సత్యమేవ జయతే


‘ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి’

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 133

గురువారం 3-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కొత్త రికార్డు నుంచి కిందకు

సెన్సెక్స్ 98 పాయింట్లు..
నిఫ్టీ 33 పాయింట్లు డౌన్ –బిజినెస్‌లో



నేటి నుంచి రెండో టెస్ట్

సిరీస్ విజయంపై భారత్ కన్ను..
ఒత్తిడిలో శ్రీలంక –స్పోర్ట్స్‌లో



అదే మోసం.. అవే స్కాములు

నంద్యాల ఉప ఎన్నిక సాక్షిగా బాబు కుటిల రాజకీయం

- అభివృద్ధి స్కీముల వెనుక స్కాములు
- ‘పెదబాబు’ నుంచి మహిళా మంత్రి వరకు కమీషన్లు
- లంచాలిచ్చే కాంట్రాక్టర్లకే పనులు
- ఇళ్ల పథకంలో నిర్మాణవ్యయం రెట్టింపు..
- పసుపుకుంకుమ పేరుతో మహిళలకు టోపీ
- ట్రాక్టర్ల సబ్సిడీలో ‘పెద్ద’లకు కమీషన్
- రోడ్లు, డ్రెయినేజీ పనుల్లో ఎక్సెస్
- కుట్టుమిషన్ల కొనుగోలులోనూ అ‘ధనం’
- సీసీ రోడ్డు పనుల్లో ‘మిగులు’ సగానికి సగం
- కేంద్ర పథకాలకిచ్చే నిధులనూ వదల్లేదు..

సాక్షి ప్రతినిధి, కర్నూలు

ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా.. పదేపదే మాయమాటలతో మోసం చేస్తూ 3 ఏళ్లుగా అంతులేని అవినీతిలో కూరుకుపోయిన బాబు సర్కార్ నంద్యాల ఉప ఎన్నికలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తోంది. అవినీతిలో దేశంలోనే నంబర్ వన్ అనే ఖ్యాతిని మూటగట్టుకుంది.. ఎప్పుడు ఏ ఎన్నిక జరిగినా వంచన, అవినీతిని అస్త్రాలుగా చేసుకోవడం అధికారపార్టీకి అలవాటుగా మారిందని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. నంద్యాలలో జరుగుతున్న పరిణామాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ప్రజలను దారుణంగా వంచించడం, అభివృద్ధి పేరుతో విడుదల చేసే నిధులను కమీషన్ల రూపంలో కైంకర్యం చేస్తుండడం ఇందుకు నిదర్శనం. నంద్యాలలో ఓటర్లను ప్రలోభపెట్టడం కోసం కొన్ని పథకాలకు హడావిడిగా విడుదల చేస్తున్న నిధులను అధికారపార్టీ నేతలు భోంచేస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నికను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా ‘సద్వినియోగం’ చేసుకుంటున్నారో అభివృద్ధి స్కీముల వెనక ఉన్న స్కాములు ఏమిటో నంద్యాల ఉప ఎన్నికను చూస్తే అర్థం అవుతుంది.

‘గూడు’పుఠాణి

మూడేళ్లలో రాష్ట్రంలో 35 వేల ఇళ్లు కట్టిన చంద్రబాబు ప్రభుత్వం ఒక్క నంద్యాల నియోజకవర్గం కోసం 13వేల ఇళ్లను

మిగతా 2వ పేజీలో ▶



బుధవారం లోటస్‌పాండ్ నివాసంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

వైఎస్ జగన్‌తో శిల్పా చక్రపాణి భేటీ

నంద్యాల విజయాన్ని జగన్‌కు కానుకగా ఇస్తాం

- ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి స్పష్టీకరణ
- త్వరలో అందరి జాతకాలు బయటపెడతా
- మేం లాడ్జీల నుంచి డబ్బులు గుంజలేదు, తుపాకులతో కాల్చలేదు

5 లో



నంద్యాలలో వైఎస్ జగన్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు బొత్స, ఎంపీ మిథున్‌రెడ్డి, సజ్జల, మాజీ ఎమ్మెల్యే భూమన, పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, బీవై రామయ్య తదితరులు

నేడు నంద్యాలలో వైఎస్ జగన్

బహిరంగ సభ

మధ్యాహ్నం 3 గంటలకు ఎస్పీజీ గ్రౌండ్‌లో..

ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు

నంద్యాల ఉప ఎన్నికలో ప్రచారానికి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (గురువారం) శ్రీకారం చుట్టనున్నారు. స్థానిక ఎస్పీజీ గ్రౌండులో మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. హైదరాబాద్ నుంచి నేరుగా నంద్యాలకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీజీ గ్రౌండులో బహిరంగ సభ ఏర్పాట్లను పార్టీ నేతలు బుధవారం పరిశీలించారు. ఎంపీలు మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, భూమన కరుణాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఐజయ్య, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం తదితరులు సభ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా వారు ధీమా వ్యక్తం చేశారు.

నంద్యాల ఉప ఎన్నిక ప్రచారానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందుగానే సీఎం చంద్రబాబు రెండు సార్లు పర్యటించారు. మరోవైపు మంత్రులు మొత్తం నంద్యాలలోనే తిష్టవేసి మరీ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధినేత మొట్టమొదటిసారిగా ఉప ఎన్నిక ప్రచారానికి వస్తుండటంతో ఆ పార్టీ కార్యకర్తలతో పాటు నంద్యాల నియోజకవర్గ ప్రజలు మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్లీనరీలో ప్రకటించిన నవరత్నాలతో పాటు నంద్యాలలో ఉపఎన్నిక ఎందుకు వచ్చింది? అసలు జరుగుతున్న అభివృద్ధి తీరు తెన్నులతో పాటు పలు అంశాలపై ఆయన ప్రసంగిస్తారన్న ఉత్సుకతతో అందరూ ఎదురుచూస్తున్నారు.



ఈఎంఐ ‘ఈజీ’!

- తగ్గనున్న గృహ, ఆటో, కార్పొరేట్ ఈఎంఐల భారం
- రెపో రేటు పావు శాతం తగ్గించిన రిజర్వు బ్యాంకు

■ మెజారిటీ విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై తీసుకునే వడ్డీరేటు రెపోను... పావుశాతం తగ్గించింది. దీంతో ఈ రేటు 6 శాతానికి దిగివచ్చింది. ఇది ఆరేళ్లకు పైగా కనిష్ట స్థాయి. అదే విధంగా బ్యాంకులు తమ వద్ద స్వల్పకాలికంగా ఉంచే అదనపు నిధులకు సంబంధించి చెల్లించే రేటు– రివర్స్ రెపోను కూడా పావు శాతం తగ్గించింది. దీనితో ఈ రేటు 5.75 శాతానికి తగ్గింది.

- బిజినెస్‌లో



కర్ణాటక మంత్రి ఆస్తులపై ఐటీ దాడులు

రూ. 10కోట్ల నగదు, భారీగా ఆభరణాలు స్వాధీనం

■ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయం వేడెక్కింది. బెంగళూరు క్యాంపులో ఉన్న 44 మంది గుజరాత్ ఎమ్మెల్యేల పర్యవేక్షణ బాధ్యత చూస్తున్న కర్ణాటక విద్యుత్ మంత్రి డీకే శివకుమార్ ఆస్తులపై బుధవారం ఐటీ శాఖ దాడులు నిర్వహించింది. శివకుమార్‌కు సంబంధించిన 64 వేర్వేరు ఆస్తులపై బుధవారం ఉదయం నుంచి జరిగిన సోదాల్లో రూ.10 కోట్లకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడులపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది.

- వివరాలు 6లో

‘కరకట్ట’ ఇంటిని చంద్రబాబు తక్షణమే ఖాళీ చేయాలి

‘వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా’ డాక్టర్ రాజేంద్రసింగ్ డిమాండ్

- నదీ పరివాహక ప్రాంతంలో నిర్మించిన భవనంలో సీఎం ఉంటున్నారు
- రాజధాని నిర్మాణం పేరిట నదిని నాశనం చేయొద్దు
- కృష్ణా నది పరిరక్షణ యాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న రాజేంద్రసింగ్. చిత్రంలో ప్రొఫెసర్ విక్రమ్ సోని, వడ్డే శోభానాద్రీశ్వరరావు

సాక్షి, అమరావతి బ్యూరో: ‘‘విజయవాడలో కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో(కరకట్టపై) నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో సీఎం చంద్రబాబు నివాసం ఉంటున్నారు. ఆ ఇంటిని ఆయన తక్షణమే ఖాళీ చేయాలి. ఇప్పటికే ఎన్నోసార్లు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోలేదు. చంద్రబాబుకు

మిగతా 7వ పేజీలో ▶

రాజధానికి ఏటా రూ.1500 కోట్లివ్వాలి



సీఎంను కోరిన సీఆర్‌డీఏ అధికారులు

- రాబోయే మూడేళ్లలో రూ.30 వేల కోట్లు అవసరం
- ఇందులో రూ.22,600 కోట్లు వివిధ మార్గాల్లో సమకూరుతున్నాయి
- మరో రూ.7,400 కోట్ల కోసం అన్వేషిస్తున్నామని వెల్లడి

సీఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, అధికారులు

సాక్షి, అమరావతి

రాష్ట్ర నూతన రాజధాని అమరావతిలో మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులకోసం 11 ఏళ్లపాటు రాష్ట్రప్రభుత్వం ఏటా రూ.1,500 కోట్లను బడ్జెట్‌లో అదనంగా కేటాయింపులు చేయడం ద్వారా అందజేయాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) అధికారులు సీఎం చంద్రబాబునాయుడుకు నివేదించారు. వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం సీఎం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణ వివరాల్ని వారు తెలిపారు. రాబోయే మూడేళ్లకు రూ.30 వేల కోట్లు అవసరమని అంచనా వేయగా, అందులో రూ.7,300 కోట్లు లోటుగా కనిపిస్తున్నాయని అధికారులు చెప్పారు. ఈ నిధుల్ని వివిధ మార్గాల్లో సమకూర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. హడ్కో ద్వారా రూ.7,500 కోట్లు, బహుళ సంస్థలద్వారా రూ.3,200 కోట్లు, కేంద్రప్రభుత్వ గ్రాంటు రూ.2,500 కోట్లు, స్మార్ట్

మిగతా 7వ పేజీలో ▶

కరువు కాటు.. అప్పుల పోటు!

మళ్లీ ముంచిన ఖరీఫ్

వరుసగా నాలుగో ఏడాదీ వర్షాభావం

సీమలో 20 శాతానికి చేరిన వర్షపాత లోటు

దారుణంగా పడిపోయిన వేరుశనగ సాగు

విత్తనాలు సగం ధరకు తెగనమ్ముకుంటున్న రైతులు

అప్పుల ఊబిలో చిక్కుకుపోయామని ఆవేదన

- వివరాలు 7లో



• ప్రైవేటు పాఠశాలలకు సర్కారు కొత్త చట్టం

స్వయంపోషక స్వేచ్ఛ

ఈ చట్టం యజమానులకే చుట్టం

■ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ‘స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం (ఏపీ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్–2017)ను తెస్తోంది. పాఠశాల విద్యలో ప్రైవేటు కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించడంతోపాటు వీటిపై ప్రభుత్వానికి కూడా అజమాయిషీ లేని తీరులో ఈ చట్టంలోని అంశాలు, నిబంధనలు ఉన్నాయి. ఫీజులు, తదితర అంశాల్లో వాటికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దీంతో ఇప్పటికే భారంగా మారిన పాఠశాల విద్య సామాన్య, మధ్య తరగతికి అందుబాటులో లేకుండా పోనుంది.

- ఫుల్‌అవుట్ IVలో



రూ.3,600 కోట్లతో ఈఏపీ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- రాష్ట్రంలో చిన్న నీటి వనరుల అభివృద్ధికి ఊతం
- దివంగత సీఎం వైఎస్ హయాంలో చేపట్టిన పథకాల కొనసాగింపునకు ఆమోదం

3 లో

కుక్క కాటు.. ఆలస్యం చేస్తే చేటు!



రాష్ట్రంలో ఏటా 4.19 లక్షల కుక్కకాటు బాధితుల నమోదు

కుక్క కరిచిన 48 నెలల్లోపు ఎప్పుడైనా రేబిస్ సోకే ప్రమాదం

సకాలంలో టీకా వేయించకుంటే ప్రమాదమంటున్న వైద్యులు

వ్యాధి సోకితే ఇక బతికిబట్టకట్టడం అసాధ్యం

90 రోజుల్లో ఆరు డోసులు తప్పనిసరి

■ కుక్క కాటుకు, పాముకాటుకు పెద్దగా తేడాలేదన్నది నిపుణుల అభిప్రాయం. పాము కరిస్తే వెంటనే వైద్యుడి వద్దకు పరుగు తీస్తాం. కుక్క కరిస్తే మాత్రం లెక్కలేనంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తాం. పాము కాటేస్తేనే కాదు.. కుక్క కరిచినా ప్రాణాపాయమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

3 లో



నీలం రంగును గుమ్మరించినట్టు..అక్కడక్కడా తెల్లటి మేఘాలను అలంకరించినట్టు కనిపించే ఆకాశం హఠాత్తుగా ఎర్రబడింది. అందమైన కాన్వాసులా మారింది. బుధవారం సాయంత్రం ప.గో. జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈ దృశ్యం స్థానికులను ఆకట్టుకుంది. - జంగారెడ్డిగూడెం రూరల్



సర్సరే.. పెళ్లి మేమే చేస్తాం!
కట్నం డబ్బుల్లో జీఎస్టీ కట్ చేసుకొని..

డిగ్రీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో నిర్వహించిన డిగ్రీ మూడో సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను బుధవారం వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. పరీక్షకు అన్ని కోర్సుల నుంచి 25,808 మంది హాజరుకాగా 57.06 శాతం చొప్పున 14,726 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాలను www.anu.ac.in, www.indiaresults.com, www.manabadi.com, www.goresults.net, www.vidyavision.com వెబ్‌సైట్ల ద్వారా పొందవచ్చు. రీవాల్యుయేషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 17 వరకు గడువు ఇచ్చామని ఏసీఈ జి.కనకసుందరరావు తెలిపారు. రీవాల్యుయేషన్ దరఖాస్తులను ఈనెల 19లోగా వర్సిటీలోని యూజీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు బీసీఏ కోర్సులో ఒక్కో పేపర్‌కు రూ.1025, ఇతర సబ్జెక్టుల వారు రూ.935 చొప్పున చెల్లించాలన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో యూజీ పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ జి.రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

వావ్ ఫ్యాక్టర్



● ప్లాస్టిక్‌తో ఫిన్లాండ్ వాస్తు శిల్పి నిర్మించిన ఇంటి నమూనా.

ఫ్యూచర్ మనిషికి ప్లాస్టిక్ గూళ్లు

ఊహూ.. మీరు అనుకున్నది నిజం కాదు. పక్క ఫొటోల్లో ఉన్నవి గ్రహాంతర వాసులను మోసుకొచ్చిన అంతరిక్ష నౌకలు కానే కాదు. ఎప్పుడో భవిష్యత్తులో ఇళ్లు ఇలా కడతారని చూపించిన నమూనాలూ కాదు. ఇటలీలోని మార్సే ప్రాంతంలో దాదాపు 57 ఏళ్లుగా ఉన్న బుల్లి 'ఇళ్ల ప్రదర్శన' తాలూకూ చిత్రాలివి. అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాల్లో ఇప్పుడు బంగళాలపై మోజు తగ్గుతోంది. వీలైనంత చిన్నసైజులోనే ఇళ్లు కట్టేసుకోవాలని, వాటిల్లోనే అన్ని సౌకర్యాలను ఇముడ్చుకోవాలన్న ఆకాంక్ష పెరుగుతోంది. కానీ ఇటలీ ఆర్కిటెక్టులో దశాబ్దాల క్రితమే ఈ దిశగా వేసిన అడుగులకు తార్కాణం ఈ ఎగ్జిబిషన్. పేరు 'యుటోపీ ప్లాస్టిక్'. ఇందులో ఉన్న ఇళ్లన్నింటినీ అచ్చుపోసి ప్లాస్టిక్‌తో తయారుచేశారు. ప్లాస్టిక్ వాడకం అప్పుడప్పుడే మొదలైన కాలమది. అవసరానికి తగ్గట్టుగా అచ్చుపోసుకునే సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని మరీ తయారు చేశారీ ఇళ్లను. అన్నింటినీ ఎప్పుడు కావాలంటే అప్పుడు కావాల్సిన చోటికి తరలించవచ్చు. అంతరిక్ష నౌక షేపులో ఉన్న ఇంటిని ఫిన్లాండ్ ఆర్కిటెక్ట్ మట్టీ సూరోనెన్ డిజైన్ చేశారు. పేరు ఫ్యుచురో హౌస్. భూమికి కొంచెం ఎత్తులో ఉంది కాబట్టి దీంట్లోకి వెళ్లాలంటే కొన్ని మెట్లు ఎక్కాలి. ఈ మెట్లు.. అవసరమైనప్పుడు ఇంట్లోంచి బయటికి వస్తాయి! దశాబ్దాలుగా ఏటా కొంతకాలం పాటు ఈ ఇళ్లను సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ ఏడాది జూలై నుంచి అక్టోబరు 1వ తేదీ వరకూ ప్రదర్శన ఉంటుంది.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్

అదే మోసం.. అవే స్కాములు

▶ మొదటి పేజీ తరువాయి

మంజూరు చేయడం చూసి అంతా విస్తుపోయారు. అదంతా ఓట్ల మహిమ అని పైకి అనిపిస్తున్నా ఈ స్కీమ్ వెనక ఉన్న స్కామ్ చూసి షాక్ తింటున్నారు. ఇంటి నిర్మాణానికి చదరపు అడుగుకి రూ. 1,000 మించకున్నా బినామీ కాంట్రాక్టర్లకు రూ. 2,078 చొప్పున రూ. 890.37 కోట్లను కట్టబెడుతున్నారు. యూనిట్ రూ. 6 లక్షలు అనుకుంటే అందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్రప్రభుత్వం రూ.1.5 లక్షలు వెరసి రూ.3 లక్షలు సబ్సిడీ ఇస్తుండగా మిగిలిన రూ.3 లక్షలను లబ్ధిదారుడు కిస్తీల రూపంలో 20 ఏళ్లపాటు చెల్లించాల్సి ఉంటుంది. కమీషన్లిచ్చే కాంట్రాక్టర్ల కోసం నిర్మాణ వ్యయాన్ని రెట్టింపు చేయడం వల్ల యూనిట్ రూ. 6 లక్షలకు పెరిగింది. ఒక్కో ఇంటిపైన రూ.3 లక్షల మేర దోచుకుంటున్నారు. దానిని పేదలపైన రుద్దుతున్నారు. వాటిని పేదలు 20 ఏళ్లపాటు కట్టాల్సిన పరిస్థితి.

ట్రాక్టర్ల సబ్సిడీ మాయం..

రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లను అందించేందుకు ఉద్దేశించిన 'రైతు రథం' పథకాన్నీ తమ కమీషన్లకు రథంగా మార్చుకున్నారు. డీలర్లకింత, చంద్రబాబుకు, మంత్రికి కొంత, రైతులకు రవ్వంత.. ఇదీ జరుగుతోంది. నంద్యాలలో పంపిణీ చేసే ట్రాక్టర్లు కేవలం స్వరాజ్ మజ్దా లేదా జాన్ డీర్ కంపెనీలవి మాత్రమే ఇవ్వాలని.. మిగిలిన కంపెనీలవి ఇవ్వవద్దని ఆదేశించినట్టు సమాచారం. వాస్తవానికి ఏదైనా ప్రభుత్వ పథకం కింద లబ్ది పొందే వారు తమకు ఇష్టమైన కంపెనీ వస్తువులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. అయితే, ఇందుకు భిన్నంగా ఫలానా కంపెనీవే తీసుకోవాలని ఒత్తిళ్లు తెస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమీషన్ ఇవ్వడానికి అంగీకరించలేదు కాబట్టి ఐషర్ వంటి కంపెనీలను పక్కనపెట్టారు. మరోవైపు ఒక్కో ట్రాక్టర్‌పై తనకు రూ.30 వేల మేరకు ఇవ్వాలని డీలర్లపై జిల్లా మంత్రి ఒత్తిడి తెస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. తమకు ఒక ట్రాక్టర్ విక్రయిస్తే వచ్చే లాభం రూ.40 వేలకు మించదని... అందులో ఏకంగా రూ.30 వేలు ఇస్తే ఇక తమకు ఏం లాభమని డీలర్లు వాపోతున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8,500 ట్రాక్టర్లు మంజూరు చేయగా కర్నూలు జిల్లాకు 542 కేటాయించారు. ఇపుడు ఉప ఎన్నిక నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గానికి మరో 400 మంజూరు చేశారు. ఇక రైతులకు ఒక్కో ట్రాక్టరుకు రూ. 1.5 లక్షల సబ్సిడీ ఇస్తున్నా ఆ మేరకు రేట్లు పెంచి డీలర్లకు ప్రభుత్వ సొమ్మును కట్టబెట్టి కమీషన్లు పొందే ఎత్తుగడ. అంటే పేద రైతుల సబ్సిడీని పెద్దలు భోంచేస్తున్నారన్నమాట.

రోడ్లు, డ్రెయినేజీలనూ వదల్లేదు..

నంద్యాలలో రోడ్లు, డ్రెయినేజీ పనుల్లో కూడా దారుణమైన దోపిడీ జరుగుతోంది. కమీషన్లు ఇచ్చేవారికే పనులు కట్టబెట్టారు. కమీషన్లు ఇచ్చే సంస్థలకే పనులు దక్కేలా నిబంధనలు రూపొందించారు. అఖిలప్రియకు చెందిన సంస్థలు పనులు దక్కించుకున్నాయంటే దానర్థం ఏమిటి? ఒకవైపు కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఇదే తరహా పనులు 10 శాతం నుంచి 14 శాతం వరకూ తక్కువ ధరకే (లెస్) టెండర్‌లో ధరలు కోట్ అవుతున్నాయి. అయితే, ఇందుకు భిన్నంగా నంద్యాల మునిసిపాలిటీలో చేపడుతున్న పనుల్లో మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేకు చెందిన బీఎస్‌సీపీఎల్ సంస్థ మాత్రం ఒక టెండర్‌లో 4.43 శాతం, మరో టెండర్‌లో 4.41 శాతం అధిక ధరకు పనులను దక్కించుకుంది.

- రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.155 కోట్ల అంచనా వ్యయంతో మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. వాటిని కమీషన్లు ఇచ్చేవారికే కట్టబెట్టారు. రూ.155 కోట్లతో జరగాల్సిన పనులు కాస్తా 4.25 శాతం అధిక ధరకు అంటే రూ. 161.89 కోట్ల(అంటే రూ.6.89 కోట్లు అధనం)కు చేపడుతున్నారు.
- మొదటి ప్యాకేజీ కింద నంద్యాల మునిసిపాలిటీలో చేపట్టాల్సిన రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ పనులను రూ. 12.51 కోట్ల అంచనా వ్యయంతో టెండర్‌ను పిలిచారు. అధికార పార్టీ ఎమ్మెల్యేకు చెందిన సంస్థ టెండర్ కంటే 4.43 శాతం అధిక ధరకు అంటే 13.6 కోట్లకు పనులు దక్కించుకుంది. ఇక కర్నూలు కార్పొరేషన్ తరహాలో టెండర్ ధర కంటే 10 శాతం తక్కువ ధరకే పనులను అప్పగిస్తే ఇవే పనులు రూ. 10.2 కోట్లకే పూర్తయ్యేవి. అంటే మొత్తం మీద రూ.2.8 కోట్ల మేరకు అదనంగా అప్పగించినట్టు తెలుస్తోంది.
- ఇక రెండో ప్యాకేజీ పనుల్లోనూ ఇదే విధానం కొనసాగింది. రూ.15.13 కోట్ల విలువైన ఈ పనులను 4.41 శాతం అధిక ధరకు అంటే రూ.15.80 కోట్లకు పనులు దక్కించుకుంది. ఇక కర్నూలు కార్పొరేషన్ తరహాలో టెండర్ విలువ కంటే 10 శాతం తక్కువ ధరకే అని లెక్కిస్తే ఇవే పనులు రూ.13.5 కోట్లకే పూర్తయ్యేవి. అంటే రూ.2.3 కోట్ల అధిక ధరకు కట్టబెట్టారన్నమాట.

సీసీ రోడ్ల పనుల్లో సగానికి సగం

ఇక నంద్యాల, గోస్పాడు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఏకంగా రూ.63 కోట్లతో పనులు చేపట్టారు. కేంద్రం ఉపాధి హామీ పథకం నుంచి సగం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సగం నిధులతో ఈ పనులను చేపడుతున్నారు. ఈ పనులన్నీ రూ.10 లక్షల అంచనా వ్యయంతో స్థానికంగా ఉన్న నేతలకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. ఇందులో సగానికి సగం మిగులుతోంది. అంటే రూ.63 కోట్లలో రూ.30 కోట్ల మేరకు కమీషన్ల రూపంలో అధికారపార్టీ నేతల జేబుల్లోకి వెళ్లనుందన్నమాట.

కేంద్ర పథకాలకూ ఎక్సెస్..

రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కేంద్ర ప్రభుత్వ పథకాలనూ వదలటం లేదు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీలల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం అమృత్ పేరుతో కొత్త పథకాన్ని తెచ్చింది. ఈ పథకం కింద నంద్యాల మునిసిపాలిటీలో తాగునీటి అవసరాల కోసం నిధులను కేటాయించింది. ఈ పనులను కూడా ఎన్‌సీసీ సంస్థ 4.49 శాతం అధిక ధరకు దక్కించుకుంది. అంటే రూ.132 కోట్లతో పూర్తికావాల్సిన ఈ పనులు కాస్తా ఏకంగా రూ.138 కోట్లకు వ్యయం పెరిగింది. అంటే అదనంగా రూ. 6 కోట్లు అన్నమాట.

పసుపు కుంకుమ కాదు ఉప్పు, కారం

పసుపు కుంకుమ పథకం కింద డ్వాక్రా మహిళలకు నంద్యాలలోనే రూ.500 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు హోర్డింగులలో తెలుగుదేశం హోరెత్తిస్తోంది. వాస్తవానికి ఇది పెద్ద మోసం. డ్వాక్రా మహిళల రుణాలను బేషరతుగా సంపూర్ణంగా మాఫీ చేస్తానని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఎన్నికలయ్యాక అక్కచెల్లెమ్మలను మోసగించారు. జీరో వడ్డీ డబ్బు ఎగ్గొట్టడమే కాక క్యాపిటల్ ఇన్‌ఫ్యూజన్ పేరుతో అదే మొత్తాన్ని బ్యాంకులకు ఇచ్చి అధికవడ్డీ వసూలు చేసుకొమ్మన్నారు. జీరో వడ్డీ తీసేసి అధిక వడ్డీకి అప్పు ఇచ్చే ఈ పథకానికే ఇంతకు ముందు క్యాపిటల్ ఇన్‌ఫ్యూజన్ అని పేరు పెట్టి ఇపుడు నంద్యాల ఎన్నికల్లో దానికే పసుపు – కుంకుమ పథకం అని పేరు పెట్టారు. ''అది పసుపు కుంకుమ పథకం కాదు... మా గాయాలకు ఉప్పుకారం రాస్తున్న పథకం. కళ్లల్లో కారం కొట్టి.. ఎడం చేత్తో జేబు కొట్టి (జీరో వడ్డీ హుళక్కి) కుడి చేత్తో అప్పుగా ఇచ్చారు. అప్పు ఇప్పించి దానికి కూడా ఓ పథకం పేరు పెట్టి మోసగిస్తున్నారు.'' అని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు.



పసుపు, కుంకుమ పథకంపై చంద్రబాబు ఇచ్చిన ప్రకటన

కూల్చివేసి తగినంత పరిహారమివ్వరా?

రోడ్డు వెడల్పు చేయడం కోసం కూల్చివేయాల్సిన ఇళ్ల యజమానులకు తగినంత సమయం ఇవ్వడం సహజం. తగినంత పరిహారం ఇవ్వడం కూడా న్యాయం. కానీ నంద్యాలలో మాత్రం ఈ రెండు అంశాలను పట్టించుకోవడం లేదు. అన్నీ హడావుడిగా సాగిస్తున్నారు. నంద్యాలలో గజం రూ. 1.10 లక్షలు పలుకుతున్న చోట పరిహారం రూ.18వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం అని బాధిత ప్రజలు వాపోతున్నారు. వారి ఆందోళనలు, ఆవేదనలు అరణ్యరోదనలుగానే మిగిలిపోతున్నాయి.

కని'కుట్టు మిషన్లు'

నంద్యాలలో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టడం కోసం అధికారపార్టీ కుట్టుమిషన్లను ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఓ 3వేల కుట్టుమిషన్లను తీసుకువచ్చి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అవికూడా పంపిణీ చేయడానికి కాకుండా.. వాటికి పసుపు రంగు వేసి.. ప్రచారం చేస్తున్నారు. ఇవ్వ దలచుకుంటే నోటిఫికేషన్‌కు ముందుగానే ఇచ్చేవారని, ఎన్నికల తర్వాత ఇస్తామని అంటున్నారంటే ఫలితాన్ని బట్టి ఎగ్గొట్టవచ్చు అన్న దురాలోచన కనిపిస్తోందని మహిళలు చర్చించుకుంటున్నారు. ఇక ప్రచారం కోసం కొనుగోలు చేసిన 3వేల కుట్టుమిషన్లలోనూ కమిషన్లు మింగేశారు. కుట్టుమిషన్లు సాధారణంగా ఒక్కొక్కటి రూ.5 వేలకు లభిస్తుండగా... ఏకంగా రూ.7,500 చొప్పున చెల్లించి 3 వేల మిషన్లను కొనుగోలు చేసినట్టు సమాచారం. అంటే ఒక్కో మిషన్‌కు రూ.2,500 లెక్కిస్తే 3 వేల మిషన్లకు రూ.75 లక్షల అదనంగా అవుతుంది.

జీఎస్టీ నుంచి 'టెక్స్‌టైల్'ను మినహాయించాలి

- కేంద్రానికి మేకపాటి రాజమోహన్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలు ప్రభావం టెక్స్‌టైల్ రంగంపై తీవ్రంగా ఉందని, జీఎస్టీ నుంచి ఈ రంగాన్ని మినహాయించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత మేకపాటి రాజమోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం లోక్‌సభలో ది ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (జమ్మూకశ్మీర్‌కు పొడిగింపు) బిల్లు, సెంట్రల్ జీఎస్టీ(ఎక్స్‌టెన్షన్) బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు వినియోగించే సహాయ పరికరాలను జీఎస్టీ నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. శరీరంలో పని చేయని అవయవాలకు, పాక్షికంగా పనిచేసే అవయవాలకు బదులుగా వాడే క్రచెస్, వినికిడి యంత్రాలు, ఊతకర్రలు, ఇతర పరికరాలను పన్ను పరిధిలోకి తేవడం అన్యాయమని పేర్కొన్నారు. తాజా బిల్లుతో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని కూడా జీఎస్టీ పరిధిలోకి తేవడం మంచి పరిణామమని హర్షం వ్యక్తం చేశారు.

శశికళ పిటిషన్‌పై ప్రతిష్టంభన

సాక్షి ప్రతినిధి, చెన్నై: అక్రమాస్తుల కేసులో నాలుగేళ్ల జైలు శిక్షను పునఃసమీక్షించాల్సిందిగా కోరుతూ అన్నాడీఎంకే (అమ్మ) తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళ సుప్రీం కోర్టులో పెట్టుకున్న పిటిషన్‌పై ప్రతిష్టంభన నెలకొంది. బుధవారం ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ రోగిందన్ పాలినారిమన్, జస్టిస్ అమిత్తవరాయ్ విచారించాల్సి ఉంది. అయితే జస్టిస్ రోగిందన్ తండ్రి పాలిమన్ నారిమన్ గతంలో దివంగత జయలలిత ప్రత్యేక న్యాయవాదిగా వ్యవహరిస్తూ అనుకూలంగా వాదించారు. ఈ కారణంగా శశికళ పిటిషన్‌పై విచారించడం సబబు కాదంటూ కేంద్ర మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ మంగళవారం సాయంత్రం జస్టిస్ రోగిందన్‌ను కలిసి తన అభిప్రాయం తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం విచారణకు రావాల్సిన కేసుల జాబితాలో శశికళ పిటిషన్ రాలేదు. అలాగే విచారణ నుంచి జస్టిస్ రోగిందన్ పాలినారిమన్ తప్పుకున్నారు. దీంతో కొత్త న్యాయమూర్తి నియామకం తర్వాతే శశికళ పిటిషన్‌పై విచారణ జరగనుంది.

మళ్లీ విదేశీ బొగ్గు వైపు చూపు!

- సింగరేణికి రూ.1400 కోట్లు బకాయిలు
- చెల్లించని కారణంగా బొగ్గు సరఫరా నిలిపివేత

సాక్షి, అమరావతి: సింగరేణి సంస్థ బొగ్గు సరఫరాను నిలిపివేయడంతో ఏపీజెన్‌కో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. విదేశీ బొగ్గు కొనుగోలు ప్రతిపాదనను తెరమీదకు తెచ్చింది. అయితే ఇది ఎంతవరకు సాధ్యమనే అంశంపై చర్చిస్తున్నారు. విదేశీ బొగ్గు కొనుగోలు చేయవద్దని కేంద్ర ఇంధనశాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీనికి విరుద్ధంగా ముందుకెళ్ళడం వల్ల ఎదురయ్యే సమస్యలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికే లేఖ రాసి అనుమతి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. రూ.1400 కోట్ల బకాయిలు చెల్లించని కారణంగా ఏపీజెన్‌కోకు సింగరేణి మంగళవారం నుంచి బొగ్గు నిలిపివేసింది. దీంతో ఆర్టీపీపీ, వీటీపీఎస్‌కు బొగ్గు కొరత ఏర్పడింది. మరోవైపు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో జెన్‌కో థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేస్తే విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏపీ జెన్‌కో అధికారులు బొగ్గు దిగుమతికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నారు. స్వదేశీ బొగ్గును సరఫరా చేసే మహానది కోల్ ఫీల్డ్ (ఎంసీఎల్) అదనపు సరఫరాకు ఒప్పుకోలేదు. ఈ బొగ్గు క్షేత్రాల నుంచి రవాణా కూడా కష్టంగా ఉంది. వెస్టన్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ మాత్రం బొగ్గు ఇవ్వడానికి సిద్ధపడినప్పటికీ అత్యధిక ఉష్ణసామర్థ్యం గల బొగ్గును అధిక రేటుకు ఇచ్చేందుకు మొగ్గు చూపుతోంది. ఆస్ట్రేలియా బొగ్గు క్షేత్రాల నుంచి తాత్కాలికంగా దిగుమతి చేసుకోవడంవల్ల ఏమేరకు భారం పడుతుందనే దానిపై అధికారులు దృష్టి పెట్టారు. బొగ్గు సరఫరాదారులతో బుధవారం చర్చలు జరిపినట్టు తెలిసింది. సాధారణ గ్రేడ్ బొగ్గును అందించేందుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర ఇంధనశాఖ నిబంధనల ప్రకారం బొగ్గు నాణ్యతను సింఫర్ అనే సంస్థ పరిశీలించి నివేదిక ఇవ్వాలి. జెన్‌కో ప్లాంట్లకు లింకేజీ ఉన్న ఎంసీఎల్, సింగరేణి సంస్థలతో సింఫర్‌కు ఈ తరహా ఒప్పందం ఉంది. కానీ విదేశీ బొగ్గు దిగుమతిని ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. అదీగాక ఏ బొగ్గు క్షేత్రం నుంచి అది వస్తుందో తెలియదు. కాబట్టి దీన్ని తాము పరిశీలించేందుకు నిబంధనలు అంగీకరించవని సింఫర్ చెబుతోంది. ఈ నేపథ్యంలో విదేశీ బొగ్గు నాణ్యతను కాంట్రాక్టర్లు చెప్పినట్టు నిర్ధారించడం తప్ప మరోమార్గం లేదని జెన్‌కో భావిస్తుంది. దీనివల్ల అనేక ఆరోపణలు వచ్చే వీలుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఏదేమైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, అక్కడి నుంచి అనుమతి లభించిన తర్వాతే విదేశీ బొగ్గు కొనుగోలుపై స్పష్టత వస్తుందని జెన్‌కో ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



రాష్ట్రపతి కోవింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ నరసింహన్

రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీలతో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ బుధవారం సమావేశమయ్యారు. రాష్ట్రపతిగా కోవింద్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా గవర్నర్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణలోని తాజా పరిస్థితులను రాష్ట్రపతికి ఆయన వివరించినట్టు సమాచారం. తెలుగు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లుగా గుజరాత్ మాజీ సీఎం ఆనందీబెన్ పటేల్, సీనియర్ బీజేపీ నేత శంకరమూర్తిలను కేంద్రం నియమించనుందని, నరసింహన్‌కు కేంద్ర పదవి ఇవ్వనున్నారన్న ఊహాగానాల నేపథ్యంలో రాష్ట్రపతి, ప్రధానితో ఆయన భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిబ్బంది, ప్రజా విజ్ఞప్తుల శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్‌తోనూ నరసింహన్ సమావేశమయ్యారు.

రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ ప్రకాశ్..
ఢిల్లీలో ఉన్న ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్(ఆర్‌సీ)గా ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలో జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రవీణ్ ఇటీవల ఏపీ భవన్ ఆర్‌సీగా నియమితులయ్యారు.

అనుమానాస్పద పార్శిళ్లపై నజర్

- సినీ ప్రముఖులకు వస్తున్న కొరియర్లపై సిట్ ఆరా
- రామానాయుడు స్టూడియోలో తనిఖీ

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కేసులో పలువురికి నోటీసులిచ్చి విచారణ పూర్తి చేసిన సిట్ తాజాగా అనుమానాస్పద పార్శిళ్లపై దృష్టి సారించింది. పోస్టల్, కొరియర్ సంస్థల ద్వారా వస్తున్న అనుమానిత పదార్థాలు, వస్తువులు కస్టమర్లకు చేరుతున్నట్లు సిట్ గుర్తించింది. ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ వంటి డ్రగ్స్ కూడా ఇలాగే సినీ ప్రముఖులతోపాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, విద్యార్థులకు చేరాయని ఇప్పటికే ఆధారాలతో నిరూపించింది. ఇందులో భాగంగా పోస్టల్ శాఖతో పాటు పలు ప్రముఖ కొరియర్ సంస్థలతో నిఘా పటిష్టం చేయాలని నిర్ణయించింది. కాగా, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఫిల్మ్‌నగర్‌లోని రామానాయుడు స్టూడియోలో 3 గంటల పాటు తనిఖీ చేశారు. విదేశాల నుంచి వచ్చిన ఓ పార్శిల్‌ను స్వాధీనం చేసుకొని తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ పార్శిల్‌లో వెన్నునొప్పికి సంబంధించిన పరికరం ఉందని ఇన్‌స్పెక్టర్ కనకదుర్గ తెలిపారు. ఆ పార్శిల్ తన కుమారుడు రానాకు వచ్చిందని, అది వెన్నునొప్పికి సంబంధించిన పరికరమని నిర్మాత సురేశ్‌బాబు మీడియాకు వివరించారు.

చంద్రబాబును నిలదీయండి

- 'ఫిరాయింపు' ఎమ్మెల్యేలకు వైఎస్సార్‌సీపీ నేత తమ్మినేని సీతారాం సూచన
- అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరగదని తేలిపోయింది
- ఇప్పుడేం చేస్తారు బాబూ?



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరగదని తేలిపోవడంతో అధికార తెలుగుదేశం పార్టీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. పెరగబోయే సీట్లలో సర్దుబాటు చేస్తామంటూ ఆశ చూపి 21 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు. తమ్మినేని బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు పూర్తిగా అనైతిక రాజకీయాలకు పాల్పడ్డారని అన్నారు. టీడీపీలో చేర్చుకున్న 21 మంది ఎమ్మెల్యేల చేత ఇప్పటికీ రాజీనామా చేయించలేదని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు చంద్రబాబు ప్రలోభాలకు గురై మోసపోయారని, ఇప్పుడు వారంతా ఆయనను నిలదీయాలని సూచించారు. అసెంబ్లీ సీట్ల పెంపు ఉండబోదని కేంద్రం స్పష్టం చేయడంతో టీడీపీలో పెనుతుపాను, ప్రకంపనలు రేగుతున్నాయన్నారు.

పింఛన్లు, రోడ్లు చంద్రబాబు అబ్బగారి సొత్తా?

సీఎం చంద్రబాబు మాట్లాడేవి అబద్ధాలు, చేసేవి మోసాలు కనుక ఆయన అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని తమ్మినేని సీతారాం దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి చంద్రబాబును ప్రశ్నిస్తే అసహనానికి గురవుతున్నారని దుయ్యబట్టారు. నేనిచ్చిన పింఛన్లు, నా రోడ్లు అని చంద్రబాబు బెదిరించడం సరికాదని, అవేమన్నా ఆయన అబ్బగారి సొత్తా అని సీతారాం మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లను కొనుగోలు చేస్తాను అని చంద్రబాబు చెప్పారంటే వెంటనే న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ఆయనను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నారా లోకేశ్ అడ్డదారిలో ఎమ్మెల్సీ, మంత్రి అయ్యారని తమ్మినేని సీతారాం విమర్శించారు. లోకేశ్ రెండో పులకేశిగా మారారని ఆరోపించారు. ఇలాంటి పులకేశిని భరిస్తున్న రాష్ట్ర ప్రజలకు శతకోటి నమస్కారాలని అన్నారు.

కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం.. విక్రమ్‌గౌడే!

డిశ్చార్జ్ అయ్యాక విక్రమ్ అరెస్టు: సీపీ మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న నేపథ్యంలో పార్టీ టికెట్, తన నియోజకవర్గ ప్రజల్లో సానుభూతి పొందడమే లక్ష్యంగా మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ కాల్పులు జరిపించుకున్నారని నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి వెల్లడించారు. పథక రచన, కాల్పులకు కాంట్రాక్ట్ ఇవ్వడం, ప్లాన్ అమలు చేయడం, ఆయుధాన్ని దాచి పెట్టడం, నిందితులకు షెల్టర్ ఇవ్వడం.. ఇలా ప్రతి అంకాన్నీ విక్రమ్ స్వయంగా పర్యవేక్షించాడని తెలిపారు. ఈ కేసులో విక్రమ్‌తో పాటు 11 మందిని నిందితులుగా గుర్తించగా.. ఐదుగురిని అరెస్టు చేశామని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే విక్రమ్‌ను అరెస్టు చేస్తామని తెలిపారు. తన శత్రువులపై పోలీసుల దృష్టి పడేలా చేయడంతో పాటు అప్పులవాళ్లు తన జోలికి రాకుండా కట్టడి చేయడం.. ఒడిశాలో మైనింగ్ రంగానికి సంబంధించి సాంబశివరావు దగ్గర తాను పెట్టుబడిగా పెట్టిన సొమ్ము తిరిగి తెప్పించుకోవడం.. కొంతకాలంగా దూరంగా ఉంటున్న కుటుంబంతో పాటు స్నేహితుల నుంచీ సానుభూతి పొందటం.. గతంలో రద్దయిన ఆయుధ లైసెన్స్ తిరిగి పొందటంతో పాటు పోలీసులే గన్‌మెన్లను ఏర్పాటు చేసేలా చేయడం.. కాల్పులు జరిపించుకోవడం వెనుక ఉన్న ప్రధాన కారణాలని చెప్పారు. ఇందుకోసం పులివెందుల ప్రాంతానికి చెందిన ఎ.గోవిందరెడ్డితో రూ.50 లక్షలు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు చెల్లించాడని తెలిపారు. అతను కదిరివాసులు ఎస్.నందకుమార్, కె.బాబుజాన్, షేక్ అహ్మద్, వెంకటరమణ అలియాస్ చిన్నాలతో కలిసి గతనెల 27వ తేదీ రాత్రి పథకాన్ని అమలు చేశాడని చెప్పారు. ఇండోర్‌కు చెందిన రయీస్‌ఖాన్ ఆయుధం సమకూర్చడంతోపాటు కాల్పులు జరిపాడని తెలిపారు.

కుక్క కాటు.. ఆలస్యం చేస్తే చేటు!



• రాష్ట్రంలో ఏటా 4.19 లక్షల కుక్కకాటు బాధితుల నమోదు • కుక్క కరిచిన 48 నెలల్లోపు ఎప్పుడైనా రేబిస్ సోకే ప్రమాదం
• సకాలంలో టీకా వేయించకుంటే ప్రమాదమంటున్న వైద్యులు • వ్యాధి సోకితే ఇక బతికిబట్టకట్టడం అసాధ్యం • 90 రోజుల్లో ఆరు డోసులు తప్పనిసరి

ఏ పుట్టలో ఏ పాముందో.. ఏ కుక్క శరీరంలో రేబిస్ వైరస్ ఉందో ఎవరికి తెలుసు! అందుకే కుక్కలతో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఇక మన పెంపుడు కుక్క మనల్ని చూడగానే ఎంతో ముచ్చటపడిపోతుంది.. తోక ఊపుకొంటూ పైపైకి ఎగురుతుంది.. మనల్ని మురిపెంగా నాకుతుంది.. సుతారంగా కొరుకుతుంది. మన శునకం అలా గారాలు పోతుంటే చూడముచ్చటగా ఉంటుంది కదూ. ఈ క్రమంలో దాని పళ్లు మన శరీరానికి గుచ్చుకుని గాయాలయ్యే అవకాశంలేక పోలేదు. ఆ.. ఏముందిలే అని వాటిని నిర్లక్ష్యం చేశామో చేజేతులారా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లే. ఇక వీధి కుక్కల సంగతి చెప్పాల్సిన పనిలేదు. రోడ్లపై స్వైర విహారం చేస్తూ వచ్చిపోయే జనాన్ని కరవడమే పనిగా పెట్టుకున్నాయి. మరీ ముఖ్యంగా ఇవి చిన్నపిల్లలపై ప్రతాపం చూపుతున్నాయి. రాష్ట్రంలో రోజుకు సగటున 1,150 కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయంటే పరిస్థితిని ఊహించుకోవచ్చు. గుంటూరు జిల్లాకు చెందిన పదేళ్ల బాలుడు రాజేష్ ఇటీవల రేబిస్‌తో మృతిచెందడం కలచివేస్తున్న అంశం. – సాక్షి, అమరావతి

రేబిస్.. అత్యంత ప్రమాదకరం



కుక్క కరిస్తే వచ్చే రేబిస్ 14 రోజుల నుంచి 48 నెలల వరకూ ఎప్పుడైనా రావచ్చు. రేబిస్ వైరస్ నరాల వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుంది. కుక్క కరిచిన గాటు తలకు దగ్గరగా అంటే.. భుజానికి, మెడకు, వీపుకు ఉన్నట్లయితే అత్యంత వేగంగా రేబిస్ వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి సోకి బతికి బట్టగట్టినవారు ప్రపంచంలో ఎవరూ లేరు.

కుక్క కరిస్తే ప్రాథమిక చికిత్స ఇలా

- కుక్క కరవగానే కరిచిన చోట శుభ్రంగా కడగాలి.
- కుళాయి కింద గాయాన్ని ఉంచి ఆ గాయంపై నీళ్లు నేరుగా పడేలా చూడాలి.
- సబ్బు నీటితో కడగడం వల్ల వైరస్ లక్షణాలను వీలైనంత ఎక్కువగా నిర్మూలించవచ్చు.
- పొయొడిన్, డెటాల్ వంటి వాటిని గాయంపై వేయడం మంచిది.
- కుక్కకాటు గాయానికి కుట్లు వేయడం, ఆయిట్‌మెంట్లు పూయడం చేయకూడదు.
- బకెట్‌లో ఉంచి కడిగితే కుక్క నోటి నుంచి వచ్చిన సొంగ మరో పుండు మీద, ఇతర కారణాల వల్ల వేరే గాయానికి అంటుకున్నా వ్యాధి సోకే అవకాశం ఉంటుంది.

ఈ లక్షణాలు కనిపిస్తే అది పిచ్చికుక్కే

- నోటి నుంచి లాలాజలం కారుతూ ఉండటం.
- నాలుక బయటపెట్టడం
- మతిలేకుండా తిరుగుతుండటం
- కనపడిన వస్తువులను, మనుషులను, పశువులను కరవడం
- ఇలాంటి కుక్కలు కరిచిన వెంటనే 30 నిముషాల్లోపు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- రేబిస్ వ్యాధి అనేది ఒకరికి సోకితే కుటుంబ సభ్యులకు, ఇరుగు పొరుగు వారికీ సోకే అవకాశం ఉంటుంది.

ఆలస్యమే.. విషం

నిపుణుల అభిప్రాయం ప్రకారం పాము విషానికి, కుక్క విషానికి పెద్ద తేడా లేదు. పాము కాటు వేయగానే వెంటనే ఆస్పత్రికి వెళ్తారు. కుక్కకరిస్తే మాత్రం జాప్యం చేస్తారు. పాము తరహాలోనే కుక్క కాటుకు కూడా అత్యవసరంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. దీనివల్ల రేబిస్ వైరస్‌తో ఉన్న కుక్క కరచినా ఆ వైరస్ ప్రమాదం మనిషికి సోకే అవకాశం ఉండదు. వ్యాక్సిన్ వేయగానే రేబిస్ వ్యాధికి విరుగుడుగా కావాల్సిన యాంటీబాడీస్ శరీరంలో అభివృద్ధి చెందుతాయి. అందుకే కుక్క కరిస్తే వీలైనంత త్వరగా వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది.

రేబిస్ సోకిన మనుషుల ప్రవర్తన ఇలా ఉంటుంది..

- నీళ్లంటే విపరీతమైన భయం
- శరీర కండరాల్లో విపరీతమైన నొప్పి
- ప్రవర్తనలో తీవ్ర మార్పులు సంభవిస్తాయి.
- వ్యాధి ముదిరే కొద్దీ శ్వాస తీసుకోవడం కష్టం

టీకాల నియమావళి ఇలా ఉంటుంది

- కుక్క కరిచిన రోజు నుంచి.. 0 డోసు నుంచి ఏఆర్‌వీ వేయించుకోవాలి. కరిచిన రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు, 28వ రోజు, 90వ రోజున యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి.
- గాయం బాగా పెద్దదిగా ఉంటే రేబిస్ హ్యూమన్ ఇమ్యునోగ్లోబిలిన్ యాంటీ సీరంలను వేయాలి.
- గాయాన్ని బట్టి గాయం చుట్టూ ఇమ్యునోగ్లోబిలిన్ యాంటీ సిరంను వాడాలి.
- పైన పేర్కొన్నట్టు 90 రోజుల వరకూ సూచించిన డోసులన్నీ వాడితే రేబిస్ వచ్చే అవకాశం ఉండదు.



లూయిస్ పాశ్చర్స్ చలవే

లూయిస్ పాశ్చర్స్ అనే శాస్త్రవేత్త లేక పోయి ఉంటే కుక్కకాటుకు ఎంతో మంది బలయ్యేవారు. 1885 జూలై 6వ తేదీన ఆయన కుక్కకాటుకు టీకాను కనిపెట్టారు. కుక్కకాటుకు గురైన తొమ్మిదేళ్ల బాలుడికి ఈ టీకా మందు ఇచ్చి రేబిస్ నుంచి కాపాడారు. ఆ తర్వాత పశువుల నుంచి సంక్రమించే ఎన్నో రకాల వ్యాధులకు టీకాలు వచ్చాయి. అందుకే జూలై 6ను జునోసిస్ డే (పశువుల నుంచి సంక్రమించే వ్యాధుల నివారణ దినోత్సవం)గా జరుపుకొంటారు.


గాయాన్ని బట్టి చికిత్స చేయాలి



కుక్కకాటుకు గురైన బాధితులు ఎక్కువగా వస్తున్నారు. కుక్క కాటు చిన్నది కదా అని వదిలేయకూడదు. రక్తం కనిపించని గాయానికి కూడా వ్యాక్సిన్ వేయాలి. గాయం పెద్దదైతే హెచ్‌ఆర్‌ఐజీ (హ్యూమన్ రేబిస్ ఇమ్యునో గ్లోబిలిన్), ఈఆర్‌ఐజీ (ఈక్వెలింట్ రేబిస్ ఇమ్యునో గ్లోబిలిన్) వాడాల్సి ఉంటుంది. గాయం పెద్దదైతే బాధితులను ఆస్పత్రిలోనే ఉంచి పరిశీలనలో ఉంచడం మంచిది. గాయం మరీ పెద్దదైతే జనరల్ సర్జన్ పరిశీలించాలి.
–డా.మస్రూర్ అహ్మద్, చిన్న పిల్లల వైద్యులు, రిమ్స్, కడప

వేగంగా స్పందించాలి

కుక్కలకు సాధారణంగా టెరిటోరియల్ ఫీలింగ్ (ఇది నా అడ్డా.. అనే భావన) ఉంటుంది. తన ప్రాంతంలోకి ఇతర ప్రాంత కుక్కలు వచ్చినా, మనుషులు వచ్చినా దానికి కోపం వస్తుంది. పెంపుడు కుక్కలకూ టీకాలు వేయించాలి. రేబిస్ సోకిన తర్వాత మందు లేదు. టీకాలు వాడితే రేబిస్ రాదు. పాముకాటుకు, కుక్క కాటుకు పెద్దగా తేడా లేదు. పాము కాటుకు ఎంత తొందరగా స్పందిస్తారో, దీనికీ అంతే తొందరగా స్పందించి చికిత్స చేయించాలి.
–డా.కె.సాయిగోపాల్, పశువైద్య నిపుణులు, పశుసంవర్ధక సంచాలకుల కార్యాలయం, విజయవాడ



మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించింది

- ఎస్టీ జాబితాలో చేర్చుతామన్న హామీని మరిచింది
- రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడిన మాజీ మంత్రి మోపిదేవి
- ఢిల్లీలో 13 జిల్లాల మత్స్యకారుల భారీ ధర్నా



బుధవారం మత్స్యకారుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మోపిదేవి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారుల సంక్షేమాన్ని రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మత్స్యకారుల్ని ఎస్టీ జాబితాలో చేర్చుతామని ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీని అధికారంలోకొచ్చి మూడేళ్లు పూర్తయినా అమలు చేయలేదని తప్పుపట్టారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 13 జిల్లాల వృత్తిదారులు బుధవారం ఢిల్లీలో భారీ ధర్నా చేపట్టారు. మోపిదేవి ఇందులో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విస్తారంగా ఉన్న తీరప్రాంతంలో ప్రభుత్వం పరిశ్రమల పేరుతో మత్స్యకారుల పొట్టకొడుతోందన్నారు. ఎన్నికల ముందు వారి ఓట్ల కోసం హామీలు గుప్పించిన చంద్రబాబు.. అధికారంలోకొచ్చాక ముఖం చాటేశారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారుల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, వారి సంక్షేమానికి కార్పొరేషన్ ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, 50 ఏళ్లపైబడిన వారికి పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏటా రూ.25 వేలకోట్ల లావాదేవీల్ని, విదేశీ మారకద్రవ్యాన్ని సమకూరుస్తున్న మత్స్యరంగంపై చిన్నచూపు సరికాదన్నారు. వేటకెళ్లి ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాల్ని ఆదుకోవాలన్నారు. సముద్రంలో మునిగిపోయిన వేటగాళ్ల శరీరాలు చాలావరకు దొరకని పరిస్థితులున్న నేపథ్యంలో.. మరణ ధ్రువీకరణపత్రం లేదన్న కారణంతో సర్కారు వారికి బీమా చెల్లించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రసర్కారు మత్స్యకారుల సమస్యల్ని పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో వారు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మత్స్యకారుల్ని త్వరలోనే ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి సమస్యల్ని వివరిస్తామని తెలిపారు. పుదుచ్చేరి సీఎం వి.నారాయణస్వామి కూడా ధర్నాకు సంఘీభావం తెలిపారు. ధర్నాలో మత్స్యకారుల సంఘం నేత ఏఎల్ మల్లయ్య, సంఘం సలహాదారు కర్రి పద్మశ్రీ, అధ్యక్షురాలు బి.గొరేశ్వరి, నేతలు రాజశేఖర్, పాపారావు, కర్రి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సదస్సు విజయవంతం చేయాలి

- 7న జరిగే సదస్సుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక
- పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కే, పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు


చేనేత సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు తదితరులు

మంగళగిరి: మంగళగిరి వేదికగా తొలిసారి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే) పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో చేనేత సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన పట్టణంలోని ఆటోనగర్‌లోని నన్నపనేని కళావేదికలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్న ఈ సదస్సులో చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, గత ఎన్నికల సమయంలో నేతన్నలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి టీడీపీ చేసిన మోసాన్ని బట్టబయలు చేయడంతో పాటు పరిశ్రమను ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ చేయనున్న కార్యక్రమాలను వెల్లడిస్తారని తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేనేత పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. ఇక వైఎస్సార్‌సీపీ చేపట్టిన నవరత్నాలు కార్యక్రమంలో అమ్మ ఒడి పథకం చేనేత కార్మికుల కోసమే ప్రత్యేకంగా ప్రవేశపెట్టారన్నారు. చిలపలనూలుపై జీఎస్టీ పన్ను విధించడంతో పరిశ్రమకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా తనను నియమించడమే కాక అంతర్జాతీయ చేనేత సదస్సును మంగళగిరిలోనే నిర్వహించాలని సూచించడం వైఎస్ జగన్‌కు మంగళగిరి చేనేత పరిశ్రమ మీద ఉన్న అభిమానాన్ని తెలియజేసిందని పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పచ్చల రత్నకుమారి, మంగళగిరి, తాడేపల్లి, పట్టణ, మండల కన్వీనర్లు మునగాల మల్లేశ్వరరావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, బుర్రముక్కు వేణుగోపాలరెడ్డి, పాటిబండ్ల కృష్ణమూర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సంకె సునీత, జిల్లా కార్యదర్శులు మాచర్ల సుధాకర్, నాలి వెంకటకృష్ణ, అన్నే శేషారావు, అందె ప్రసాద్, దామర్ల ఉమామహేశ్వరరావు, బొమ్ము శివరామిరెడ్డి, పచ్చల శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనంతలో ర్యాగింగ్ కలకలం

అనంతపురం సెంట్రల్: అనంతపురంలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఒకేరోజు ఇద్దరు విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(ఎస్కేయూ)లోని సైన్స్ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ తొలి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. తోటి విద్యార్థులు గమనించి అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. మహిళా వసతి గృహాల్లో రాత్రి పూట ర్యాగింగ్ తీవ్రంగా జరుగుతోందని బాధితురాలు వాపోయారు. ఈ ఘటనపై విచారణ జరిపుతామని వర్సిటీ అధికారులు తెలిపారు. కాగా, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి చెందిన పీవీకేకే కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న నితీష్‌కుమార్‌రెడ్డి గొంతుకోసి దుండగులు పరారయ్యారు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థి.. కళాశాలకు కూతవేట దూరంలోని ముళ్ల పొదల్లో రక్తపుమడుగులో పడి ఉండటంతో గమనించిన స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ కళాశాలలో చదువుకోలేనని, ర్యాగింగ్‌తో పాటు, తాగొస్తున్నారని ముందు రోజు బాధిత విద్యార్థి తన తల్లిదండ్రులకు తెలిపినట్లు బంధువులు వివరించారు. అయితే విద్యార్థి అనుమతి లేకుండా బయటకు వెళ్లాడని, ఏం జరిగిందో తమకు తెలియదని కళాశాల యాజమాన్యం తెలిపింది.

అవన్నీ నకిలీ నోటీసులు: ఐటీ శాఖ

సాక్షి, హైదరాబాద్: తమ పేరుతో పన్ను చెల్లింపుదారులకు వస్తున్న నోటీసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సూచించింది. అలాంటి నోటీసులు వచ్చినప్పుడు తమ అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆదాయపు పన్ను శాఖ పేరుతో పన్ను చెల్లింపుదారులకు కొన్ని నకిలీ నోటీసులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. నోటీసుల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారిక చిహ్నం, హోదా, అధికారుల పేర్లు కూడా వాడుతున్నారని పేర్కొంది. అయితే అలాంటి నోటీసులు అందుకున్నవారు ముందుగా 040–23425200, 8985970011 నంబర్లలో బీవీ వినోద్ (పీఆర్వో)ను సంప్రదించిన తర్వాతే స్పందించాలని పేర్కొంది.

వైద్యుడి రెండో పెళ్లి యత్నం భగ్నం

• అడ్డుకున్న మొదటి భార్య • పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం


పెళ్లి ఫొటోలను చూపిస్తున్న లలిత

మంగళగిరి: భర్త రెండో పెళ్లి యత్నాన్ని మొదటి భార్య భగ్నం చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం ఈ హైడ్రామా జరిగింది. చివరకు ఈ వివాదం పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరింది. సికింద్రాబాద్‌కు చెందిన కనుమూరి రాజు, దేవి దంపతుల కుమార్తె లలిత, అదే ప్రాంతానికి చెందిన పఠాన్ జమీర్ ప్రేమించుకున్నారు. జమీర్ చైనాలో డాక్టర్ కోర్సు చేసి తన తండ్రి నిర్వహిస్తున్న క్లినిక్‌లో వైద్యుడిగా పని చేస్తున్నాడు. వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించకపోవడంతో ఏడాదిన్నర క్రితం రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. అయితే వారం క్రితం జమీర్ తన తండ్రికి బాగోలేదని లలితకు చెప్పి వచ్చి మంగళగిరిలో రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. భర్త స్నేహితుడి ద్వారా విషయం తెలుసుకున్న ఆమె మంగళగిరి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కల్యాణ మండపానికి చేరుకుని జమీర్‌ను, అతడి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. మ్యారేజ్ సర్టిఫికెట్, ఫొటోలను పోలీసులకు చూపించిన లలిత.. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. లలితను వివాహం చేసుకున్న మాట వాస్తవమేనని, అయితే ఆమెకు రూ. 5 లక్షలు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు జమీర్ తెలిపాడు.

'జన్మభూమి కమిటీలను రద్దు చేయాలి'

సాక్షి, అమరావతి: గ్రామాల అభివృద్ధికి జన్మభూమి కమిటీలు ఆటంకంగా తయారయ్యాయని, తక్షణమే వాటిని రద్దు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నియమించిన జన్మభూమి కమిటీల్లోని సభ్యులు గ్రామాల అభివృద్ధి కంటే వర్గ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని పరిషత్ జాతీయ కార్యదర్శి జాష్టి వీరాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో టీడీపీ నాయకులే రెండు, మూడు వర్గాలుగా ఏర్పడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అసలైన అర్హులకు చేరకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

తునిలో ఐటీ దాడులు.. రూ. 11 కోట్లు పట్టివేత

తుని: ఆదాయపన్నుల (ఐటీ) శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో లెక్కల్లో చూపని రూ. 11 కోట్ల ఆదాయం పట్టుబడింది. తూర్పు గోదావరి జిల్లా తునిలో మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు 4 బంగారు దుకాణాలు, నలుగురు వైద్యుల నివాసాల్లో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 8 మందిని విచారించగా రూ. 11 కోట్లు మేర పన్ను ఎగవేతకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిసింది. బుధవారం సాయంత్రం వరకు విచారణ కొనసాగింది.

నత్తనడకన 'కొండవీటి' ఎత్తిపోతల

- రాజధానికి పొంచి ఉన్న ముంపు ముప్పు
- జూలై 11 నాటికి పనులు పూర్తి కావాలని గడువు
- ఆగస్టు వచ్చినా 10 శాతం కూడా పూర్తి కాని వైనం


నత్తనడకన జరుగుతున్న కొండవీటివాగు ఎత్తిపోతల పనులు

సాక్షి, అమరావతి బ్యూరో: రాజధాని ప్రాంతానికి పొంచి ఉన్న ముంపు ముప్పును తప్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. కొండవీటి వాగు వరద నీటిని బ్యారేజీ ఎగువకు ఎత్తిపోసేందుకు గానూ ఉండవల్లి వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించతలపెట్టారు. ఈ పనులను మెగా ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.222.44 కోట్లకు దక్కించుకుంది. ఈ ఏడాది జనవరి 11న పనులు ప్రారంభించగా.. ఏడు నెలలవుతున్నా ప్రాజెక్టు ఇంకా ఓ కొలిక్కిరాలేదు. ఇప్పటివరకూ కేవలం 10 శాతంలోపు పనులు మాత్రమే జరగడం గమనార్హం. ప్రధానంగా పంప్ హౌస్, సర్‌ప్లస్ ఎస్కేప్(ర్యాఫ్ట్) పునాదుల తవ్వకం పనులు మందకొడిగా సాగుతున్నాయి. జూలై 11 నాటికే ప్రాజెక్టు పూర్తి కావాలని గడువు విధించినప్పటికీ ఆ దిశగా పనులు వేగంగా జరగలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రాజధాని పరిసర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి పెదపరిమి–నిడుముక్కల మధ్య పాటేళ్ల వాగు పొంగడంతో దాదాపు 13 గంటలపాటు తుళ్లూరు– గుంటూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అదే కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహిస్తే.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేవీ అడ్డుకట్ట వేయలేవని.. ముంపు బారిన పడాల్సిందేనని రాజధాని ప్రాంత వాసులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3,600 కోట్లతో ఈఏపీ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- దివంగత సీఎం వైఎస్ హయాంలో చేపట్టిన పథకాల కొనసాగింపునకు ఆమోదం
- రాష్ట్రంలో చిన్న నీటి వనరుల అభివృద్ధికి ఊతం
- రైతులకు మెరుగైన జీవనోపాధికి భరోసా
- పంటల దిగుబడి పెంచేందుకు దోహదం



సాక్షి, అమరావతి: అంతర్జాతీయ సంస్థల రుణ సహకారం(ఈఏపీ)తో రాష్ట్రంలో చిన్న నీటి వనరులను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించిన రెండు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఇందులో ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకుని రూ.1600 కోట్లతో చేపట్టే ఆంధ్రప్రదేశ్ సామాజిక నీటి యాజమాన్య పథకం (ఏపీసీడబ్ల్యూఎంపీ) రెండో దశ పథకం ఒకటి. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాదుల అభివృద్ధి పథకం (ఏపీఐడబ్ల్యూఎంపీహెచ్‌ఐపీ –ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్, పోస్టు హార్వెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ప్రాజెక్ట్) కొనసాగింపులో భాగంగా జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ నుంచి రుణం తీసుకుని రూ.రెండు వేల కోట్లతో చేపట్టే పథకం మరొకటి. రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులను అధిగమించడానికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సాగునీటి రంగానికి పెద్దపీట వేశారు. ఆ క్రమంలో ప్రపంచ బ్యాంకు, జైకా వంటి అంతర్జాతీయ సంస్థల రుణ సహకారం తీసుకున్నారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో రూ.1,044.30 కోట్లతో ఆంధ్రప్రదేశ్ సామాజిక చెరువుల అభివృద్ధి పథకాన్ని 2007లో చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో మూడు వేల చెరువులను ఈ పథకం ద్వారా అభివృద్ధి చేసి.. 2.50 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు.

రాష్ట్రంలో చిన్న నీటివనరులను అభివృద్ధి చేయడంతోపాటూ రైతులకు మెరుగైన జీవనోపాదులను కల్పించేందుకు జైకా ఆర్థిక సహాయంతో రూ.1,137.74 కోట్లతో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాదుల అభివృద్ధి పథకాన్ని 2007లో చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ఈ పథకం రెండు వేల చెరువులను అభివృద్ధి చేయడంతోపాటూ పంటల దిగుబడులను పెంచడానికి దోహదం చేసింది. ఈ రెండు పథకాలు 2014లో పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్ సామాజిక నీటి యాజమాన్య పథకానికి కొనసాగింపుగా రూ.1,600 కోట్లతో పనులు చేపట్టేందుకు 2015లో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఇందులో రూ.1,200 కోట్లు ప్రపంచ బ్యాంకు రుణం కాగా, రూ.400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాటా. రూ.2 వేల కోట్లతో ఏపీఐడబ్ల్యూఎంపీహెచ్‌ఐపీ పథకాన్ని కొనసాగించేందుకు 2015లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో రూ.300 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటా కాగా, రూ.1,700 కోట్లు జైకా రుణం. ఈ రెండు పథకాలను ఇటీవల నీతి అయోగ్ ఆమోదించడంతో, ఈ ప్రాజెక్టుల ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర జలవనరుల శాఖ జూలై 27న గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

సాగర్ ఆయకట్టు అభివృద్ధి ఘనత వైఎస్‌దే

నాగార్జునసాగర్ ఆయకట్టు ఆధునీకీకరణ ప్రాజెక్టు గడువు వచ్చే ఏడాది జూలైతో పూర్తి కానుంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో రూ.4,444.41 కోట్లతో సాగర్ ఆయకట్టు ఆధునీకీకరణకు అప్పటి ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు జూన్ 25, 2009న కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు వ్యయంలో రూ.2,025 కోట్లు ప్రపంచ బ్యాంకు వాటా కాగా, రూ.2,149.41 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటా. ఈ ప్రాజెక్టు కూడా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో చేపట్టింది కావడం గమనార్హం.

సాక్షి
గురువారం, ఆగస్టు, 3


గ్యాస్ బాంబు!

ఉరుము లేకుండా పడిన పిడుగులా వంటగ్యాస్ సిలెండర్ల సబ్సిడీకి భవిష్యత్తులో మంగళం పాడదల్చుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పెట్రోల్‌పైనా, డీజిల్‌పైనా ధరల నియంత్రణ వ్యవస్థను ఎత్తేసినట్టే ఇకపై వంటగ్యాస్‌పై కూడా తొలగించబోతున్నట్టు తెలిపింది. వాస్తవానికి నిరుడు జూలైలోనే సబ్సిడీ సిలెండర్ ధరను నెలకు రూ. 2 చొప్పున పెంచమని చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. దాన్ని ఇప్పుడు నెలకు రు. 4 చేసింది. సబ్సిడీ పూర్తిగా పోయేవరకూ లేదా వచ్చే ఏడాది మార్చి వరకూ ఇలా పెంచుకుంటూ పోవాలని కూడా కోరింది. ఒక్కసారిగా ధర పెంచితే అందువల్ల జనంలో ఎలాంటి స్పందన వస్తుందో ప్రభుత్వాలకు అర్ధమై చాలా కాలమైంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఈ 'కాలజ్ఞానం' మొదలైంది. 2010లో తొలిసారి పెట్రోల్ ధరపై నియంత్రణ ఎత్తేసింది. సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉండే డీజిల్, వంటగ్యాస్, కిరోసిన్‌ల జోలికి మాత్రం వెళ్లబోమని వాగ్దానం చేసింది. 2013లో ఆ వాగ్దానాన్ని ఉల్లంఘించి డీజిల్‌పై 'పాక్షికం'గా నియంత్రణ ఎత్తేస్తున్నట్టు ఆనాటి కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం ప్రకటించారు. ఎన్‌డీఏ సర్కారు వచ్చాక 2014లో ఆ ముచ్చట కూడా ముగిసిపోయింది. ఈసారి వంటగ్యాస్ వంతు వచ్చింది. ముందూ మునుపూ కిరోసిన్‌ను సైతం ధరల నియంత్రణ వ్యవస్థ నుంచి తొలగించినా ఆశ్చర్యం లేదు.

నిరుడు మే నెలలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన(పీఎంయూవై) పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. దారిద్ర్య రేఖకు దిగువునున్న కుటుంబాలకు మహిళల పేరిట ఉచితంగా 5 కోట్ల వంటగ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలన్నది ఈ పథకం లక్ష్యం. ఇప్పటికే ఈ పథకంలో 2.5 కోట్ల మంది మహిళలు వంటగ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారని గణాంకాలు చెబుతున్నాయి. సంప్రదాయ పొయ్యిల వల్ల వాతావరణ కాలుష్యం, మహిళల ఆరోగ్యం దెబ్బతినడం వగైరా జరుగుతున్నాయి గనుక ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెప్పింది. నిజానికి యూపీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడానికి తోడ్పడిన అంశాల్లో ఉచిత వంటగ్యాస్ కనెక్షన్ల అంశం కూడా ప్రధానమైనదని అంటారు. ఈ పథకం కింద వంటగ్యాస్ కనెక్షన్ లభించిన కుటుంబాలు సెక్యూరిటీ డిపాజిట్‌గానీ, కనెక్షన్‌కి సంబంధించిన ఇతర చార్జీలుగానీ చెల్లించనవసరం లేదు. మొదటి సిలెండర్ ధరనూ, స్టౌ ధరనూ వాయిదాల్లో కట్టొచ్చునన్న నిబంధన కూడా ఉంది. కనుక ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు చాలా కుటుంబాలే తీసుకున్నాయి. కానీ రెండో సిలెండర్ నుంచి వాయిదాల పద్ధతి ఉండదు. పర్యవసానంగా కనెక్షన్ తీసుకున్నవారిలో చాలామంది కొత్త సిలెండర్ కోసం రాలేదని ఒక సర్వేలో తేలింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు సబ్సిడీ సిలెండర్ ధర రూ. 450 చెల్లించలేని స్థితిలో ఉన్నారని దీన్నిబట్టే అర్ధమవుతోంది. ఇప్పుడు ఆ సబ్సిడీని కాస్తా ఎత్తేస్తే సహజంగానే ఆ ధర మరింత పెరుగుతూ పోతుంది. ఏతావాతా అలాంటి కుటుంబాలన్నీ వంటగ్యాస్ సౌకర్యానికి దూరం కాక తప్పదు.

ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పటినుంచీ సంక్షేమ భావన క్రమేపీ కొడిగడుతోంది. దేనికైనా 'తగిన ధర' చెల్లించి తీసుకోవాల్సిందేనని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఆ లెక్కన చూస్తే వంటగ్యాస్ జోలికి ప్రభుత్వాలు చాలా ఆలస్యంగా వచ్చినట్టే లెక్క. దేశంలో సబ్సిడీ సిలెండర్లు ఉపయోగించే వారి సంఖ్య 18.11 కోట్లు. సబ్సిడీయేతర సిలెండర్ల వినియోగదారులు 2.66 కోట్లున్నారు. అసలు వంటగ్యాస్‌లో సబ్సిడీ, సబ్సిడీయేతర తరగతుల్ని తీసుకొచ్చింది యూపీఏ సర్కారే. రెండింటికీ రెండు రకాల ధరలు నిర్ణయించి... పెంచినప్పుడు చెరో రకంగా పెంచుతూ జనాన్ని అయోమయంలోకి నెట్టడం అప్పుడే మొదలైంది. వంటగ్యాస్ కనెక్షన్లలో 89 శాతం మంది ఏడాదికి 9 సిలెండర్లు మాత్రమే వాడతారని... తాము వారి జోలికి పోకుండా అంతకుమించి వాడేవారిపై భారం పడేలా పదో సిలెండర్ నుంచి సబ్సిడీని తీసేస్తున్నట్టు ఆనాటి ప్రభుత్వం చెప్పింది. దీని ప్రభావమేమిటో త్వరలోనే వారికి అర్ధమైంది. కాంగ్రెస్‌పై ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిలాయి. దాంతో 2014 ఎన్నికలకు ముందు దాన్ని కాస్తా సవరించారు. ఏడాదికి 12 సిలెండర్లను సబ్సిడీపై ఇవ్వాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. నిజానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మూడేళ్లక్రితం చమురు, గ్యాస్ ధరలు గణనీయంగా తగ్గాయి. నిరుడు ఇందులో స్వల్ప పెరుగుదల కనిపించినా అది 2014కి ముందున్న ధరలతో పోలిస్తే చాలా తక్కువే. నిజానికి దీన్ని ఆసరా చేసుకునే ప్రస్తుతం వంటగ్యాస్‌కిచ్చే సబ్సిడీని భవిష్యత్తులో ఎత్తేయబోతున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఉదాహరణకు సబ్సిడీయేతర సిలెండర్ ధర ప్రస్తుతం రూ. 737. 2013లో దాని ధర రూ. 1,250. మళ్లీ అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పుంజుకుంటే ఇది తారుమారు కావొచ్చు. ఆ పరిస్థితే తలెత్తితే ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెను ప్రభావం చూపే వంటగ్యాస్ సబ్సిడీ జోలికి వెళ్లడం ధర్మం కాదు. ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గాయని సంబరపడి ధరల నియంత్రణ వ్యవస్థ నుంచి వంటగ్యాస్‌ను తొలగిస్తే రేపన్న రోజున పరిస్థితులు వేరే రకంగా ఉండొచ్చు. నిజానికి చమురు సంస్థలపై కేంద్రం విధిస్తున్న అమ్మకం పన్ను, దిగుమతి సుంకం... ఇంకా రాష్ట్ర ప్రభుత్వాలు విధించే వ్యాట్ వగైరాలు లేనట్టయితే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఈ స్థాయిలో ఉండవు. వీటి ధరలు పెంచాల్సి వచ్చినప్పుడల్లా ప్రభుత్వం తామిస్తున్న సబ్సిడీల గురించి మాట్లాడుతుంది తప్ప ఈ పన్నుల ఊసెత్తదు. మన దేశంలో వంటిల్లు భారం మోస్తున్నది మహిళలే. వంటగ్యాస్ సబ్సిడీ తీసేస్తే పేద, మధ్య తరగతి కుటుంబాలకు అది పెను భారమవుతుంది. పర్యవసానంగా ఆ కుటుంబాలు తిరిగి పాత పద్ధతుల్లో పొయ్యి రాజేసుకుంటాయి. అందువల్ల ప్రధానంగా దెబ్బతినేది మహిళల ఆరోగ్యమే. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలి.



సుపరిపాలన అంటే సత్వర నిర్ణయాలు తీసుకోవడం అని కాదు. ఆ నిర్ణయాల వెనుక ఉద్దేశాలు కూడా మంచివిగా ఉండటమే కీలకం.

– కోఫీ అన్నన్
ఐక్యరాజ్య సమితి
మాజీ ప్రధాన కార్యదర్శి

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి శు.ఏకాదశి సా.4.26 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం జ్యేష్ఠ రా.7.06 వరకు, తదుపరి మూల, వర్జ్యం తె.3.48 నుంచి 5.35 వరకు (తెల్లవారితే శుక్రవారం) దుర్ముహూర్తం ఉ.9.58 నుంచి 10.49 వరకు, తదుపరి ప.3.04 నుంచి 3.56 వరకు అమృతఘడియలు ఉ.9.14 నుంచి 10.45 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.30
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 4.38
జొహర్ : 12.22
అసర్ : 4.50
మగ్రీబ్ : 6.48
ఇషా : 8.06

'నర్మదా బచావ్' ఓడిపోలేదు

విశ్లేషణ



యోగేంద్ర యాదవ్

నర్మదా ఉద్యమం ప్రజా కార్యాచరణకు కొత్త వ్యాకరణాన్ని ఆవిష్కరించింది. మన నైతిక ఊహాత్మకతను విస్తరింపజేసి, అభివృద్ధి బాధితులను బాధితులుగా మన చేత గుర్తింపజేసింది. రాజ్యాంగబద్ధమైన మన ప్రజాస్వామ్యంలో మాట్లాడటానికి అర్హతలేని వారికి గొంతునిచ్చింది. మన ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామీకరించింది. అంతిమ పోరాటంలో అది ఓడిపోతున్నట్టు కనిపించవచ్చు. కానీ అది ఇప్పటికే మనల్నందరినీ గెలుచుకుంది. ఆ ఉద్యమ అపజయాలు మన గతం, విజయాలు మనందరి సమష్టి భవితకు చెందుతాయి.

నర్మదా బచావ్ ఆందోళన్(ఎన్‌బీఏ) అంతిమ పోరాటానికి దిగింది. అలాంటి ఈ సమయంలో నేను ఒక తరం కార్యకర్తలకు ఆదర్శమూర్తి మేధా పాట్కర్ గురించి ఎంతగా ఆలోచిస్తున్నానో, శ్యామా భారత్ గురించి కూడా అంతగా ఆలోచిస్తున్నానని అనుకుంటాను. శ్యామా, ధార్ జిల్లాలోని బిద్వానీ తెహసిల్ పిచ్చోది గ్రామంలోని జాలరి మహిళ.

నర్మదా పోరు చివరి దశలోకి ప్రవేశించింది. సర్దోవర్ డ్యాం ప్రతిపాదిత ఎత్తుకు చేరుకుంది. కొందరికి కల, ఇతరులకు పీడకల వంటి ఆ ప్రాజెక్టు వాస్తవమైంది. చివరకు, గేట్లను కూడా మూసేశారు. ఇక రిజర్వాయరు నీటి మట్టం పెరిగి... ప్రభుత్వం ''ప్రాజెక్టు ప్రభావిత ప్రజలు''గా పిలుస్తున్న వారి ఇళ్లు, వాకిళ్లు సర్వస్వాన్నీ ముంచేస్తుంది. వారా ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవడానికి పెట్టిన తుది గడువు జూలై 31. ప్రభుత్వం ఇక ఏ రోజునైనా బలవంతంగా వారిని ఖాళీ చేయించడాన్ని ప్రారంభించవచ్చు.

ఇక అంతా ముగిసిపోయినట్టే అనిపించవచ్చు. నర్మదను కాపాడటానికి చేస్తున్న 32 ఏళ్ల చరిత్రాత్మక పోరాటం పూర్తయిందని అనిపించవచ్చు.

వెనకడుగు... కొత్త పోరు

దుస్సాధ్యమైన ప్రతిఘటనా పోరాటాన్ని ఇంకా నడుపుతున్న మేధా పాట్కర్ మీదికి నా ఆలోచనలు పోతున్నాయి. ఖాళీ చేసి వెళ్లాలన్న ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి వేలాది కుటుంబాలు ఇంకా తమ ఇళ్లలోనే ఉంటున్నాయి. వందలాది మంది గ్రామస్తులు చివరి దఫా జల సత్యాగ్రహంలో చేరారు. జూలై 27 నుంచి మేధాపాట్కర్ సహా ఓ డజను మంది కార్యకర్తలు చికల్దా గ్రామంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆసియాలో మొట్టమొదట వ్యవసాయం చేసినది ఇక్కడేనని తెలిపే ఆధారాలను పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారని మేధా పాట్కర్ తెలిపారు. ఈ వానా కాలంలోనే బహుశా ఆ గ్రామం సైతం డ్యామ్ రిజర్వాయర్‌లో మునిగిపోతుంది.

ఏళ్ల తరబడి నర్మదా బచావ్ ఆందోళన్‌ను గమనిస్తున్నవారు ఎవరైనా... ప్రతి కొత్త పోరాటమూ ఒక వెనుకడుగేనని గుర్తిస్తారు. మొదట అసలా డ్యామ్‌ను నిర్మించడానికి అనుమతించేది లేదని, దాన్ని అడ్డుకోడానికి చేసిన పోరాటం. తర్వాత డ్యామ్ ఎత్తు గురించి పోరాటం. ఇప్పుడిక ఈ ఆఖరు పోరాటం, డ్యామ్ వల్ల మధ్యప్రదేశ్‌లో నిర్వాసితులైన వారి సహాయ, పునరావాసాలా గురించి జరుగుతున్నది. డ్యామ్ నిర్మాణానికి అనుమతినిస్తూ సుప్రీం కోర్టు.. నిర్మాణానికి ముందే ప్రభావిత ప్రజలకు పునరావాసాన్ని కల్పించడం తప్పనిసరి అని షరతును విధించింది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం, పునరావాస షరతులను వేటినీ పరిపూర్తి చేయకుండానే నిర్మాణాన్ని కొనసాగించి, డ్యామ్ ఎత్తును పెంచే మార్గాలను కనిపెట్టింది.

వాగ్దానాల కాలరాచివేత

డ్యామ్ నిర్మాణాన్ని కొనసాగించడంతో పాటూ ప్రభుత్వం వాస్తవాలను తారుమారు చేయడమూ సాగించింది. వాటిని ఎన్‌బీఏ నిర్విరామంగా ఎండగడుతూ వచ్చింది. చాలా వరకు వాగ్దానాలు పరిపూర్తి కాకుండానే మిగిలిపోయాయి. భూమికి బదులుగా భూమి అనే సూత్రాన్ని విడనాడారు. అర్హతగల



చాలా కుటుంబాలకు నగదు పరిహారాన్ని సైతం ఎగవేశారు. ప్రత్యామ్నాయ గృహ వసతి వాగ్దానం కార్యరూపం దాల్చలేదు. ప్రత్యామ్నాయ గృహం వాగ్దానం చివరకు ప్రభుత్వం హడావుడిగా వేసిన రేకుల షెడ్డుకు కుదించుకుపోయింది. రైతులు వాటిలోకి తమ నివాసాన్ని మార్చుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. కోర్టు ఆదేశాలను అనుసరించి పునరావాసం పూర్తయ్యేవరకు గేట్లను మూసివేయకూడదని చికల్దాలోని ఆందోళనకారులు, దేశవ్యాప్తంగా ఉన్న వారి మద్దతుదార్లు డిమాండు చేస్తున్నారు. పాలకులు అదేమీ వినిపించుకునే ధోరణిలో లేరని స్పష్టంగానే కనిపిస్తోంది. గుజరాత్ ఎన్నికల్లోగా ప్రాజెక్టు పూర్తయిందని వాళ్లు ప్రకటించుకోవాలి.

ఈ దశలో కోర్టులు దీన్ని అడ్డుకున్నాగానీ, ఆందోళనకారుల ఎజెండా బాగా కుదించుకుపోయిందనే విషయాన్నే అది గుర్తుచేస్తూనే ఉంటుంది. నిరాశావాదులైన పరిశీలకులు నర్మదా ఉద్యమం అసలు లక్ష్యాన్నే కోల్పోయిందని మీకు చెప్పొచ్చు.

ఎనలేని ఉద్యమ విజయాలు

నేను మాత్రం అంగీకరించను. ఈ ఉద్యమం వల్ల నిర్వాసిత ప్రజలకు స్పష్టంగా కళ్లకు కనిపించే పలు లాభాలు సమకూరాయని భావిస్తున్నాను. ఈ పోరాటం, మహారాష్ట్ర, గుజరాత్‌లలో నిర్వాసిత కుటుంబాలకు దేశంలో మనం ఇంతవరకు ఎరుగనంత మంచి పునరావాస ప్యాకేజీని సాధించిపెట్టింది. అంతకు మించి అది 'పర్యావరణ ప్రభావ నివేదిక'ను ప్రభుత్వ విధి విధానాలలో భాగం చేసింది. 2013 భూసేకరణ బిల్లును తెచ్చిన ప్రతిష్ట ఎవరికి చెందుతుంది అనేట్టయితే, నిస్సందేహంగా నర్మదా బచావ్ ఆందోళనకే. ఈ ప్రయోజనాలు కేవలం మన దేశానికే పరిమితం కాలేదు. సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు నిధులను సమకూర్చే బాధ్యతల నుంచి ప్రపంచ బ్యాంకు ఉపసంహరించుకుంది. భారీ డ్యామ్ ప్రాజెక్టులకు ఆర్థికసహాయం అందించడాన్ని సమీక్షించింది.

ఎన్‌బీఏ నిర్వాసితులకు సాధించిపెట్టిన ప్రయోజనాలు ప్రత్యక్షంగా కంటికి కనిపించే వాటి పరిధికి మించి విస్తరించాయి. 'నిర్వాసిత ప్రజలు' అనే వర్గీకరణను తెచ్చినది అనేక విధాలుగా ఎన్‌బీఏనే. సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు ముందు దేశంలో పలు డ్యామ్‌లు వచ్చాయి. బాక్రా డ్యామ్, హిరాకుడ్ డ్యాం వంటివి వాటిలో కొన్ని. చండీగఢ్ నగరం కూడా అలాంటి భారీ ప్రాజెక్టే. ఇవన్నీ భారీ ఎత్తున ప్రజలను విస్థాపితులను చేశాయి.

అయినా, ఈ శరణార్థులకు ప్రభుత్వ పత్రాలలో తప్ప గుర్తింపే లేదు. వారి కడగండ్లు, బాధ, విషాదం సమంజసమైనవిగా పరిగణించేవారే కారు. వారిది దేశ నిర్మాణ ప్రాజెక్టుకు వ్యతిరేకమైన ఆందోళనగా కనిపించేది. మన నైతిక ఊహాత్మకతను విస్తరింపజేసి, అభివృద్ధి బాధితులను బాధితులుగా మన చేత గుర్తింపజేయడం ఎన్‌బీఏ సాధించిన విజయం. అది ఎన్నటికీ నిలిచి ఉండేది. ఎన్‌బీఏ, మనందరికీ పర్యావరణ, జీవావరణ స్పృహ కల్పించిందనడం సర్వసాధారణమే. కానీ అంతకు మించి అది చాలానే చేసింది. మనకు చూపుతున్న అభివృద్ధి నమూనాను... ఆధునికవాద సాంప్రదాయకత మూసల పరి ధిని దాటి పునరాలోచించడానికి అది మనల్నందర్నీ ఆహ్వానించింది.

నర్మదా ఉద్యమం ప్రజా కార్యాచరణకు కొత్త వ్యాకరణాన్ని ఆవిష్కరించింది. గాంధేయవాదం ఆకర్షణను కోల్పోతూ, విప్లవ హింస మాత్రమే ఏకైక ప్రత్యామ్నాయంగా అనిపిస్తున్న సమయంలో... మేధాపాట్కర్, ఆమె సహచరులు కలిసి అహింసకు కట్టుబడి ఉంటూనే పోరాటం, ప్రతిఘటన అనే రాడికల్ గాంధేయవాదాన్ని పునరుద్ధరించారు. ప్రభుత్వ కార్యాలయాలపై దాడి చేసి, వాటిని ఆక్రమించడం మొదలు నీటిలో నిలబడటం వరకు కొత్త పోరాట రూపాలను ఆవిష్కరించారు. ఇటీవలి కాలంలోని మరే ఉద్యమం కన్నా, ఎక్కువగా ఎన్‌బీఏ పోరాటమే... పాటలు, వాద్య బృందాలు, సినిమాలు, కథలు వగైరా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలకు విస్తరించడంలో ఆశ్చర్యమేమీ లేదు. పూర్తి డొల్ల రాజకీయాల యుగంలో, ఎన్‌బీఏ మనకు లోతైన రాజకీయాలకు అర్థం చెప్పింది.

'నర్మదా బచావ్' సాధించిన అసలు విజయం

నేను, శ్యామా భారత్ గురించి ఆలోచిస్తున్నాను. గత నెలలో ఎన్‌బీఏ, మా కిసాన్ ముక్తి యాత్రకు బద్వానీ వద్ద స్వాగతం పలికింది. ఆ సందర్భంగానే నేను మొదటిసారిగా ఆమెను కలుసుకున్నాను, ఆమె మాటలు విన్నాను. మా యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత సభలో శ్యామా మాట్లాడారు. ఆ ప్రాంతపు నిమడీ భాషలో మాట్లాడిన ఆమె ఉపన్యాసాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. అయితే, ఆమె, తన మాటల కంటే బిగ్గరగా మాట్లాడుతుంటే అందులోని ప్రతి మాటా అర్థం చేసుకోవాల్సిన అవసరమే రాలేదు. ఆ సాధారణ గ్రామీణ జాలరి మహిళ భారత రాజ్యాన్ని సవాలు చేయడానికి సాహసించింది. తనను తన ఇంటిని వదిలి పొమ్మనే హక్కు ఎవరిచ్చారని ముఖ్యమంత్రిని, జిల్లా కలెక్టర్‌ను, ఎస్‌డీఎమ్‌ను నిలదీస్తోంది. ఆమె ధిక్కారం తెలుపుతోంది. మూర్తీభవించిన సాహసమై నిలిచింది. నర్మదా బచావ్ ఆందోళన సాధించిన నిజమైన ప్రయోజనం ఆమే.


రాజ్యాంగబద్ధమైన మన ప్రజాస్వామ్యంలో మాట్లాడటానికి అర్హతలేని వారికి ఈ ఉద్యమం గొంతునిచ్చింది. మన ప్రజాస్వామ్యాన్ని అది ప్రజాస్వామీకరించింది. ఎన్‌బీఏ, తన అంతిమ పోరాటంలో ఓడిపోతున్నట్టుగా కనిపించవచ్చు. కానీ అది ఇప్పటికే మనల్నందరినీ గెలుచుకుంది. ఆ ఉద్యమం ఎదుర్కొన్న అపజయాలు మన గతం, విజయాలు మనందరి సమష్టి భవితకు చెందుతాయి.

వ్యాసకర్త స్వరాజ్ అభియాన్, జైకిసాన్ సంస్థల్లో సభ్యుడు
మొబైల్ : 98688 88986 | Twitter: @_YogendraYadav

ఆ స్నేహవారధికి నీతే మూలం

ఎవరెన్ని భాష్యాలు చెప్పినా అవినీతి మచ్చలేని నరేంద్రమోదీ, నితీశ్ కుమార్‌లు కలసి నీతి ప్రాతిపదికగా కలిసి పనిచేయడం దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపకతప్పదు. ఈ తాజా స్నేహం రాజకీయ కూటములకు స్ఫూర్తి కావాలి.

సందర్భం



పురిఘళ్ల రఘురాం

కాంగ్రెస్ పార్టీ మధ్యవర్తిగా పెళ్లి పెద్దగా ఉండి బిహార్‌లో జేడీ(యు), ఆర్జేడీల మధ్య సయోధ్య కుదిర్చి లాలూ, నితీశ్ కుమార్‌లను కలిపి మహాఘటబంధన్ ఏర్పరచిన రెండేళ్లలోనే ఇప్పుడు విడిపోవడానికి కారణం కాంగ్రెస్ అనే చెప్పాలి. గతంలో నితీశ్, లాలూలు బద్ధ శత్రువులే అయినప్పటికీ భాజపా మీద కోపంతో నితీశ్ తప్పనిసరి పరిస్థితుల్లో లాలూతో కలసి పనిచేశారు. 2015 ఎన్నికల్లో అయిష్టంగానే చేతులు కలపాల్సి వచ్చింది. 15 సంవత్సరాల భాజపా మిత్రత్వాన్ని వదులుకుని లాలూతో చేతులు కలిపి కోరి కష్టాలు తెచ్చుకున్నట్లైంది నితీశ్ కుమార్‌కు. ఏడున్నర ఏళ్లకు పైగా భాజపాతో కలసి ప్రభుత్వాన్ని నడిపిన నితీశ్‌కు ఎప్పుడూ, ఎలాంటి అభిప్రాయ భేదాలు, ఎలాంటి తలపోట్లు రాలేదు. ఏ ఒక్క అవినీతి ఆరోపణ లేదు.

నితీశ్ కుమార్ నిజాయితీని ఎవరూ శంకించరు. కానీ అవినీతిపరుడిగా ముద్రపడిన లాలూ కుమారుడు తేజస్వీ ప్రసాద్ యాదవ్ పైన కూడా అవినీతి ఆరోపణలు చూసి నితీశ్‌కు తలబొప్పి కట్టింది. ఉప ముఖ్యమంత్రిగా లాలూ కుమారుడు తేజస్వీ ప్రసాద్ యాదవ్‌పై సీబీఐ కేసు నమోదు చేయడం... ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో ఉప ముఖ్యమంత్రి మాట్లాడక పోవటం, ఆఖరికి ముఖ్యమంత్రి పక్క సీట్లో కూడా కూర్చునేందుకు ఉప ముఖ్యమంత్రి ఇష్టపడక పోవటం బిహార్ ప్రజలను విస్తుపరచింది. రోజు రోజుకీ వీరి మధ్య అగాధం పెరిగి పెద్దదయ్యిందని చెప్పాలి.

జరిగే పరిణామాలను కాంగ్రెస్ పార్టీ నిశితంగా పరి శీలిస్తోంది. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో దౌత్యం కూడా నడిపారు. మొన్న కలసిన వీరిద్దరూ సమస్యపై చర్చించారు కూడా. మహాఘటబంధన్ విడిపోతే భాజపా మరలా బలపడుతుందని, ఆ అవకాశం భాజపాకు ఇవ్వకూడదని లాలూ, కాంగ్రెస్‌లు కలవరపడ్డాయి. అయితే నితీశ్ కుమార్ మాత్రం చాలా ఆచితూచి అడుగులు వేశారు. ప్రధాని మోదీతో రెండు సార్లు విందు రాజకీయాలు నడిపారు నితీశ్ కుమార్. అప్పుడే వీరిద్దరి మధ్య స్నేహం చిగురించిందని చెబుతున్నారు రాజకీయ పండితులు.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ ప్రసాద్ యాదవ్‌ని తప్పించాలని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ లాలూని, కాంగ్రెస్‌ని డిమాండ్ చేశారు. అందుకు లాలూ ససేమిరా అన్నారు. గతంలో ముఖ్యమంత్రి నితీశ్ తనకు ముఖ్య అనుచరులు మంత్రులుగా ఉన్న మాంజీ, ఆర్.ఎన్. సింగ్, ఆవిదేశ్, కుశవహ, రమాధర్‌సింగ్‌లను వివిధ అవినీతి ఆరోపణలపై పదవుల నుంచి తొలగించి తన నిజాయితీని నిరూపించుకున్నారు. మరి ఇప్పుడేమో అవినీతి ముద్ర ఉన్న ఉప ముఖ్యమంత్రితో కలసి పనిచేయలేక సతమతమయ్యారు నితీశ్. వివాదం రోజురోజుకూ ముదిరి ఆయన రాజీనామాకు దారితీసాయి.

మరోపక్క నితీశ్ భాజపాకు దగ్గరయ్యారు. భాజపా రాష్ట్ర నాయకులతో నితీశ్‌కు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నమాట వాస్తవమే. రాష్ట్రపతి ఎన్నికల్లో నితీశ్ కుమార్ ఎన్డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కి మద్దతివ్వడం కూడా కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడలేదు. ఉప ముఖ్యమంత్రి తేజస్వీ ప్రసాద్ యాదవ్‌ను తొలగించడంపై కాంగ్రెస్ అభిప్రాయం (స్టాండ్‌ని) నితీశ్ కోరినప్పటికీ కాంగ్రెస్ మాత్రం తేజస్వీ ప్రసాద్ యాదవ్‌ని సమర్థించి అవినీతికి కొమ్ము కాయటం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు అసలు నచ్చలేదు. గత్యంతరం లేక రాజీనామా చేశారు.

జేడీయూ, ఆర్జేడీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. కాంగ్రెస్ మాత్రం మధ్యలో చాలా కలవరపడింది. ఇలాగే కొనసాగితే ప్రభుత్వం ఎంతోకాలం మనుగడ సాగించదని రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. ఎలాగైనా మహాఘటబంధన్ కొనసాగాలని కాంగ్రెస్ కోరుకుంది. రెండేళ్లలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవ్వాలంటే ముందు బిహార్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని సోనియాగాంధీ స్వయంగా రంగంలోకి దిగినా లాభం లేకపోయింది.

నితీశ్ కుమార్ మాత్రం ఈ తలనొప్పులు భరించలేక 2018లో జరుగనున్న రాజస్తాన్ ఎన్నికలతో కలసి బిహార్‌లో కూడా ఎన్నికలకు వెళతానని బెదిరించారు. తద్వారా లాలూ కుటుంబానికి, ఆర్జేడీకి చెక్ పెట్టాలని కోరుకున్నారు. ఇన్ని తలపోట్లు, అవమానాలు, అవినీతితో లాలూ ప్రసాద్, కాంగ్రెస్‌లతో కొనసాగటం ఇష్టం లేక ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాజీనామా చేసి తన పాత మిత్రుడైన భాజపాతో కలసి బిహార్ అభివృద్ధిని కొనసాగించి, మోదీ నాయకత్వంలో పనిచేయడమే ఉత్తమమైన మార్గమని తలచి భాజపాతో కొత్త ప్రభుత్వాన్ని బిహార్‌లో ఏర్పరిచారు. ఎవరెన్ని భాష్యాలు చెప్పినా అవినీతి మచ్చలేని నరేంద్రమోదీ, నితీశ్ కుమార్‌లు కలసి పనిచేయడం దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. రోజురోజుకీ ప్రధానిగా నరేంద్ర మోదీకి ప్రజాదరణ పెరుగుతుండటంతో పాటు దేశంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు సైతం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక చేరుతున్న వాస్తవాన్ని గ్రహించాల్సి ఉంది.



గతంలో పంజాబ్‌లో భాజపా–అకాలీలు కలసి పని చేసినప్పుడు అకాలీల అవినీతివల్లే భాజపా–అకాలీల ప్రభుత్వం తిరిగి రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోలేకపోయిందన్నది వాస్తవమే. కేంద్రంలో గత మూడేళ్లుగా భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా నిజాయితీగా పని చేయడాన్ని దేశ ప్రజలు గుర్తిస్తున్నారు. ఎన్డీఏ భాగస్వామ్యాలు కూడా అవినీతి మచ్చలేకుండా పరిపాలన సాగించాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికలలో అభివృద్ధి ఎజెండాగా, ఎన్నికల అస్త్రాలుగా ఉండాలని ప్రధాని కోరుకుంటున్నారు.

వ్యాసకర్త బీజేపీ ఏపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

ఖాండవ దహనం

కాలిపోయిన ఆయా కీలక విభాగాల ఫైళ్లలో ఎంతమంది మహానుభావుల గోత్రాలు శాశ్వతంగా నేలమట్టమయ్యాయో మనకి తెలీదు. అవినీతికి అవకాశాలెక్కువ. నీతికి విస్తృతి తక్కువ.

విశ్లేషణ



గొల్లపూడి మారుతీరావు

జీవన కాలమ్

చాలా సంవత్సరాల కిందట చెన్నై హైకోర్టులో ఒక కేసు నడిచింది. కేసు ఓడిపోతే గవర్నమెంటుకి మేం 30 లక్షలు కట్టాలి. చేతిలో అంత సొమ్ము లేదు. కేసు త్వరగా పరిష్కారం అయిపోయే సూచనలు కనిపించాయి. నేను కంగారు పడడాన్ని మా న్యాయవాది గ్రహించాడు. కారణం చెప్పాను. ''మరేం ఫర్వాలేదు సార్. కేసుని ఎంతకాలం వాయిదా వేయాలో చెప్పండి''అన్నాడు. నేను తెల్లబోయాను. ''అదెలా సాధ్యం?'' అన్నాను. నవ్వాడు న్యాయవాది. ''ఈ దేశంలో కావలసినన్ని సౌకర్యాలు ఉన్నాయి సార్. కేసు ఆరు నెలలు వాయిదా పడాలా? రెండేళ్లు వాయిదా పడాలా? లేక శాశ్వతంగా నిలిచిపోవాలా? ప్రతి పనికీ రేట్లున్నాయి'' అన్నాడు. ''ఎలా?'' అని తెలబోయాను. ''రెండు నెలలు వాయిదా పడాలంటే – కరెక్టుగా డిపార్టుమెంటులో మీ కేసు ఫైలు మాయమయిపోతుంది. మళ్లీ కావలసినప్పుడు కనిపిస్తుంది. మంచి ధర చెల్లిస్తే శాశ్వతంగానూ మాయమయిపోగలదు'' అన్నాడు.

మరో సరదా అయిన కథ. అలనాటి మద్రాసులో 1985 వరకు రచయితలకు, పరిశోధకులకు, జిజ్ఞాసువులకు ఆటపట్టయిన ఒక మార్కెట్ ఉండేది– ఇప్పటి సెంట్రల్ స్టేషన్‌ని ఆనుకుని. దాని పేరు మూర్ మార్కెట్. అక్కడ పుస్తకాల షాపుల్లో – ఆరోజుల్లో దొరకని పుస్తకం లేదు. ఆ షాపుల వాళ్లు తమిళులు. అయినా సంవత్సరాల తరబడి – అనుభవం వల్ల– చాలా విజ్ఞతనార్జించినవారు. వారికి ముద్దుపళని 'రాధికా సాంత్వనము' తెలుసు. 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' తెలుసు. నార్ల వెంకటేశ్వరరావు గారిని తెలుసు. ఆరుద్రని తెలుసు. డి. ఆంజనేయులు గారిని తెలుసు. బులుసు వెంకటరమణయ్య గారిని తెలుసు. వీరందరికీ ఆ మార్కెట్ విజ్ఞాన భాండాగారం. అలాగే సైన్స్, ఖగోళ ఇతర విభాగాల ప్రముఖులూ అక్కడ ప్రతిదినం కనిపించేవారు. అదొక విజ్ఞాన కూడలి.

దరిమిలాను సెంట్రల్ స్టేషన్‌లో రద్దీ పెరిగి, దాని విస్తృతి చేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ మూర్ మార్కెట్‌ని తొలగించాలని గవర్నమెంట్ నిర్ణయించుకుంది. మేధావులు హాహాకారాలు చేశారు. సంపాదకుని లేఖలు రాశారు. మేయర్‌కి హెచ్చరికలు చేశారు. గవర్నమెంటుకి వారి కిటుకులు వారికి ఉన్నాయి. అప్పటికి కిమ్మనకుండా నోరు మూసుకుంది. 1985 మే 30వ తేదీ అర్ధరాత్రి – నగరం నిద్రిస్తున్నప్పుడు మూర్ మార్కెట్‌లో మంటలు చెలరేగాయి. కోట్ల విలువయిన పుస్తకాలు, షాపులు నేలమట్టమయ్యాయి. అందరూ నిశ్చేష్టులయ్యారు. తెల్లవారే సరికి మూర్ మార్కెట్ లేదు.

ఆ మధ్య హుద్‌హుద్ జల ప్రళయం పెట్టుబడిగా ఎంత మంది రెవెన్యూ అధికారులు ఎన్ని ఫైళ్లను నీటిపాలు చేశారో, తత్కారణంగా ఎంత మంది భూబకాసురులకు కలసి వచ్చిందో ఇప్పుడిప్పుడే కథలు బయటికి వస్తున్నాయి. చాలామంది రెవెన్యూ అధికారుల గోత్రాలు రోజూ పత్రికల్లో వెల్లివిరుస్తున్నాయి. ఎంతోమంది తాసీల్దారుల లీలలు చదువుకుంటున్నాం.

దేశంలో ఒక పక్క నితీశ్ కుమార్‌గారి హఠాత్ మానసిక పరివర్తన, నవాజ్ షరీఫ్ సాహెబ్‌గారి హఠాత్ పదవీ చ్యుతి వంటి 'రుచి'కరమయిన వార్తలు చదువుకుంటున్న నేపథ్యంలో – వార్తాపత్రికల్లో ఆరవ పేజీలో అంగుళం మేర ఒక వార్త ప్రచురితమయింది. చాలామంది చూసి ఉండరు. చూసినా పట్టించుకుని ఉండరు. అది– ఢిల్లీ ఖాన్ మార్కెట్‌లోని లోక్‌నాయక్ భవన్‌లో ఘోర అగ్నిప్రమాదం. 26 అగ్ని మాపక దళాలు ఆ మంటల్ని ఆర్పడానికి ప్రయత్నించాయి. అంటే ఆ అగ్నిప్రమాదం ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చు. ఏమిటి ఈ అగ్నిప్రమాదంలో విశేషం? ఆ లోక్‌నాయక్ భవన్‌లో మన సీబీఐ, ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం (అంటే రాబడి పన్ను నిఘా విభాగం), రాబడి పన్ను విభాగం ఉన్నాయి. ఇవన్నీ ఈ దేశపు అవినీతి నిరోధానికి కీలక విభాగాలు.

ఈ అగ్ని ప్రమాదంలో ఎన్ని ముఖ్యమయిన



ఫైళ్లు నాశనమయిపోయాయి?ఎన్ని దొంగ లెక్కల ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయి? ఎంతమందికి ఈ 'ప్రమాదం' ప్రమోదాన్ని ఇవ్వగలదు? మనకు తెలియదు. ఏ పెద్ద మనుషులు ఈ చక్కని ప్రమాదాన్ని ఎంత ఖర్చుతో నిర్వహించారు? మనదాకా రాదు.

పోనీ, నిజంగా ఎవరి ప్రమేయం లేకుండానే ఈ ప్రమాదం జరిగిందనుకుందాం! రేపు–అతి నిజాయితీపరుడయిన ఏ ఖేమ్కా గారో పెద్ద కుర్చీలో కూర్చుని ''ఫలానా మాల్యాగారి ఫైలు పట్రావయ్యా!'' అంటే, గుమాస్తా చిరునవ్వు నవ్వి, ''అది ఆ మధ్య జూలైలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది సార్!'' అని సెలవివ్వగలడు. ఇచ్చినందుకు ఆయన ఇంటికి ఆ రాత్రి ఓ పెద్ద పార్సిలు మాల్యా గారి శుభాకాంక్షలతో చేరగలదు. ఇది కేవలం నమూనా ఊహ.

కాలిపోయిన ఆయా కీలక విభాగాల ఫైళ్లలో ఎంతమంది మహానుభావుల గోత్రాలు శాశ్వతంగా నేలమట్టమయ్యాయో మనకి తెలీదు. అవినీతికి అవకాశాలెక్కువ. నీతికి విస్తృతి తక్కువ. అందుకనే హిట్లర్ కనిపించినంతగా శిబి చక్రవర్తి వదాన్యత కనిపించదు.

నంద్యాల విజయాన్ని జగన్‌కు కానుకగా ఇస్తాం

ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి స్పష్టీకరణ
- త్వరలో అందరి జాతకాలు బయటపెడతా
- మేం లాడ్జీల నుంచి డబ్బులు గుంజలేదు, తుపాకులతో కాల్చలేదు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నిక విజయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి చెప్పారు. అధికార తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశానని ప్రకటించారు. ఈ సమాచారాన్ని ఫ్యాక్స్ ద్వారా పార్టీ అధిష్టానానికి పంపినట్లు వెల్లడించారు. నేడు (గురువారం) నంద్యాల బహిరంగ సభలో శ్రీశైలం నియోజకవర్గ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరబోతున్నామని తెలిపారు. చక్రపాణిరెడ్డి బుధవారం నంద్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో చాలా అవమానకర పరిస్థితులు, ఇబ్బందులను ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే... ‘‘టీడీపీలో రెండేళ్ల పాటు పలు హోదాల్లో పనిచేశా. ప్రతి గ్రామంలో పేరు పెట్టి పిలిచే విధంగా సంబంధాలు ఏర్పర్చుకున్నా. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వలేని పరిస్థితుల్లో నాకు అంతకంటే ఎక్కువ అధికారాలను ఇచ్చారు. నా నాయకత్వంలో కర్నూలు జిల్లాలో ఎన్నికల్లో గెలిచాం. ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేశా. ఇప్పటివరకు టీడీపీలో చంద్రబాబు దగ్గర పనిచేశా. నేను ఎక్కడ పనిచేసినా ఆ పార్టీకి అంకితభావంతో సేవలందించా. టీడీపీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశా. నేను ఎవరి దగ్గర పనిచేసినా నిబద్ధతతోనే పనిచేశా.

జగన్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదు

మొదటిసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచాం. ఐదుగురు ఎమ్మెల్యేలను డబ్బు పెట్టి కొనుకున్న తర్వాత మెజార్టీ తగ్గింది. నా సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి గురించి, నా గురించి కొందరు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. కొన్ని రోజులు ఆగితే నోరు విప్పుతా. అందరి జాతకాలు బయటపెడతా. తెలుగుదేశం నాయకత్వానికి పెళ్లాం దెయ్యం మాదిరిగా కనబడుతోంది, ప్రియురాలు దేవతలాగా కనపడుతోంది. టీడీపీ అధిష్టానం నుంచి వచ్చిన స్క్రిప్ట్ మేరకే వైఎస్ జగన్‌పై విమర్శలు చేశా, వ్యక్తిగతంగా ఎన్నడూ విమర్శలు చేయలేదు.

రండి.. రాజీనామా చేసి తేల్చుకుందాం..

నా సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి చీమకు కూడా హాని చేయని వ్యక్తి. మా అన్నకు దయాదాక్షిణ్యాలు ఎక్కువ. అటువంటి వ్యక్తిపై విమర్శలు చేస్తారా? నంద్యాలను అభివృద్ధి చేయలేదని మాట్లాడుతున్నారు. మీరు(టీడీపీ) ఏం అభివృద్ధి చేశారు? మేం లాడ్జీల నుంచి డబ్బులు గుంజలేదు, తుపాకులతో కాల్చలేదు. మేం చీమను కూడా చంపలేదు. శిల్పా సోదరులు ఎక్కడుంటే అక్కడ విజయం ఉంటుంది. నంద్యాల విజయాన్ని వైఎస్ జగన్‌కు కానుకగా ఇస్తాం. నేను రాజీనామాకు సిద్ధం, రాజీనామా లేఖను జేబులోనే పెట్టుకుని తిరుగుతున్నా. అందరూ రండి రాజీనామా చేసి తేల్చుకుందాం. భూమా నాగిరెడ్డి కుటుంబం గతంలో ప్రజారాజ్యం పార్టీని మోసం చేసింది, ఇప్పుడు వైఎస్ జగన్‌ను మోసం చేసింది. రేపటి నుంచి చూస్తారు... చిందు చిందు వేయాల్సిందే’’ అని శిల్పా చక్రపాణిరెడ్డి తేల్చిచెప్పారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేతలు బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, పార్టీ నేత పీపీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి. చిత్రంలో బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, శిల్పా మోహన్‌రెడ్డి, గౌరు వెంకటరెడ్డి, పీపీ నాగిరెడ్డి తదితరులు



జగన్‌తో చక్రపాణి భేటీ

సాక్షి, అమరావతి: టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్న కర్నూలు జిల్లా నాయకుడు ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. పార్టీలో చేరికకు సంబంధించి ఇరువురి మధ్య చర్చ జరిగిందని, టీడీపీకి రాజీనామా చేయడానికి దారితీసిన పరిస్థితులను జగన్‌కు చక్రపాణిరెడ్డి వివరించారని పార్టీ వర్గాలు తెలిపాయి. టీడీపీ ఎమ్మెల్సీగా ఉన్నందున చక్రపాణిరెడ్డి వైఎస్సార్సీపీలో చేరడానికి ముందు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని జగన్ కోరినట్లు తెలిసింది. వైఎస్సార్సీపీ మొదటి నుంచి ఉన్నతమైన విలువలతో కూడిన రాజకీయాలకే పెద్దపీట వేస్తుందని జగన్ తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన 18 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి 2011లో వైఎస్సార్సీపీలో చేరడం, తిరిగి పోటీ చేసి గెలవడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసినట్లు తెలిసింది.

నంద్యాల ఉపఎన్నికకు టీడీపీ అభ్యర్థి నామినేషన్

నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికకు టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాలలోని ఆయన స్వగృహం నుంచి మున్సిపల్ స్కూల్, సంజీవనగర్, శ్రీనివాస సెంటర్ మీదుగా టెక్కె మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ప్రసన్నకుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మంత్రులు అఖిలప్రియ, కాలవ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఎమ్మెల్సీ ఫరూక్, ఆర్ఐసీ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, నంది గ్రూప్ ఎండీ శ్రీధర్‌రెడ్డి, భూమా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు అందని ఆహ్వానం!

ఏవీ, ఎస్పీవైలకు అవమానం

నంద్యాల: అధికార పార్టీ నేతల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఆ పార్టీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్ సమయంలో మంత్రి అఖిలప్రియ వ్యవహారశైలి అధికార పార్టీలో చర్చనీయాంశమైంది. నామినేషన్ కార్యక్రమానికి ఏవీ సుబ్బారెడ్డితో పాటు ఎంపీ ఎస్పీవై రెడ్డికి కూడా ఆహ్వానం అందలేదని సమాచారం. చివరకు మంత్రి కాలవ శ్రీనివాసులు జోక్యం చేసుకుని ఏవీ సుబ్బారెడ్డిని తీసుకొచ్చినట్టు అధికార పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి జోక్యం చేసుకుని ఎంపీ ఎస్పీవై రెడ్డిని పిలవాలని కోరినట్టు తెలిసింది. అయితే, ఎవరొచ్చి ఏం చేస్తారులే అని మంత్రి అఖిల వ్యాఖ్యానించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చివరకు డిప్యూటీ సీఎం ఒత్తిడితో ఎంపీకి ఆహ్వానం అందగా.. ఆయన తరపున శ్రీధర్‌రెడ్డి వచ్చారు. అది కూడా రెండో సెట్ నామినేషన్ సమయానికి ఆయన హాజరుకాగలిగారని తెలిసింది. మొత్తం మీద నేతల మధ్య లుకలుకలు ఆ పార్టీ కేడర్‌ను గందరగోళంలోకి నెడుతున్నాయి.

జగనన్న వస్తున్నారు... నవరత్నాలు తెస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ
- టీడీపీకి ఓట్లు వేస్తేనే అభివృద్ధి చేస్తారా?
- చీరాల నుంచి రౌడీలు వచ్చినా, కుప్పం నుంచి గూండాలు వచ్చినా బెదరం

నంద్యాల: నంద్యాలకు జగనన్న వస్తున్నారని, వస్తూ వస్తూ నవరత్నాలు తెస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. కర్నూలు జిల్లా నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీకి ఓట్లు వేస్తేనే అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ నంద్యాల ప్రజలను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి, కుట్రలు, కుతంత్రాలతో గెలవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. చీరాల నుంచి రౌడీలు వచ్చినా, కుప్పం నుంచి గూండాలు వచ్చినా తాము బెదరబోమన్నారు. స్థానిక ఎస్పీజీ గ్రౌండ్‌లో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే బహిరంగ సభలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఎందుకు ఓట్లు వేయాలో వివరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తోందీ, చట్టాన్ని ఏ విధంగా చేతుల్లోకి తీసుకుందీ తెలియజేస్తారన్నారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత ప్రభుత్వం మైనార్టీలకు అన్యాయం చేస్తున్న తీరును మరోసారి గుర్తు చేస్తారని చెప్పారు. మూడేళ్లుగా నంద్యాలను పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు ఉప ఎన్నికల నేపథ్యంలో కపట ప్రేమ చూపిస్తోందని దుయ్యబట్టారు. ‘శిల్పా సహకార సంఘం’ పేరుతో ప్రజల కోసం సొంత డబ్బుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. డబ్బు, పదవులు ఇచ్చి టీడీపీ నాయకులు పార్టీలో చేర్చుకుంటున్నారని, అదే తమ పార్టీలోకి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి వస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు చెప్పారు. నంద్యాలలో విస్తరణ పేరుతో రోడ్లన్నీ పగులగొట్టి టీడీపీకి ఓటు వేస్తేనే పనులు పూర్తి చేస్తామని, లేకపోతే జరగవని ఓటర్లను భయపెడుతున్నారని విమర్శించారు. నంద్యాల ప్రజలు చాలా తెలివైన వారని, చంద్రబాబు గిమ్మిక్కులను నమ్మరని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జగన్ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బొత్స, చిత్రంలో అంబటి

అమరావతి నుంచి బాబు డైరెక్షన్

నంద్యాలలో మంత్రుల యాక్టింగ్
- ఎప్పటికప్పుడు నిఘా వర్గాల నివేదికలు
- పార్టీ నేతల ఎన్నికల ప్రచారంలో మూడో కన్ను

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి: నంద్యాల ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో మంత్రులు అద్భుతంగా తమ పాత్రలు పోషిస్తున్నారు. నిఘావర్గాలు ఎప్పటికప్పుడు సీఎం డాష్ బోర్డుకు సమాచారం ఇవ్వడం.. అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నంద్యాలలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతోంది. ఉప ఎన్నికలకోసం మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానికంగా హోటల్ సురాజ్ గ్రాండ్‌లో తిష్టవేశారు. ముఖ్యమంత్రి ప్రతిరోజు అమరావతినుంచి నంద్యాలలో ఉన్న మంత్రులకు పని అప్పజెప్తే.. వారు సాయంత్రానికి ఆ పనిలో పురోగతిని సీఎంకు తెలియజేయాల్సి ఉంది. ఇలా సీఎం ప్రతిరోజు మంత్రులతో ఉప ఎన్నిక పనులపై సమీక్ష నిర్వహిస్తున్నారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేల ప్రచారంలో డొల్లతనాన్ని గుర్తిస్తూ ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబుకు చేరవేసే వ్యవస్థ ఒకటి పార్టీలో నెలకొల్పారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్సీకి ఆ బాధ్యతను అప్పగించారు. ఎమ్మెల్యేల వ్యవహారశైలిలో లోపాలుంటే వెంటనే ముఖ్యమంత్రి నుంచి ఫోన్ వస్తోంది. దీంతో చిన్నచిన్న విషయాలు సైతం అమరావతి వరకూ ఎలా తెలిసిందన్న అంశంపై కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మథనపడుతున్నారు. నంద్యాల పట్టణంలో వివిధ వార్డులకు ఎమ్మెల్యేలను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అయితే టీడీపీ బలహీనంగా ఉన్న వార్డుల ఇన్‌చార్జ్ బాధ్యతలనుంచి తప్పించాలని కొందరు ఎమ్మెల్యేలు పట్టుబట్టుతుండడం గమనార్హం. ఎమ్మెల్యే పనితీరు సక్రమంగా లేని కారణంగా ఓట్లు తక్కువ వచ్చాయనే నెపం వేస్తారని వీరిలో భయం పట్టుకుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యే నుంచే ఇలాంటి అభ్యంతరం మొదట వ్యక్తం కావడం చర్చనీయాంశమైంది.

గెలుపే లక్ష్యం కావాలి...

‘ఉప ఎన్నికలు నంద్యాలకు మాత్రమే పరిమితం కావు... ప్రభుత్వం పరువు ప్రతిష్టకు సంబంధించినవి. ఎన్నికల ఫలితాలు అధారంగానే భవిష్యత్ ఆధారపడి ఉంది. ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దు. చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం చూపొద్దు. గెలుపే లక్ష్యం కావాలి, అందుకు ఎలాంటి ప్రలోభాలకైనా సిద్ధంగా ఉండాలి’ అంటూ నేరుగా సీఎం చంద్రబాబు ఆదేశిస్తున్నట్లు టీడీపీ వర్గాలు వివరిస్తున్నాయి. మునుపు ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి అత్యంత శ్రద్ధతో ఉప ఎన్నిక స్థితిగతులపై ఆరా తీస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నేతలే స్వయంగా వ్యాఖ్యానిస్తున్నారు. అందుకోసమే తనకు వ్యక్తిగతంగా నమ్మకస్తులైన ప్రజాప్రతినిధులకు, నిఘా అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించారని వారు చెప్పడం గమనార్హం. మరోవైపు ముగ్గురు ఐపీఎస్‌లు, ఆరుగురు డీఎస్పీలు, ఎనిమిదిమంది సీఐలు కిందిస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు టీడీపీ బలాలు, బలహీనతలు వివరించే పనిలో నిమగ్నమైయ్యారు. ఏమి చేయాలో సూచనలిస్తూ అమరావతికి నివేదికలు అందుతున్నాయి. ఆ మేరకు సీఎం అమరావతి నుంచి సురాజ్ గ్రాండ్‌కు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో రాజ్యాంగ విలువలు, ఎన్నికల కమిషన్ విధి విధానాలకు టీడీపీ తూట్లు పొడుస్తోందని రాజకీయ పరిశీలకులు విమర్శిస్తున్నారు.

నంద్యాల సాధారణ పరిశీలకుడిగా హిమాన్షు చౌదరి

కర్నూలు (అగ్రికల్చర్): పశ్చిమ బెంగాల్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి హిమాన్షు చౌదరిని నంద్యాల నియోజకవర్గ సాధారణ పరిశీలకుడిగా కేంద్రం నియమించింది. ఈ మేరకు కర్నూలు జిల్లా కలెక్టర్ సత్యనారాయణకు సమాచారం అందింది. ఆయన 2 రోజుల్లో కర్నూలుకు రానున్నారు. హిమాన్షుకు లైజన్ అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయరెడ్డి నియమితులయ్యారు.

నంద్యాల ఉప ఎన్నికలో అధికార దుర్వినియోగం

- డబ్బు, మద్యం, ప్రలోభాలను నివారించాలి
- ఓటర్లను చైతన్యపర్చాలి
- ఎన్నికల ప్రధాన అధికారికి ఎన్నికల నిఘా వేదిక వినతి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో నంద్యాల ఉప ఎన్నికలో విచ్చలవిడిగా డబ్బు, మద్యం వినియోగిస్తున్నారని, అధికార దుర్వినియోగం జరుగుతోందని ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కమిటీ ఆరోపించింది. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా, ప్రశాంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిటీ చైర్మన్ జస్టిస్ అంబటి లక్ష్మణరావు, కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్షణమే ఈ కింది చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

- కొత్త ఓటర్ల నమోదులో లోపాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే ఓటు కలిగిన వారు మళ్లీ ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకుంటున్నారు. క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే ఓటు హక్కు కల్పించాలి.
- నంద్యాలలో నిఘా బృందాలను ఏర్పాటు చేసి, డబ్బు పంపిణీని నివారించాలి.
- మద్యం, డబ్బు లాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లను చైతన్యపర్చాలి. ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు, వాల్‌పోస్టర్లు కళారూపాల ప్రదర్శనల ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకొస్తాం.
- నంద్యాల నియోజకవర్గంలో 2016 ఆగస్టు నెలలో విడుదల చేసిన మద్యం కంటే అదనంగా విడుదల చేయరాదని ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్‌ను ఆదేశించాలి. మద్యం సరఫరాపై ఆంక్షలు విధించాలి.
- మంత్రులు ప్రభుత్వ వాహనాలను వినియోగించకుండా, అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా పూర్తి నిఘా ఏర్పాటు చేయాలి.
- పోలీసు, అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలి.
- సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- మూడేళ్లుగా నంద్యాలలో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలి.
- ఉప ఎన్నికలో అక్రమాలను నివారించడానికి టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులపై సత్వరమే చర్యలు చేపట్టాలి.




ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న జస్టిస్ అంబటి లక్ష్మణరావు, వి. లక్ష్మణరెడ్డి

ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు

నంద్యాల ఉప ఎన్నికలో ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. ఎన్నికల్లో జరిగే అక్రమాలను ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని అన్నారు. ఫోన్‌చేస్తే 15 నిమిషాల్లో చర్యలు చేపడతామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు ప్రింటర్‌ను జత పరిచామని తెలిపారు. ఓటర్ తాను ఏ గుర్తుకు ఓటు వేశారో ఈ ప్రింటర్ ద్వారా చూడవచ్చన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల లిస్టులో 3,200 మందికి 2 చోట్ల ఓట్లు ఉండటాన్ని గుర్తించి తొలగించామని చెప్పారు. అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల అక్రమాలపై 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు, 08518–277305, 08518–277309లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. 2016 ఆగస్టులో నంద్యాల నియోజకవర్గంలో విడుదల చేసిన మద్యం కంటే ఆదనంగా విడుదల చేయవద్దని ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్‌ను ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు.

వృద్ధాశ్రమం మూసివేత ఉత్తర్వుల అమలు నిలిపివేత

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: మెగా ఆక్వాఫుడ్ పార్క్‌కు వ్యతిరేకంగా స్థానికులు చేస్తున్న పోరాటానికి విశ్వమానవ వేదిక నిర్వాహకులు మద్దతు తెలిపారన్న కారణంతో పాలకొల్లులో ఆ వేదిక ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని మూసివేయాలంటూ అధికారులు జారీచేసిన ఉత్తర్వుల అమలుపై ఉమ్మడి హైకోర్టు స్టే విధించింది. ఈ మొత్తం వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ సంబంధిత అధికారులకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ మూడు రోజుల కిందట మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. పాలకొల్లులో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని మూసివేయాలంటూ అధికారులు గత నెల 19వ తేదీన జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వేదిక అధ్యక్షుడు ఎం.సురేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ విచారణ జరిపారు.

సీఏ-ఐపీసీసీ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ హవా

గుంటూరు: ఐసీఏఐ మంగళవారం విడుదల చేసిన సీఏ– ఐపీసీసీ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్ శ్రీ మట్టుపల్లి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలిండియా స్థాయిలో మొదటి 50 ర్యాంకుల్లో తమ విద్యార్థులు 9 ర్యాంకులు సాధించి సత్తా చాటారని చెప్పారు. ఆలిండియా 16, 23, 27, 32, 34, 35, 39, 40, 42 వంటి ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. మొదటి 50 ర్యాంకుల్లో 9 ర్యాంకులు అంటే సుమారు 20 శాతం ర్యాంకులు మాస్టర్‌మైండ్ విద్యార్థులే సొంతం చేసుకున్నారని వివరించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు.

‘ఒకేసారి ఎన్నికలు అంశాన్ని పరిశీలిస్తున్నాం’

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపే అంశంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పలు సిఫారసులు చేసిందని, వీటిని కేంద్రం పరిశీలిస్తోందని న్యాయ శాఖ సహాయ మంత్రి పి.పి.చౌదరి తెలిపారు. బుధవారం లోక్‌సభలో ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

లా కాలేజీల అనుమతుల అంశం బీసీఐ ముందుంచాం

వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు 2016–17 విద్యా సంవత్సరంలో అత్యధిక సంఖ్యలో లా కళాశాలలకు అనుమతులు ఇచ్చాయని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి పి.పి.చౌదరి తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలు ఇలా అనుమతులు ఇచ్చిన విషయాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టాండింగ్ కమిటీ ముందు ఉంచామని, స్టాండింగ్ కమిటీ బీసీఐ అకడమిక్ కమిటీకి పంపిందని వివరించారు.

సిట్ అదుపులో టీడీపీ మాజీ కార్పొరేటర్

మధురవాడ (భీమిలి): టీడీపీ నాయకుడు, విశాఖ నాలుగో వార్డు మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు ను బుధవారం సిట్ దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుంది. విశాఖ జీవీఎంసీ మధురవాడ జోన్ 4, 5 వార్డుల్లో పర్యటించిన ఏడు బృందాలు సోంబాబు అనధికారికంగా ప్రభుత్వ రికార్డులు కలిగి ఉండటమే కాకుండా రికార్డుల ట్యాంపరింగ్‌తో ఆయనకు సంబంధం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించాయి. ఆయన నుంచి కొన్ని రికార్డులను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోంబాబు అనుచరులు, సన్నిహితులలో ఆయన బినామీలుగా గుర్తించిన పి.రామయ్యమ్మ, పీతల దుర్గారావు, ఒమ్మి సన్యాసిరావు, దుర్గ, దువ్వి రామస్వామి, గొలగాని కనకరాజు, నందిని, రాజు, ఎస్.గణపతి, గొలగాని చిన్నమ్మలను విచారించారు. గతంలో ప్రభుత్వ స్థలంలో హెచ్చరికల బోర్డులు తొలగించడం, ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ ఆక్రమణలకు పాల్పడటం వంటి ఆరోపణలు ఆయనపై నమోదయ్యాయి. అలాగే ఆదిత్యనగర్‌లోని కె.శోభనాచలపతిరావు, కొమ్మాదిలో పోతినాయుడు, పరదేశిపాలెంలో కరణం కుటుంబానికి చెందిన వాసు, మిధిలాపురి వుడా కాలనీలోని డాక్యుమెంట్ రైటర్ ఇళ్లపై ద్వారకానగర్ ఏసీపీ రామచంద్రరావు ఆధ్వర్యంలో దాడులు చేశారు.

అలిపిరిలో మారణాయుధం స్వాధీనం

- చెక్‌పాయింట్ వద్ద కారులో పిస్టల్, బులెట్లు లభ్యం
- పోలీసుల అదుపులో నలుగురు పుణే వాసులు
- తిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- ఇద్దరు వ్యక్తుల వద్దనుంచి గంజాయి, మద్యం సీసాలు స్వాధీనం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల కొండకు వెళ్లే వాహనాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన అలిపిరి చెక్ పాయింట్ వద్ద పిస్టల్, బుల్లెట్లు లభ్యం కావడం తీవ్ర కలకలం రేపింది. చెక్ పాయింట్ వద్ద బుధవారం ఉదయం విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు, కానిస్టేబుల్ మౌలాలీ పుణేకి చెందిన ఓ నల్లరంగు కారును ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న 14 రౌండ్ల బుల్లెట్లు, ఐఎన్ మోడల్ గ్లాక్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న సౌరభ్ అనే యువకుడిని, మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఆయుధం గురించి ప్రశ్నించారు. పిస్టల్ తనది కాదని, కారు యజమాని విజయ్ మాణేది అని సమాధానమిచ్చారు. లైసెన్స్‌ను పరిశీలించిన పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అది ఒరిజినల్ లైసెన్స్ కాదన్న అనుమానంతో పూర్తి వివరాలను సేకరించారు. ఒకవేళ ఒరిజినల్ లైసెన్స్ అయినప్పటికీ అది జారీ చేసిన రాష్ట్రం దాటి ఆయుధాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడం నేరం. దీన్ని గుర్తించిన పోలీసులు వెంటనే వారిని తిరుమలకు తీసుకెళ్లి విచారణ జరిపారు. మెట్ల మార్గంలో కొండపైకి చేరిన విజయ్ మాణేను తిరుమలలో పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురిని విచారిస్తున్నామని టీటీడీ సీవీఎస్‌వో ఆకే రవికృష్ణ తెలిపారు. తిరుమల టూ టౌన్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయించామన్నారు. అన్ని కోణాల్లోనూ లోతుగా విచారణ జరుపుతున్నామని చెప్పారు.

గంజాయి, మద్యం సీసాలు లభ్యం

ఇదిలా ఉండగా బుధవారం అలిపిరి వద్ద తనిఖీల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ, బీరాన్ అనే ఇద్దరు వ్యక్తుల నుంచి 60 గ్రాముల గంజాయి, 9 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో 100 గుట్కా ప్యాకెట్లు, 30 బీడీ కట్టలను కూడా గుర్తించినట్లు తెలిపారు. మరణాయుధాలు, నిషేధిత పదార్థాలు, వస్తువులను తిరుమల కొండపైకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.



విజిలెన్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న పిస్టల్, మద్యం సీసాలు, గంజాయిని పరిశీలిస్తున్న టీటీడీ సీవీఎస్‌వో

‘పంద్రాగస్టు’న పేలుళ్లకు కుట్ర పన్నారా?

తిరుపతి అర్బన్: ఈ ఏడాది రాష్ట్రస్థాయి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను తిరుపతిలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అరాచక, సంఘ విద్రోహ శక్తులు తిరుపతి, తిరుమల పుణ్యక్షేత్రాల్లో పేలుళ్లు నిర్వహించి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు కుట్ర పన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలిపిరి టోల్‌గేట్ చెక్ పాయింట్ వద్ద బుధవారం మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన కారు, అందులో పిస్టల్, 14 రౌండ్ల బుల్లెట్లు లభించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది. 10 రోజులుగా అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ఉత్తరాది యాత్రికులే ఎక్కువ సంఖ్యలో మాదకద్రవ్యాలు, నిషేధిత వస్తువులు తిరుమలకు తీసుకెళ్తూ పట్టుబడుతున్నారు. పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలో తిరుమలతోపాటు తిరుపతి రైల్వేస్టేషన్, జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భద్రతను పటిష్టం చేయాలని కేంద్ర ఇంటెలిజెన్స్, నిఘా వర్గాలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాయి.

ఏపీలో 272 కాపలా లేని లెవల్ క్రాసింగ్‌లు

సాక్షి, న్యూఢిల్లీ: 2017 ఏప్రిల్ 1 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 272, తెలంగాణలో 37 కాపలా లేని లెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గొహెయిన్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ మురళీమోహన్ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో 71, తెలంగాణలో 16 లెవల్ క్రాసింగ్‌లను కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్‌లుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, జూన్ చివరి నాటికి ఏపీలో 15, తెలంగాణలో 3 లెవల్ క్రాసింగ్‌లను కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్‌లుగా మార్చామని తెలిపారు.

అవి జిల్లా అధికారుల ఆదేశాలే.. ప్రభుత్వానివి కాదు

‘సాక్షి’ కథనంపై పంచాయతీరాజ్ కమిషనర్ విచిత్ర వివరణ

.సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన 14వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌లకు ఇవ్వొద్దని ఆంక్షలు విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ బి.రామాంజనేయులు విచిత్రమైన వివరణ ఇచ్చారు. ‘మీ నిధులు.. మా ఇష్టం’ శీర్షికతో బుధవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారులు జారీ చేసిన ఉత్తర్వులతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని బదులిచ్చారు. ఆ ఉత్తర్వులు.. పరిపాలన సౌలభ్యం కోసం ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు మాత్రమేనని వివరణ ఇచ్చారు. పంచాయతీల నిధుల వినియోగానికి సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి గానీ మంత్రి గానీ అధికారులకు ఎలాంటి ఆదేశాలివ్వలేదని పేర్కొన్నారు.

కర్ణాటక మంత్రి ఆస్తులపై ఐటీ దాడులు

రూ. 10 కోట్ల నగదు, భారీగా ఆభరణాలు స్వాధీనం

- ఢిల్లీ, బెంగళూరులోని పలుచోట్ల సోదాలు.. ఈగల్‌టన్ రిసార్ట్‌లోని మంత్రి గదిలోనూ..
- అధికారులకు దొరికిన కీలక పత్రాలు, చించేసిన కాగితాలు
- ఇదే రిసార్ట్‌లో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల బస.. రాజకీయ కుట్రేనన్న కాంగ్రెస్..


బెంగళూరులో తన నివాసంలో శివకుమార్

సాక్షి, బెంగళూరు: రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయం వేడెక్కింది. బెంగళూరు క్యాంపులో ఉన్న 44 మంది గుజరాత్ ఎమ్మెల్యేల పర్యవేక్షణ బాధ్యత చూస్తున్న కర్ణాటక విద్యుత్ మంత్రి డీకే శివకుమార్ ఆస్తులపై బుధవారం ఐటీ శాఖ దాడులు నిర్వహించింది. శివకుమార్‌కు సంబంధించిన 64 వేర్వేరు ఆస్తులపై బుధవారం ఉదయం నుంచి జరిగిన సోదాల్లో రూ.10 కోట్లకు పైగా (ఇందులో మంత్రి ఢిల్లీ నివాసం నుంచి రూ.7.9 కోట్లు, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి రూ. 2.23 కోట్లు) నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడులపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ఇవి రాజకీయ కక్షసాధింపు చర్యలేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. అటు, శివ కుమార్ బంధువైన ఓ ఉపాధ్యాయుడి కాలేజీ లాకర్ నుంచి కూడా భారీ మొత్తంలో ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పన్ను ఎగవేతకు సంబంధించిన కేసులోనే ఈ దాడులు జరిగినట్లు స్పష్టం చేశారు. ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ఎన్‌క్లేవ్, కర్ణాటకలోని హసన్, మైసూరులలో దొరికిన నగదును లెక్కించేందుకు ఆరు లెక్కింపు యంత్రాలను వినియోగిస్తున్నారు. రూ.కోట్ల నగదు, వందల కోట్ల విలువ చేసే స్థిర, చరాస్తుల పత్రాలు, పదుల కిలోల బంగారు, వెండి ఆభరణాలు వెలుగుచూసినట్లు సమాచారం.

ఉదయం 6:30 గంటలకు మొదలై..
బుధవారం ఉదయం దాదాపు 6:30 గంటలకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రోడ్‌లో ఉన్న డీకే శివకుమార్ ఇంటితో పాటు బెంగళూరులోని సదాశివనగర్, రామనగర జిల్లా కనకపురతో పాటు మైసూరు తదితర ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు, కార్యాలయాలకు ఐటీ అధికారులు సీఆర్‌పీఎఫ్ బలగాల రక్షణతో చేరుకుని కార్యాచరణ ప్రారంభించారు. ఢిల్లీలోని ఇంట్లో బ్యాగుల్లో దాదాపు రూ.7.9 కోట్ల నగదును ఐటీ శాఖ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇందులో రద్దయిన రూ.1,000 నోట్లతో పాటు కొత్త రూ.2,000, రూ.500 నోట్లుపెద్ద మొత్తంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలు మరో 2 రోజుల పాటు కొనసాగే అవకాశం ఉండగా రంగంలోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

లెక్కచూపని ఆస్తులపై దర్యాప్తు
పన్ను ఎగవేతతో పాటు రియల్ ఎస్టేట్, పలురంగాల్లో లెక్కచూపని భారీ మొత్తాన్ని పెట్టుబడులుగా పెట్టారనే అంశాలపై.. సింగపూర్‌తోపాటు పలుదేశాల్లో శివకుమార్ పెట్టిన పెట్టుబడులపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్లు ఐటీ అధికారులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన కొన్ని షెల్ కంపెనీలు, వాటి నిర్వహణపైనా దృష్టిపెట్టామన్నారు. ఈగల్‌టన్ రిసార్ట్‌లో మంత్రిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. అనంతరం పటిష్టమైన భద్రతతో బెంగళూరులోని నివాసానికి మంత్రిని తీసుకొచ్చి విచారించారు. అధికారులు రిసార్ట్‌కు వస్తున్నారన్న విషయం తెలుసుకుని కొన్ని కాగితాలను మంత్రి చించేశారని.. ఈ కాగితం ముక్కలను స్వాధీనం చేసుకున్న అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు. ఈగల్‌టన్ రిసార్ట్‌లో ఉంచిన గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కావాల్సిన సదుపాయాలను శివకుమార్ చూసుకుంటున్నారు. అయితే, ఈ రిసార్ట్‌లోని గుజరాత్ ఎమ్మెల్యేల గదుల్లోకి అధికారులు వెళ్లలేదని ఐటీ శాఖ స్పష్టం చేసింది. రిసార్ట్‌లోని శివకుమార్ గదిలో మాత్రమే సోదాలు నిర్వహించామంది. శివకుమార్, అతని కుటుంబసభ్యులకు సంబంధించిన 39 ప్రాంతాల్లో 120 మంది ఐటీ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఇందుకోసం పారామిలటరీ బలగాల సాయం తీసుకున్నారు. దాడులు నిర్వహించాలని కొంతకాలం క్రితమే నిర్ణయించినట్లు ఐటీ శాఖ పేర్కొంది. అయితే.. ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసార్ట్‌లో ఉంచుతారని, దీని వల్ల వివాదం పెద్దదవుతుందని ఊహించలేదని చెప్పింది. శివకుమార్‌తో పాటు ఆయన తమ్ముడు, ఎంపీ డీకే సురేష్, మంత్రికి సన్నిహితుడైన ఎమ్మెల్సీ రవి ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ సోదాలు జరిగాయి.

రిసార్ట్‌లో ఆ ఎమ్మెల్యేలకు క్లాసులు
రిసార్ట్‌లోని ఎమ్మెల్యేలకు 60 ఏళ్లగా కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు, బీజేపీ చేస్తున్న అసత్యాలపై క్లాసులు తీసుకుంటున్నారు. ఈ ఎమ్మెల్యేలను పలు ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే.. గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో వరదల కారణంగా భారీ నష్టం వాటిల్లుతుండటం, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండటంపై కొందరు ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో రిసార్ట్‌లోనే వీరికి ఈ క్లాసులను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది.


ఢిల్లీలో స్వాధీనం చేసుకున్న నగదు..


ఢిల్లీలో మంత్రి నివాసం వద్ద ఐటీ అధికారులు

ఇది రాజ్యసభ ఎన్నికల కుట్ర..: కాంగ్రెస్

ఐటీ శాఖ దాడులపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ సీనియర్ నేత, గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీచేస్తున్న అహ్మద్ పటేల్ ఈ దాడులను ఖండించారు. ఒక్క రాజ్యసభ సీటును గెలుచుకునేందుకు ఇన్ని కుట్రలు పన్నుతున్నారని బీజేపీపై విమర్శలు చేశారు. 'కేంద్ర విచారణ సంస్థలను సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ఐటీ దాడులు బీజేపీ అసహనానికి నిదర్శనం' అని పటేల్ విమర్శించారు. కాగా, రాజకీయ అనిశ్చితి సృష్టించేందుకు బీజేపీ ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుంటోందని కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. ఈ దాడుల వెనక కేంద్రం హస్తం ఉందన్నారు. ఐటీ అధికారులను, సీఆర్పీఎఫ్ బలగాలను రాజకీయ కుట్రలో భాగం చేసే హక్కు కేంద్రానికి లేదని.. ఇలాంటి ఒత్తిళ్లకు తమ పార్టీ భయపడదన్నారు. కర్ణాటకలో బలమైన ఒక్కలిగ కులానికి చెందిన శివకుమార్‌కు బెంగళూరు రూరల్‌తోపాటుగా రామనగర జిల్లాపై రాజకీయంగా మంచి పట్టుంది. 2018లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచార కమిటీకి ఈయన చీఫ్‌గా ఉన్నారు. ఐటీ దాడులు జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న కార్యకర్తలు రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలకు దిగారు.

పార్లమెంట్‌లో ఐటీ దాడుల రగడ

- కర్ణాటక మంత్రిపై ఐటీ దాడులతో కాంగ్రెస్ ఆందోళన
- ఐటీ దాడులకు, గుజరాత్ ఎన్నికలకు సంబంధం లేదు: జైట్లీ



న్యూఢిల్లీ: కర్ణాటక మంత్రి శివకుమార్‌పై ఆదాయపన్ను శాఖ చేసిన దాడులు పార్లమెంట్‌ను కుదిపేశాయి. కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఉభయ సభల్లోనూ కార్యకలాపాలను అడ్డుకున్నారు. గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తమ ఎమ్మెల్యేలను హైజాక్ చేసేందుకు ఈ దాడులు చేశారని ఆరోపించారు. అయితే రాజ్యసభ ఎన్నికలకు, ఐటీ దాడులకు సంబంధం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించినా.. ప్రతిపక్ష సభ్యులు శాంతించలేదు. కాంగ్రెస్ సభ్యుల నిరసనతో రాజ్యసభ నాలుగుసార్లు వాయిదా పడింది. రాజ్యసభ ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ ఈ అంశాన్ని లేవనెత్తారు. గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ ఎమ్మెల్యేలను హైజాక్ చేసేందుకే ఐటీ దాడులకు దిగారని ఆరోపించారు. దాడులు చేసిన ప్రదేశం, సమయం సరైనది కాదని, ఇవే దాడులను నెల ముందో నెల తర్వాతో ఎందుకు చేయలేదని రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులామ్‌నబీ ఆజాద్ ప్రశ్నించారు. అటు లోక్‌సభలోనూ నిరసనకు దిగిన కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. ఇక లోక్‌సభలో ఈ అంశాన్ని లేవనెత్తిన మల్లిఖార్జున ఖర్గే.. రాజకీయ వేధింపులతోనే ఈ దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఉభయ సభల్లోనూ ఈ అంశంపై మాట్లాడిన జైట్లీ.. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బస చేసిన కర్ణాటకలోని రిసార్ట్‌లో ఎటువంటి తనిఖీలు చేయలేదని వెల్లడించారు. రిసార్ట్‌లో ఉన్న మంత్రిని మాత్రం ప్రశ్నించేందుకు తీసుకెళ్లినట్టు చెప్పారు. మొత్తం 39 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్టు చెప్పిన ఆయన.. రిసార్ట్‌లో మాత్రం సోదాలు చేయలేదని అన్నారు. అయితే తమ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను వినియోగిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ విమర్శలను కర్ణాటక బీజేపీ నేత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ తిరస్కరించారు. ఎమ్మెల్యేలకు బస కల్పించిన రిసార్ట్‌పై రూ. 942 కోట్ల జరిమానా విధించాలని సిద్దరామయ్య సర్కారు నిర్ణయించిందని.. ఇదే సమయంలో గుజరాత్ ఎమ్మెల్యేలను అక్కడకు తీసుకొచ్చారని తెలిపారు.

సైబర్ దాడులపై అప్రమత్తంగా ఉన్నాం: భారత్‌పై సైబర్ దాడుల ప్రభావం తక్కువగానే ఉందని, అయినా ప్రభుత్వం వాటికి సంబంధించి అప్రమత్తంగా ఉందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వద్ద సమాచారం ప్రకారం.. 2014–17 మధ్య దేశంలో ర్యాన్‌సమ్‌వేర్‌కు సంబంధించి 65 ఘటనలు నమోదయ్యాయని తెలిపారు.

అన్ని రంగాల్లోనూ అవినీతి జాడ్యం: సుప్రీం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని కీలక రంగాల్లోనూ అవినీతి వేళ్లూనుకుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. దేశాభివృద్ధికి, పెట్టుబడుల రాకకు ఇది తీవ్ర అవరోధంగా మారిందని జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.భానుమతిల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. విధులను సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజా హక్కుల పరిరక్షణ కోసమే తాము పనిచేస్తున్నామన్న స్పృహ అధికారుల్లో ఉన్నప్పుడే అవినీతిని అరికట్టగలమని కోర్టు అభిప్రాయపడింది. 20 ఏళ్ల క్రితం నిబంధనలకు విరుద్ధంగా భూమిని కేటాయించిన కేసులోఉత్తరప్రదేశ్ మాజీ సీఎస్ నీరా యాదవ్, ఐఏఎస్ అధికారి రాజీవ్ కుమార్‌లకు విధించిన శిక్షను సమర్థించిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ప్రజలు లంచగొండితనం, అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించనంతవరకు ఈ జాడ్యం నుంచి సమాజం విముక్తి పొందలేదని అభిప్రాయపడింది. అంతేకాకుండా బంధుప్రీతితో అనర్హులకు లబ్ధి చేకూర్చడంపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది.

'హెచ్1బీ దుర్వినియోగాన్ని అడ్డుకోండి'




వాషింగ్టన్: అమెరికాలోని ఔట్‌సోర్సింగ్ కంపెనీలు హెచ్1బీ, ఎల్1 వీసాలను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని ఆ దేశ చట్టసభల ప్రతినిధుల బృందం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ సభ్యుల బృందం ట్రంప్‌కు లేఖ రాసింది. ఔట్‌సోర్సింగ్ సంస్థలు స్థానికులకు బదులుగా విదేశీ ఉద్యోగులను చౌకగా అమెరికాకు తరలిస్తున్నాయని ఆరోపించింది. అమెరికన్ల ప్రయోజనాలను రక్షించేందుకు తర్వలోనే ఓ బిల్లు తీసుకురానున్నట్లు పేర్కొంది. ఉద్యోగాల భర్తీ సమయంలో స్థానికులకే ప్రాధాన్యమివ్వడంతో పాటు అమెరికన్లను ఉద్యోగాల నుంచి తొలగించి మరొకరికి కట్టబెట్టడాన్ని ఈ బిల్లు నిషేధిస్తుందని తెలిపింది. 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న అమెరికన్ ఔట్‌సోర్సింగ్ సంస్థల్లో 50% కంటే ఎక్కువ మంది హెచ్1బీ, ఎల్1 ఉద్యోగులుంటే కొత్తగా విదేశీయులను నియమించుకోవడాన్ని ఈ బిల్లు నిషేధిస్తుందని వెల్లడించింది.

ఇకపై 5, 8 తరగతుల్లో డిటెన్షన్!

న్యూఢిల్లీ: పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు డిటెన్షన్ ఉండకూడదన్న నిబంధనను తొలగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. విద్యాహక్కు చట్టానికి చేసిన సవరణల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు ఐదో తరగతిలో, ఎనిమిదో తరగతిలో విద్యార్థులు ఫెయిల్ అయితే వారిని డిటెన్షన్ చేసే అధికారం ఉంటుంది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అయితే డిటెన్షన్ అయిన విద్యార్థులు తమను తాము నిరూపించుకునేందుకు మరోసారి పరీక్ష నిర్వహించేందుకూ అవకాశం కల్పించారు. 2010 నుంచి అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం ఎనిమిదో తరగతి వరకు డిటెన్షన్ ఉండేది కాదు. సవరణలు చేసిన ఈ బిల్లును త్వరలోనే పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్నారు. దీంతోపాటుగా దేశవ్యాప్తంగా 20 ప్రపంచస్థాయి విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖను కేబినెట్ ఆదేశించింది. విదేశాల్లో ఉంటున్న భారతీయుల ఓటుహక్కు చట్టాల్లో మార్పులు తెస్తూ.. వారు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకునే పరోక్ష ఓటింగ్ (ప్రాక్సీ) అవకాశం కల్పించేందుకూ కేబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ సంస్థల విధుల్లో ఉన్న వారికి మాత్రమే ఈ ప్రాక్సీ ఓటింగ్ అవకాశముంది. అయితే దీన్ని ఎన్నారైలు, విదేశాల్లో ఉన్న భారతీయులకు కూడా వర్తింపజేయాలని కేబినెట్ నిర్ణయించింది.

మీరు కన్యనో కాదో చెప్పండి!



పట్నా: ఏదైనా ఉద్యోగంలో చేరేముందు అభ్యర్థి వివాహ స్థితి గురించిన సమాచారాన్ని సంస్థ అడగడం మామూలే. బిహార్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రి మాత్రం ఉద్యోగంలో చేరేవారు కన్యనా కాదా అనే సమాచారాన్ని అడగడం పలువురి ఆగ్రహానికి కారణమవుతోంది. పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఉద్యోగంలో చేరేవారు నింపాల్సిన దరఖాస్తులోని వివాహ స్థితి పత్రంలోని ఓ సెక్షన్‌లో 'నేను బ్రహ్మచారి/వితంతువు/కన్య' అని ఉంది. అలాగే 'నాకు ప్రస్తుతం జీవించి ఉన్న ఒకే భార్య ఉంది', 'నాకు పెళ్లైంది, ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలు ఉన్నారు', 'నేను పెళ్లి చేసుకున్న అతనికి జీవించి ఉన్న మరో భార్య లేదు', 'నేను పెళ్లి చేసుకున్న అతనికి జీవించి ఉన్న మరో భార్య కూడా ఉంది' లాంటి వింత ఆప్షన్లు కూడా ఆ పత్రంలో ఉన్నాయి. అభ్యర్థి వీటిలో తనకు ఏది సరిపోలుతుందో దానిని టిక్ చేయాలి. వీటిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ, ఉద్యోగులపై అత్యాచారాలు జరిగినప్పుడు కన్యనా, కాదా అనే సమాచారం ఉపయోగపడొచ్చని చెప్పడం మరింత వివాదానికి దారి తీసింది.




స్విట్జర్లాండ్‌లోని 'వాల్డాస్ ఆమ్' హోటల్‌లో చైనా కస్టమర్‌కు సర్వ్ చేసిన 1878నాటి ఒక గ్లాస్ స్కాచ్ విస్కీ ఇది. గ్లాస్ విస్కీకి రూ.6.60లక్షలు వసూలుచేశారు.

న్యూఢిల్లీ: వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అవుతుండటం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నేటి సాంకేతిక యుగంలో గోప్యత అనే భావనను పరిరక్షించడం కష్టసాధ్యమవుతోందని పేర్కొంది. గోప్యత పరిరక్షణ ఒక విఫల యుద్ధమని అభివర్ణించింది. గోప్యత హక్కును ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చాలా? లేదా? అన్న అంశంపై మూడు వారాలు విచారణ జరిపిన సర్వోన్నత ధర్మాసనం బుధవారం తన తీర్పును రిజర్వులో ఉంచింది. ఈ బెంచ్‌కు నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ పదవీ విరమణ చేయనున్న ఆగస్టు 27న లేదా అంతకు ముందు


గోప్యత పరిరక్షణ ఓ విఫల యుద్ధం

సాంకేతికతతో ప్రాధాన్యత కోల్పోతున్న ప్రైవసీ.. ● విచారణ ముగిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



తీర్పును ప్రకటించొచ్చు. మన జీవితం ప్రతి అంగుళంలోకి చొచ్చుకొచ్చిన సాంకేతికత కారణంగా గోప్యత అనే భావన ప్రాభవం కోల్పోతోందని, గోప్యత మౌలిక లక్షణాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బెంచ్ అభిప్రాయపడింది. 'ప్రైవసీ పరిరక్షణ అనే విఫల యుద్ధాన్ని చేస్తున్నాం. వ్యక్తిగత సమాచారాన్ని వేటికి వాడుతున్నారో తెలియడం లేదు. ఇది ఆందోళన కలిగించే విషయం' అని వ్యాఖ్యానించింది. భారత్‌లో ప్రైవసీ పదాన్ని నిర్వచించాల్సిన అవసరం ఉందని, సుమారు 140 కోట్ల మంది సమాచారం ప్రజాక్షేత్రంలో ఉందని బెంచ్ పేర్కొంది. గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించినట్లయితే , దాని కిందికి ఏమేం వస్తాయో కూడా తామే చెప్పాల్సి ఉందని వెల్లడించింది.

'గోప్యత హక్కు' కింద వద్దు: కనీస వ్యక్తిగత విషయాలు వెల్లడించడాన్ని గోప్యత హక్కు కింద పరిగణించరాదని గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకు నివేదించింది. నేటి సాంకేతిక యుగంలో పారదర్శకత కీలకమని పేర్కొంది. గోప్యతకు చెందిన పలు అం శాలు ప్రాథమిక హక్కులతో ముడిపడి ఉన్నాయంది. వ్యక్తిగత సమాచారం వాణిజ్య పరంగా దుర్వినియోగం కాకుండా టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఏదైనా పిల్ దాఖలు చేసే సమయంలో లాయర్లు కూడా తమ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఐడీ కార్డు తదితర వివరాలు ఇవ్వాలన్న సుప్రీం నిబంధనలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అత్యున్నత న్యాయస్థానాలు సాంకేతికతతో ముందుకు సాగుతూ నిబంధనల పేరిట వ్యక్తిగత సమాచారాన్ని కోరుతున్నాయని అన్నారు. గోప్యత హక్కును ఇతర ప్రాథమిక హక్కుల్లో భాగంగా చేర్చితే అభ్యంతరమేమీ లేదని, దాన్ని ప్రత్యేక ప్రాథమిక హక్కుగా ప్రకటించొద్దని విజ్ఞప్తి చేశారు. హరియాణా ప్రభుత్వ లాయర్లు కూడా గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా ప్రకటించరాదని కోర్టుకు విన్నవించారు.



రత్లే, క్రిష్ణగంగలకు అనుమతి

ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టవచ్చన్న ప్రపంచ బ్యాంకు

వాషింగ్టన్: జమ్మూ కశ్మీర్‌లో భారత్ నిర్మిస్తున్న క్రిష్ణగంగ, రత్లే జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులను కొనసాగించుకోవచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. అయితే 1960నాటి సింధు జలాల ఒప్పందాన్ని అనుసరించి కొన్ని పరిమితులకు లోబడి ఆనకట్టల నిర్మాణాలు ఉండాలంది. పాకిస్తాన్, భారత్ నుంచి కార్యదర్శి స్థాయి అధికారులు తన వద్ద చర్చలు జరిపిన అనంతరం ఓ ప్రకటనను ప్రపంచ బ్యాంకు మంగళవారం విడుదల చేసింది. సింధు జలాల ఒప్పందం ప్రకారం భారత్ నుంచి పాక్‌కు ప్రవహిస్తున్న పశ్చిమ నదులపై ప్రాజెక్టుల నిర్మాణం కోసం భారత్... ఈ వ్యవహారంతో సంబంధంలేని ఇతర వ్యక్తి/సంస్థ నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరమే లేదు. సింధునది ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై భారత్ 330 మెగావాట్ల సామర్థ్యంగల క్రిష్ణగంగ, 850 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రత్లే జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టు నిర్మాణాలను ఇప్పటికే ప్రారంభించగా, వీటిపై పాకిస్తాన్ అభ్యంతరాలు తెలుపుతూ వస్తోంది. ఈ ప్రాజెక్టుల ఆకృతులు సాంకేతికంగా సింధు జలాల ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నాయని పాక్ వాదిస్తోంది. వివాదాన్ని పరిష్కరించాలంటూ పాక్ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించింది. తాజాగా పాక్, భారత్ కార్యదర్శి స్థాయి అధికారులు ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో ఈ వారంలో భేటీ అయ్యారు. తదుపరి దఫా చర్చలు సెప్టెంబరులో జరగనున్నాయి.

శరద్ కొత్త పార్టీ?



పట్నా: జేడీయూ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్ మరో కొత్త పార్టీని స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆయనకు అత్యంత సన్నిహితుడు వెల్లడించిన అంశాల మేరకు ఆయన కొత్త పార్టీవైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. 'బిహార్ రాజకీయ పరిణామాలను శరద్ యాదవ్ నిశితంగా గమనిస్తున్నారు. ఆయన స్నేహితులతో చర్చలు జరుపుతున్నారు. దీంతోపాటు కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు అవకాశాలను కూడా ఆయన పరిశీలిస్తున్నా'రని శరద్‌కు అత్యంత సన్నిహితుడైన సీనియర్ నేత విజయ్ వర్మ తెలిపారు. ఇతర లౌకిక పార్టీలను కూడా కలుపుకుని ఇదే కూటమిని కొనసాగించే అవకాశాలను ఆజాద్ (కాంగ్రెస్), ఏచూరి (సీపీఎం)లతో చర్చించినట్లు తెలుస్తోంది.

బీజింగ్: సిక్కింలోని డోక్లాంలో తమ సైనికులను 270 నుంచి 40కి తగ్గించామని చైనా పేర్కొనడాన్ని భారత్ తోసిపుచ్చింది. అక్కడి నుంచి భారత బలగాలను కుదించలేదని, ఇరు దేశాలు ఇంకా 400 మంది సైనికుల చొప్పున మోహరించాయని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. డోక్లాం నుంచి భారత సైనికులు బేషరతుగా వైదొలగితేనే సమస్య పరిష్కారమవుతుందని చైనా స్పష్టం చేసింది. జూన్ 16న ఇరు దేశాల మధ్య డోక్లాంలో ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి మ్యాపులు, ఇతర వివరాలతో చైనా బుధవారం 15 పేజీల సమగ్ర నివేదికను విడుదల చేసింది. ' చైనా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకునేందుకు జూన్ 18న సుమారు 270 మంది భారత సైనికులు మా భూభాగంలో 100

బలగాలను కుదించలేదు

డోక్లాంపై చైనా నివేదికను కొట్టిపారేసిన భారత్

- ఇరు దేశాలు 400 మంది చొప్పున మోహరించాయని స్పష్టీకరణ

మీటర్ల లోనికి చొచ్చుకొచ్చారు. ఆ తరువాత 400 మందికి పైగా సైనికులు అక్రమంగా మూడు గుడారాలు ఏర్పాటుచేసుకుని సుమారు 180 మీటర్లలోనికి చొరబడ్డారు. జూలై చివరి నాటికి 40 మంది భారత సైనికులు, ఒక బుల్‌డోజర్ అక్రమంగా చైనా భూభాగంలో ఉన్నాయి' అని నివేదిక పేర్కొంది. చైనా రోడ్డు నిర్మాణం వల్ల తన వ్యూహాత్మక ప్రయోజనాలు దెబ్బతింటాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. రెండు దేశాల సరిహద్దులపై స్పష్టత ఉన్న ప్రాంతంలోనే ప్రతిష్టంభన నెలకొందని చైనా నివేదిక తెలిపింది. సరిహద్దులను నిర్ధారించిన తరువాత కూడా తమ భూభాగంలోకి భారత సైనికులు చొరబడటం తమ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఆరోపించింది. సిక్కిం సెక్టార్‌లో చైనా–ఇండియా సరిహద్దు మౌలిక రూపాన్ని మార్చాలని భారత్ ప్రయత్నించడం చైనా భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ' ప్రస్తుత వివాదం చైనా–భూటాన్‌లది. ఇందులో భారత్ చేయగలిగేదేం లేదు. చైనా–భూటాన్ సరిహద్దు చర్చలకు అడ్డుపడే హక్కు భారత్‌కు లేదు. తన చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకునేందుకు చైనా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. భారత్‌తో స్నేహ సంబంధాలు పెంచుకోవడానికి అధిక ప్రాధాన్యమిస్తుంది. ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంతత, శాంతి నెలకొల్పడానికి కట్టుబడి ఉంటుంది' అని నివేదిక స్పష్టం చేసింది. తాము డోక్లాంలో చేపట్టబోయే రోడ్డు నిర్మాణం గురించి అంతకు ముందే భారత్‌కు సమాచారమిచ్చినట్లు చైనా పేర్కొంది.

బేషరతుగా వెనుదిరిగితేనే...
డోక్లాం నుంచి భారత్ తన బలగాలను బేషరతుగా విరమించుకోవడానికి చర్యలు తీసుకుంటేనే ప్రస్తుత వివాదం సద్దుమణుగుతుందని చైనా స్పష్టం చేసింది. జూలై 28న భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా భద్రతా సలహాదారు యాంగ్ జియేచి మధ్య జరిగిన చర్చల వివరాలను చైనా విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది.

యుద్ధం వస్తే... చైనాకే నష్టం!

భారత్–చైనా సరిహద్దులో వివాదం నేపథ్యంలో రెండు దేశాల మధ్య యుద్ధమే వస్తే చైనాకే ఎక్కువ నష్టమనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ప్రపంచ జనాభాలో 35 శాతం(260 కోట్లు) నివసించే ఈ రెండు భారీ దేశాలూ ఓ చిన్నపాటి సరిహద్దు గొడవతో అసలు పోరుకు దిగుతాయా? అన్నదే ప్రస్తుత ప్రశ్న. ఈశాన్య సరిహద్దులో భారత, చైనా సేనలు కేవలం 150 మీటర్ల ఎడంలో నిలబడి ఉన్నాయి. ఒకవేళ యుద్ధమే మొదలైతే పోరు ఒక్క సిక్కిం సెక్టార్‌కే పరిమితం కాదనీ, అరుణాచల్ నుంచి జమ్మూకశ్మీర్ వరకూ విస్తరిస్తుందని నిపుణుల అంచనా. 1962లో మాదిరిగా సరిహద్దు మొత్తం సమరాంగణమైతే చైనాకే అనుకూల పరిస్థితులు ఎక్కువ. చైనాకు 80 శాతానికి పైగా ముడి చమురు సరఫరా జరిగే మలాకా జలసంధి (మలేసియా, ఇండొనేసియా మధ్య) అండమాన్–నికోబార్ దీవులకు సమీపంలో ఉంటుంది. ఆ ప్రాంతం గుండా జరిగే ముడిచమురు రవాణాపై యుద్ధ ప్రభావం పడుతుంది. దీవుల్లో భారత్‌కు భారీ నౌకాదళ కేంద్రం ఉంది. నౌకాదళం రంగంలోకి దిగితే, చైనా ఓడలు అండమాన్ పక్క నుంచి పోవడం కష్టమే. 1999లో కార్గిల్ యుద్ధసమయంలోనూ ఈ కారణం వల్లనే పాకిస్తాన్‌కు చైనా సాయం చేయలేదు.

భారత్‌కు లక్ష్యాలు కాగల చైనా స్థావరాలు
చైనా–పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ ప్రాజెక్టులో భాగంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చైనా 4,500 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టి మౌలిక సౌకర్యాల ప్రాజెక్టులు చేపట్టింది. ఉత్తర భారత సరిహద్దు యావత్తూ సమరాంగణమైతే భారత సేనలకు ఇవి లక్ష్యంగా మారతాయి. అప్పుడు చైనా భారీగా నష్టపోతుంది. ఇటీవల శ్రీలంకలోని హంబంతోతట్ రేవు, పాక్‌లోని గ్వాదర్ పోర్టులో కొన్ని సౌకర్యాలు పొందడానికి చైనా ఒప్పందాలు చేసుకుంది. ఆఫ్రికా దేశం జిబూటీలో చైనా సైనిక స్థావరం శరవేగంతో పూర్తవుతోంది. యుద్ధం ఆరంభమైతే ఈ ప్రాంతాలన్నీ భారత నౌకాదళ దాడుల పరిధిలోకి వస్తాయి.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

చైనా నిపుణులదీ అదే మాట..

ఇండియాతో తగవు ముదిరితే చైనా రోడ్– బెల్ట్ ప్రాజెక్టు, ముడి చమురు సరఫరా మార్గం ఇబ్బందుల్లో పడతాయని మకావ్‌కు చెందిన చైనా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండు దిగ్గజాల మధ్య పోరు జరిగితే రోడ్–బెల్ట్ ప్రాజెక్టుకు ఎనలేని నష్టం వాటిల్లుతుందని చైనా సైనికరంగ నిపుణుడొకరు హెచ్చరించారు. డోక్లాం పేరుతో చైనా యుద్ధవాతావరణం సృష్టించి, ఇండియాను నొప్పిస్తే దాన్ని శత్రుశిబిరంలోకి నెట్టినట్టవుతుందని ఆయన అన్నారు. ఏకకాలంలో బుజ్జగించి, బెదిరించే వ్యూహాలతో చైనా ఇతర ఆగ్నేయాసియా దేశాలను లొంగదీసినట్టు ఇండియాను తన దారిలోకి తెచ్చుకోవడం కుదిరే పని కాదనేది ఆయన నిశ్చితాభిప్రాయం. రోడ్–బెల్ట్ ప్రాజెక్టులో భాగస్వామి కావడానికి మొదట్నుంచీ వెనుకాడుతున్న ఇండియా ప్రస్తుత ఉద్రిక్తత వల్ల అసలు అందులో చేరకపోయే ప్రమాదముందని మరొక నిపుణుడు చైనా సర్కారును హెచ్చరిస్తున్నారు.



కరువు కాటు.. అప్పుల పోటు!



ఖరీఫ్‌లో పంటల సాగు వివరాలు
(హెక్టార్లలో - ఆగస్టు 2వ తేదీ నాటికి)

జిల్లా	లక్ష్యం	వాస్తవ సాగు
శ్రీకాకుళం	2,57,663	92,231
విజయనగరం	2,04,150	54,026
విశాఖపట్నం	2,01,100	66,044
తూర్పుగోదావరి	2,60,614	1,62,975
పశ్చిమగోదావరి	2,61,047	2,10,082
కృష్ణా	3,35,800	1,90,214
గుంటూరు	5,43,421	1,71,149
ప్రకాశం	2,65,609	41,398
పీఎస్ నెల్లూరు	97,519	31,192
చిత్తూరు	2,00,038	1,45,735
వైఎస్సార్	1,51,120	34,359
అనంతపురం	8,37,503	1,94,495
కర్నూలు	5,91,102	3,57,286
రాష్ట్రం మొత్తం	42,06,686	17,51,186

ముందస్తు రుతుపవనాలు ఊరించాయి.. వస్తున్నానంటూ వరుణుడూ అక్కడక్కడ నేల వాలాడు.. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన రైతన్న వెనకా ముందు చూడక పొలంలో విత్తేశాడు.. ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.. వరుణుడి జాడే లేదు.. వేసిన పంట బతకాలంటే నాలుగు చినుకులు పడాల్సిందే.. ఈ రోజు సరే.. రేపు బాగుంటుందనేది రైతుల ఆశ.. ఆ ఆశతోనే అన్నదాతలు పొద్దస్తమానం ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు.. విత్తనం వేయలేకపోయిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కరువు మండలాలు	2014వ సం॥	2015వ సం॥	2016వ సం॥	2017వ సం॥
	238	359	301	247

2017లో కరువు మండలాల ప్రకటన అక్టోబర్‌లో వస్తుంది. ప్రస్తుతానికి ఇవి వర్షాభావ మండలాలు

- మళ్లీ ముంచిన ఖరీఫ్
- వరుసగా నాలుగో ఏడాదీ వర్షాభావం
- సీమలో 20 శాతానికి చేరిన వర్షపాత లోటు
- దారుణంగా పడిపోయిన వేరుశనగ సాగు
- విత్తనాలు సగం ధరకు తెగనమ్ముకుంటున్న రైతులు
- అప్పుల ఊబిలో చిక్కుకుపోయామని ఆవేదన

సాక్షి, అమరావతి

ఈ ఏడాదీ ఖరీఫ్‌ను కరువు కాటేసింది. రాష్ట్రంలో పంటల సాగు పడిపోయింది. అరకొరగా సాగైన పంటలు కూడా చాలా జిల్లాల్లో ఎండిపోతున్నాయి. రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 42.06 లక్షల హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 17.54 లక్షల హెక్టార్లలో మాత్రమే విత్తనం పడిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవంగా 15 లక్షల హెక్టార్లలో కూడా విత్తనం పడలేదని క్షేత్ర స్థాయి సమాచారం. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో సాగు కావాల్సిన భూమిలో మూడో వంతు పొలంలో మాత్రమే విత్తనం పడింది. వరుణుడు ముఖం చాటేయడం, ఎండలు మండుతుండటంతో ఈ కొద్దిపాటి విస్తీర్ణంలోని పంటలు కూడా మాడిపోతున్నాయి. మరో పక్షం రోజులు వర్షాభావం తప్పదని వాతావరణ శాఖ నిపుణుల ప్రకటనలు రైతులను తీవ్ర ఆందోళనలోకి నెట్టాయి. రాయలసీమలో గత నెల 30వ తేదీ నాటికి 13 శాతం ఉన్న వర్షపాత లోటు ఈ నెల 2వ తేదీకి (కేవలం మూడు రోజుల్లో) 20 శాతానికి పెరిగింది. వాతావరణ శాఖ చెప్పినట్లు మరో పక్షం రోజులు వర్షం కురవకపోతే పంటలేమీ మిగలవని, 90 శాతం ఎండిపోతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అసలే అరకొర సాగు...

రాయలసీమలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 17.79 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా ఈ నెల 2వ తేదీ వరకు 7.31 లక్షల హెక్టార్లలో మాత్రమే విత్తనం పడిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవంగా సీమలో సాగు విస్తీర్ణం 5.5 లక్షల హెక్టార్లకు మించలేదని అంచనా. విత్తనాల కొనుగోళ్లను చూసి రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు ఇలా అంచనా వేశారని క్షేత్రస్థాయి పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. రాయలసీమలో ప్రధాన పంట అయిన వేరుశనగ సాగు మూడో వంతుకు పడిపోయింది. అనంతపురం జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 6.05 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా 1.50 లక్షల హెక్టార్లలో కూడా విత్తనం పడలేదు. ఈ జిల్లాలో ఈ ఖరీఫ్‌లో మొత్తం 8.37 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.94 లక్షల హెక్టార్లలో మాత్రమే విత్తనం పడింది. రాష్ట్రం మొత్తంలో పండే వేరుశనగలో 90 శాతం రాయలసీమ నుంచి కాగా, మూడొంతులు అనంతపురం జిల్లా నుంచే ఉంటుంది. ప్రస్తుతం వేరుశనగ సాగుకు అదును కూడా దాటిపోయింది.

అప్పులు తీరేదెలా?

జూన్ మొదటి వారంలో రుతు పవనాలు ప్రవేశించగానే వర్షాలు కురవడం, పరిస్థితి ఆశాజనకంగా ఉండటం, వాతావరణ నిపుణులు సాధారణ వర్షపాతం (98 శాతం) నమోదవుతుందని ప్రకటించడంతో రైతులు అప్పు చేసి వేరుశనగ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. వర్షం కురిస్తే విత్తనం వేద్దామని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వరుణుడి జాడ లేకపోవడం, సీజన్ దాటిపోవడంతో ఇక లాభం లేదని పలువురు వేరుశనగ విత్తన పప్పును తక్కువ ధరకే దుకాణాల వారికి విక్రయిస్తున్నారు. రైతుల నుంచి వ్యాపారులు కిలో 50 - 60 రూపాయలకు వేరుశనగ విత్తనాలను తీసుకుని ప్రజలకు రూ.110 నుంచి 120 వరకూ అమ్ముతున్నారు. మరికొందరు రైతులు మాత్రం అక్కడక్కడ అరకొరగా కురిసిన వర్షానికే విత్తనం వేశారు. ఆ తర్వాత వర్షం కురవక పోవడంతో పంట ఎండుముఖం పట్టింది. దీంతో అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచడంలేదని కర్నూలు జిల్లా జంబులదిన్నెకు చెందిన వెంకట రమణారెడ్డి అనే రైతు వాపోయారు.

నాలుగేళ్లుగా కరువే..

రాష్ట్రాన్ని.. ప్రత్యేకించి రాయలసీమను నాలుగేళ్లుగా కరువు వెంటాడుతోంది. రాష్ట్రంలో నాలుగేళ్లుగా కరువు కరాళ నృత్యం చేస్తోందనడానికి ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల ప్రకటనే ప్రత్యక్ష నిదర్శనం. 2015లో ప్రభుత్వం 359 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించగా అందులో 200 రాయలసీమ జిల్లాల్లోవి కావడం గమనార్హం. 2014, 2016 సంవత్సరాల్లో కూడా మొత్తం కరువు మండలాల్లో సగంపైగా రాయలసీమలోనే ఉన్నాయి. కాగా, అనంతపురం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి (ఆగస్టు 2వ తేదీ) వరకు కురవాల్సిన వర్షం కంటే 33 శాతం తక్కువ కురిసింది. ఇదే కాలంలో రాయలసీమ మొత్తంలో 20.37 శాతం వర్షపాత లోటు నమోదైంది. సాధారణ వర్షం (కురవాల్సిన దాని) కంటే కర్నూలు జిల్లాలో 20, వైఎస్సార్‌లో 19, చిత్తూరులో 13 శాతం తక్కువ కురిసింది. విజయనగరం జిల్లాలో 15 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

తెరపైకి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక

ఇప్పటికి సగానికి పైగా పూర్తి కావాల్సిన సాగు మూడో వంతు దాటినట్టు వ్యవసాయ శాఖ బుధవారం నాటి నివేదికలో తెలిపింది. ఖరీఫ్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటికి 251.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంటే 244.5 మిల్లీమీటర్లు నమోదైంది. దీంతో 3 శాతం లోటు ఏర్పడింది. కృష్ణా, గుంటూరు మాత్రమే మిగులు వర్షపాతంలో ఉన్నాయి. అనంతపురం ఇప్పటికే కరవు కోరల్లో చిక్కుకుంది. విత్తిన పంటల్లో జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి వంటి మెట్టపంటలే ఎక్కువగా ఉన్నాయి. వేరుశనగ పంట అనుకున్న లక్ష్యాన్ని చేరలేదు. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం 23.58 లక్షల హెక్టార్లయితే ఇప్పటికి 8.48 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగవుతున్నాయి. చివరకు మిర్చి పంట సైతం ముందుకు సాగడం లేదు. 1.35 లక్షల హెక్టార్లలో మిర్చి సాగవుతుందని అంచనా వేస్తే ఇప్పటికి 40 వేల ఎకరాల్లో కూడా నాటలేదు. 67,187 హెక్టార్లలో వరి నారుమళ్లు పెరుగుతున్నాయి. ఉభయ గోదావరి, ఉత్తర కోస్తా జిల్లాల్లో ఇప్పుడిప్పుడే నాట్లు ముమ్మరం అవుతున్నాయి. ఈ నెలాఖరు వరకు సమయం ఉన్నందున పంటల పరిస్థితి మెరుగుపడుతుందని వ్యవసాయ శాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

డ్రోన్.. భళా!

- 70 కిలోల బరువున్న మర మనిషితో గాల్లోకి ఎగిరిన మ్యాన్డ్ ఆక్టో కాప్టర్
- చిరెక్ విద్యార్థుల ఘనత.. దేశంలోనే తొలి ప్రయోగం



హైదరాబాద్: ఇప్పటిదాకా గాల్లో ఎగిరి వీడియోలు, ఫొటోలు తీసే డ్రోన్‌లనే చూశాం.. కానీ హైదరాబాద్‌లోని చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు మనిషిని కూడా గాల్లోకి తీసుకెళ్లగలిగే డ్రోన్ హెలికాప్టర్ (ఆక్టో కాప్టర్)ను రూపొందించారు. బుధవారం కొండాపూర్‌లోని స్కూల్ ఆవరణలో 70 కిలోల బరువున్న మర మనిషితో ఆక్టో కాప్టర్‌ను విజయవంతంగా గాల్లోకి ఎగురవేసి రికార్డు సృష్టించారు. ఇలాంటి ప్రయోగం చేయడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ప్రయోగానికి మరింత పదును పెడితే మ్యాన్డ్ ఆక్టో కాప్టర్‌ను ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉపయోగించుకునే వీలుంటుందని చెబుతున్నారు. స్కూల్‌లో 12వ తరగతి చదువుతున్న వినయ్ కనుమూరి, వినీత్ ఆలపాటి, అమోఘ్ ఇస్కా, ఆదిత్య మద్దుకూరి పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థుల సహకారంతో దీన్ని తయారు చేశారు. ఏడాదిపాటు శ్రమించి, రూ.8.5 లక్షల ఖర్చుతో ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. చివరికి రిమోట్ సాయంతో 15 అడుగుల ఎత్తు వరకు విజయవంతంగా ఎగురవేశారు. మరో 8 నెలల తర్వాత మనిషిని కూర్చోబెట్టి ఆక్టో కాప్టర్‌ను ఎగురవేస్తామని వైస్ ప్రిన్సిపల్ వెంకట్ రామన్ తెలిపారు. దీనికి 100 అడుగుల ఎత్తులో ఎగిరే సామర్థ్యం ఉందన్నారు. మనిషితో ఎగిరే డ్రోన్‌ను తయారు చేయడం ఎంతో స్ఫూర్తినిచ్చిందని విద్యార్థి అమోఘ్ ఇస్కా పేర్కొన్నాడు.

రూ.2 లక్షలకు బీటెక్ సర్టిఫికెట్

- ఏఎన్‌యూ పేరుతో నకిలీపత్రం
- సీఎంఎం కోసం వచ్చి దొరికిపోయిన యువకుడు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పేరుతో నకిలీ సర్టిఫికెట్ జారీఅయిన అంశం బుధవారం యూనివర్సిటీలో కలకలం సృష్టించింది. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన జి.తరుణ్‌తేజ మూడు రోజుల కిందట యూనివర్సిటీ పరీక్షా భవన్ నుంచి సీఎంఎం (కన్సాలిడేట్ మార్క్స్ మెమో) పొందేందుకు ఫీజు చెల్లించి పరీక్షా భవన్ కౌంటర్‌లో దరఖాస్తు చేశాడు. యూనివర్సిటీ పరిధిలోని చలపతి ఇంజనీరింగ్ కళాశాల (లాం)లో బీటెక్ ఈసీఈ బ్రాంచ్‌లో ఉత్తీర్ణుడైనట్లు మార్కుల జాబితాలు సమర్పించాడు. వాటి ఆధారంగా సీఎంఎం ఇవ్వాలని దరఖాస్తులో పేర్కొన్నాడు. దరఖాస్తుకు జతచేసిన వివరాల ఆధారంగా బీటెక్ సెక్షన్లో సిబ్బంది రికార్డులు, కంప్యూటర్‌లలో వివరాలు పరిశీలించారు. ఎక్కడా విద్యార్థి వివరాలు నమోదుకాలేదని గుర్తించారు. దీంతో సర్టిఫికెట్లు నకిలీవని సందేహం వచ్చిన సిబ్బంది సీఎంఎం పూర్తయిందని వచ్చి తీసుకెళ్లాలని యువకుడికి ఫోన్‌చేసి పిలిపించి విషయాన్ని వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్, యూనివర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రిజిస్ట్రార్ కె.జాన్‌పాల్ పెదకాకాని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు విద్యార్థిని పోలీసులకు అప్పగించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పేరుతో ఉన్న బీటెక్ సర్టిఫికెట్‌ను రెండు లక్షల రూపాయలకు కొనుగోలుచేశానని తరుణ్‌తేజ ఒప్పుకున్నట్టు సమాచారం. తనకు ఈ సర్టిఫికెట్‌ను గుంటూరుకు సమీపంలో ఉండే జానకిరాం అనే వ్యక్తి ఇచ్చాడని వెల్లడించినట్లు తెలిసింది.

ఆ జీవో అమలును నిలిపేయాలి

టీటీడీ నిధులు ఇతర కార్యకలాపాలకు వాడకూడదంటూ పిల్

సాక్షి, హైదరాబాద్: తిరుపతి ఎయిర్‌పోర్ట్ రోడ్డు సుందరీకరణకోసం రూ.10 కోట్లను విడుదల చేయాలంటూ టీటీడీని ఆదేశిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 699ని సవాలు చేస్తూ ఉమ్మడి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. టీటీడీ తన నిధులను స్వీయ అవసరాలు, ధార్మిక కార్యక్రమాల కోసమే వినియోగించేలా తప్ప ఇలా ఎలా పడితే అలా వినియోగించడం చట్ట విరుద్ధమని, అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని ప్రభుత్వం జారీచేసిన జీవో అమలును నిలిపేయాలని కోరుతూ తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి వ్యాజ్యాన్ని దాఖలుచేశారు. ఇందులో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, టీటీడీ ఈవో, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) వైస్ చైర్మన్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి బాధ్యత రాష్ట్రాలదే

- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు జవాబు



సాక్షి, అమరావతి: వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల్ని అభివృద్ధి చేసే ప్రాథమిక బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బుధవారం రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ దేశంలో పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే చర్యల్లో భాగంగా కేంద్రప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ఆమె తెలిపారు. ఆగ్నేయ రాష్ట్రాల్లోనూ, ప్రత్యేక ప్యాకేజీ పథకం కింద ఉన్న హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో పారిశ్రామిక విధాన రూపకల్పన, ప్రోత్సాహక విభాగం(డీఐపీపీ) పలు పథకాల్ని అమల్లోకి తెచ్చిందన్నారు. అయితే ప్రత్యేక ప్యాకేజీ వెసులుబాటు ఈ మధ్యకాలంలోనే ముగిసిపోయిందని ఆమె చెప్పారు. రాష్ట్ర విభజనానంతరం ఆంధ్రప్రదేశ్ దేశంలోని పారిశ్రామికంగా వెనుకబడిపోయిన రాష్ట్రాల సరసన చేరిన విషయం వాస్తవమేనా? కేంద్రం నుంచి ఏపీకి తక్షణ సాయం చేయాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఆర్థికాభివృద్ధికోసం కేంద్రం పన్ను ప్రోత్సాహకాలతోపాటుగా ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 94 స్పష్టంగా నిర్దేశిస్తోందని తెలిపారు. దీనికను గుణంగానే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెసిలిటేషన్ స్కీమ్‌ను ప్రారంభించాలంటూ ఏపీ ప్రభుత్వం తమకు ప్రతిపాదనలు పంపిందన్నారు.

ఎగుమతుల వృద్ధిరేటు తగ్గింది..

గతేడాది ఆగస్టు నుంచి గడిచిన 11 నెలల్లో సరుకుల ఎగుమతి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ వృద్ధిరేటు తగ్గిన విషయం వాస్తవమేనని నిర్మలా సీతారామన్ అంగీకరించారు. విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు ఆమె బదులిస్తూ.. అంతర్జాతీయంగా సరుకుల ధరలు తగ్గుముఖం పట్టడంతో వాటి ఎగుమతిదారులపై దాని ప్రభావం పడిందన్నారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం, క్రూడ్ ధరలు పతనమవడంతో దేశంనుంచి అత్యధికంగా ఎగుమతయ్యే పెట్రోలియం ఉత్పాదనల ధరలు సైతం గణనీయంగా పడిపోయాయని చెప్పారు. చమురు ఉత్పత్తి దేశాల్లో దేశం నుంచి ఎగుమతి అయ్యే అమూల్యమైన వస్తువులైన ముత్యాలు, రత్నాలుకు డిమాండ్ లేకుండా పోవడమూ ఎగుమతుల వృద్ధిరేటు క్షీణతకు కారణాలన్నారు. విదేశీ వాణిజ్య విధానంలో భాగంగా దేశం నుంచి సరుకుల ఎగుమతిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక పథకాల్ని ప్రారంభించినట్లు మంత్రి వెల్లడించారు.

విజయవాడకు లైట్ మెట్రో రైలు

- సీఎంకు నివేదిక ఇచ్చిన జర్మనీ కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ
- ఆమోదం తెలిపిన చంద్రబాబు. డీపీఆర్ రూపకల్పనకు ఆదేశం

సాక్షి, అమరావతి: విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదనను పక్కనపెట్టారు. దీనికి బదులుగా లైట్ మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. జర్మనీ ఆర్థిక సంస్థ కేఎఫ్‌డబ్ల్యూ రవాణారంగ నిపుణుడు ఎడ్వర్డ్ డాట్సన్ బుధవారం సచివాలయంలో సీఎంను కలసి లైట్ మెట్రోపై నివేదిక అందజేశారు. దానిని పరిశీలించిన సీఎం వెంటనే ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. మూడు మార్గాల్లో రానున్న ఈ లైట్ మెట్రో రైలు ప్రాజెక్టును 40 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తామని, గత ప్రాజెక్టులో లేని గన్నవరం ఎయిర్‌పోర్టు, జక్కంపూడి కాలనీలను ఇందులో అనుసంధానించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఢిల్లీస్థాయి మెట్రో రైలు వ్యవస్థ అధిక వ్యయంతో కూడినది కావడంతో సీఎం సూచనల ప్రకారం ప్రత్యామ్నాయ రవాణాగా లైట్ మెట్రో రైలును పరిశీలించామని చెప్పారు. దీనిపై సవివర నివేదిక(డీపీఆర్) రూపొందించాలని ఏఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డిని సీఎం ఆదేశించారన్నారు. డీఎంఆర్‌సీ ప్రతిపాదించిన మెట్రోకంటే లైట్ మెట్రో నిర్మాణ ఖర్చు 25 శాతం తగ్గుతుందని, నిర్వహణ ఖర్చు 22 శాతానికి తగ్గుతుందన్నారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.250 కోట్లు ఖర్చవుతుండగా, లైట్ మెట్రోకు రూ.170 కోట్ల నుంచి రూ.180 కోట్లే ఖర్చవుతుందన్నారు. మెట్రో నిర్వహణ ఖర్చు ఏడాదికి 26 కిలోమీటర్లకు రూ.160 కోట్లు అయితే.. లైట్ మెట్రోకు రూ.106 కోట్లు ఖర్చవుతుందన్నారు. మెట్రోకు మూడు బోగీలు తప్పనిసరని, లైట్ మెట్రోను రెండు బోగీలతో ప్రారంభించి ప్రయాణికుల సంఖ్య పెరిగేకొద్దీ అదనపు బోగీ ఏర్పాటు చేసుకునే వీలుంటుందన్నారు. మెట్రో బోగీలో 250మంది ప్రయాణించే వీలుంటే.. లైట్ మెట్రో బోగీలో 200 మంది ప్రయాణించవచ్చన్నారు. లైట్ మెట్రోరైల్‌కు రూ.4,273 కోట్లు ఖర్చవుతుందని డాట్సన్ అంచనా వేశారని, నిడమానూరు నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వరకు నిర్మించే 13.27 కిలోమీటర్ల కారిడార్, పెనమలూరు నుంచి బస్టేషన్ వరకు నిర్మించే 12.76 కిలోమీటర్ల కారిడార్లకు పూర్తిగా లైట్ మెట్రోరైలు మార్గాలు అనుకూలమని సూచించారని నారాయణ వివరించారు.

స్విమ్స్ డైరెక్టర్.. లుంగి డాన్స్!

టీటీడీ ఆడిటోరియంలో స్టెప్పులు

తిరుపతి మెడికల్ : టీటీడీకి చెందిన సంస్థలో అపచారం చోటు చేసుకుంది. శ్రీవారి పాదాల చెంత కొలువై, దేవస్థానం ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో సాక్షాత్తు డైరెక్టర్ తన హోదా మరచి ఓ కార్యక్రమంలో 'లుంగి డ్యాన్స్' అనే పాటకు చిందులేయడం వివాదాస్పదమైంది. ఆయన డ్యాన్స్‌కు సంబంధించిన వీడియో, చిత్రాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవల స్విమ్స్ ఉద్యోగుల పిల్లల సంరక్షణ కేంద్రం వార్షికోత్సవాన్ని శ్రీపద్మావతి ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులతో కలసి స్టెప్పు లేయడం చూసిన వారు ముక్కున వేలేసుకున్నారు. స్విమ్స్ ఆసుపత్రిలో అసభ్యకరమైన, పాశ్చాత్య సంస్కృతికి చెందిన కార్యక్రమాలకు స్థానం లేదు. ఆ సంస్థ వైస్ చాన్స్‌లర్, డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారే ఈ విషయాన్ని విస్మరించి, వేదికపై శ్రీవారి విగ్రహం ఎదుటే ఏమాత్రం సంకోచించకుండా స్టెప్పులేశారు.

పాలనాపరంగానూ ఆరోపణలు: ఎన్‌ఆర్‌ఐ అయిన డాక్టర్ రవికుమార్ అధికార పార్టీకి చెందిన వైద్య శాఖ మంత్రికి సన్నిహితుడు. ఏడాది క్రితం డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆరంభంలో కొన్ని పాలనాపరమైన సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నప్పటికీ తర్వాత అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే పని చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలకమైన నిర్ణయాలను సైతం అధికార పార్టీకి చెందిన అధికారులకు అప్పగించడం, తరచూ సెలవులో విదేశాలకు వెళ్లడంతో స్విమ్స్‌లో పాలన అటకెక్కింది. సీనియర్లను కాకుండా తనకు సన్నిహితంగా ఉన్న వ్యక్తికి ఫర్ఫ్యూజనిస్ట్‌గా శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించారు. ఫైనాన్స్ కమిటీ అప్రూవల్, ప్రిన్సిపల్ సెక్రటరీ అనుమతి లేకుండానే ఈ నియామకం పట్ల సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 151 జీవో ప్రకారం కనీస వేతనాలు చెల్లించడం లేదు. ఓ మహిళకు కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధి కల్పించి క్వార్టర్స్ కేటాయించడంపై విమర్శలున్నాయి. దీనిపై స్విమ్స్ డైరెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్నట్లుగా సోషల్ మీడియాలో వచ్చిన ఫొటో

'కరకట్ట' ఇంటిని చంద్రబాబు తక్షణమే ఖాళీ చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి

మా మాటలు కంటే సింగ్‌పూర్ మాటలంటేనే ఎంతో ఇష్టం. ఎందుకంటే వారు గాల్లో ఎగురుతారు. మేం నేలమీద నడుస్తాం. అందుకే మా మాటలు చెవికెక్కడం లేదు. కనీసం జగ్గీ వాసుదేవ్ మాటలైనా వింటే ఎంతో సంతోషం. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన నదిని రాజధాని నిర్మాణం పేరిట దయచేసి నాశనం చేయొద్దు'' అని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం విజయవాడలో కృష్ణానది పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి బీజాపూర్ వరకు ఈ యాత్ర కొనసాగనుంది. ఈ సందర్భంగా రాజేంద్రసింగ్ మాట్లాడుతూ.. భారతదేశంలో నదుల పరిరక్షణ కోసం ఈ యాత్రను ప్రారంభించామని చెప్పారు. కృష్ణా నది రోజురోజుకీ ఆక్రమణలతో కుంచించుకుపోతోందని, ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నవ్యాంధ్ర రాజధాని ప్రాంతంలో కృష్ణా నదిపై నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు వెలిశాయన్నారు. ఇసుక మాఫియా ఆగడాల వల్ల నదీ పరీవాహక ప్రాంతం పాడైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే నదుల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

నదులను ధ్వంసం చేస్తే పెనుప్రమాదమే

ప్రకృతి సిద్ధంగా ప్రవహించే నదులకు అడ్డుకట్ట వేయడం అంటే ఆ నదులను నాశనం చేసినట్టే అవుతుందని నేచురల్ సిటీస్ రూపకర్త ప్రొఫెసర్ విక్రమ్ సోని అన్నారు. నదులు నాశనమైతే మళ్లీ తీసుకురాలేమని పేర్కొన్నారు. నదులను ధ్వంసం చేస్తే భవిష్యత్తులో పెనుప్రమాదం తప్పదని హెచ్చరించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ... నదీ పరివాహక ప్రాంతంలో నిర్మాణాలు చేపడతూనే ఎలాంటి కట్టడాలు కట్టలేదని సుప్రీంకోర్టు, ఎన్‌జీటీలో చెప్పడం ప్రభుత్వ మోసకారితనానికి నిదర్శనమని మండిపడ్డారు. జరీబు భూముల్లో రాజధాని నిర్మాణం చేపట్టడంపై పునరాలోచన చేయాలన్నారు. ఈ యాత్రలో రాజధాని ప్రాంత రైతు, రైతు కూలీ హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ అనుమోలు గాంధీ, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దూశర్ల సత్యనారాయణ, పర్యావరణ నిపుణులు బొలిశెట్టి సత్యా, సీపీఎం నేత సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

లంకపల్లి ఇసుక రేవులో ధర్నా

ప్రకాశం బ్యారేజీ నుంచి మద్దూరు, పాపవినాశనం, హంసలదీవి, పెనుమూడి, కొల్లూరు వరకు కృష్ణానది పరిరక్షణ యాత్ర సాగింది. లంకపల్లి ఇసుక రేవును రాజేంద్రసింగ్ బృందం సందర్శించింది. అక్కడ నదిలో ఇసుక తవ్వకాల కోసం ఒక రోడ్డు మార్గాన్నే ఏర్పాటు చేసి, పొక్లెయిన్‌తో ఇసుకను తవ్వుతుండడం చూసి రాజేంద్రసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ధర్నాకు దిగారు. ప్రభుత్వం అండతోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. తక్షణమే అక్రమ తవ్వకాలను నిలిపివేసి, కృష్ణమ్మను కాపాడాలని డిమాండ్ చేశారు.

రాజధానికి ఏటా రూ.1500 కోట్లివ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

సిటీ నిధులు రూ.100 కోట్లు, విట్, ఎస్ఆర్ఎం వంటి సంస్థలకు భూములివ్వడం ద్వారా సమకూ రిన రూ.400 కోట్లతోపాటు గత డిసెంబర్‌లో ఆమోదించిన రూ.9 వేల కోట్లు కలుపుకుంటే మొత్తం రూ.22,600 కోట్లు సమకూరుతున్నాయని తెలిపారు. మిగిలిన రూ.7,400 కోట్ల నిధులకోసం అన్వేషిస్తున్నామని చెప్పారు. దీర్ఘకాలిక వాయిదా సౌకర్యాలిస్తూ నిర్మాణ సమయంలో మారటోరియానికి అంగీకరించే ఆర్థిక సంస్థల్నే రుణాలకోసం సంప్రదించాలని సీఎం సూచించారు. కాగా, న్యాయమూర్తులు, శాసనసభ్యులు, ఉభయ సభల అధిపతులు, మంత్రులు, అఖిల భారత సర్వీస్ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల నివాస భవంతులపై రూపొందించిన ప్రతిపాదనల వివరాల్ని అధికారులు సీఎంకు అందజేశారు. సమావేశంలో సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో కన్‌స్ట్రక్షన్ సిటీ నిర్మాణం: సీఎం

ప్రకాశం జిల్లా దొనకొండలో కన్‌స్ట్రక్షన్ సిటీని నిర్మిస్తున్నామని, ఇక్కడ నిర్మాణ రంగానికి సంబంధించి అవసరమైన సకల సామాగ్రి అందుబాటులోకి తెస్తామని సీఎం చంద్రబాబు పురపాలక-పట్టణాభివృద్ధి శాఖపై సమీక్షలో పేర్కొన్నారు. కన్‌స్ట్రక్షన్ సిటీ పూర్తయితే గృహనిర్మాణ రంగానికి మరింత ఊతం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ నగర్-పీఎంఏవై పథకం కింద నిర్మించతలపెట్టిన పేదల గృహ సముదాయాల్ని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 15 రోజులకోసారి డ్రోన్ కెమెరాలతో గృహనిర్మాణ పనుల పురోగతిని చిత్రీకరించి, తనకు వివరించాలన్నారు.

చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే మద్యం షాపుల లైసెన్సుల రద్దు

రాష్ట్రంలో బెల్టుషాపుల్ని పూర్తిగా తొలగించాలని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే మద్యంషాపుల లైసెన్సులను రద్దు చేయాలని అధికారుల్ని సీఎం ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, అధిక ధరలకు ఇసుక అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సీఎం చంద్రబాబు తన నివాసం నుంచి జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా అడ్డుకట్ట వేయాలని, కొత్త రీచ్‌లను తెరవడం ద్వారా ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని సీఎం కోరారు. ఉద్యోగులను తొలగిస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ వదంతుల్ని నమ్మొద్దని ఆయనీ సందర్భంగా అన్నారు.

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- ఏపీపీఎస్సీ పంచాయతీ కార్యదర్శి: ఇండియన్ పాలిటీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: బ్యాంకింగ్ అవేర్‌నెస్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్ sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్-1102 సైంటిఫిక్ అసిస్టెంట్ (భారత వాతావరణ విభాగం) పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 4
- హిందుస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ మేనేజర్, ఇంజనీర్ తదితర ఎనిమిది పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 4
- కార్పొరేషన్ బ్యాంక్‌లో 20 మేనేజర్ (లా) పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 5
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 60 డ్రెడ్జ్ క్యాడెట్స్, ట్రైనీస్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 5

పారిస్‌లో 2024 ఒలింపిక్స్

అంతర్జాతీయం

చైనాలో బ్రిక్స్ దేశాల కార్మిక మంత్రుల సమావేశం



రెండు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ దేశాల కార్మిక మంత్రుల సమావేశాలు చైనాలోని చాంగ్‌కింగ్‌లో జూలై 26న ముగిశాయి. ఈ సమావేశాల్లో మన కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. సమావేశంలో ప్రసంగించిన ఆయన బ్రిక్స్ దేశాల కార్మిక సంస్థల మధ్య సమాచార మార్పిడి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా పరస్పర సహకారాన్ని పెంచుకోవచ్చన్నారు. సుస్థిర ఉద్యోగ కల్పన, జీవన ప్రమాణాల నాణ్యతను పెంచేందుకు పరస్పర సహకారంతో పనిచేస్తామని సమావేశాల ముగింపు సందర్భంగా బ్రిక్స్ దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. సెప్టెంబర్ మొదటి వారంలో చైనాలోని షియామెన్‌లో బ్రిక్స్ సదస్సు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

రష్యా, ఇరాన్, ఉత్తర కొరియాపై అమెరికా ఆంక్షలు

రష్యా, ఇరాన్, ఉత్తర కొరియాలపై ఆర్థిక ఆంక్షలు విధించే బిల్లును జూలై 25న అమెరికా దిగువసభ(ప్రతినిధుల సభ) భారీ మెజారిటీతో ఆమోదించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 419 మంది, వ్యతిరేకంగా ముగ్గురు ఓటు వేశారు. అమెరికా, దాని మిత్ర దేశాలను చిన్నచూపు చూస్తూ వాటికి వ్యతిరేకంగా ఈ మూడు దేశాలు ప్రమాదకర, యుద్ధోన్మాద కార్యకలాపాలు చేపడుతున్నాయని ఆరోపిస్తూ ఈ చర్య తీసుకుంది. దిగువ సభ ఆమోదంతో బిల్లు సెనేట్(ఎగువ సభ) పరిశీలనకు వెళ్లనుంది. బిల్లును రూపొందించిన ప్రతినిధుల సభ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఎడ్ రాయిస్స్ మాట్లాడుతూ ఈ మూడు దేశాలు అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించడంతోపాటు పొరుగు దేశాల్లో అస్థిరత సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

2040 నుంచి బ్రిటన్‌లో పెట్రోల్, డీజిల్ వాహనాలు నిషేధం

డీజిల్, పెట్రోల్‌తో నడిచే కార్లు, వ్యాన్ల అమ్మకాలను 2040 నుంచి నిషేధిస్తున్నట్లు యూకే పర్యావరణ సెక్రటరీ మైఖేల్ గోవ్ ప్రకటించారు. ఈ మేరకు 'ఎయిర్ క్వాలిటీ ప్లాన్'ను జూలై 26న బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. 2040 నుంచి అన్ని వాహనాలు పూర్తిగా విద్యుత్‌తో నడిచేలా చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు హైబ్రిడ్ వెహికల్స్‌తో సహా ఇతర అన్ని రకాల ఇంజిన్లతో నడిచే వాహనాలపై నిషేధం విధించనుంది. 2040 నుంచి జీరో ఉద్గార వాహనాలే రోడ్లపై నడిచేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం బ్రిటన్ మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 1 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. 2040 తర్వాత ఉద్గార రహిత వాహనాలనే అమ్మాలని 2011లో బ్రిటన్ ప్రభుత్వం కార్బన్ ప్లాన్‌ను తీసుకొచ్చింది.

చైనా ఆర్మీ 90వ వార్షికోత్సంలో ఆయుధాల ప్రదర్శన

చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) 90వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 30న ఇన్నర్ మంగోలియాలోని ఝురిహెలో భారీ పరేడ్, ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. దీనికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరయ్యారు. ఇందులో 12 వేల దళాలు పాల్గొన్నాయి. 100కు పైగా యుద్ధవిమానాలు, 600 రకాల ఆయుధాలను ప్రదర్శించారు. వీటిలో సగం ఆయుధాలు కొత్తగా రూపొందించినవే. 1927, ఆగస్టు 1న మావో జెడాంగ్ నేతృత్వం లోని చైనా కమ్యూనిస్టు పార్టీ పీఎల్‌ఏను స్థాపించింది.

జాతీయం

కనీస వేతనాల బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం



నాలుగు కార్మిక చట్టాలను సమ్మిళితం చేస్తూ రూపొందించిన నూతన వేతనాల బిల్లుకు కేంద్ర మంత్రివర్గం జూలై 26న ఆమోదం తెలిపింది. అన్ని రంగాల్లోని కార్మికులకు కనీస వేతనం చెల్లించేందుకు దీన్ని తీసుకొచ్చారు. దీంతో దేశంలోని నాలుగు కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలగనుంది. కనీస వేతనాల చట్టం–1948, వేతనాల చెల్లింపుల చట్టం–1936, బోనస్ చెల్లింపుల చట్టం–1965, సమాన ప్రతిఫలం చట్టం–1976లను విలీనం చేస్తూ నూతన కార్మిక స్మృతిని రూపొందించారు. దీని ద్వారా దేశంలోని అన్ని రంగాల్లో కనీస వేతనాన్ని నిర్ణయించే అధికారం కేంద్రానికి సంక్రమించనుంది. అయితే నిర్దిష్ట కనీస వేతనం కంటే అధికంగా చెల్లించే వెసులుబాటు(అధికారం) రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. ప్రస్తుతం నెలకు రూ.18 వేల జీతం పొందుతున్న కార్మికులకే కనీస వేతన చట్టాలు వర్తిస్తున్నాయి. ఇకపై ఇవి జీతంతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తాయి. రెండో కార్మిక కమిషన్ సిఫార్సుల మేరకు ఈ బిల్లును రూపొందించారు.

వీలర్ ఐలాండ్‌కు అబ్దుల్ కలాం పేరు

ఒడిశా తీరంలోని వీలర్ దీవికి (ఐలాండ్) ఆ రాష్ట్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు పెట్టింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ జూలై 27న అధికారికంగా ప్రకటించారు. అబ్దుల్ కలాం క్షిపణి శాస్త్రవేత్తగా ఉన్న సమయంలో ఒడిశాలోని భద్రక్ జిల్లా ఛాంద్‌బలిలోని క్షిపణి ప్రయోగశాలను పలుమార్లు సందర్శించారు. ఆ సమయంలో బంగాళాఖాతంలోని వీలర్ దీవిని గుర్తించి..క్షిపణి ప్రయోగాలకు అనుకూలంగా ఉంటుందని సూచించారు. అనంతరం ఇక్కడ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ మిస్సైల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి క్షిపణి ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.

భూకంప తీవ్రత పరిధిలో 29 నగరాలు

దేశ రాజధాని, తొమ్మిది రాష్ట్ర రాజధానులతో సహా దేశంలోని మొత్తం 29 నగరాలు, పట్టణాలు భూకంప తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో (జోన్లు) ఉన్నాయి. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ప్రకటించింది. ఈ జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ, పాట్నా, శ్రీనగర్, కోహిమా, పుదుచ్చేరి, గువహటి, గ్యాంగ్‌టక్, సిమ్లా, డెహ్రాడూన్, ఇంఫాల్, చండీఘర్ తదితరం ఉన్నాయి. ఇవి సెస్మిక్ జోన్-4, 5లో ఉన్నాయి.

విశ్వాస పరీక్షలో నెగ్గిన నితీశ్



బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ జూలై 27న ప్రమాణస్వీకారం చేశారు. 2015లో ఆర్జేడీతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీశ్ జూలై 26న సీఎం పదవికి రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో రాజీనామా చేయించాలనే ప్రయత్నం ఫలించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతీయ జనతా పార్టీ మద్దతివ్వడంతో నితీశ్ కుమార్ తిరిగి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీలో జూన్ 28న జరిగిన విశ్వాస పరీక్షలో 131–108 ఓట్ల తేడాతో గెలుపొందారు.

కరెంట్ అఫైర్స్

క్రీడలు

పారిస్‌లో 2024 ఒలింపిక్స్



2024లో జరిగే ఒలింపిక్స్ క్రీడలకు పారిస్(ఫ్రాన్స్) ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) జూలై 31న ప్రకటించింది. అలాగే 2028లో ఈ క్రీడలకు వేదికగా లాస్ ఏంజిల్స్(అమెరికా)ను ఎంపికచేసినట్లు ఐఓసీ పేర్కొంది. గతంలో పారిస్‌లో రెండుసార్లు (1900, 1924) ఒలింపిక్స్ జరిగాయి. సరిగ్గా వందేళ్ల తర్వాత 'సిటీ ఆఫ్ లవ్' మళ్లీ ఒలింపిక్స్‌కు సిద్ధం కానుండటం విశేషం. లాస్ ఏంజిల్స్ (1932, 1984) కూడా ఇప్పటికే రెండుసార్లు ఒలింపిక్స్ నిర్వహించింది. 2020లో జపాన్ రాజధాని టోక్యోలో ఒలింపిక్స్ జరగనున్న సంగతి తెలిసిందే.

వెటెల్‌కు హంగేరీ గ్రాండ్ ప్రి టైటిల్

ఫార్ములావన్ రేసులో హంగేరీ గ్రాండ్ ప్రి టైటిల్‌ను ఫెరారీ జట్టు డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ గెలుచుకున్నాడు. బుడాపెస్ట్‌లో జూలై 30న జరిగిన రేసులో వెటెల్ మొదటి స్థానంలో నిలవగా, రైకోనెన్‌కు రెండో స్థానం లభించింది.

ఆర్థికం

వంటగ్యాస్‌పై ప్రతి నెలా రూ.4 పెంపు




సబ్సిడీపై అందించే వంట గ్యాస్(ఎల్‌పీజీ) సిలిండర్ల ధరలను ఇక నుంచి ప్రతి నెలా రూ.4 చొప్పున పెంచాలని ఆయిల్ కంపెనీలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 2018, మార్చి నాటికి ఎల్‌పీజీపై అన్ని రకాల సబ్సిడీలను తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూలై 31న లోక్‌సభలో తెలిపారు.

పన్నుల రంగంలో బ్రిక్స్ దేశాల మధ్య ఒప్పందం

పన్నుల రంగంలో సహకారం కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని బ్రిక్స్ దేశాలు జూలై 27న బీజింగ్‌లో నిర్ణయించాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్) దేశాల పన్నుల విభాగాల అధిపతుల ఐదో సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కూటమికి చెందిన తొలి విధాన పత్రం ఇదే.

అవార్డులు

రామన్ మెగసెసే అవార్డులు-2017



ఆసియా నోబెల్‌గా పిలిచే మెగసెసే అవార్డుకు 2017 సంవత్సరానికి గాను ఆరుగురు ఎంపికయ్యారు. ఈ మేరకు రామన్ మెగసెసే ఫౌండేషన్ జూలై 27న ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ప్రకటన చేసింది. ఈ అవార్డులను ఆగస్టు 31న మనీలాలో ప్రదానం చేయనున్నారు. 1957లో మరణించిన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రామన్ మెగసెసె పేరుతో ఈ అవార్డును నెలకొల్పారు.

అవార్డు గ్రహీతలు విశేషాలు

యోషియాకీ షిజావా– జపాన్‌కు చెందిన ఈయన కాంబోడియాలోని అంగ్‌కోర్‌వాట్ ఆలయం పరిరక్షణకు కృషి చేశారు; **గెథ్సీ షణ్ముగం**–శ్రీలంకలోని తమిళ కమ్యూనిటీకి చెందిన ఉపాధ్యాయురాలు; **అబ్దోన్ నబాబన్**– ఇండోనేసియాలోని సుమత్రా దీవికి చెందిన ఈయన ప్రభుత్వ ఆధీనంలోని భూమి స్థానిక సమాజాలకు దక్కేలా పోరాడారు; **టోని టే**–సింగపూర్‌కి చెందిన వ్యాపార వేత్త, వృద్ధులు, అల్పాదాయ కుటుంబాల ఆకలిని తీర్చడం కోసం వారికి ఆహార పొట్లాలను అందించేందుకు స్వచ్ఛంద కార్యకర్తలను తీర్చిదిద్దారు; **లిలియా డీ లీమా**–ఫిలిప్పీన్స్‌కు చెందిన ఈమె ఎకనమిక్ జోన్ అథారిటీ అధిపతిగా ఉపాధి కల్పనకు దేశమంతటా వందలాది ఎక్స్‌పోర్ట్ జోన్లను ఏర్పాటు చేశారు; **ఫిలిప్పీన్స్ ఎడ్యుకేషనల్ థియేటర్ అసోసియేషన్**(సంస్థ).

ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

నేను ఉద్యోగ నియామకాల పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. జాగ్రఫీ ప్రిపరేషన్‌కు సంబంధించి కొన్ని సూచనలివ్వండి.

– కాశీవిశ్వనాథ్, వరంగల్.

పోటీ పరీక్షల్లో భూగోళ శాస్త్రానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ విభాగంలో ప్రశ్నల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోంది. జాగ్రఫీ చదివేటప్పుడు తప్పనిసరిగా అట్లాస్‌ను ముందుంచుకోవాలి. పాఠ్యాంశాలను ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేస్తే ఎక్కువ అంశాలు గుర్తుంటాయి. ఎందుకంటే దీంట్లో ఒక అంశం మరొకదాంతో ముడిపడి ఉంటుంది. ఉదాహరణకు నైసర్గిక స్థితి ఆధారంగా వర్షపాతం ఉంటుంది. వర్షపాతాన్ని బట్టి అడవులు విస్తరించి ఉన్నాయి. చదివేటప్పుడు ఇదే క్రమాన్ని పాటిస్తే సులభంగా అర్థమవుతుంది. పరీక్షల్లో భారతదేశ భూగోళ శాస్త్రంపై ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు. అందువల్ల రాష్ట్రాలు – రాజధానులు, నైసర్గిక స్వరూపం, శీతోష్ణస్థితి, వర్షపాతం, అడవులు మొదలైన అంశాలపై అవగాహన ఉండటం తప్పనిసరి. దేశంలో అతి పెద్దవి, అతి చిన్నవి, రెండు, మూడు స్థానాల్లో ఉన్నవాటిని గుర్తుంచుకోవాలి.

గ్రూప్స్ పరీక్షల కోసం ఇండియన్ ఎకానమీలో భాగంగా వ్యవసాయ రంగ అంశాలకు ఎలా సిద్ధమవ్వాలి?

– బి.జోగేశ్వరరావు, ఖమ్మం.

దేశంలోని ముఖ్య పంటలు, ఆహార ఉత్పత్తుల రవాణా, నిల్వ, మార్కెటింగ్, ఈ-టెక్నాలజీ, అవరోధాలు తదితరాలకు సంబంధించిన సమకాలీన పరిణామాలను అధ్యయనం చేయాలి. పంటల తీరుతెన్నులు, నీటిపారుదల పద్ధతులు, మార్కెటింగ్ సంస్కరణలు వంటివాటిపై అవగాహన అవసరం. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని వనరులు, అభివృద్ధి పాఠ్యాంశాలను చదవడం వల్ల అనేక అంశాలపై స్పష్టత వస్తుంది. భారత వ్యవసాయ నివేదిక, ఆర్థిక సర్వేలు కూడా ఉపకరిస్తాయి.

- వ్యవసాయ ఉత్పత్తులు–మద్దతు ధరలు, రాయితీలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహారభద్రత అంశాలపై పట్టు సాధించాలి. డబ్ల్యూటీవో వాణిజ్య సదుపాయ ఒప్పందం, భారత్‌లో ఆహార భద్రతకు సంబంధించి తాజా పరిణామాలను అధ్యయనం చేయాలి. టెక్నాలజీ మిషన్లు (టెక్నాలజీ మిషన్- కాటన్, టెక్నాలజీ మిషన్- హార్టికల్చర్ తదితరాలు) ముఖ్యమైనవి.
- దేశంలో ఆహార శుద్ధి పరిశ్రమను సన్‌రైజ్ పరిశ్రమగా చెప్పొచ్చు. దీనికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నందువల్ల దానిపై దృష్టిసారించాలి. కానీ, ప్రామాణిక పుస్తకాల్లో ఆహారశుద్ధి పరిశ్రమకు సంబంధించిన సమకాలీన పరిణామాల సమాచారం లభ్యం కావడం లేదు. అందువల్ల కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలి.

భారతదేశం- రైల్వే రవాణా



దేశ ఆర్థికాభివృద్ధికి రైల్వే వ్యవస్థ అత్యంత కీలకం. మనదేశంలో పారిశ్రామికాభివృద్ధి త్వరగా జరిగేందుకు రైల్వేలే ప్రధానకారణం.

- దేశంలో రైల్వేలు మొదట సైన్యం (మిలటరీ) అవసరాల కోసం ఏర్పడ్డాయి.
- మొట్టమొదటి రైల్వేలైన్ 1853 ఏప్రిల్ 16న బాంబే(బొంబాయి) నుంచి థానే వరకు సుమారు 34 కి.మీ పొడవున ఏర్పాటు చేశారు. దీన్ని లార్డ్ డల్హౌసీ గవర్నర్ జనరల్ కాలంలో నిర్మించారు.
- రెండో రైల్వే లైన్ హౌరా, హుగ్లీ మధ్య 1854లో నిర్మించారు.
- 2016 మార్చి 31 నాటికి దేశంలో సుమారు 66,687 కి.మీ.పొడవున రైల్వే మార్గాలు, 7,216 రైల్వేస్టేషన్లతో భారతీయ రైల్వే ప్రపంచంలోనే 4వ అతిపెద్ద రైల్వే వ్యవస్థగా అభివృద్ధి చెందింది.
- ప్రపంచంలో అతిపెద్ద రైల్వే వ్యవస్థలు వరుసగా..
  1. అమెరికా 2. రష్యా
  3. చైనా 4. భారతదేశం
- మన రైల్వే వ్యవస్థ ఆసియా ఖండంలో రెండో అతిపెద్దది.
- దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో రైల్వేది ప్రథమస్థానం. ఇందులో అత్యధికంగా సుమారు 14 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశంలో 2/5 వంతు ప్రయాణికులు, 2/3 వంతు సరకుల రవాణా రైల్వేల ద్వారానే జరుగుతోంది.
- ఉత్తర భారతదేశంలో.. ప్రధానంగా గంగా నదీ మైదానంలో రైలు మార్గాలు ఎక్కువగా అభివృద్ధి చెందాయి. ఈశాన్య రాష్ట్రాల్లో రైలు మార్గాల అభివృద్ధి తక్కువ.
- దేశంలో రైలుమార్గాల పొడవు(నిడివి) ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా ఉండగా, ఆ తర్వాత స్థానాల్లో రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి.
- దేశంలో అత్యంత వేగంగా వెళ్లే రైలు 'తేజస్ సూపర్‌ఫాస్ట్'. దీన్ని ఇటీవలే రైల్వే మంత్రి సురేశ్ ప్రభు ప్రారంభించారు. ఇది ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి గోవా వరకు ప్రయాణిస్తుంది.

గేజ్‌లు-రకాలు

- పట్టాల మధ్య దూరాన్ని గేజ్ అంటారు. దేశంలో నాలుగు రకాల గేజ్‌లు ఉన్నాయి. అవి..

1. బ్రాడ్ గేజ్ – 1.676 మీ. లేదా 1,676 మి.మీ వెడల్పు.
2. మీటర్ గేజ్ – 1.00 మీ. లేదా 1,000 మి.మీ. వెడల్పు.
3. న్యారోగేజ్ – 0.762 మీ. లేదా 762 మి.మీ. వెడల్పు.
4. లైట్ న్యారోగేజ్ – 0.610 మీ. లేదా 610 మి.మీ. వెడల్పు.

- రైల్వే వ్యవస్థ ఏర్పడిన కాలంలో న్యారోగేజ్ మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఆధునికీకరణలో భాగంగా దాదాపు 79 శాతం రైల్వేలైన్లను బ్రాడ్‌గేజ్‌గా మార్చారు.
- ఇప్పటికీ కొండ ప్రాంతాల్లో న్యారోగేజ్‌ను ఉపయోగిస్తున్నారు.
- లైట్ న్యారోగేజ్‌ను పారిశ్రామిక ప్రాంతాల్లో ఉపయోగిస్తున్నారు.

రైల్వే పరికరాల తయారీ కేంద్రాలు

- రైల్వేల నిర్వహణకు అవసరమైన పట్టాలు, బోగీలు, ఇంజన్లు మొదలైన పరికరాల తయారీకి దేశవ్యాప్తంగా ఆరు ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. అవి..

1. చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్:
- ఇది పశ్చిమబెంగాల్‌లోని చిత్తరంజన్‌లో ఉంది.
- దీన్ని 1950లో స్టీమ్ ఇంజన్ల తయారీకి స్థాపించారు.
- 1972 నుంచి స్టీమ్ ఇంజన్ల తయారీని నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రిక్ ఇంజన్లు తయారుచేస్తున్నారు.

2. డీజిల్ లోకోమోటివ్ వర్క్స్:
- దీన్ని ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో స్థాపించారు.
- ఇక్కడ డీజిల్ రైల్వే ఇంజన్లు తయారుచేస్తున్నారు.

3. డీజిల్ కాంపోనెంట్ వర్క్స్:
- ఇది పంజాబ్‌లోని పాటియాలాలో ఉంది.
- డీజిల్ ఇంజన్లకు అవసరమైన పరికరాలను ఇక్కడ తయారు చేస్తారు.

4. ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ:
- దీన్ని తమిళనాడులోని చెన్నై సమీపంలోని పెరంబూర్‌లో స్థాపించారు.
- ఇక్కడ బ్రాడ్ గేజ్, మీటర్‌గేజ్ బోగీలు, ఎయిర్ కండిషన్ కోచ్‌లు తయారు చేస్తారు.

5. రైల్వేకోచ్ ఫ్యాక్టరీ:
- ఇది పంజాబ్‌లోని కపుర్తలాలో ఉంది.
- ఇక్కడ ప్రయాణికుల బోగీలు తయారుచేస్తారు.

6. వీల్ అండ్ యాక్సిల్ ప్లాంట్:
- ఇది కర్ణాటకలోని ఎలహంకలో ఉంది.
- ఇక్కడ రైలు చక్రాలు, ఇరుసులు మొదలైన రైల్వే పరికరాలు తయారు చేస్తారు.

- దేశంలో అతిపెద్ద రైల్వే జోన్ – ఉత్తర రైల్వే
- దేశంలో మొదటి రైల్వే జోన్ – దక్షిణ రైల్వే
- దేశంలో అతి పొడవైన రైల్వే ప్లాట్‌ఫాం – ఖరగ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)
- భారత రైల్వే ప్రధాన కేంద్రం – ఢిల్లీ.
- రైల్వే రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ – లక్నో(ఉత్తర ప్రదేశ్).
- రైల్వే స్టాఫ్ కాలేజ్ – వడోదరా(గుజరాత్).

కొంకణ్ రైల్వే:
- దేశంలో మొట్టమొదటిసారిగా ప్రైవేటు రంగంలో నిర్మించిన రైల్వే మార్గం.

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఈ రైలుమార్గం పొడవు 760 కి.మీ.
- 1998 జనవరి 26న కొంకణ్ రైల్వే ప్రారంభమైంది.
- ఈ రైల్వే లైన్‌ను మహారాష్ట్రలోని 'రోహ' నుంచి కర్ణాటకలోని మంగుళూరు వరకు నిర్మించారు.
- దీని నిర్వహణకు 'కొంకణ్ రైల్వే కార్పొరేషన్' ఏర్పాటు చేశారు.
- దీని ప్రధాన కేంద్రం 'నవీ ముంబై'లో ఉంది.
- ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యమైన రాష్ట్రాలు.. మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ.
- **వివేక్ ఎక్స్‌ప్రెస్:** దేశంలో అత్యంత ఎక్కువ దూరం ప్రయాణించే రైలు. ఇది అసోంలోని దిబ్రుఘర్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకు సుమారు 4,286 కి.మీ.ల దూరం ప్రయాణిస్తుంది.
- **శతాబ్ది ఎక్స్‌ప్రెస్:** దేశంలో అత్యంత వేగవంతమైన రైలు. ఇది భోపాల్ నుంచి న్యూఢిల్లీ వరకు గంటకు 150 కి.మీ.ల వేగంతో ప్రయాణిస్తుంది.
- దేశంలో సుదూర ప్రయాణం చేసే రెండో రైలు 'హిమసాగర్ ఎక్స్‌ప్రెస్'. ఇది కన్యాకుమారి నుంచి జమ్మూతావి వరకు సుమారు 3,726 కి.మీ.ల దూరం ప్రయాణిస్తుంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. డీజిల్ లోకోమోటివ్స్ తయారీ యూనిట్ ఎక్కడ ఉంది?
1) చిత్తరంజన్ 2) వారణాసి
3) భోపాల్ 4) జంషెడ్‌పూర్

2. ఎవరి కాలంలో మొదటి రైల్వే లైన్ వేశారు?
1) లార్డ్ డల్హౌసీ 2) లార్డ్ కానింగ్
3) లార్డ్ కర్జన్ 4) లార్డ్ ఛెమ్స్‌ఫర్డ్

3. దేశంలో మొట్టమొదటి రైల్వే లైన్ బొంబాయి నుంచి థానే వరకు ఎప్పుడు నిర్మించారు?
1) ఏప్రిల్ 16, 1851
2) ఏప్రిల్ 16, 1852
3) ఏప్రిల్ 16, 1853
4) ఏప్రిల్ 16, 1854

4. రైల్వే స్టాఫ్ కాలేజ్ ఎక్కడ ఉంది?
1) బెంగళూరు 2) సికింద్రాబాద్
3) వడోదరా 4) నాగపూర్

5. హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏయే ప్రాంతాల మధ్య నడుస్తుంది?
1) జమ్ముతావి– కన్యాకుమారి
2) న్యూఢిల్లీ– చెన్నై 3) ముంబై – కోల్‌కతా
4) బెంగళూరు – న్యూఢిల్లీ

6. రైల్వే ప్రయాణికుల పెట్టెలు(బోగీలు) ఎక్కడ తయారవుతాయి?
1) వారణాశి 2) చిత్తరంజన్
3) పెరంబూర్ 4) కోల్‌కతా

7. ఈశాన్య రైల్వే ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
1) కోల్‌కతా 2) గోరఖ్‌పూర్
3) న్యూజల్‌పాయ్‌గురి 4) గౌహతి

8. దేశంలోని ఏ నగరంలో విక్టోరియా టెర్మినల్, చర్చిగేట్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి?
1) కోల్‌కత 2) ముంబై 3) చెన్నై 4) ఢిల్లీ

9. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే బ్రిడ్జిని జమ్మూ కశ్మీర్‌లోని ఏ నదిపై నిర్మిస్తున్నారు?
1) జీలం 2) చీనాబ్ 3) ఇందువా 4) బియాస్

10. దేశంలో అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న రైల్వే స్టేషన్?
1) సిమ్లా, మౌంటెన్ రైల్వే
2) రత్నగిరి, కొంకణ్ రైల్వే
3) ఘూమ్, డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే
4) కూనూర్, నీలగిరి మౌంటెన్ రైల్వే

సమాధానాలు

1) 2	2) 1	3) 3	4) 3	5) 1
6) 3	7) 2	8) 2	9) 2	10) 1

ముల్కల రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ
జీవీఎస్ స్టడీ సర్కిల్



ఒకప్పుడు వినోదమంటే టీవీ, సినిమాలే. కానీ ఇప్పుడు అంతా యూట్యూబ్ మయం. సినిమాలు చూడాలన్నా.. సీరియళ్లు కావాలన్నా.. పాటలు వినాలన్నా.. అన్నీ యూట్యూబ్‌లోనే! ఒకప్పుడు సినిమా అవకాశాల కోసం సంవత్సరాల తరబడి స్టూడియోల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు హీరో, డైరెక్టర్, కమెడియన్ ఏది కావాలన్నా.. యూట్యూబ్‌ని ఆశ్రయిస్తే చాలు. మనలో విషయం ఉంటే చాలు అవకాశాలు తలుపుతడతాయి. యూట్యూబ్ ద్వారా ఇలా సినీ అవకాశాలు అందుకునే వారు కొందరైతే.. యూట్యూబ్‌ను ఆదాయ మార్గంగా మలచుకుంటున్న వారు మరికొందరు. ఈ నేపథ్యంలో యూట్యూబ్ ద్వారా ఆదాయం ఎలా ఆర్జించొచ్చో తెలుసుకుందాం..



టెక్ స్టోరీ

YouTube సరికొత్త ఆదాయ మార్గం

- లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్న యూట్యూబర్లు
- తెలుగువారూ ఎక్కువ మందే
- వంటల నుంచి టెక్నాలజీ వరకు అన్నీ యూట్యూబ్‌లోనే..

అవకాశాలతోపాటు ఆదాయం కూడా




యూట్యూబ్.. అవకాశాలే కాదు.. నేటి యువతకు ఆదాయాన్ని కూడా ఆర్జించి పెడుతోంది. ఆదాయంతోపాటు బోలెడంత గుర్తింపు కూడా వస్తుండటంతో చాలా మంది ఇప్పుడు యూట్యూబ్ బాటపడుతున్నారు. వంటలు, టెక్నాలజీ, గాసిప్స్, న్యూస్.. ఇలా అన్నిటికి సంబంధించిన సమాచారం అప్‌లోడ్ చేస్తూ పేరుతోపాటు డబ్బు కూడా సంపాదిస్తున్నారు. యూట్యూబ్ ద్వారా ఆర్జించడం విదేశాల్లో బాగా పాపులర్. కొద్దికాలంగా మన దేశంలోనూ ఈ ట్రెండ్ ప్రారంభమైంది. క్రమంగా ఇది తెలుగు నేలకు కూడా విస్తరించింది. ప్రస్తుతం తెలుగులో పలువురు యూట్యూబర్స్.. యూట్యూబ్ ద్వారానే బాగానే సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు.

గూగుల్ బోట్స్ ఉంటాయి జాగ్రత్త



ఆదాయం వచ్చేస్తుంది కదా.. అని బాగా పాపులర్ అయిన వీడియోలు ,లేదా ఆన్‌లైన్‌లో వీడియో కొట్టేసి అప్‌లోడ్ చేసేద్దాం అనుకునే వారు కూడా ఉంటారు. వారికి చెక్ పెట్టడానికే గూగుల్ బోట్స్ నిత్యం తిరుగుతూ ఉంటాయి. ఇలాంటి వీడియోలను, వీడియోలు పెట్టే చానెల్స్‌ను ఆ బోట్స్ వెంటనే డిలీట్ చేసేస్తాయి. ఒకవేళ మనది కాపీ కంటెంట్ కాదు అనుకుంటే.. మనం యూట్యూబ్ వారిని సంప్రదించవచ్చు. అప్పుడు ఆ చానెల్‌ని పరిశీలించి సంతృప్తి చెందితే వారం నుంచి పది రోజుల్లో వీడియో లేదా చానెల్ మనకు తిరిగి వస్తుంది.

యూట్యూబ్‌లో ఆదాయం ఎలా?



యూట్యూబ్‌లో ప్రధానంగా వ్యూస్‌ని బట్టే ఆదాయం వస్తుంది. ఆ వీడియోని చూసే దేశాలు, సదరు వీడియోని చూసేటప్పుడు వచ్చే ప్రకటనల మీద కూడా ఆదాయం ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాల్లోని వారు చూసే వ్యూస్‌కి కాస్త ఎక్కువ ఆదాయం ఉంటుంది. ఎందుకంటే.. వారు యాడ్స్‌పై ఎక్కువ ఖర్చు పెడతారు. మన దగ్గర యాడ్స్‌పై పెద్దగా ఖర్చు పెట్టరు. ఒక వీడియోని వీక్షకులు ఏ సమయంలో చూస్తున్నారనేది కూడా ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. చానెల్ పెట్టిన మొదట్లోనే మనం యూట్యూబ్ నుంచి ఆదాయం ఆశించలేం. విజయం సాధించాలంటే కాస్త ఓపిక పట్టాలి. చానెల్‌కు సబ్‌స్క్రైబర్లు పెరిగేకొద్దీ కొంతమంది మన వీడియోలకు స్పాన్సర్ చేస్తూ ఉంటారు. ఇలా కూడా మనకు ఆదాయం వస్తూ ఉంటుంది. చానెల్స్ ఎక్కువైపోవడం, డూప్లికేట్ కంటెంట్ పెరిగిపోతుండడంవల్ల ఇటీవలి కాలంలో చానెల్ నిర్వాహకులకు ఆదాయం తగ్గుతోంది. అందుకే దీన్ని ఫుల్‌టైమ్ కెరీర్‌గా తీసుకోవద్దని చాలామంది యూట్యూబర్లు సలహా ఇస్తున్నారు. కాబట్టి యూట్యూబ్‌ని పూర్తిస్థాయి ఆదాయ మార్గంగా భావించకుండా.. పార్ట్‌టైమ్ జాబ్‌లా పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు.


130 కోట్లు ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ చూసేవారు

300 గంటలు ఒక నిమిషానికి అప్‌లోడ్ అయ్యే వీడియోల నిడివి

500 కోట్లు 1 రోజుకు చూసే వీడియోలు

76 యూట్యూబ్ సపోర్ట్ చేసే భాషలు

యూట్యూబ్ చూసేవారు వయసు ఆధారంగా



80 శాతం వినియోగదారుల్లో 18-49 సంవత్సరాల మధ్య వారు

10,113 1 బిలియన్ (వంద కోట్లు) వ్యూస్ సాధించిన వీడియోల సంఖ్య

20 శాతం - వీడియో చూడటం ప్రారంభించిన పది సెకన్లలోనే క్లోజ్ చేసే వారు

77.35 కోట్లు - యూట్యూబ్ చానెల్ ద్వారా ఏడాదిలో ఒక వ్యక్తి సంపాదించిన అధిక మొత్తం (2015లో PewDiePie చానెల్)

తెలుగులో పేరు పొందిన కొన్ని యూట్యూబ్ చానెల్స్

విక్రమాదిత్య

సబ్‌స్క్రైబర్లు: 4.5 లక్షలు
చానెల్‌కు వచ్చిన మొత్తం వ్యూస్: 37 మిలియన్లు
ఇప్పటి వరకు అప్‌లోడ్ చేసిన వీడియోలు: 69

విక్రమాదిత్య.. మిస్టరీస్, ఫ్యాక్ట్స్ గురించి చెప్పే తెలుగు చానెల్. విక్రమాదిత్య అనే అతను తన పేరు మీదనే ఈ చానెల్ నడుపుతున్నారు. ఈయనది తూర్పు గోదావరి జిల్లా తామరాడ. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఎస్‌బీఐలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. యూట్యూబ్ గురించి ఆయన కొన్ని విషయాలు తెలియజేశారు.



'2015 సెప్టెంబర్‌లో నేను నా మొదటి వీడియో అప్‌లోడ్ చేశాను. మంచి జాబ్‌లో ఉన్నా కూడా జీవితం నాకు యాంత్రికంగా అనిపించేది. ఏదన్నా కొత్తగా చేయాలి అనిపించేది. ఫ్యాక్ట్స్, మిస్టరీస్‌లో మొత్తం ఇండియాలో మొదటి యూట్యూబ్ చానెల్ నాదే. రోజుకు 4 గంటలు నేను యూట్యూబ్‌కి కేటాయిస్తాను. అనంత పద్మనాభస్వామి మీద నేను చేసిన వీడియో చాలా పాపులర్ అయింది. నాకు డబ్బులు విషయం కాదు. ఒకవేళ యూట్యూబ్ మీద వచ్చే ఆదాయం ఆగిపోయినా నేను చానెల్‌లో వీడియోస్ పెట్టడం ఆపను. నేను పెట్టే ప్రతి వీడియోలో సమాజానికి ఏదో ఒక మెసేజ్ ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. యూట్యూబ్‌లో ఆదాయం తగ్గుతుందని నాకు ముందే తెలుసు. భవిష్యత్తులో పెరుగుతుందనే నమ్మకం ఉంది.'

వీట్యూబ్

సబ్‌స్క్రైబర్లు: 4.7 లక్షలు
ఇప్పటి వరకు అప్‌లోడ్ చేసిన వీడియోలు: 1,418
చానెల్‌కు వచ్చిన మొత్తం వ్యూస్: 99 మిలియన్లు

ఈ చానెల్‌ను ప్రారంభించింది వరంగల్‌కు చెందిన కొయ్యాడ రాజు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. డిగ్రీ చేసి మల్టీమీడియా నేర్చుకుని ఉద్యోగం కూడా చేశారు. ఇందులో పాటలు, న్యూస్, గాసిప్స్, హెల్త్ టిప్స్‌కి సంబంధించిన వీడియోలు ఉంటాయి. 'యూట్యూబ్ చానెల్ మొదలు పెట్టాలని రెండు సంవత్సరాల నుంచి అనుకున్నప్పటికీ ఉద్యోగరీత్యా ప్రారంభించలేకపోయాను. ఉద్యోగం మానేశాక, రెండో ఉద్యోగంలో చేరే మధ్యలో రెండు నెలల గ్యాప్ వచ్చింది. ఆ గ్యాప్‌లో 'అన్‌నోన్ ఫ్యాక్ట్స్ తెలుగు' అనే చానెల్ స్టార్ట్ చేశాను. రెండు నెలలకే ఆదాయం రావడంతో మరో స్నేహితుడి సాయంతో వీట్యూబ్ చానెల్‌ని అక్టోబర్‌లో ప్రారంభించాను. ఈ జనవరిలో ఆదాయం సరిగ్గా రాకపోవడంతో కాస్త నిరాశపడి అన్‌నోన్ ఫ్యాక్ట్స్ ఆపేశాను. నెల క్రితం మళ్లీ ప్రారంభించాను. గతేడాది నవంబర్‌లో అన్‌నోన్ ఫ్యాక్ట్స్‌లో పెట్టిన 'పద్మవ్యూహం-అసలైన నిజాలు' వీడియో బాగా పాపులర్ అయింది. సబ్‌స్క్రైబర్స్ పెరిగారు. వీట్యూబ్‌లో ముగ్గురు సిబ్బందిని పెట్టుకుని నడిపిస్తున్నాం. ప్రస్తుతం ఉద్యోగం చేయడం లేదు. ఇంతకు ముందుతో పోలిస్తే ఆదాయం కొంచెం తగ్గినా మన ద్వారా కొందరికి ఉపాధి కలుగుతుందనే ఉద్దేశంతో చానెల్‌ని ఆపలేదు. యూట్యూబ్ మీద వచ్చే ఆదాయం ఆగిపోతే మరో వ్యాపారంలోకి వెళ్లాలనుకుంటున్నాను. వెబ్ సిరీస్‌లు ప్రారంభించే ఆలోచన కూడా ఉంది.'



తెలుగు టెక్ ట్యూట్స్

సబ్‌స్క్రైబర్లు: 4.1 లక్షలు
ఇప్పటి వరకు అప్‌లోడ్ చేసిన వీడియోలు:1,995
చానెల్‌కు వచ్చిన మొత్తం వ్యూస్: 38 మిలియన్లు

తెలుగులో ఉన్న కొన్ని టెక్నాలజీ చానెల్స్‌లో ఈ చానెల్ కూడా ఒకటి. తెలంగాణలోని గోదావరిఖనికి చెందిన సయ్యద్ హఫీజ్ ఈ చానెల్‌ను ప్రారంభించారు. ఇతను కరీంనగర్‌లో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు ఈ చానెల్‌ను కూడా నడుపుతున్నారు. ఈ చానెల్ గురించి అతన్ని సంప్రదించినప్పుడు ఆయన చాలా విషయాలు పంచుకున్నారు.



'చానెల్‌లో మొదటి వీడియో అప్‌లోడ్ చేసింది 2014లోనే అయినా మూడు నెలల నుంచి ఫుల్‌టైంగా చేస్తున్నా. నాకు తెలిసింది అందరికీ చెప్పడాన్ని నేను ఇష్టపడతాను. చానెల్ నడిపేది ఒక్కడినే. నాకు ఇక్కడ ఒక కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. 2014 నుంచి వీడియోలు అప్‌లోడ్ చేయడం ప్రారంభించాను. ఆరు నెలల క్రితం చేసిన 'సీక్రెట్ సెట్టింగ్స్ ఇన్ మొబైల్' అనే వీడియో నుంచి చానెల్ బాగా పాపులర్ అయింది. అప్పటి నుంచి చానెల్ మీద దృష్టి పెట్టాను. రోజుకి ఆరు గంటలు నేను వీడియోల మీద దృష్టి పెడతాను. ఈ సమయంలో 3,4 వీడియోలు చేయగలను. ఏప్రిల్ తర్వాత ఆదాయం ఒక్కసారిగా చాలా తగ్గిపోయింది. అప్పుడు కూడా నేను ఏనాడూ చానెల్‌ను వదల్లేదు. ఇప్పుడు తగ్గినా భవిష్యత్తులో కచ్చితంగా యూట్యూబ్ మీద వచ్చే ఆదాయం పెరుగుతుంది. చాలా మంది యాప్ డెవలపర్స్ కూడా నా ద్వారా వారి యాప్స్‌ను ప్రచారం చేసుకుంటారు. దానికి సంబంధించిన ఆదాయం కూడా నాకు వస్తుంది.'

ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉంటే కేసులు పెట్టొచ్చు

యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలు వ్యక్తి ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉంటే.. అప్‌లోడ్ చేసిన వ్యక్తిపై పరువు నష్టం కేసు దాఖలు చేయొచ్చు. కేసు పెట్టే వ్యక్తి కచ్చితమైన సాక్ష్యాధారాలను చూపితే ఐపీసీ.. వీడియోలు లేదా వ్యాఖ్యలు హింసకు దారితీసేలా ఉంటే సీఆర్‌పీసీ కింద కేసులు వేయొచ్చు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకూ పరిమితులు ఉంటాయి. అది ఎదుటి వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వారిని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టే విధంగా ఉంటే న్యాయ పోరాటం సాగించొచ్చు. ఇలాంటి సందర్భాల్లో వ్యక్తులనే కాకుండా.. అలాంటి వీడియోస్ అప్‌లోడ్ చేసేందుకు ప్లాట్‌ఫామ్‌గా ఉన్న సంస్థను సైతం బాధ్యులను చేస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించొచ్చు.

-ప్రొఫెసర్. వి.బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్, నల్సార్, హైదరాబాద్

భావ ప్రకటనా స్వేచ్ఛకు లోబడే


యూట్యూబ్ కూడా పబ్లికేషన్ కిందకే వస్తుంది. ప్రింట్ మీడియాకు వర్తించే చట్టపరమైన నిబంధనలే దీనికీ వర్తిస్తాయి. వ్యక్తిగతంగా కించపరిచే విధంగా, ఏకాంతానికి భంగం వాటిల్లేలా వీడియోలు రూపొందిస్తే పరువు నష్టం చట్టం కింద శిక్షార్హులే. ఆక్షేపణీయమైన వీడియోలు అప్‌లోడ్ చేస్తే .. అభ్యంతరం తెలుపుతూ రిపోర్టింగ్ చానల్ ద్వారా వీడియో పెట్టిన వ్యక్తిని, యూట్యూబ్ వారిని తొలగించవలసిందిగా కోరవచ్చు. అప్పటికీ తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయించవచ్చు. సోషల్ మీడియాకు సంబంధించిన ప్రత్యేకమైన చట్టాలు ఏమీ లేకున్నా .. వీడియోలోని సమాచారం భావ ప్రకటనా స్వేచ్ఛకు లోబడే ఉండాలి. ఇతరుల వీడియోలను దొంగిలించి అప్‌లోడ్ చేసినవారిపై కాపీ రైట్ చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

-ఎస్.శ్రీరామ్, అడ్వకేట్

గూగుల్ యాజమాన్యం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసే వీడియోలపై నిబంధనలను రూపొందించింది. అవే యూట్యూబ్ కమ్యూనిటీ గైడ్‌లైన్స్. దాని ప్రకారం ఉంచకూడని వీడియోలు ఇవే...

యూట్యూబ్ కమ్యూనిటీ గైడ్‌లైన్స్

- నగ్న లేదా అశ్లీల వీడియోలు (డాక్యుమెంటరీలకు అనుమతి ఉంటుంది)
- హింసాత్మక వీడియోలు(ఒక పరిమితి వరకు అనుమతి ఉంటుంది), ఒక వ్యక్తి లేదా వర్గం మనోభావాలను దెబ్బతీసే వీడియోలు
- ఏదైనా ప్రదేశం, మతం, అంగవైకల్యం, లింగ పరమైన, వయో పరమైన, జాతి పరమైన, జాతీయ భావాలను కించపరిచే వీడియోలు.
- వ్యాపార ప్రకటనల కోసం ఎక్కువ మందికి అవసరం లేని (స్పామ్), తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టించే వీడియోలు, వ్యూస్ పెంచుకోవడం కోసం తప్పుదోవ పట్టించే సమాచారం, తప్పుడు థంబ్ నెయిల్స్ (వీడియో క్లిక్ చేసే ముందు దానిపై కనిపించే చిత్రం) ఉంచకూడదు.
- హింసనుప్రేరేపించే వీడియోలు, ప్రధానంగా చిన్నపిల్లలపై ప్రభావం చూపించే వీడియోలు.(ఇటువంటి వీడియోలకు పరిమితిని బట్టి వయోపరిమితి విధించడమో, లేదా పూర్తిగా తొలగించడమో చేస్తారు)
- ఇతరులను వేధించడం, భయాందోళనలకు గురిచేయడం, ఇతరుల వ్యక్తిగత సమాచారాన్ని తెలియజేసేలా ఉండటం, ఇతరులను హింసకు ప్రేరేపించడం వంటి వీడియోలు (యూట్యూబ్ దీన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తుంది. వారిని యూట్యూబ్ నుంచి బహిష్కరించే ఆస్కారం కూడా ఉంది)



అంతేకాకుండా యూట్యూబ్‌లో మనకు సొంతమైన, మనం తయారు చేసిన వీడియోలు మాత్రమే అప్‌లోడ్ చేయాలి. ఇతరులకు సంబంధించిన సంగీతం, ఇతరులు తయారు చేసిన వీడియోలు వంటి వాటిని అప్‌లోడ్ చేయకూడదు. దీనివల్ల కాపీరైట్ సమస్యలు తలెత్తుతాయి.-

- ఏలేటి సాకేత్ రెడ్డి, సాక్షి

సీటుంది.. రండి.. చేరండి

ఇంజనీరింగ్ స్పెషల్

పేరు ప్రఖ్యాతులకు కొదవలేదు..! వసతుల పరంగా వంక పెట్టలేం..! బోధనలోనూ భేష్..! అయినా ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్లలోనే ఇంజనీరింగ్ సీట్లు మిగిలిపోతున్నాయి.

- **ఐఐటీల్లో యాక్సెప్టెన్సీకి నోచుకోనివి 121..**
- **ఎన్‌ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐల్లో మిగిలిపోనున్నవి వెయ్యిపైనే..**

దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొనసాగుతోన్న టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ (జీఎఫ్‌టీఐ)లలో ఈసారి మొత్తం 1,279 సీట్లు భర్తీ కాలేదు. ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఏడో విడతగా ప్రత్యేకంగా చేపట్టిన యాక్సెప్టెన్సీ రౌండ్ తర్వాత కూడా 121 సీటల్లో ఎవరూ చేరలేదు. వాస్తవానికి ఐఐటీల్లో ప్రవేశానికి ఉండే ఆరు రౌండ్లు పూర్తయ్యే సరికి 468 సీట్లు భర్తీ కాలేదు. మరో రౌండ్ నిర్వహించగా 347 మంది చేరారు. ఐఐటీల్లో గతేడాది 96 సీట్లు మిగిలిపోగా.. ఈసారి ఆ సంఖ్య 121కి చేరడం గమనార్హం. అలాగే జోసాను ఏడు రౌండ్లు నిర్వహించినా.. ఈ సంవత్సరం ఎన్‌ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐల్లో మొత్తం 1158 సీట్లు మిగిలిపోవడం గమనార్హం.

పేరుగాంచిన ఈ విద్యా సంస్థల్లో సీట్ల భర్తీని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) ద్వారా చేపడతారు. గతేడాది జోసా కౌన్సెలింగ్ ప్రక్రియను ఆరు రౌండ్లలో నిర్వహించారు. సీట్లు మిగిలిపోతుండటంతో ఈసారి అదనపు విడత జోడించాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) నిర్ణయించింది. అయినా ఐఐటీల్లో వందకు పైగా ఖాళీలుండిపోయాయి.

జోసా ద్వారా భర్తీ ఇలా..

సంస్థ పేరు	కాలేజీలు	సీట్లు
ఐఐటీ	23	10,988
ఎన్‌ఐటీ	31	17,868
ఐఐఐటీ	23	3,433
జీఎఫ్‌టీ	20	3,919
మొత్తం		**36,208**

గతేడాది ఇలా..

విద్యా సంస్థ	మిగిలినవి
ఐఐటీలు	96
ఎన్‌ఐటీలు	1518
ఐఐఐటీలు	407
జీఎఫ్‌టీఐలు	1174
మొత్తం	**3195**

ఐఐటీల్లో ఇదీ పరిస్థితి

సంవత్సరం	భర్తీకానివి
2014-15	03
2015-16	50
2016-17	96
2017-18	121

కారణాలేంటి?

- 'ఎన్‌ఐటీలు, ఐఐఐటీలు పేరుగాంచినవే. కానీ దూరంగా ఉన్న వాటిల్లో కంటే స్థానికంగా ఉన్న రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయ కళాశాలల్లో చేరడం ఉత్తమం' అనేది విద్యార్థుల భావన. 'జీఎఫ్‌టీఐల కంటే మౌలిక వసతులు, బోధనా సిబ్బంది, ప్లేస్‌మెంట్స్ పరంగా స్థానిక విద్యా సంస్థలే మేలు' ఇదీ తల్లిదండ్రుల అభిప్రాయం.
- కొందరు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించినా.. ఇంజనీరింగ్ కంటే వ్యక్తిగత అభిరుచి ఉన్న ఇతర కోర్సుల వైపే మొగ్గు చూపుతున్నారని ప్రొఫెసర్లు అభిప్రాయపడుతున్నారు. తల్లిదండ్రుల ఒత్తిడితోనే ఐఐటీ ప్రవేశపరీక్షలు రాస్తున్నట్లు పేర్కొంటున్నారు.
- ఎన్‌ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్‌ఐటీల్లో విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కానీ వాటిలో చేరితే కెరీర్ ప్రశ్నార్థకం అవుతుందని.. ఆశించిన ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు లభించవనే కారణంతో చేరడానికి విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారు.
- ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సిరామిక్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, బయో కెమికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, ఫిజిక్స్, మైనింగ్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు విద్యార్థులను ఆకట్టుకోలేకపోతున్నాయి. జాబ్ మార్కెట్ అవకాశాలు కూడా ఇందుకు ఒక కారణం.
- సీట్లు మిగిలిపోతున్న కోర్సులను రద్దు చేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్లు భావిస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం కోర్సును పూర్తిగా రద్దు చేసేకంటే సీట్ల సంఖ్యనే తగ్గించుకోమని సూచిస్తున్నట్లు తెలుస్తుంది.
- మరికొందరు విద్యార్థులు కళాశాల కంటే బ్రాంచికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉదాహరణకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు పొందిన విద్యార్థి ఐఐటీలో సీఎస్‌లో చేరాలనుకున్నాడు. కాని ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో అవకాశం వచ్చింది. ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ కంటే.. ఎన్‌ఐటీలో సీఎస్ బ్రాంచిలో చేరడం మేలని ఆ విద్యార్థి భావిస్తున్నాడు.
- 50 శాతం రాష్ట్ర కోటా... ఎన్‌ఐటీలు, ఐఐఐటీల్లో సీట్లు మిగిలిపోవడానికి ముఖ్య కారణం. ఎన్‌ఐటీల్లో స్థానిక ప్రాంత విద్యార్థులకు 50 శాతం కేటాయింపు ఉంటుంది. దీంతో జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లోని ఇన్‌స్టిట్యూట్లలో ఎక్కువ సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వీటిలో ప్రవేశానికి ఉన్న నిబంధనలను ఎంహెచ్‌ఆర్‌డీ తాజాగా సడలించింది.



సాక్షి బిజినెస్

గురువారం 3-8-2017

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
98 ▼	33 ▼
32,477	10,081

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... W W చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11.30కి)

నాస్‌డాక్	6,355	▽	7
డోజోన్స్	22,003	△	39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,411	▽	12
డాక్స్	12,181	▽	70
షాంఘై	3,286	▽	7
నికాయ్	20,080	△	94

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.30	64.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	83.24	86.10
€	యూరో	ఎస్‌బీఐ	74.38	77.00
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.01	59.02
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.01	51.98
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.37	47.96
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.52	18.39
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.88	18.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	[illegible]	10.94

ఈఎంఐ ఈజీ!



తగ్గనున్న గృహ, ఆటో, కార్పొరేట్ ఈఎంఐల భారం

రెపో రేటు పావు శాతం తగ్గించిన రిజర్వు బ్యాంకు

- 6 శాతానికి దిగివచ్చిన ఆర్‌బీఐ 'బ్యాంకింగ్' రుణ రేటు
- ఇది ఆరేళ్ల కనిష్ఠం ; రివర్స్ రెపో కూడా 0.25 శాతం తగ్గింపు
- 10 నెలల విరామం తరువాత ఆర్‌బీఐ కీలక ప్రకటన
- ద్రవ్యోల్బణం భయాలు తగ్గడంతో తాజా నిర్ణయం
- వృద్ధి రేటు అంచనా 7.3 శాతం వద్దే యథాతథం

ముంబై: మెజారిటీ విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై తీసుకునే వడ్డీ రేటు రెపోను... పావుశాతం తగ్గించింది. దీనితో ఈ రేటు 6 శాతానికి దిగివచ్చింది. ఇది ఆరేళ్లకు పైగా కనిష్ట స్థాయి. అదే విధంగా బ్యాంకులు తమ వద్ద స్వల్పకాలికంగా ఉంచే అదనపు నిధులకు సంబంధించి చెల్లించే రేటు– రివర్స్ రెపోను కూడా పావు శాతం తగ్గించింది. దీనితో ఈ రేటు 5.75 శాతానికి తగ్గింది. అయితే తమకు రెపో తగ్గింపు ద్వారా లభిస్తున్న ప్రయోజనాన్ని బ్యాంకులు కస్టమర్లకు బదలాయించాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. తాజా నిర్ణయం వల్ల గృహ, ఆటో, కార్పొరేట్ల నెలవారీ రుణ పునః చెల్లింపుల (ఈఎంఐ) భారం కొంత తగ్గుతుంది. దాదాపు పది నెలల నుంచీ ద్రవ్యోల్బణం పెరుగుదల భయాలతో రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తూ వచ్చిన ఆర్‌బీఐ, ప్రస్తుతం ఈ భయాలు తగ్గడంతో రెపో రేటు పావుశాతం తగ్గించినట్లుగా వివరించింది. వృద్ధికి ఇది భరోసా కల్పిస్తున్న అంశంగా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు అంచనాలను యథాతథంగా 7.3 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తప్పనిసరిగా ఉంచాల్సిన మొత్తం– 4 శాతం నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)లో ఎటువంటి మార్పు లేదు. అయితే మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్), బ్యాంక్ రేటు కూడా 6.25 శాతానికి దిగివచ్చాయి. గతేడాది అక్టోబర్‌లో ఆర్‌బీఐ గవర్నర్‌గా పటేల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భేటీలో పావు శాతం రెపో రేటు కోత నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఎంపీసీ మెజారిటీ నిర్ణయం ఆధారంగా పాలసీ చర్యలు కూడా అదే భేటీలో మొదలు కావడం గమనార్హం.

మెజారిటీనే... ఏకాభిప్రాయం కాదు...

ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీలో నలుగురు సభ్యులు పావుశాతం తగ్గింపునకు ఓటు చేయగా, ఒకరు అరశాతం కోతకు సిఫారసు చేశారు. అయితే మరొకరు యథాతథ పరిస్థితికి ఓటు చేశారు. పావుశాతం కోతకు మొగ్గు చూపిన వారిలో ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్, డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, ఛేతన్ ఘాటే, పామీ దువాలు ఉన్నారు. మరో సభ్యుడు రవీంద్ర హెచ్ దోలాకియా అరశాతం రేటు కోతకు సిఫారసు చేశారు. కాగా ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ దేబబ్రత పాత్ర యథాతథ పరిస్థితిని కొనసాగించడానికి తాను సానుకూలమని తెలిపారు.

ఎంసీఎల్‌ఆర్ విధాన మార్పు సంకేతం

బ్యాంకింగ్ రుణ మంజూరు రేటు నిర్ణయానికి సంబంధించి ప్రస్తుతం అనుసరిస్తున్న మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్) విధాన పనితీరు పట్ల పూర్తి సంతృప్తి లేదని ఆర్‌బీఐ పేర్కొంది. దీనికి మార్కెట్ అనుసంధాన బెంచ్ మార్క్ ప్రాతిపదికగా ఉంచే విధంగా ఒక అధ్యయనం జరుగుతున్నట్లు సూచించింది. ఈ మేరకు ఏర్పాటయిన గ్రూప్ సెప్టెంబర్ 24న తన నివేదికను అందించనున్నట్లు తెలిపింది. తన తాజా నిధుల సమీకరణ వ్యయాలపై చెల్లిస్తున్న వడ్డీ ప్రాతిపదికన బ్యాంకింగ్ ఎంసీఎల్‌ఆర్ రేటును ఓవర్‌నైట్, నెల, మూడు నెలలు, ఆరు నెలలు, వార్షిక కాలాల ప్రాతిపదికన సవరిస్తోంది. ప్రస్తుతం నెలవారీగా ఈ సమీక్ష జరుగుతోంది. దీనివల్ల ఆర్‌బీఐ రెపో రేటు ప్రయోజనం కొంత త్వరితగతిన కస్టమర్‌కు అందుతోందన్న అభిప్రాయమూ నెలకొంది. అయితే ఇప్పటికీ ఈ ప్రయోజనం అందించే విషయంలో ఇంకా వెనుకడుగులోనే ఉన్నట్లు ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ప్లస్ 2 లేదా మైనస్ 2 శ్రేణితో 4 శాతం వద్ద ద్రవ్యోల్బణం లక్ష్యాలను కొనసాగించడంపై దృష్టి. పే కమిషన్ సిఫారసుల అమలు, వస్తు, సేవల పన్ను అనంతరం ధరల సర్దుబాట్ల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో ద్రవ్యోల్బణంపై మరింత అప్రమత్తత.
- ప్రైవేటు రంగంలో పెట్టుబడులకు భారీ ఊతం లభించాల్సిన అవసరం ఉంది. మౌలిక రంగానికి ఉన్న అడ్డంకులు అన్నీ తొలగిపోవాలి.
- గృహ నిర్మాణానికి సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అమలు మరింత ముమ్మరం కావాలి.
- 2017 జూలై 28కి భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు 392.9 బిలియన్ డాలర్లకు చేరాయి.
- మొండిబకాయిల (ఎన్‌పీఏ)ల సమస్య పరిష్కారం, ప్రభుత్వ రంగ బ్యాంకులకు తాజా మూలధనం కేటాయింపులపై కేంద్రం– ఆర్‌బీఐ కలిసి పనిచేస్తాయి.
- అటు కార్పొరేట్, ఇటు బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్లపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఇది కొత్త పెట్టుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలు కనిపిస్తున్నాయి.
- ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు రూ.5,000 కోట్ల ప్రత్యేక ఐఆర్‌ఎఫ్ (ఇంట్రస్ట్ రేట్ ఫ్యూచర్) పెట్టుబడుల విండో.
- ఆర్‌బీఐ తదుపరి పరపతి విధాన సమీక్ష ఏడాది అక్టోబర్ 3, 4 తేదీల్లో (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాల్గవ ద్వైమాసిక సమావేశం) జరుగుతుంది.

తగిన నిర్ణయమే.. ఇంకా తగ్గిస్తే బాగుండేది!

తాజా ఆర్‌బీఐ నిర్ణయం పట్ల బ్యాంకింగ్, పారిశ్రామిక, రియల్టీ తదితర వర్గాల నుంచి మొత్తంమీద హర్షం వ్యక్తమైనా, కొంచెం భిన్నత్వం ధ్వనించింది. రుణ వృద్ధికి, ఇన్వెస్టర్ సెంటిమెంట్ మెరుగుపడటానికి, వృద్ధి బలోపేతానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని బ్యాంకింగ్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే అరశాతం రేటు కోత అవసరమని పారిశ్రామిక వర్గాలు విజ్ఞప్తి చేశాయి. ఆయా వర్గాల స్పందనలను పరిశీలిస్తే...

మార్కెట్ సెంటిమెంట్ బలోపేతం



తాజా నిర్ణయం మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేస్తుంది. ముఖ్యంగా రుణ వృద్ధి ఊపందుకోడానికి, డిమాండ్ మెరుగుకు తాజా నిర్ణయం దోహదపడుతుందని భావిస్తున్నాం.

– అరుంధతీ భట్టాచార్య, ఎస్‌బీఐ చైర్మన్

సరైన నిర్ణయం ఇది...



ఆర్‌బీఐ తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంది. గణాంకాలకు అనుగుణంగా తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌లో పెట్టుబడుల పట్ల గ్లోబల్ ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుంది.

– చందా కొచ్చర్, ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్

ఆర్థిక వ్యవస్థకు సానుకూలం



ఆర్థిక వ్యవస్థకు తాజా ఆర్‌బీఐ నిర్ణయం సానుకూలమైనదని నేను భావిస్తున్నాను. ఎంపీసీ తగిన మంచి నిర్ణయం తీసుకుందని విశ్వసిస్తున్నాను. వృద్ధికి ఈ నిర్ణయం ఊతం ఇస్తుంది.

– దీపక్ పరేఖ్, హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్

వృద్ధి దిశలో కీలక అడుగు



ఆర్‌బీఐ తాజా నిర్ణయం వృద్ధి దిశలో కీలక అడుగు. ద్రవ్యోల్బణంపై భయాలను సైతం అధిగమించేలా తాజా నిర్ణయం ఉంది. పెట్టుబడుల సెంటిమెంట్‌కు ఊతం లభిస్తుంది.

– సుభాశ్ చంద్ర గార్గ్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి

అరశాతం రేటు కోత అవసరం: పరిశ్రమలు

తాజా నిర్ణయం హర్షణీయమైనదే అయినప్పటికీ, ప్రస్తుతం వ్యవస్థలో పెట్టుబడుల పెంపునకు భారీగా అరశాతం రేటు కోత అవసరమని పారిశ్రామిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒకపక్క ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, మరొకపక్క పెట్టుబడుల నత్తనడక నేపథ్యంలో, వృద్ధికి పునరుత్తేజం ఇవ్వడానికి ఆర్‌బీఐ నిర్ణయం దోహదపడుతుందని సీఐఐ ఒక ప్రకటనలో పేర్కొంది. అరశాతం కోత మరింత ప్రయోజనం చేకూర్చుతుందనీ విశ్లేషించింది. ఫిక్కీ కూడా ఇదే అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ సెంటిమెంట్ ప్రస్తుతం అత్యంత బలహీనంగా ఉందని తెలిపింది. పావు శాతం కోత కార్పొరేట్ల రుణ భారాన్ని పెద్దగా తగ్గించబోదని అసోచామ్ పేర్కొంది. కొంత సెంటిమెంట్‌ను మాత్రం తాజా నిర్ణయం బలపరుస్తుందని భావిస్తోంది. రేటు కోత చాలా స్వల్పమని జేకే పేపర్ వైస్ చైర్మన్, ఎండీ హర్ష్ పతి సింఘానియా పేర్కొన్నారు.

హౌసింగ్ అమ్మకాలకు బూస్ట్...

'పండుగల సీజన్‌లో గృహ విక్రయాలకు తాజా ఆర్‌బీఐ నిర్ణయం ఉత్తేజాన్ని ఇస్తుంది. అయితే ఆర్‌బీఐ నుంచి అందిన రేటు ప్రయోజనాన్ని కస్టమర్‌కు అందించడంపై బ్యాంకులు శ్రద్ధ వహించాలి' అని క్రెడాయ్ ప్రెసిడెంట్ జక్షయ్ షా చెప్పారు.

ఆర్‌బీఐ పాలసీ రేట్ల తీరు...



ఎన్‌పీఏల కట్టడికి క్రెడిట్ రిజిస్ట్రీ!

రాష్ట్రాల వ్యవసాయ రుణ మాఫీ విధానం ద్రవ్య క్రమశిక్షణ కట్టు తప్పడానికి దారితీసే వీలుంది. ప్రభుత్వ వృద్ధి వ్యయాలపై ప్రభావం చూపే అవకాశమూ ఉంది. ఇక తాజా ఆర్థిక క్రియాశీల పరిస్థితిని గమనిస్తే, వ్యవసాయ రంగం సానుకూలంగా ఉంది. పరిశ్రమ, సేవల రంగాల్లో మాత్రం బలహీన వృద్ధి ధోరణులు కనబడుతున్నాయి. కార్పొరేట్ రంగంలో రుణ ఒత్తిళ్లు ఇందుకు కారణం. ఈ పరిస్థితుల్లో పెట్టుబడులకు మరింత డిమాండ్ పెరగాల్సి ఉంది. తాజా గణాంకాల ప్రకారం– రెపో రేటు పావుశాతం తగ్గింపునకు వీలుంది. అలాగే రెపో రేటు కోత ద్వారా అందుతున్న ప్రయోజనాన్ని బ్యాంకింగ్ కస్టమర్‌కు మరింతగా అందించే వీలుంది. గృహ, ఆటో రంగాలే కాకుండా మరికొన్ని రంగాలకూ రెపో తగ్గింపు ప్రయోజనం అందాలి. రుణాల అందుబాటు, మొండిబకాయిల పరిస్థితిపై తగిన పర్యవేక్షణ కోసం పబ్లిక్ క్రెడిట్ రిజిస్ట్రీని నెలకొల్పనున్నాం. దీన్ని రూపొందించేందుకు వీలుగా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ చర్యలు... రుణ నాణ్యత మెరుగుపడేందుకు దోహదం చేస్తాయి. తాజా రేటు కోత ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్‌ను పెంచుతుందని భావిస్తున్నాం. ఇది తిరిగి ఉత్పత్తి వృద్ధికి, తద్వారా కంపెనీల బ్యాలెన్స్‌షీట్ల మెరుగుదలకు దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఇక డిమాండ్ ఒకసారి పుంజుకున్న తర్వాత, ఉత్పాదక రంగాలకు రుణ అందుబాటు మరింత మెరుగుపడ్డానికి చర్యలు తీసుకోవాలి.

– ఉర్జిత్ పటేల్, ఆర్‌బీఐ గవర్నర్



డేటావిండ్‌కు కొత్త కష్టాలు

- కొన్ని నెలలుగా భారీగా తగ్గిన ఆర్డర్లు
- హైదరాబాద్ ప్లాంటులో పడిపోయిన ఉత్పత్తి
- కంపెనీని వీడిన వందలాది కార్మికులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చవక ట్యాబ్లెట్ పీసీల తయారీలో ఉన్న డేటావిండ్‌కు కష్టాలు మొదలయ్యాయి. అమ్మకాలు లేకపోవడంతో హైదరాబాద్ ఫెసిలిటీలో ఉత్పత్తిని సగానికి తగ్గించినట్టు కంపెనీ తెలిపింది. విశ్వసనీయ సమాచారం మేరకు... తయారీ అంతంత మాత్రంగానే జరుగుతోంది. తాజా పరిస్థితులతో కంపెనీ పెద్ద ఎత్తున కార్మికులకు ఉద్వాసన పలికింది. హైదరాబాద్‌కు విడిభాగాలు రావాల్సి ఉందని, వాటి కోసం చూస్తున్నామని, అమృత్‌సర్ ప్లాంటులో యథావిధిగా ఉత్పత్తి కొనసాగుతోందని కంపెనీ వెల్లడించింది. అయితే ఆర్డర్లు లేక కంపెనీ సమస్యల్లో చిక్కుకుందని, ఆరు నెలల కిందటి నుంచే హైదరాబాద్ ప్లాంటు కార్మికులు ఒక్కొక్కరుగా కంపెనీని వీడుతున్నారని తెలియవచ్చింది. గత రెండు త్రైమాసికాల్లో అమ్మకాలు గణనీయంగా పడిపోయాయని డేటావిండ్ సీఈవో సునీత్ సింగ్ తులి స్వయంగా వెల్లడించారు. వర్కింగ్ క్యాపిటల్ పైనా దీని ప్రభావం ఉందన్నారు. అయితే ఉద్వాసనకు గురైన 200 మందికిపైగా కార్మికులు తెలంగాణ కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆర్.చంద్రశేఖరంను కలిసి న్యాయం చేయాలంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై కంపెనీ ప్రతినిధులతో మాట్లాడతానని కమిషనర్ వారికి తెలిపారు. మరోవంక డేటావిండ్ మాత్రం "ఎయిర్‌పోర్టు విస్తరణలో భాగంగా శంషాబాద్ ప్లాంటు స్థలాన్ని ఖాళీ చేయాలని జీఎంఆర్ యాజమాన్యం మమ్మల్ని కోరింది. దీంతో ప్లాంటును సికింద్రాబాద్‌కు మార్చాలనుకుని, ఆ విషయాన్ని కార్మికులకు చెప్పాం. కార్మికుల్లో అత్యధికులు శంషాబాద్ చుట్టుపక్కల వారు కావటంతో మారటం ఇష్టం లేక విధ్వంసం సృష్టించారు. వారిని తొలగించాం. వారే సమస్యను సృష్టించారు'' అని వివరించింది. కాగా ఒక దశలో 400 మంది వరకు పనిచేసిన ఈ ప్లాంటులో ప్రస్తుతం 15 మందిలోపే ఉన్నారు.

వెబ్‌సైట్‌తోనే కంపెనీలకు గుర్తింపు

- అతి తక్కువ చార్జీలతో సేవలు
- గో డాడీ ఇంటర్నేషనల్ ఈవీపీ ఆండ్రూ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చిన్న, మధ్యతరహా కంపెనీలకు (ఎస్ఎంబీ) వెబ్‌సైట్‌తోనే గుర్తింపు లభిస్తుందని డొమైన్ రిజిస్ట్రీ, వెబ్ హోస్టింగ్ దిగ్గజం 'గో డాడీ' తెలిపింది. వెబ్‌సైట్లను కలిగి ఉన్న కంపెనీల వ్యాపారం పెరిగిందన్న విషయం తమ అధ్యయనంలో తేలిందని గో డాడీ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆండ్రూ లోకీ బుధవారమిక్కడ తెలిపారు. ఎస్ఎంబీలకు అతి తక్కువ ఖర్చుతో నెలకు రూ.99 మొదలుకుని ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నట్టు చెప్పారు. ఔత్సాహికులు ఎవరైనా అర గంటలోనే వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసుకునేలా టెక్నాలజీని సులభతరీతిన డిజైన్ చేశామన్నారు. ఫేస్‌బుక్ పేజీ ఉన్నప్పటికీ, కంపెనీలు సొంత వెబ్‌సైట్లను కలిగి ఉంటున్నాయని వివరించారు. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించి అయిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ కాలంలో 7.5 లక్షల మంది కస్టమర్లను సొంతం చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు.

అపార అవకాశాలు..: దేశవ్యాప్తంగా 5.1 కోట్ల ఎస్ఎంబీలు ఉన్నాయి. వీటిలో 1.2 కోట్ల కంపెనీలు మాత్రమే ఇంటర్నెట్‌తో అనుసంధానం అయ్యాయని గో డాడీ ఇండియా వైస్ ప్రెసిడెంట్, ఎండీ నిఖిల్ అరోరా తెలిపారు. దేశంలో డొమెయిన్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. వెబ్‌సైట్ల కోసం ఎస్ఎంబీల నుంచి రిజిస్ట్రేషన్లు రెండంకెల వృద్ధి నమోదు చేస్తున్నాయని పేర్కొన్నారు. వెబ్‌సైట్ ప్రయోజనాలపై చిన్న కంపెనీలకు అవగాహన లేదని.. పోర్టల్‌కు ఎక్కువ ఖర్చు అవుతుందన్న అపోహ ఉందని చెప్పారు. కాగా, 5 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 31 వరకు రెన్యువల్స్‌పై 40% దాకా డిస్కౌంట్‌ను గో డాడీ ప్రకటించింది.

డర్టీ డజన్‌కు తోడుగా మరిన్ని కంపెనీలు!!

- త్వరలో ఎన్‌సీఎల్‌టీ ముందుకు రెండో లిస్టు
- జాబితాలో వీడియోకాన్, జేపీ వెంచర్స్ తదితర సంస్థలు!!

ముంబై: మొండి బాకీలు పేరుకుపోయిన మరిన్ని కంపెనీల కేసులు త్వరలో దివాలా కోర్టు ముందుకు చేరనున్నాయి. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందుకు బ్యాంకులు పంపతగిన కంపెనీల రెండో జాబితాను రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) త్వరలోనే సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే తొలి జాబితాలోని డర్టీ డజన్ కంపెనీలపై చర్యలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా రాబోయే కొత్త లిస్టులో వీడియోకాన్ ఇండస్ట్రీస్ (స్థూల రుణభారం రూ. 47,554 కోట్లు), జైప్రకాశ్ పవర్ వెంచర్స్ (రూ. 21,098 కోట్లు), అబాన్ ఆఫ్‌షోర్ (రూ. 12,030 కోట్లు), పుంజ్ లాయిడ్ (రూ. 6,126 కోట్లు), శ్రీ రేణుక షుగర్స్ (రూ. 6,012 కోట్లు), జిందాల్ స్టెయిన్‌లెస్ (రూ. 3,367 కోట్లు) తదితర సంస్థలు ఉండగలవని తెలుస్తోంది. ఎన్‌సీఎల్‌టీకి నివేదించతగిన మరిన్ని కంపెనీల జాబితాను ఆర్‌బీఐ అంతర్గత సలహా కమిటీ .. బ్యాంకులకు పంపనున్నట్లు సమాచారం. కొత్తగా అమల్లోకి వచ్చిన దివాలా చట్టం ప్రకారం.. మొండి బాకీ ఖాతాలను ఎన్‌సీఎల్‌టీకి నివేదించేలా బ్యాంకులను ఆదేశించేలా ఆర్‌బీఐకి అధికారాలు లభించిన సంగతి తెలిసిందే.






నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్,వ్యాపారస్తులు)	రూ.4,600 (కనిష్టం) రూ.5,000 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.1,800 (కనిష్టం) రూ.5,600 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,706 (కనిష్టం) రూ.6,067 (గరిష్టం) (20న ముగింపు)
ఉల్లి (కర్నూలు)	రూ.260 (కనిష్టం) రూ.840 (గరిష్టం) (20న ముగింపు)
చక్కెర (చెన్నై)	రూ.4,050
బియ్యం (కరీంనగర్)	రూ.3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.6,000
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు) (ప్రభుత్వ మార్కెట్ మద్దతు ధర)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.7,376











ఎస్ఐఎస్ ఐపీఓకు 7 రెట్లు స్పందన

న్యూఢిల్లీ: సెక్యూరిటీ సర్వీసుల్ని అందించే సెక్యూరిటీ, ఇంటిలిజెన్స్ సర్వీసెస్ (ఎస్ఐఎస్) తొలి పబ్లిక్ ఆఫర్ 7 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ఐపీఓలో రూ. 780 కోట్ల సమీకరణకు 53.16 లక్షల షేర్లను కంపెనీ జారీచేస్తుండగా, ఇష్యూ చివరిరోజైన బుధవారం 3.72 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి.రూ. 805–815 ప్రైస్‌బ్యాండ్‌తో ఈ ఇష్యూ జారీఅయ్యింది.

జీఆర్‌టీ 'ఆషాఢ ఆశ్చర్యం' ఆఫర్



హైదరాబాద్: దక్షిణ భారతదేశంలో విస్తరించిన 'జీఆర్‌టీ జువెలర్స్' తాజాగా ఆషాఢ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన ఆఫర్‌ను ప్రకటించింది. నెల మొత్తం కొనసాగే ఈ 'ఆషాఢ ఆశ్చర్యం' ఆఫర్‌లో భాగంగా ప్రతి కొనుగోలుపై కస్టమర్లకు ఒక బహుమతిని అందిస్తున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వినియోగదారులకు నిజమైన సంతోషాన్ని అందించాలని ఈ పరిమిత కాల ఆషాఢ ఆశ్చర్యం ఆఫర్‌ను ప్రకటించామని జీఆర్‌టీ మేనేజింగ్ డైరెక్టర్ అనంత పద్మనాభన్ తెలిపారు.

కొత్త రికార్డు నుంచి కిందకు

- ఆల్‌టైమ్ గరిష్టస్థాయి నుంచి తగ్గిన మార్కెట్
- సెన్సెక్స్ 98 పాయింట్లు, నిఫ్టీ 33 పాయింట్లు డౌన్



ముంబై: రిజర్వుబ్యాంక్ వడ్డీ రేట్లను పావుశాతం తగ్గించినప్పటికీ, స్టాక్ మార్కెట్లో ఉత్సాహం లేకపోగా, నీరసించిపోయాయి. పావుశాతం కోతను ఇప్పటికే ఇన్వెస్టర్లు డిస్కౌంట్ చేసుకోవడం, అంతకుమించి ఆశ్చర్యపర్చే అంశాలేవీ ఆర్‌బీఐ పాలసీలో లేకపోవడంతో మార్కెట్లో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణ జరిగింది. గత రాత్రి అమెరికా మార్కెట్ మార్కెట్ పెరగడం, బుధవారం ఆసియా మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్న ప్రభావంతో బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే సరికొత్త రికార్డుస్థాయిలకు చేరాయి. ట్రేడింగ్ ముగింపు సమయంలో ఆర్‌బీఐ పాలసీ వెలువడిన తర్వాత లాభాల స్వీకరణ ఫలితంగా క్షీణతతో ముగిసాయి. 32,686 పాయింట్ల కొత్త గరిష్టస్థాయికి చేరిన సెన్సెక్స్ చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 98 పాయింట్ల తగ్గుదలతో 32,477 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. నిఫ్టీ సైతం ఇదేబాటలో 10,149 పాయింట్ల రికార్డుస్థాయి నుంచి 10,054 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 33 పాయింట్ల క్షీణతతో 10,081.50 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. ఆర్‌బీఐ సానుకూల నిర్ణయం, రుణ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్ల నిధులు తరలివస్తున్న ప్రభావంతో రూపాయి బాగా బలపడిందని, ఈ అంశాలు మార్కెట్‌ను ప్రభావితం చేశాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,037
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	24,104
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,51,232
ఎఫ్ఐఐ	474
డీఐఐ	-233

బ్యాంక్ నిఫ్టీ కూడా...

కొద్దిరోజులుగా వరుస రికార్డుల మోతతో హోరెత్తిస్తున్న బ్యాంక్ నిఫ్టీ కూడా 25,199 పాయింట్ల కొత్త రికార్డుస్థాయిని నమోదుచేసిన తర్వాత ట్రేడింగ్ ముగింపులో 25,000 పాయింట్ల దిగువన 24,941 పాయింట్ల వరకూ పడిపోయింది. చివరకు క్రితం రోజుతో పోలిస్తే 67 పాయింట్ల నష్టంతో 25,055 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. రూపాయి భారీ ర్యాలీ ప్రభావంతో ఫార్మా, ఐటీ షేర్లు తగ్గాయి.

యూనియన్ బ్యాంక్.. 'ఫ్యూచర్స్' సిగ్నల్స్!



ఈ రోజు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో (ఎఫ్అండ్ ఓ) ఏ షేర్లయితే బెటర్? ఆ 'ఫ్యూచర్ సిగ్నల్స్' 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం...

యూనియన్ బ్యాంక్..

వడ్డీ రేట్లను పావుశాతం తగ్గిస్తూ ఆర్‌బీఐ పరపతి విధానం వెల్లడైన తర్వాత దాదాపు బ్యాంకింగ్ షేర్లన్నీ గరిష్టస్థాయి నుంచి క్షీణించాయి. వీటిలో అన్నింటికంటే అధికంగా ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ 3 శాతం తగ్గుదలతో నాలుగువారాల కనిష్టస్థాయి రూ. 150 వద్ద ముగిసింది. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఫ్యూచర్ కాంట్రాక్ట్ ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ)లో తాజాగా 25.26 లక్షల షేర్లు (15.29 శాతం) యాడ్ అయ్యాయి. స్పాట్ ధరతో పోలిస్తే ఫ్యూచర్ ప్రీమియం స్వల్పంగా తగ్గింది. షేరు క్షీణిస్తూ ఓఐ పెరగడం, ప్రీమియం తగ్గడం షార్టింగ్ కార్యకలాపాల్ని సూచిస్తోంది. అయితే షేరు బాగా తగ్గినప్పటికీ, రూ. 160 స్ట్రయిక్ వద్ద కాల్‌రైటింగ్ అంతంతమాత్రంగా జరగ్గా, పుట్ కవరింగ్ కూడా స్వల్పంగానే వుంది. ఈ కాల్ ఆప్షన్లో 1.08 లక్షల షేర్లు యాడ్‌కాగా, బిల్డప్ 8.92 లక్షల షేర్లకు చేరింది. పుట్ ఆప్షన్ నుంచి 8 వేల షేర్లు కట్‌కాగా, బిల్డప్ 4.92 లక్షల షేర్లకు తగ్గింది. ఫ్యూచర్ కాంట్రాక్టులో తీసుకునే షార్ట్ పొజిషన్లకు రక్షణగా పుట్ రైటర్లు వాటిని కవర్‌చేయకపోవడంతో పుట్ బిల్డప్ బాగా తగ్గి వుండకపోవొచ్చు. రూ. 150 స్ట్రయిక్ వద్ద పుట్‌రైటింగ్ ఫలితంగా 52 వేల షేర్లు యాడ్ అయ్యాయి. ఇక్కడ 4.88 లక్షల షేర్ల బిల్డప్ వుంది. రూ. 155 స్ట్రయిక్ వద్ద స్వల్పంగా జరిగిన కాల్‌రైటింగ్‌తో 80 వేల షేర్లు యాడ్‌కాగా, కాల్ బిల్డప్ 2.68 లక్షల షేర్లకు చేరింది. ఈ షేరు రూ. 150 స్థాయిని పరిరక్షించుకుంటే..సమీప భవిష్యత్తులో రూ. 155 స్థాయిని చేరవచ్చని, రూ. 150 స్థాయిని వదులుకుంటే మరింతగా తగ్గవచ్చని ఈ ఆప్షన్ డేటా వెల్లడిస్తున్నది.

→ ఎన్‌టీపీసీ ఎఫ్ అండ్ ఓ డేటా ఏం చెబుతోంది?
ఈ వివరాలు W . లో W C

రెండేళ్ల గరిష్ఠానికి రూపాయి

- డాలర్‌తో పోలిస్తే 63.70 వద్ద ముగింపు
- ఒకే రోజున 37 పైసలు అప్



ముంబై: రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు తగ్గించడం తదితర పరిణామాల నేపథ్యంలో రూపాయి మారకం విలువ రెండేళ్ల గరిష్టానికి ఎగిసింది. బుధవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు బలపడి 63.70 వద్ద ముగిసింది. 2015 జులై 22 తర్వాత ఈ స్థాయిలో ముగియడం ఇదే ప్రథమం. అప్పట్లో రూపాయి 63.58 వద్ద క్లోజయ్యింది. ఇక ఒకే రోజున 37 పైసలు పెరగడం ఈ ఏడాది ఇదే తొలిసారి. పది నెలల విరామం తర్వాత రెపో రేటు పావు శాతం తగ్గిన దరిమిలా సానుకూల పరిణామాలపై ఆశావహ అంచనాలు నెలకొనడంతో రూపాయి ర్యాలీకి ఊతం లభించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

కోస్తాంధ్రలోకి అల్ట్రాటెక్

విశాఖలో ఘనంగా ఆవిష్కరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌వీ పాటిల్

సాక్షి, విశాఖపట్నం: సిమెంట్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ కోస్తాంధ్రలోకి ప్రవేశించింది. ఇటీవలే జేపీ సిమెంట్‌ను సొంతం చేసుకున్న అల్ట్రాటెక్.. డీలర్లు, రిటైలర్లు, ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్ల సమక్షంలో తమ సిమెంట్‌ను కోస్తాంధ్ర మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఆదిత్య బిర్లా గ్రూపు దక్షిణాది రాష్ట్రాల హెడ్ ఎస్‌వీ పాటిల్ ఈ సందర్భంగా తమ సిమెంట్ ఉత్పత్తులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా తమ ఉత్పత్తులకు బలమైన మార్కెటింగ్ నెట్‌వర్క్ ఉందన్నారు. ''గతంలో మాకు 63 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. జేపీ సిమెంట్‌కు చెందిన ఆరు ఇంటిగ్రేటెడ్ ప్లాంట్స్, ఐదు గ్రేడింగ్ యూనిట్లను సొంతం చేసుకోవడం ద్వారా మరో 21.2 మి. టన్నుల సామర్థ్యం జతయింది. కొత్త ప్లాంట్లు కూడా కలిపితే చైనా కంపెనీల తరవాత అతిపెద్ద సిమెంట్ కంపెనీగా నిలిచాం. 93 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో దేశంలోనే అతిపెద్ద సంస్థగా ఆవిర్భవించాం'' అని పాటిల్ చెప్పారు. కార్యక్రమంలో రెడీ మిక్స్ కాంక్రీట్ హెడ్ సంజయ్ మాథుర్, మార్కెటింగ్ సర్వీసెస్ హెడ్ అజయ్‌డాంగ్, టెక్నికల్ సర్వీస్ హెడ్ డాక్టర్ రామచంద్ర, ఏపీ రీజనల్ హెడ్ కిషన్‌రావు, కంపెనీ ప్రచార విభాగం హెడ్ కుమార్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

పీఎన్‌బీ లాభం 12% వృద్ధి

- క్యూ1లో రూ.343 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు జూన్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. లాభం 12 శాతం వృద్ధితో రూ.343 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7 శాతం పెరిగి రూ.14,468 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో లాభం రూ.306 కోట్లు, ఆదాయం రూ.13,475 కోట్లుగా ఉంది. ఆస్తుల నాణ్యత సైతం కొద్దిగా మెరుగైంది. స్థూల నిరర్ధక ఆస్తులు (ఎన్‌పీఏ) 13.75 శాతం నుంచి 13.66 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏలు 9.16 శాతం నుంచి 8.67 శాతానికి దిగివచ్చాయి. దీంతో ఎన్‌పీఏలకు చేసిన కేటాయింపులు 19 శాతం తగ్గి రూ.2,559 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.3,165 కోట్లు కావడం గమనార్హం. అయితే, మార్చి క్వార్టర్‌లో ఉన్న స్థూల ఎన్‌పీఏలు 12.53 శాతం కంటే పెరిగినట్టు తెలుస్తోంది. మెరుగైన ఫలితాలతో పీఎన్‌బీ స్టాక్ ధర బీఎస్‌ఈలో ఒక శాతం పెరిగి రూ.158.90 వద్ద క్లోజయింది.

హైదరాబాద్‌లో నోర్డ్ మొబైల్ సేవలు ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా, విమానాశ్రయ, సిమెంట్, టెక్స్‌టైల్స్, ఫుడ్ అండ్ బేవరేజెస్, గిడ్డంగి వంటి రంగాల్లో వినియోగించే కన్వర్షన్ బెల్ట్‌లు, మోటార్లు, గేర్ బాక్స్‌ల వంటి రిపేర్లు, సర్వీసింగ్ సేవలను ఇక నుంచి పరిశ్రమ వద్దకే వచ్చి అందించనుంది నోర్డ్. ఇందుకుగాను ఎక్స్‌ట్రా మైల్ సర్వీస్ వెహికిల్‌ను బుధవారమిక్కడ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఏపీ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్ సుకుమార్, తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం నోర్డ్ డ్రైవ్‌సిస్టమ్స్ గ్లోబల్ ఎండీ ఉల్‌రిచ్ కుచెన్‌మిస్టర్, ఇండియా ఎండీ పీఎల్ ముతుశేఖర్ మాట్లాడుతూ.. గతేడాది నోర్డ్ 560 మిలియన్ యూరోల టర్నోవర్‌ను చేరుకుందని, మన దేశంలో రూ.135 కోట్ల టర్నోవర్‌ను చేరుకున్నామని తెలిపారు. నోర్డ్ గ్లోబల్ మార్కెట్‌లో ఇండియా వాటా 5 శాతంగా ఉందని.. దీన్ని 30 శాతానికి చేర్చడమే లక్ష్యంగా సేవలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి బోర్డు మీటింగ్స్

- బీఎస్ఈ
- సియట్
- ఐఓసీ
- కోల్గేట్ పామోలివ్
- కమ్మిన్స్ ఇండియా
- రామ్‌కో ఇండస్ట్రీస్
- బజాజ్ ఎలక్ట్రికల్స్
- జేఎస్‌డబ్ల్యూ హోల్డింగ్స్
- టైటాన్
- పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్
- రామ్‌కో సిమెంట్స్
- వీఐపీ ఇండస్ట్రీస్
- బాంబే బర్మా ట్రేడింగ్
- హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్

బులియన్ రూ.లలో

	ధర	మార్పు
ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	28,580	▼ 65
బంగారం (99.5, 10గ్రా)	28,430	▼ 65
వెండి (కిలో)	37,910	▼ 350
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	– –	
బంగారం (22 క్యారెట్లు)	27,270	▼ 90
వెండి (కిలో)	– –	
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	29,250	▼ 60
బంగారం (22 క్యారెట్లు)	27,350	▼ 60
వెండి(కిలో)	38,455	▼ 470
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	29,550	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	27,410	▼ 60
వెండి(కిలో)	39,400	▼ 300
విశాఖపట్నం (మంగళవారం ధరలు)		
బంగారం (24 క్యారెట్లు)	29,300	
బంగారం (22 క్యారెట్లు)	27,400	
వెండి(కిలో)	39,900	
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	29,500	
బంగారం (22 క్యారెట్లు)	27,500	
వెండి(కిలో)	39,200	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	29,470	▼ 180
బంగారం (22 క్యారెట్లు)	27,260	▼ 160
వెండి(కిలో)	39,200	▼ 300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	49.41 (రాత్రి 11.30కు)	$49.16 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	52.16 (రాత్రి 11.30కు)	$51.78 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 3-8-2017

విశాఖ	318-00
చిత్తూరు	365-00
వరంగల్	312-00
ముంబై	360-00
చెన్నై	372-00
విజయవాడ	308-00
గోదావరి	308-00
నమక్కల్	360-00
2-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	310-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.70
బెంగళూరు	360-00
ఢిల్లీ	297-00
కోల్‌కతా	338-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1772.1	1737.75
ADANI PORT	411.25	404
AMBUJA CEME	266.6	260.8
ASIAN PAINT	1144.5	1148.2
AXIS BANK L	516.9	516.55
BAJAJ AUTO	2802.9	2823.4
BANK OF BAR	163.4	163.5
[illegible]	[illegible]	[illegible]

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
3M INDIA LI	13290.7	13354.2
63 MOONS TE	63.05	63.1
8K MILES SO	541.85	542.7
AARTI DRUGS	567.8	560.95
AARTI INDUS	930.65	954.7
AARVEE DEN.	61.6	61.85
ABAN OFFSHO	182.25	185.2
ABBOTT INDI	4430.4	4392.2
ACCELYA KAL	1413.05	1410.75
[illegible]	[illegible]	[illegible]
BAYER CROPS	4665.7	4688.5
BEML LIMITE	1706.5	1717
BERGER PAIN	250.75	248.75
BF INVESTME	175.45	174.55
BF UTILITIE	373	381.45
BGR ENERGY	146.1	147.7
BHAGERIA IN	274.4	285.2
BHANSALI EN	71.55	73
BHARAT BIJL	1304.75	1292.15
BHARAT FIN	842.1	851.8
BHARAT FORG	1156.35	1150.1
BHARAT GEAR	164.8	161.7
[illegible]	[illegible]	[illegible]
DISH TV IND	81.6	81
DOLLAR INDU	2114.05	2121.15
DOLPHIN OFF	92.55	94
DONEAR IND.	64.3	63.65
DR. LAL PAT	831.75	824.1
DWARIKESH S	563.35	527.35
DYNAMATIC T	2369.8	2367.9
DYNEMIC PRO	134.9	129.95

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ECE INDUSTR	202.4	213.25
ECLERX SERV	1282.25	1280.45
[illegible]	[illegible]	[illegible]
GUJARAT MIN	140.9	143.3
GUJARAT PIP	144.15	146.75
GUJARAT STA	185	190
GULF OIL LU	808.75	811.35
GULSHAN POL	95.35	96.5
HARITA SEAT	798.15	801.35
HARRISON MA	81.4	83.95
HATSUN AGRO	620	620.1
HDFC BANK L	1821	1825
HEALTHCARE	271.5	271.55
HEG LTD	498.2	493.55
HEIDELBERGC	128.3	128.1
[illegible]	[illegible]	[illegible]

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]
JINDAL SAW	106	105.5
JINDAL STAI	91.95	88.75
JINDAL STAI	162	164.35
JINDAL STEE	158.4	155.05
JINDAL WORL	806.75	799.3
JK CEMENT L	1008.2	1018.3
JK LAKSHMI	455.15	454.95
JK PAPER LI	93.4	94.85
JK TYRE & I	169.1	163.5
JKUMAR INFR	291.8	295
JM FINANCIA	120.3	119.9
JMC PROJECT	351.75	351.55
[illegible]	[illegible]	[illegible]

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MARATHON NX	314.2	323.55
MASTEK LTD	291.95	301.45
MAWANA SUGA	78.25	75.6
MAX FINANCI	609.9	600.15
MAX INDIA L	151.3	151.55
MAX VENTURE	93.3	84
MAYUR UNIQU	359.85	360.45
MAZDA LIMIT	399.35	405.65
MCLEOD RUSS	176.95	179.25
MCNALLY BH.	68.9	70.8
MEGHMANI OR	51.5	51.6
MENON BEARI	78.7	79.4
[illegible]	[illegible]	[illegible]
PHILIPS CAR	587.4	586.8
PHOENIX LAM	211.35	212.55
PI INDUSTRI	757.4	763.2
PINCON SPIR	72.85	71.85
PLASTIBLEND	261.5	265.7
PNB GILTS L	54.25	54.45
PNB HOUSING	1486.5	1487.6
PNC INFRATE	140.2	141.15
PODDAR HOUS	1036.5	1014
PODDAR PIGM	280.6	284.1
POKARNA LIM	1293.95	1311.6
[illegible]	[illegible]	[illegible]

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]
SHANTHI GEA	138.5	142.2
SHARDA CROP	460.6	465.1
SHARDA MOTO	2762.85	2750.85
SHEELA FOAM	1314.6	1305.65
SHEMAROO EN	355.6	354.35
SHILPA MEDI	652.95	663.75
SHIPPING CO	84.65	82.3
SHIRPUR GOL	155.25	156.15
SHIVA TEXYA	369.55	367.45
SHIVAM AUTO	69.45	69.3
SHOPPERS ST	359.85	360.9
[illegible]	[illegible]	[illegible]
THE RAMCO C	699.1	687
THE RUBY MI	380.7	380.3
THE STATE T	170.25	176
THE TINPLAT	131.95	135
THEJO ENGIN	352.8	336
THEMIS MEDI	513.9	515.55
THERMAX LTD	876.8	876.65
THIRU AROOR	60.3	59.25
THIRUMALAI	1286.05	1248.3
THOMAS COOK	222.95	224.55
THYROCARE T	714.45	710.3
[illegible]	[illegible]	[illegible]

V W Y Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ


కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

బీఎస్ఈలో ఎస్ఎంఈ, ఎస్ఎస్ఈ షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

నేటి నుంచి 5వ తేదీ వరకు నిర్వహణ



వసంత మండపంలో పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

సాక్షి,తిరుమల: తిరుమల ఆలయంలో జరిగే దోషాల పరిహారార్థం నిర్వహించే పవిత్రోత్సవాలకు బుధవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. క్రీ.శ.1464కు పూర్వం నుంచే పవిత్రోత్సవాలు నిర్వహించేవారని శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ.1562 తర్వాత నిలిచిపోయిన ఈ ఉత్సవాలను తిరిగి 1962 నుంచి టీటీడీ ఏటా శ్రావణ మాసంలో మూడు రోజుల పాటు వైదిక ఆచారాలతో నిర్వహిస్తోంది. ఈ నెల 3 నుంచి 5వతేది వరకు ఈ ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీవారి సేనాపతి విష్వక్సేనుడు ఆలయ వీధుల్లో ఊరేగుతూ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇదే సందర్భంగా వైఖానస ఆగమోక్తంగా మృత్సంగ్రహణం, అంకురార్పణం, ఆస్థానంతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇక తొలిరోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామిని పవిత్రోత్సవ మండపానికి తీసుకొస్తారు. పట్టు పవిత్రాలను (పట్టుదండలు) యాగశాలలో ప్రతిష్ఠించి హోమాలు, ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తారు. రెండోరోజు శుక్రవారం పట్టు పవిత్రాలు సమర్పించనున్నారు. చివరి రోజు శనివారం పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగిస్తారు.

7న చంద్రగ్రహణం.. ఆలయం మూత

ఈ నెల 7వ తేదిన చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం 4.30 నుంచి 8వ తేది వేకువజాము 2 గంటల వరకు శ్రీవారి ఆలయం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద కేంద్రం మూసివేయనున్నారు. అనంతరం ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహ వచనం నిర్వహిస్తారు. అనంతరం సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అష్టదళ పాద పద్మారాధనసేవ అనంతరం ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం ఆరంభిస్తారు.

ఇన్ని ఇక్కట్లా.. రిజిస్ట్రేషన్లు చేసేదెట్లా?

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మొరాయిస్తున్న సర్వర్లు
- పనిచేయని స్కానర్లు, ఆగిపోతున్న కంప్యూటర్లు
- నాసిరకం క్యాట్రిడ్జ్‌లతో పత్రాలపై మసకబారుతున్న అక్షరాలు
- నిర్వహణ కాంట్రాక్టు గడువు ముగిసినా పట్టించుకోని సర్కారు
- తమ చేతి చమురు ఊడుతోందని అధికారుల ఆవేదన
- గంటలకొద్దీ నిరీక్షణతో మండిపడుతున్న జనం




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తరచూ సర్వర్ డౌన్ అవుతోంది. స్కానర్లు ఆగిపోతున్నాయి. కంప్యూటర్లూ మొరాయిస్తున్నాయి. ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రోజుల్లో ఈ సమస్య ఎక్కువవుతోంది. దీంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి. పాత మార్కెట్ విలువ ప్రకారం రిజిస్ట్రేషన్లకు చివరిరోజైన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 13,500 లావాదేవీలు రావడంతో సర్వర్ డౌన్ అయింది. దీంతో రిజిస్ట్రేషన్లలో తీవ్ర జాప్యం జరిగింది. గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం తదితర జిల్లాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపించింది. దీంతో సబ్ రిజిస్ట్రార్లు డాక్యుమెంట్ నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ, బదిలీ సుంకం చెల్లించేందుకు అనుమతించారు. డాక్యుమెంట్ల నంబర్ ఇచ్చినందున పాత ధరల ప్రకారమే తర్వాత రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పి పంపించారు. సెంట్రల్ సర్వర్ సామర్థ్యం చాలనందునే ఇలా డౌన్ అవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా డాక్యుమెంట్లను నిక్షిప్తం చేయడానికి వినియోగించే స్కానర్లు మొరాయిస్తున్నాయి. స్కానర్ ఆన్‌చేస్తే ఎప్పుడు స్కానింగ్ పూర్తవుతుందో తెలియని పరిస్థితి. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చినవారు సిబ్బందిపై విసుక్కుంటున్నారు. ప్రజలు తమను నిలదీస్తుంటే తమ తప్పు లేకపోయినా మాట పడాల్సి వస్తోందంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయోమెట్రిక్ (వేలిముద్రలు తీసుకునే) యంత్రాలు, ఎప్పుడో ఏర్పాటు చేసిన పాత కంప్యూటర్లు, ప్రింటర్లు సక్రమంగా పనిచేయ డంలేదు. ప్రింటర్ల టోనర్లలో ఇంక్ (క్యాట్రిడ్జ్) అయిపోవడం వల్ల దస్తావేజు నకళ్లు, డాక్యుమెంట్ల రివర్స్ ఎండార్స్‌మెంట్ పత్రాలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ (ఈసీ)ల్లో అక్షరాలు సరిగా కనిపించడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఈ పత్రాలను ఇంటికి తీసుకెళ్లాక చూస్తే నల్లటి పొడి రాలిపోయి అక్షరాలు మసకమసకగా కనిపిస్తున్నాయి.

ఆగస్టులో ఒప్పందం ముగిసినా..

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ (కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ల రిపేరు/రిప్లేస్‌మెంట్, సర్వర్ నిర్వహణ), స్టేషనరీ సరఫరా కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో చేసుకున్న ఒప్పంద గడువు గత ఏడాది ఆగస్టుతో ముగిసింది. అప్పటి నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టేషనరీ సరఫరా ఆగిపోయింది. తిరిగి కాంట్రాక్టు ఇచ్చేందుకు ప్రభుత్వం టెండర్లు పిలవకుండా కేవలం సర్వీసు ప్రొవైడర్ (సర్వర్లు, కంప్యూటర్ల నిర్వహణ) ఒప్పందాన్ని మాత్రం పొడిగించింది. జూన్ నెలాఖరుతో ఈ గడువు కూడా ముగియడంతో మరో మూడు నెలలు పొడిగించినట్లు మౌఖికంగా తెలియజేశారు. ఈ నేపథ్యంలో కంప్యూటర్ల మౌస్‌లు, కీ ప్యాడ్లు పనిచేయకపోయినా, ప్రింటర్లు/స్కానర్లు దెబ్బతిన్నా, టోనర్ క్యాట్రిడ్జ్‌లు అయిపో యినా సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుంటున్నామని రిజిస్ట్రేషన్ కార్యాలయాల అధికారులు చెబుతున్నారు. 'కొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నెలకు రెండు కేట్రిడ్జ్‌లు మార్చాలి. ఒరిజినల్ మార్చాలంటే ఒక్కోటి రూ.3,400 నుంచి రూ.3,600 వరకూ అవుతుంది. అంత డబ్బు మా జేబు నుంచి పెట్టలేం కదా. అందుకే రీఫిల్ చేయిస్తున్నాం. ఇందువల్లే ప్రింటింగ్‌లో నాణ్యత ఉండటం లేదు' అని ఒక సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ విషయమై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన ఒక అధికారిని 'సాక్షి' సంప్ర దించగా టెండరు గడువు ముగిసిన తర్వాత సమస్య ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. తిరిగి టెండర్లు పిలిచే ందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌టీ) తయారుచేసి ప్రభుత్వానికి ఇచ్చిందని, సర్కారు ఆమోదిస్తే టెండర్లు పిలుస్తారని తెలిపారు.

సెప్టెంబర్ 21 నుంచి
దసరా ఉత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమం): శ్రీ హేవలంబి నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సెప్టెంబర్ 21వ తేదీ నుంచి శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఈ పది రోజుల్లో అమ్మవారు పది అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 21వ తేదీ గురువారం స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి, 22న బాలా త్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25 సోమవారం లలితా త్రిపుర సుందరీదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న శ్రీ సరస్వతిదేవి (మూలా నక్షత్రం), 28న దుర్గాదేవి (దురాష్టమి), 29న మహిషాసుర మర్ధిని (మహర్నవమి), 30వ తేదీ శనివారం రాజరాజేశ్వరిదేవి (విజయదశమి)గా అమ్మవారిని అలంకరి స్తారు. 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు కృష్ణానదిలో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహి స్తారు.

యూట్యూబ్‌లో దుర్గగుడి కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర్వస్వామి ఆలయ కార్యకలాపాలను ప్రచారం చేసేందకు యూట్యూబ్‌లో ప్రత్యేక ఛానల్ ఏర్పాటు చేసినట్టు ఈవో సూర్య కుమారి తెలిపారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

ఆన్‌లైన్‌లో నవంబరు నెల ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

సాక్షి,తిరుమల: తిరుమలలో ఈనెల 4వ తేది శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతినెలా మొదటి శుక్రవారం ఉదయం 8.30 నుంచి 9.30 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా భక్తులు తమ సందేహాలు, సూచనలు 0877–2263261 నెంబరుకు ఫోన్ చేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు తెలియజేయవచ్చు. ఈ సందర్భంగా నవంబరు నెలలో జరిగే శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల కోటాను ఇంటర్నెట్ ద్వారా విడుదల చేయనున్నారు.

పింగళి వెంకయ్యకు బ్రాహ్మణ కార్పొరేషన్ నివాళి

సాక్షి, అమరావతి: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 141వ జయంతి కార్యక్రమాలు బుధవారం బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, ఎండీ పద్మ తదితరులు పాల్గొని పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు మాట్లాడుతూ.. పింగళి వెంకయ్య 1916లో జాతీయ పతాకం అనే గ్రంథాన్ని రచించారని, ఇందులో సుమారు 30 రకాల పతాకాలను రూపొందించారని గుర్తు చేశారు. 1921లో బెజవాడ అఖిల భారత కాంగ్రెస్ మహాసభ సందర్భంగా మహాత్మాగాంధీ ఆదేశానుసారం త్రివర్ణపతాకాన్ని రూపొందించారని కొనియాడారు.

నేటి నుంచి పాదయాత్ర

శాంతియుతంగా తరలిరావాలని కాపు ఉద్యమ నేత ముద్రగడ పిలుపు



కిర్లంపూడిలోని నివాసంలో కంచాల మోత మోగిస్తున్న ముద్రగడ పద్మనాభం తదితరులు

కిర్లంపూడి (జగ్గంపేట): పోలీసులు విధించిన గృహ నిర్బంధం బుధవారంతో ముగిసిందని, గురువారం నుంచి పాదయాత్ర జరిగి తీరుతుందని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కాపు నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన స్వగృహంలో కాపు నాయకులతో కలసి ముద్రగడ బుధవారం కూడా 'కంచాల మోత' కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాపులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని మాత్రమే అడుగుతున్నామని.. కొత్తగా గొంతెమ్మ కోర్కెలేమీ కోరడం లేదన్నారు. హామీలను గుర్తు చేసేందుకు పాదయాత్ర చేస్తామంటే.. ప్రభుత్వం అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కాపులను విభజించి పాలించేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. కాగా, పాదయాత్ర కాపులకు మద్దతుగా బీసీలు, దళితులు కూడా పాల్గొంటారని ముద్రగడ చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పన రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంతం నానాజీ, జేఏసీ నాయకులు వాసిరెడ్డి యేసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, జీవీ రమణ, గౌతు స్వామి, గౌతు సుబ్రహ్మణ్యం, మట్టా శివప్రసాద్, తోట బాబు, పెద్దాడ సుబ్బారావు, బస్వా చంద్రమౌళి, పెంటకోట నాగబాబు పాల్గొన్నారు.

424 ఎకరాలు స్వాధీనం చేసుకున్నాం

- గడువులోగా విచారణ పూర్తి చేస్తాం..
- విశాఖ భూకుంభకోణంపై 'సిట్' అధినేత వినీత్ బ్రిజ్‌లాల్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రాన్ని కుదిపేస్తున్న విశాఖపట్నం భూకుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ జరుపుతోంది. ఈ భారీ భూకుంభకోణంపై విచారణ తీరు తెన్నులను 'సిట్' అధినేత వినీత్ బ్రిజ్‌లాల్ 'సాక్షి'కి వివరించారు. ''భూ ఆక్రమణలు, కబ్జాలు, అత్యంత సంక్లిష్టమైన రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, నకిలీ డాక్యుమెంట్ల సృష్టి వంటి వివాదాలపై విచారణ జరపడం చిన్నపని కాదు. ఈ కేసును సీబీఐకి ఇస్తే విచారణ పూర్తికావడానికి రెండేళ్లు పట్టేది. మాకున్న అధికారులతో మా పరిధిలో విచారణ చేస్తున్నాం. గడువులోగా విచారణ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. భూకుంభకోణంపై 2,865 ఫిర్యాదుల్లో 'సిట్' పరిధిలోకి 350 ఫిర్యాదులు వచ్చాయి.. ఇప్పటివరకు 80 ఫిర్యాదులను పరిష్కరించాం. ఇప్పటిదాకా 424 ఎకరాలను స్వాధీనం చేసుకున్నాం. 30 మందిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేశాం.రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా విశాఖ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాల్సిన రికార్డులు చాలావరకు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో, ఇళ్లల్లో దర్శనమిస్తున్నాయి.'' అని వినీత్ బ్రిజ్‌లాల్ చెప్పారు.

సిఫార్సు మాత్రమే చేస్తున్నాం..

'సిట్' విచారణ పారదర్శకంగా సాగుతోంది. ఫలానా వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు మేము ఆదేశాలివ్వడం లేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కేసులు నమోదు చెయ్యాలంటూ ఏ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చెయ్యలేదు. కేవలం జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌కు మాత్రమే సిఫార్సు చేస్తున్నాం. విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. ఆ నివేదికపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం అని వినీత్ బ్రిజ్‌లాల్ తెలిపారు.

'వంశధార' పనులు అడ్డుకున్న నిర్వాసితులు

నిర్వాసిత గ్రామాల్లో యథావిధిగా సంక్షేమ పథకాల అమలుకు డిమాండ్



అధికారులను నిలదీస్తున్న నిర్వాసితులు

హిరమండలం: శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలంలోని వంశధార జలాశయ నిర్వాసితులు బుధవారం ఆందోళనకు దిగారు. జలాశయం స్పిల్‌వే పనులను అడ్డుకున్నారు. పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించకుండా గ్రామాలు ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండడాన్ని వారు తప్పుబట్టారు. ఈ నెలలో ఇవ్వాల్సిన రేషన్ సరుకులు, సామాజిక భద్రత పింఛన్‌లు, అంగన్‌వాడీ పౌష్టికాహారం వంటి వాటిని నిర్వాసిత గ్రామాల్లో కాకుండా పునరావాస కాలనీల్లో పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాటు చేయడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. పునరావాస కాలనీల పనులు పూర్తి కాకపోవడం, నిర్వాసితులు ఇంకా ఇళ్లు కట్టుకోకపోవడంతో ఇప్పుడున్న నిర్వాసిత గ్రామాల్లోనే సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం వంశధార స్పిల్‌వే పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పాలకొండ ఆర్డీవో రెడ్డి గున్నయ్య, తహసీల్దార్ ఎం.కాశీప్రసాద్ సమీక్ష నిర్వహిస్తుండగా.. నిర్వాసితులు అక్కడకు చేరుకొని వారిని నిలదీశారు. ఈనెల 5లోగా నిర్వాసిత గ్రామాల్లో యథావిధిగా సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే భారీస్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అగ్నిమాపక వాహనాలకు ఆర్టీసీ డ్రైవర్లు

- అగ్నిమాపకశాఖకు 73 మంది డ్రైవర్లు అవసరం
- ఈ మేరకు ఆర్టీసీని కోరిన ఏపీ ఫైర్ సర్వీసెస్ అధికారులు
- డ్రైవర్లను ఎంపిక చేసేపనిలో ఆర్టీసీ
- వేతనాలు ఎవరు చెల్లించాలన్నదానిపై సందిగ్ధం



సాక్షి ప్రతినిధి, తిరుపతి: రాష్ట్రంలోని అగ్నిమాపకశాఖ వాహనాలకు ప్రభుత్వం ఆర్టీసీ డ్రైవర్లను వినియోగించనుంది. తొలి విడత కింద 73 మంది డ్రైవర్లు అవసరమని ఏపీ ఫైర్ సర్వీసెస్ ఉన్నతాధికారులు ఆర్టీసీని కోరారు. దీంతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్లు అగ్నిమాపకశాఖకు బదిలీచేయాల్సిన ఆర్టీసీ డ్రైవర్ల జాబితాలు సిద్ధంచేస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ వారం రోజుల నుంచి ఈ మేరకు కసరత్తు మొదలైంది. రాష్ట్రంలోని అగ్నిమాపకశాఖలో 130 డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గడచిన మూడేళ్లుగా నూతన పోస్టుల భర్తీ నిలిచిపోవడంతో హోం గార్డులనే డ్రైవర్లుగా వినియోగిస్తున్నారు. ఇటీవల అగ్నిమాపకశాఖలో సంస్కరణలు చేపట్టిన సందర్భంలో ఆ శాఖ ఉన్నతాధికారులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో గానీ, లేదా ఆర్టీసీ డ్రైవర్లను గానీ సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రెండు నెలల కిందట ప్రభుత్వం ఆర్టీసీకి ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాల వారీగా ఎంతమంది డ్రైవర్లు అవసరమమో తెలియజేస్తూ.. ఎంపికచేసిన డ్రైవర్లను రిలీవ్‌చేసి అగ్నిమాపకశాఖకు పంపాలని ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు వివిధ రీజియన్ల మేనేజర్లు కసరత్తు ప్రారంభించారు. కొన్ని జిల్లాల్లో జాబితాలు పూర్తయ్యాయి. చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఎంపికచేసిన డ్రైవర్లను ఆర్ఎంలు రెండ్రోజుల ముందే రిలీవ్‌చేశారు. వీరంతా వెళ్లి ఆయా జిల్లాల్లోని డీఎఫ్‌వోలను కలిశారు. అయి తే తమకు ఎలాంటి సమాచారం అందలేదని డీఎఫ్‌వోలు సమాధానమిచ్చారు.

ప్రభుత్వంతో చర్చిస్తున్నాం..

అగ్నిమాపకశాఖలోకి తీసుకునే ఆర్టీసీ డ్రైవర్ల వేతనాల చెల్లింపు విషయంపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని ఏపీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జయరామ్‌నాయక్ చెప్పారు. విషయం తేలాకే ఆర్టీసీ డ్రైవర్లను తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆర్థికశాఖ నుంచి ఆమోదం లభిస్తే డ్రైవర్ల నియామక ప్రక్రియ త్వరగా ముగుస్తుందని వివరించారు.

జీతాలు ఎవరిస్తారు..?

అగ్నిమాపకశాఖకు బదిలీపై వెళ్లే ఆర్టీసీ డ్రైవర్లకు నెలవారీ జీతాలు ఎవరు చెల్లించాలో ఇంకా తేలలేదు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న అగ్నిమాపకశాఖ డీజిల్ బిల్లుల చెల్లింపునకే సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో సేవలందుకునేందుకు సిద్ధమే కానీ.. చెల్లింపులు మాత్రం జరపలేమని ఏపీ ఫైర్ సర్వీసెస్ తేల్చి చెబుతోంది. మరోవైపు ఆర్టీసీ కూడా ఇదే చెబుతోంది. అప్పుల్లో ఉన్న సంస్థ ఆ డ్రైవర్లకు ఏ విధంగా జీతాలు చెల్లిస్తుందని ఆ శాఖ అధికారులంటున్నారు.

500 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా బుధవారం విశాఖపట్నంలో శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 500 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. జగదాంబ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో జాతీయ జెండాతో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు డాక్టర్ జహీర్ అహ్మద్, సేవా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

– డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ)

కర్నూలు ఆస్పత్రికి తప్పని ఎలుకల బెడద

- నెలకు రూ.5 లక్షలు వృథా
- విద్యుత్ తీగను ఎలుక కొరకడంతో ఆగిన విద్యుత్ సరఫరా

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకల బెడద ఎక్కువైంది. వాటి నివారణకు నెలకు రూ.5 లక్షలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. బుధవారం ఉదయం ఆస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో విద్యుత్ తీగను ఓ ఎలుక కొరకడంతో షార్ట్ సర్క్యూటైంది. దీంతో 30 నిమిషాలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదే సమయంలో శుశృతభవన్‌లో ఫ్యూజ్ పోవడంతో ఉదయం అరగంట సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అసలే ఎండవేడిమి, ఉక్కపోతతో తాము అల్లాడి పోతున్నామని వాపోతున్నారు. ఆస్పత్రిలోని క్యాన్సర్, గైనిక్, సర్జరీ విభాగాలు, టీబీ, ఫిమేల్, మానసిక రోగుల వార్డుల్లో ఎలుకల సంచారం అధికంగా ఉందని రోగులు చెబుతున్నారు. వీటి నివారణకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

'ఉద్దానం బాధితులకు ప్రభుత్వ వనరుల నుంచే నిధులివ్వాలి'

సాక్షి, అమరావతి: ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వ వనరుల నుంచే ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. రవీంద్రతో కలిసి ఆయన బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఉద్దానం కిడ్నీ బాధితుల్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయమే అయినప్పటికీ అందుకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులు కేటాయించవద్దని కోరారు.

రవాణా శాఖ చెక్‌పోస్టుల ఎత్తివేతకు ప్రతిపాదనలు!

క్వార్టర్లీ, ఎంట్రీ ట్యాక్స్‌ల చెల్లింపులకు ఆన్‌లైన్‌లో అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రవాణా శాఖ నిర్వహిస్తున్న చెక్‌పోస్టుల్ని ఎత్తివేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం పొందితే రాష్ట్రంలో ఇకపై రవాణా శాఖ చెక్‌పోస్టులు ఉండవు. ఇప్పటికే జీఎస్టీ కారణంతో రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖ చెక్‌పోస్టుల్ని ఎత్తేసిన సంగతి తెలిసిందే. రవాణా శాఖ సైతం త్రైమాసిక పన్నులు, ఎంట్రీ ట్యాక్స్ కట్టించుకునేందుకు చెక్‌పోస్టుల్ని నిర్వహిస్తుంది. ఇకపై క్వార్టర్లీ, ఎంట్రీ ట్యాక్స్, రహదారి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసేందుకు రవాణా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రవాణా శాఖలో మొత్తం 83 రకాల సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. దీని ద్వారా రవాణా శాఖ కార్యాలయాల్లో దళారుల ప్రమేయం చాలా వరకు తగ్గిపోయింది. అధికారుల అవినీతికి కొంత మేర తగ్గింది. ప్రస్తుతం రాష్ట్రంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 15 చెక్‌పోస్టుల్లో పన్నులు కట్టించుకోవడంతో పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ చెక్‌పోస్టుల్లో మామూళ్ల దందా పెరిగిపోవడంతో ఏసీబీ అధికారులు తరచూ దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో చెక్‌పోస్టుల్లో అవినీతిని తగ్గించేందుకు గాను పన్నులన్నీ ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం కల్పించి తనిఖీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

15 చెక్‌పోస్టుల ద్వారా ఏటా రూ. 80 కోట్ల ఆదాయం

రవాణా శాఖ నిర్వహిస్తున్న 15 చెక్‌పోస్టుల ద్వారా ఏటా ప్రభుత్వానికి రూ. 80 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. రహదారి పన్నులు, విధిగా ప్రతి మూడు నెలలకోసారి చెల్లించాల్సిన పన్నుతో పాటు ఎంట్రీ ట్యాక్స్‌తో రూ. 75 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. తనిఖీల ద్వారా కేవలం రూ. 5 కోట్ల ఆదాయం మాత్రమే వసూలవుతోంది. చెక్‌పోస్టుల్లో నిబంధనలు పట్టించుకోకుండా వాహనాలను వదిలేయడం ద్వారా నెలకు రూ. 40–50 వేలు మామూళ్లు అధికారులకు అందుతున్నాయని ఏసీబీ ఓ నివేదిక ఇవ్వడం గమనార్హం. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని రవాణా అధికారులు విధిగా కట్టాల్సిన పన్నుల్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులకు అవకాశం ఇచ్చినట్లు రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి' ప్రతినిధికి వివరించారు.

ఉద్యోగులకు చేటుచేసే నిర్ణయాలు సహించం

- టీడీపీ హయాంలో కొరవడిన ఉద్యోగ భద్రత
- ప్రభుత్వ ఉద్యోగులకు అండగా వైఎస్సార్‌సీపీ
- అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి(మాడుగుల): ఉద్యోగులకు చేటు కలిగించేలా రాష్ట్రప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా చూస్తూ ఊరుకోబోమని అసెంబ్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు హెచ్చరించారు. విశాఖ జిల్లా దేవరాపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగ భద్రత కొరవడిందని, ఎప్పుడే నిర్ణయం తీసుకుంటారోనని ఉద్యోగులు భయాందోళనలతో గడుపుతున్నారని చెప్పారు. సర్వీసులో ఉన్న ఉద్యోగుల్ని కుంటిసాకులతో సాగనంపి ఆ స్థానంలో టీడీపీ అనుయాయులకు అవకాశమివ్వాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అనుమానం వెలిబుచ్చారు. ఉద్యోగులపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. చంద్రబాబు సీఎంగా పగ్గాలు చేపట్టగానే రాష్ట్రంలో మద్యం బెల్టుషాపులు లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలికారని, అయితే గత మూడేళ్లలో విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణకు అవకాశమిచ్చారని ఆయన విమర్శించారు. మూడంచెలుగా మద్యం షాపుల్ని పూర్తిగా నియంత్రిస్తామని వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో తమ పార్టీ అధినేత హామీ ఇవ్వడంతో బెంబేలెత్తిన చంద్రబాబు బెల్టుషాపులు రద్దు చేస్తున్నట్లు హడావుడిగా ప్రకటించారని గుర్తుచేశారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న పింఛన్లు, పక్కా ఇళ్లు, రేషన్‌కార్డులు.. ఇలా ప్రతిదానికీ రేటు నిర్ణయించి కిరికిరి(జన్మభూమి) కమిటీ సభ్యులు ప్రజల్ని దోచుకుతింటున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో జగన్ ప్రకటించిన నవరత్నాల పథకాలతో సీఎం నుంచి మంత్రుల వరకు టీడీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైందని, ఈ క్రమంలోనే మంత్రులు సంధిప్రేలాపనలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

మార్కెట్ ధర చెల్లిస్తేనే భూములిస్తాం...

- ప్రకాశం జిల్లా రైతాంగం స్పష్టీకరణ
- అమరావతి–అనంతపురం రహదారి కోసం భూసేకరణ
- రిజిస్ట్రేషన్ విలువే చెల్లిస్తామంటున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పేరుతో రైతుల భూములను బలవంతంగా లాక్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. కేవలం రిజిస్ట్రేషన్ విలువను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించగా భూసేకరణ చట్టం–2013 ప్రకారం మార్కెట్ ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పరిహారం విషయం తేల్చకుండా భూసేకరణ చేస్తే సహించబోమని హెచ్చరిస్తున్నారు. న్యాయం కోసం ఇప్పటికే ఆందోళన బాట పట్టారు.

భూసేకరణ ప్రక్రియ ప్రారంభం

అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారి ప్రకాశం జిల్లాలో అద్దంకి, దర్శి, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలో 169.380 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం 2,807.25 హెక్టార్లు భూములు సేకరించాల్సి ఉంది. కడప నుంచి గిద్దలూరు నియోజకవర్గంలో నిర్మించే నాలుగు వరుసల రహదారి కోసం మరో 353.70 హెక్టార్లు సేకరించాలి. గిద్దలూరు నియోజకవర్గంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట, కంభం, మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, తర్లుబాడు, దర్శి నియోజకవర్గంలో దొనకొండ, కురిచేడు, దర్శి, అద్దంకి నియోజకవర్గంలో సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలోని 50 గ్రామాల్లో ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం జరగనుంది. ఇందులో భాగంగా కడప నుండి వచ్చే మరో రోడ్డును ప్రకాశం జిల్లాలోని కొమరోలు, రాచర్ల ప్రాంతాల్లో 29.850 కిలో మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇప్పటికే నేషనల్ హైవే అథారిటీ భూసేకరణ ప్రక్రియ ప్రారంభించారు.

ధరల్లో ఎంతో వ్యత్యాసం

రహదారి నిర్మాణం జరిగే అద్దంకి, దర్శి, మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ లెక్కల ప్రకారం ఎకరం భూమి విలువ రూ.1.50 లక్షల నుంచి రూ.4 లక్షల లోపే ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.8 లక్షల నుంచి రూ.30 లక్షల దాకా పలుకుతోంది. ఈ ప్రాంతంలో రైతులు మిరప, పత్తి, పొగాకు తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. అద్దంకి, దర్శి ప్రాంతాల్లో నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని ఆయకట్టు ఉండగా, మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాల్లో వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో భూములున్నాయి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ భూముల్లో బంగారు పంటలు పండుతాయి. రహదారి నిర్మాణం కోసం సేకరించే భూమికి రిజిస్ట్రేషన్ విలువను మాత్రమే చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అదే జరిగితే తాము తీవ్రంగా నష్టపోతామని, మార్కెట్ విలువ చెల్లించాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



హరికృష్ణకు మూడో స్థానం

బీల్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ మూడో స్థానం సంపాదించాడు. స్విట్జర్లాండ్‌లో బుధవారం ముగిసిన ఈ టోర్నీలో హరికృష్ణ 5.5 పాయింట్లు సాధించాడు. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో హరికృష్ణ తెల్లపావులతో ఆడుతూ 29 ఎత్తుల్లో ఎటెన్ని బాక్రోట్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీలో హరికృష్ణకిదే తొలి ఓటమి కావడం గమనార్హం. ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హరికృష్ణ, మరో మూడు గేముల్లో గెలిచాడు. 6.5 పాయింట్లతో బాక్రోట్ విజేతగా అవతరించగా... ప్రపంచ మహిళల చాంపియన్ హూ ఇఫాన్ (చైనా) 6 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది.

'రెండు'లోనే ముగించాలని...

సిరీస్ విజయంపై భారత్ కన్ను • తీవ్ర ఒత్తిడిలో శ్రీలంక • నేటి నుంచి రెండో టెస్టు • తుది జట్టులోకి రాహుల్

కొద్ది రోజుల క్రితం టీమిండియా నంబర్‌వన్ టెస్టు జట్టు హోదాలోనే శ్రీలంకలో అడుగు పెట్టింది. భారత్ ఆటపై అపార నమ్మకం ఉన్నా... సొంతగడ్డపై శ్రీలంక మరీ ఇంత పేలవంగా ఆడి తలవంచుతుందని కూడా ఎవరూ ఊహించలేదు. కానీ తొలి టెస్టులో ఆ జట్టు ప్రదర్శన ఇరు జట్ల మధ్య అంతరాన్ని భారీగా పెంచేసింది. అద్భుత ఫామ్‌లో ఉన్న టీమిండియాను లంక ఇక ముందు కూడా ఆపే అవకాశం కనిపించడం లేదు. అదే జరిగితే వరుసగా రెండో పర్యటనలోనూ సిరీస్ భారత్ సొంతమవుతుంది.

రెండేళ్ల క్రితం తొలి టెస్టులో ఓడి ఆ తర్వాత వరుసగా రెండు విజయాలతో భారత బృందం సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. నాటితో పోలిస్తే ఇప్పుడు మన జట్టు మరింత పటిష్టంగా మారగా, శ్రీలంక జట్టు మాత్రం ఎన్నడూ లేనంత బలహీనంగా కనిపిస్తోంది. పైగా కీలక ఆటగాళ్లు గాయపడటంతో తుది జట్టును ఎంచుకునే విషయంలో కూడా లంక తర్జనభర్జన పడుతోంది. ఈ నేపథ్యంలో ఆతిథ్య జట్టు ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇస్తుందో చూడాలి.



31 ఈ మ్యాచ్‌తో భారత్ తరఫున కనీసం 50 టెస్టులు ఆడిన 31వ క్రికెటర్‌గా పుజారా గుర్తింపు పొందనున్నాడు

28 రాహుల్ తుది జట్టులోకి వస్తే కెప్టెన్‌గా తుది జట్టు విషయంలో కోహ్లి తన ప్రత్యేకతను మరోసారి నిలబెట్టుకున్నట్లవుతుంది. వరుసగా 27 టెస్టుల్లో కనీసం ఒక్క ఆటగాడినైనా మార్చిన కోహ్లి... 28వ టెస్టులోనూ దానిని కొనసాగించనున్నాడు.

కొలంబో: శ్రీలంకతో తొలి టెస్టులో ఘన విజయం సాధించిన భారత్ సిరీస్ విజయంపై దృష్టి పెట్టింది. నేటి నుంచి ఇక్కడి సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జరగనుంది. తొలి మ్యాచ్‌లో భారత్ 304 పరుగుల తేడాతో గెలిచింది. అనారోగ్యం నుంచి కోలుకున్న శ్రీలంక కెప్టెన్ దినేశ్ చండిమాల్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతుండగా... భారత జట్టులోకి లోకేశ్ రాహుల్ రావడం ఖాయమైంది.

అందరూ ఫామ్‌లో...

గాలే టెస్టులో భారత జట్టు టాప్-5 బ్యాట్స్‌మెన్ అంతా కనీసం అర్ధ సెంచరీ అయినా సాధించారు. వీరిలో ధావన్, పుజారా, కోహ్లి సెంచరీలతో చెలరేగారు. ఈ మ్యాచ్‌లో భారత్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 840 పరుగులను అతి వేగంగా 4.5 రన్‌రేట్‌తో సాధించింది. కాబట్టి బ్యాటింగ్ విషయంలో టీమిండియా ఏ రకంగా కూడా ఆందోళన చెందాల్సిన పని లేదు. అయితే తుది జట్టులో ఒక కీలక మార్పు జరగనుంది. ఓపెనర్ ముకుంద్ స్థానంలో రాహుల్ బరిలోకి దిగుతున్నట్లు కోహ్లి ఇప్పటికే ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఏడు ఇన్నింగ్స్‌లలో ఆరు అర్ధ సెంచరీలు చేసిన అనంతరం ఆటకు దూరమయ్యాడు. ఇప్పుడు అతని రాక జట్టు బలాన్ని మరింత పెంచనుంది. బౌలింగ్ విభాగంలో గత మ్యాచ్‌లో భారత జట్టులో అందరూ వికెట్లు తీశారు. హార్దిక్ పాండ్యా కూడా తన తొలి మ్యాచ్‌లోనే ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అయితే పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో భారత్ మూడో స్పిన్నర్‌ను ఆడించే ఆలోచన ఉంది. కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకుంటే పాండ్యా తప్పుకోవాల్సి రావచ్చు. ఓవరాల్‌గా దుర్భేద్యంగా కనిపిస్తున్న భారత్‌ను నిలువరించాలంటే లంక తీవ్రంగా శ్రమించాలి.

హెరాత్ ఆడతాడా?

తొలి టెస్టులో పరాజయంతో పాటు కీలక ఆటగాళ్ల గాయాలు లంక మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీశాయి. గాయం కారణంగా ప్రధాన బ్యాట్స్‌మన్ అసెలా గుణరత్నే తప్పుకోవడం జట్టును బలహీనం చేసింది. అతని స్థానంలో తిరిమన్నె లేదా ధనంజయ డి సిల్వా బరిలోకి దిగుతారు. హెరాత్ గాయంతో గత టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కే రాలేదు. అతని ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత లేకపోయినా... ఆడాలని లంక కోరుకుంటోంది. శ్రీలంక కూడా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భావిస్తోంది. మరో లెఫ్టార్మ్ స్పిన్నర్ మలింద పుష్పకుమారకు తొలి టెస్టు ఆడే అవకాశం లభించవచ్చు. మరోవైపు కెప్టెన్, కీలక బ్యాట్స్‌మన్ చండిమాల్ తిరిగి రావడం మాత్రం ఊరటనిచ్చే అంశం. తొలి టెస్టులో ఘోర పరాభవంతో అన్ని వైపుల నుంచి జట్టుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని లంక పట్టుదలగా ఉంది.

ఉదయం గం. 10.00 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), ధావన్, రాహుల్, పుజారా, రహానే, అశ్విన్, సాహా, జడేజా, పాండ్యా/కుల్దీప్, ఉమేశ్, షమీ.

శ్రీలంక: చండిమాల్ (కెప్టెన్), తరంగ, కరుణరత్నే, కుషాల్ మెండిస్, మాథ్యూస్, డిక్‌వెలా, ధనంజయ, పెరీరా, హెరాత్, పుష్పకుమార, ప్రదీప్.

పిచ్, వాతావరణం

తొలి టెస్టుతో పోలిస్తే ఇక్కడి పిచ్ పొడిగా ఉంది. రెండు రోజుల పాటు మంచి బ్యాటింగ్ చేయవచ్చు. మూడో రోజు నుంచి స్పిన్‌కు బాగా అనుకూలిస్తుంది. మ్యాచ్ జరిగే రోజుల్లో చిరుజల్లులకు అవకాశం ఉంది.

నాలుగు రోజుల్లోనే ముగుస్తుందేమో!

సునీల్ గావస్కర్

తొలి టెస్టు గెలిచిన ఉత్సాహంతో ఉన్న భారత్ రెండో టెస్టుకూ సర్వసన్నద్ధమైంది. ఓపెనర్ కేఎల్ రాహుల్ పూర్తి ఫిట్‌నెస్‌ను సంతరించుకున్నాడు. దీంతో రాహుల్‌కు తుది జట్టులో స్థానం కోసం తొలి టెస్టులో మెరుగ్గా ఆడిన మరో ఓపెనర్ అభినవ్ ముకుంద్‌ను పెవిలియన్‌కు పరిమితం చేయాలా? లేదంటే ఒక బౌలర్‌ను తగ్గించాలా? లేక ఎలాంటి మార్పులు చేయకుండా గెలిచిన జట్టునే ఈ మ్యాచ్‌కూ కొనసాగించాలా? అనేది కోహ్లికి సమస్యగా మారింది. తొలి టెస్టులో శిఖర్ ధావన్ తొలి రోజే అద్వితీయ బ్యాటింగ్‌తో లంక నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు.

మరోవైపు గత రెండేళ్లుగా భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు చతేశ్వర్ పుజారా వెన్నెముకగా ఉన్నాడు. తాను క్రీజులో ఉంటే మరో ఎండ్‌లోని బ్యాట్స్‌మెన్ ఎలాంటి ఒత్తిడికిలోనుకాకుండా స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని పుజారా కల్పిస్తాడు. గతంలో రాహుల్ ద్రవిడ్ పోషించిన పాత్రను ఇప్పుడు పుజారా నిర్వర్తిస్తున్నాడు. ద్రవిడ్ మాదిరిగానే పుజారాకు కూడా సరైన గుర్తింపు లభించడంలేదని చెప్పాలి. తొలి వికెట్ పడగానే క్రీజులోకి వచ్చినపుడు పుజారా కుదురుగా ఆడి ప్రత్యర్థి బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తాడు. పుజారాను అవుట్ చేయాలనే ఉద్దేశంతో బౌలర్లు ప్రయోగాలకు పోయి తమ లయను కోల్పోతుంటారు. భారత పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌తో పుజారా కూడా లాభపడ్డాడు. తాను అవుటైతే మిగతా బ్యాట్స్‌మెన్‌కు భారీ స్కోరు అందించే సత్తా ఉందనే నమ్మకంతో పుజారా తన ఆటతీరులో జోరు పెంచుతుంటాడు. కెరీర్‌లో 50వ టెస్టు ఆడబోతున్న పుజారా తనకెంతో ప్రత్యేకమైన మ్యాచ్‌లో మరో గొప్ప ఇన్నింగ్స్ ఆడాలని కోరుకుంటున్నాడు. ఇక హార్దిక్ పాండ్యా తన అరంగేట్రం టెస్టులోనే ఆకట్టుకున్నాడు. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో ఒక వికెట్ కూడా తీసుకున్నాడు. అయితే కోహ్లి మాత్రం టాప్ బ్యాట్స్‌మెన్ అవుటయ్యాకే పాండ్యాకు బౌలింగ్ ఇవ్వాలని భావిస్తున్నాడు. పాండ్యా ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సి వస్తే అతనికి మరిన్ని ఓవర్లు బౌలింగ్ చేసే అవకాశం ఇవ్వాలి. లేదంటే పాండ్యా స్థానంలో స్పెషలిస్ట్ బౌలర్‌ను తది జట్టులోకి తీసుకోవాలి.

ఇక ఆతిథ్య శ్రీలంక జట్టు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. భారత్‌కు సవాల్ విసరాలంటే శ్రీలంక ఆటతీరు ఎంతో మెరుగు పడాలి. కెప్టెన్ దినేశ్ చండిమాల్, లాహిరు తిరుమన్నేల రాకతో లంక మిడిల్ ఆర్డర్ కాస్త పటిష్టమైంది. అయితే ఓపెనర్లు శుభారంభం ఇవ్వాల్సిన అవసరముంది. తొలి టెస్టులో నువాన్ ప్రదీప్ ఆరు వికెట్లు తీసుకున్నా మిగతా బౌలర్లు విఫలమయ్యారు. నిజం చెప్పాలంటే భారత్ 20 వికెట్లు తీసే సత్తా లంక బౌలింగ్‌లో కనిపించడం లేదు. భారత్ మరీ చెత్తగా ఆడితే తప్ప ఈ మ్యాచ్‌లోనూ లంకకు కష్టాలు తప్పవు. ప్రస్తుతం భారత్ జోరు చూస్తుంటే రెండో టెస్టు కూడా నాలుగు రోజుల్లోనే ముగిసేలా అనిపిస్తోంది.



రాహుల్ ఓపెనర్‌గా తనను తాను నిరూపించుకున్నాడు. ఫిట్‌గా మారిన తర్వాత అతనికి మళ్లీ అవకాశం ఇవ్వడం ధర్మం. తన స్థానంపై అతనికి భరోసా అవసరం. ఈ టెస్టు కోసం సిద్ధం చేసిన వికెట్ బాగుంది. కచ్చితంగా ఫలితం వచ్చే అవకాశం ఉంది. జట్టుగా మేం ఇలాంటి పిచ్‌లనే కోరుకుంటున్నాం. గత టెస్టులో భారీ తేడాతో గెలిచినా కూడా మాలో అక్కడక్కడా చిన్న చిన్న లోపాలు కనిపించాయి. వాటిని ఈ మ్యాచ్‌లో సరిదిద్దుకోగలమని నమ్ముతున్నాం.

– విరాట్ కోహ్లి, భారత కెప్టెన్



చండిమాల్‌కు ఐసీసీ అనుమతి

న్యుమోనియా కారణంగా తొలి టెస్టుకు దూరమైన శ్రీలంక కెప్టెన్ చండిమాల్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్నాడు. అయితే అతను పూర్తి స్థాయిలో కోలుకోలేదు. ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది రాకుండా అతను ఇన్‌హేలర్స్‌ను వాడుతున్నాడు. అయితే డోపింగ్ సమస్య రాకుండా దీని గురించి ఐసీసీకి స్పష్టంగా వివరాలు అందించి చండిమాల్ ప్రత్యేక అనుమతి తీసుకున్నాడు.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్


బెంగాల్ ఆటగాళ్లకు చిక్కిన రాహుల్ చౌదరి

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన జోన్ 'బి' మ్యాచ్‌లో టైటాన్స్ 24-30 స్కోరుతో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓటమి చవిచూసింది. ఈ సీజన్‌లో తెలుగు జట్టుకిది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. టైటాన్స్ జట్టులో వికాస్ (9 పాయింట్లు) రాణించగా, రాహుల్ చౌదరి, నీలేష్ సాలుంకే తలో 5 పాయింట్లు చేశారు. బెంగాల్ తరపున మణిందర్ సింగ్ (11) రెచ్చిపోయాడు. జంగ్ కున్ లీ 8 పాయింట్లు సాధించాడు. బెంగాల్ డిఫెండర్లు టైటాన్స్ రైడర్లను అద్భుతంగా కట్టడి చేశారు. మణిందర్ ప్రదర్శనతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 19-14తో బెంగాల్ జట్టు ఆధిక్యంలో నిలిచింది. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి రైడింగ్‌లో నిరాశపరిచాడు.

హర్యానా, గుజరాత్ మ్యాచ్ టై

అంతకుముందు హర్యానా స్టీలర్స్, గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ జట్ల మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్ 27-27తో టైగా ముగిసింది. మ్యాచ్ ముగిసే దశలో హర్యానా ఆటగాళ్లు అద్భుతంగా రాణించారు. కేవలం 5 నిమిషాల వ్యవధిలో 13 పాయింట్లు సాధించారు. ఈ మ్యాచ్‌లో స్టీలర్స్ తరపున సుర్జీత్ సింగ్, వికాస్ ఆరేసి పాయింట్లు చేయగా, గుజరాత్ జట్టులో మహేంద్ర కుమార్ 5 పాయింట్లు సాధించాడు. *హైదరాబాద్ అంచె పోటీల్లో భాగంగా గురువారం జరిగే చివరి మ్యాచ్‌లో పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడుతుంది. రాత్రి 8 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-2 చానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.*

క్వార్టర్స్‌లో కశ్యప్



ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారులు పారుపల్లి కశ్యప్, సిరిల్ వర్మ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. వీరిద్దరితో పాటు ప్రణయ్, సౌరభ్ వర్మ కూడా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో కశ్యప్ 21-9, 21-8తో ఆస్కార్ గువో (న్యూజిలాండ్)పై, సిరిల్ వర్మ 21-14, 21-16తో సపుత్ర విక్కీ అంగా (ఇండోనేసియా)పై విజయం సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో ప్రణయ్ 23-21, 21-18తో ఫర్మాన్ అబ్దుల్ ఖాలిక్ (ఇండోనేసియా)పై, సౌరభ్ వర్మ 21-16, 21-16తో విబవో (ఇండోనేసియా)పై గెలిచారు.

ఆఖరి పరుగుకు ప్రత్యేక బూట్లు



'లండన్' రేస్‌కు బోల్ట్ రెడీ

లండన్: జమైకన్ దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్. ట్రాక్‌లో అతని వేగం అందుకోలేరెవరు. ఈ మల్టీ ఒలింపిక్ చాంపియన్ పతకం రేసు ఇప్పుడు ఆఖరి మజిలీకి చేరుకుంది. లండన్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ తర్వాత ఆ పరుగు ఇక చరిత్రే. ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన ఈ సంచలన స్ప్రింటర్ ఆఖరి రేసుకు ప్రత్యేక బూట్లు సిద్ధమయ్యాయి. ప్రఖ్యాత షూ కంపెనీ 'ప్యూమా' బోల్ట్ వేగాన్ని, తేజాన్ని ఆవిష్కరించే విధంగా ఈ బూట్లను తయారు చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బోల్ట్ తల్లిదండ్రులు వెలెస్లీ, జెన్నిఫర్ బోల్ట్ అతనికి అందజేశారు. ఈ రెండు బూట్లు విభిన్న రంగుల్లో ఉన్నాయి. ఒక బూటు పర్పుల్ కలర్‌లో ఉంది. ఇది బోల్ట్ ఓనమాలు నేర్చుకున్న 'విలియం నిబ్ హైస్కూల్'కు సంబంధించిన కలర్ కాగా... దీనిపై ఫరెవర్ (ఎప్పటికీ) అని రాసివుంది. మరో బూటుపై ఫాస్టెస్ట్ (వేగం) అని ఒమెగా సింబల్‌తో ఉంది. ఇది ముగింపునకు నిదర్శనమని 'ప్యూమా' సంస్థ తెలిపింది. ఈ రెండు షూలపై ప్రత్యేక రాతలు, గీతలు అతని కెరీర్ హైలైట్స్‌ను సూచిస్తాయి. రెండు సాక్స్ అతని ఘనతల్ని తెలిపేలా ప్రత్యేకంగా ఉన్నాయి. శనివారం రాత్రి ఈ బూట్లతోనే బోల్ట్ ఆఖరి పరుగు పెడతాడు. ఆల్ ది బెస్ట్... లెజెండ్!

ఏపీకి సమర్థమైన సీఎం కావాలని యాగం

ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



మహారుద్ర సహిత సహస్ర చండీ యాగంలో పూజలు చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో అర్చకులు, పార్టీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్రానికి సమర్థమైన ముఖ్యమంత్రి కావాలని కోరుతూ మహారుద్ర సహిత సహస్ర చండీ యాగం జరుగుతోందని ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. స్థానిక ఎల్‌బీనగర్ స్నేహపురి కాలనీలో బుధవారం బ్రహ్మశ్రీ నల్లపెద్ది శివరామ ప్రసాద శర్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి 2019లో జరిగే ఎన్నికల్లో అఖండ విజయం సాధిం చాలని ఆకాంక్షిస్తూ చేస్తున్న యాగంలో భాగంగా నిర్వహించిన మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర చండీ పారాయణ హోమం, మహా విద్యాపారాయణ హోమం, ప్రత్యంగిరి హో మం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని, ధూప దీప నైవేద్యంతో ఆలయాల అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఆ విధంగా రాష్ట్రం మళ్లీ అన్ని విధాలా అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. 2019 ఎన్నికలు జరిగేంతవరకు హోమం జరుగుతుందని, రాష్ట్ర అభివృద్ధి కోరుకునే వారందరూ ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తరువాత అభివృద్ధి మరింత వేగవంతంగా జరగాలని జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని మ హా సంకల్పంతో యాగం చేస్తున్నామని శివరామ ప్రసాదశర్మ తెలిపారు. ఈ సందర్భంగా వైవీ సు బ్బారెడ్డి శివరామ ప్రసాద శర్మకు రూ.1 లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరప్రసాద్‌రెడ్డి, ఎల్‌బీనగర్ కో ఆర్డినేటర్ బండారు వెంకటరమణ, దుర్గ సుకేందర్ రెడ్డి, ఎం.రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

6న గిరిబాబుకు జంధ్యాల స్మారక పురస్కారం

సుమధుర కళానికేతన్ గౌరవ సలహాదారు ఎంసీ దాస్ వెల్లడి



విజయవాడ కల్చరల్: ప్రముఖ సినీనటుడు గిరిబాబుకు 2017 సంవత్సరానికి గాను జంధ్యాల స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్లు సుమధుర కళానికేతన్ గౌరవ సలహాదారు డాక్టర్ ఎంసీ దాస్ చెప్పారు. బుధవారం విజయవాడలోని హోటల్ మినర్వాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమధుర కళానికేతన్ 22 ఏళ్లుగా హాస్య నాటికల పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈనెల 4న సాయంత్రం 6 గంటలకు సిద్ధార్థ కళాశాలలో 22వ జాతీయ హాస్య నాటికల పోటీలు ప్రారంభమౌతాయని తెలిపారు. 6వ తేదీ జరిగే ముగింపు సభలో గిరిబాబుకు పురస్కార ప్రదానం ఉంటుందన్నారు. పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎన్.మురళీకృష్ణ, సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, నిర్వహణ కార్యదర్శి పీఎస్ఎన్.మూర్తి, వ్యవస్థాపక కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆమె ఆశయానికి 'జీవం'

- రూ.కోటి విలువైన ఆస్తి రామకృష్ణ మఠానికి విరాళంగా రాసిన మహిళ
- మూడేళ్ల కిందట మృతి
- నేడు మఠం బాధ్యులకు ఆస్తి అప్పగింత

తెనాలి: మూడేళ్ల కిందట ఆమె మరణించినా ఆమె ఆశయం ఇప్పుడు జీవంపోసుకోనుంది. తన ఆస్తి సామాజిక సేవలో తరిస్తున్న ఆధ్యాత్మిక సంస్థకు చెందాలని మృత్యువు ముంగిట్లో ఉన్నప్పుడు ఆమె విల్లు రాశారు. తాను మరణించాక తన ఆస్తిని సంరక్షిస్తూ, విల్లును అమలుచేసే బాధ్యతను పరిచయస్తులు నలుగురికి అప్పగించారు. ఇప్పటి వరకూ వారు కంటికి రెప్పలా కాపాడిన ఆస్తిని గురువారం ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులకు అప్పగించనున్నారు.

రామకృష్ణ మఠానికి విల్లు రాశారు

తెనాలికి చెందిన ఆమె పేరు చిలుకూరి బాలాత్రిపురసుందరి. ఎమ్మెస్సీ చేశాక బ్యాంకు ఉద్యోగంలో చేరారు. ఆమెకు పిల్లలు లేరు. వివాహమైన నాలుగేళ్ల తర్వాత ఆమె భర్త కనిపించకుండా వెళ్లిపోయాడు. తన 57 ఏళ్ల వయసులో ఆమె క్యాన్సర్‌కు గురయ్యారు. దీంతో తన ఆస్తిని సత్కార్యం కోసం వినియోగించాలని నిర్ణయించుకున్నారు. రామకృష్ణ మఠం ఇందుకు సరైనదని భావించారు. అనుకున్నదే తడవుగా తెనాలి నాజరుపేట అబ్బరాజువారివీధిలోని తన నివాస గృహాన్ని రామకృష్ణమఠానికి విల్లు రాశారు. మరో రూ.12 లక్షలను కూడా ఆ మఠానికే రాశారు. తాను పోయాక ఆస్తిని మఠానికి అందించే బాధ్యతను పరిచయస్తులైన బాపట్ల వెంకటలక్ష్మీనారాయణ, మద్ది రామకృష్ణ, సంకా వెంకటేశ్వర్లు, చింతలపాటి రామకృష్ణకు అప్పగించారు. ఆ తర్వాత 2014లో ఆమె కన్నుమూశారు.

ఆశయాన్ని అమలు చేశారు: విల్లు అమలు బాధ్యుల్లో ఒకరైన వెంకటలక్ష్మీనారాయణ కూడా మృతిచెందారు. మిగిలిన ముగ్గురూ బాలాత్రిపురసుందరి ఆశయాన్ని నెరవేర్చేందుకు ఉపక్రమించారు. ముందుగా రామకృష్ణమఠానికి విల్లు విషయాన్ని తెలియజేసి వారితో సంప్రదింపులు జరిపారు. ఆ ప్రకారం రామకృష్ణమఠానికి అనుబంధమైన రామకృష్ణ మిషన్ స్టూడెంట్స్ హోమ్ (చెన్నై) కార్యదర్శి స్వామి సత్యజ్ఞానానంద గురువారం తెనాలి రాను న్నారు. పదిమంది సమక్షంలో బాలాత్రిపురసుందరి ఇంటిని, రూ.12 లక్షల నగదు కలిపి మొత్తం కోటి రూపాయల ఆస్తిని సాయిభక్తుడైన సంకా వెంకటేశ్వర్లు ఆయనకు అందజేయనున్నారు. అలాగే బాలత్రిపురసుందరి కోరిక మేరకు ఇప్పటికే రూ.2 లక్షలను వారణాశిలోని కాశీ అన్నపూర్ణ అన్న క్షేత్ర ట్రస్ట్‌కు నిత్యాన్నదాన పథకానికి వారు విరాళంగా పంపారు.



బాలాత్రిపుర సుందరి (ఫైల్)



విరాళంగా ఇచ్చిన బాలాత్రిపురసుందరి నివాసం

- ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకే కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్యాస్ సబ్సిడీకి ఎగనామం పెడుతోందని సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.నారాయణ ఆరోపించారు. గ్యాస్ సబ్సిడీని పూర్తిగా రద్దు చేసేందుకు ప్రతి నెలా గ్యాస్ సిలిండర్ ధరను రు.4 చొప్పున పెం చాలనే కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టారు. బుధవారం విజయవాడలో ఆయన విలేఖరులతో మాట్లాడారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి
ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
గురువారం ॥ 3-8-2017



నొప్పి ఒక అరుపు... శరీరం పెడుతున్న కేక.
జాగ్రత్త.. జాగ్రత్త అని చేస్తున్న హెచ్చరిక.
'లిమిట్ క్రాస్ అవొద్దు.. ప్రాబ్లం పెద్దదౌతుంది..
చెప్పిన మాట విను... అది నీ మంచి కోసమే' అని
మైండ్.. బాడీకి ఇస్తున్న సిగ్నల్.
నడుము నొప్పి ప్రాణం తీసేది కాదు... కానీ ప్రాణం తీసేంత నొప్పి.
కొన్ని సూచనలు, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే..
అక్కచెల్లెళ్లూ... మీరెంతో చురుగ్గా, చలాకీగా ఉంటారు.

నడుము అరుస్తోందా?!

మహిళల్లో నడుమునొప్పి...

నడుమునొప్పి చాలా సాధారణంగా కనిపించే సమస్య. కానీ మహిళల్లో ఇది మరింత ఎక్కువ. రోజంతా నిలబడి వంట చేసే సమయంలో నడుము ఒంచి ఉండటం నడుమునొప్పి ముప్పును పెంచుతుంది. ప్రపంచవ్యాప్తంగా నడుమునొప్పి తీవ్రత విషయంలో పురుషులు, మహిళలల్లో తేడాలు ఉంటాయి. భారత్‌లో పురుషుల్లో 18 శాతం మంది నడుమునొప్పితో బాధపడుతుంటే మహిళల్లో అది 25 శాతం. పైగా మహిళల్లోని రుతుస్రావం నొప్పి వారి నడుమునొప్పిని మరింత ప్రభావితం చేస్తుంది. అంతేకాదు... వారిలో ప్రత్యేకంగా స్రవించే హార్మోన్లు సైతం నొప్పిని మరింత తీవ్రతరం చేస్తుంటాయి. పురుషుల్లో కంటే మహిళల్లో ఇన్‌ఫ్లమేషన్ (నొప్పి, వాపు, మంట)కు స్పందించడం కాస్తంత తీవ్రంగా ఉంటుంది. ఒకేలాంటి నొప్పి అయినా మగవారితో పోలిస్తే మహిళల్లో ఆ నొప్పి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. హార్మోన్లు, జన్యువులు, మనస్తత్వం, నొప్పి తెలిసే వ్యవస్థ వంటివి పరిగణనలోకి తీసుకున్నప్పుడు మహిళల్లో నడుము నొప్పి తీవ్రత ఎక్కువే. అందుకే మహిళల్లో వివిధ కారణాల వల్ల కనిపించే నడుము నొప్పులు, వాటి పరిష్కారాలను చూద్దాం.

నడుమునొప్పుల్లో కొన్ని...

టెయిల్‌బోన్ పెయిన్ : సరిగ్గా మనం కూర్చొనే చోటికి కాస్త పైనా, నడుమునకు కాస్త కింద నొప్పి రావడాన్ని టెయిల్‌బోన్ పెయిన్‌గా చెప్పవచ్చు. అంటే సరిగ్గా వెన్ను చివరి ఎముక దగ్గర నొప్పి రావడం. దీన్ని 'కాక్సిడైనియా' అంటారు. ఇది పురుషుల్లో కంటే మహిళల్లో ఐదు రెట్లు ఎక్కువ. ఇక మహిళల్లో గర్భధారణ అనే అంశం కాక్సిడైనియా ముప్పును పెంచుతుంది.

కంప్రెషర్ ఫ్రాక్చర్ : వెన్నెముకల్లో ఎముక విరిగినప్పుడు వచ్చే నొప్పి. వెన్నెముక అనేది వెన్నుపూసలు అనే చిన్న చిన్న ఎముకల సమాహారం. ఇందులో ఆస్టియోపోరోసిస్ ఎముక విరిగినప్పుడు తీవ్రమైన నడుమునొప్పి వస్తుంది. ఈ తరహా కంప్రెషన్ ఫ్రాక్చర్స్ అయ్యేందుకు అవకాశం ఇరువురిలోనూ ఉన్నా... పురుషుల్లో కంటే మహిళల్లో రెండు రెట్లు ఎక్కువ.

ఫైబ్రోమయాల్జియా : ఈ తరహా నొప్పి వెన్నులో కింది భాగంతో పాటు పైన కూడా కనిపించవచ్చు. మహిళల్లో యాంగ్జైటీనే ఇందుకు దోహదం చేస్తుంది.

ఆస్టియో ఆర్థ్రైటిస్ : కీళ్ల అరుగుదలతో వచ్చే నొప్పి ఇది. రెండు ఎముకలు కలిసే చోట ఎముక అరిగినప్పుడు వచ్చే నొప్పి ఇది. అయితే మోకాలు, తుంటి భాగంలో లాగే నడుము ప్రాంతంలోని వెన్నులో ఎముకల అరుగుదలతో ఈ నొప్పి వస్తుంది.

శాక్రో ఇలియాక్ జాయింట్ సమస్యలు : ఈ ఎముకలు వెన్నెముక చివరి భాగంలో ఉంటాయి. శాక్రమ్ అనే వెన్నెముక చిట్టచివరి ఎముక (టెయిల్‌బోన్)ను తుంటితో కలిపేలా ఈ ఎముకలు పిరుదులకు ఇరువైపులా కాస్త విస్తరించి ఉంటాయి. ఈ భాగంలో ఇన్‌ఫ్లమేషన్ వచ్చినప్పుడు నడుము కింద భాగంతో పాటు కాళ్లలోకి సైతం నొప్పి పాకుతుంది. గర్భధారణ అనే అంశం ఈ నొప్పిని మరింత ప్రభావితం చేస్తుంది.

పక్కతేడా : మహిళలు తమ రోజువారీ పనుల్లో భాగంగా బిందెల మోయడం, పిల్లలను చంకలో మోసేటప్పుడు నడుము ఒంపు భాగంలో ఒత్తిడి పడుతుంటుంది. చాలాసేపు అవసవ్య భంగిమలో ఉండటం కూడా నడుము నొప్పికి కారణం. ఇక నడుము వంచి ఇల్లు తుడిచే వాళ్లు నిటారుగా ఉండే లాంగ్ హ్యాండిల్ మాప్‌లను వాడటం మంచిది.

అకస్మాత్తుగా అసహజ భంగిమల్లోకి వంగడం, పక్కకు తిరగడం, బరువులు ఎత్తే సమయంలో ముందుకు ఒంగడమూ నడుము నొప్పికి కారణం కావచ్చు. బరువును ఎత్తేటప్పుడు కూర్చొని నెమ్మదిగా ఎత్తడం మేలు. ఇక పనిచేసే చోట్ల మహిళల్లో కంప్యూటర్‌లోకి వంగి చూస్తుండటం వల్ల కూడా నడుము నొప్పి రావచ్చు. అందుకే కంప్యూటర్ వంటివి చూస్తున్నప్పుడు నడుమును వీలైనంత నిటారుగా ఉంచాలి.



చాలాసేపు నిలబడి ఉండే వాళ్లలో నడుము నొప్పి

కొన్ని వృత్తుల్లో ఐదారు గంటల పాటు నిలబడాల్సి ఉంటుంది. ఇలాంటి వాళ్లలో నడుమునొప్పి రావడంతో పాటు కాళ్లలోని ఎముకలు, కండరాలు దెబ్బతిని 'మస్క్యులో స్కెలెటల్ డిజార్డర్స్' రావచ్చు. స్వల్పకాలిక సమస్యలైన కాళ్లలో తిమ్మిర్లు (క్రాంప్స్) వంటివి నడుమునొప్పితో పాటు వచ్చినప్పుడు పరిస్థితి దుర్భరమవుతుంది. అందుకే చాలాసేపు నిలబడే ఉండే వృత్తుల్లో ఉండేవారు తరచూ కాస్తంత బ్రేక్ తీసుకోవాలి. నిలబడి ఉన్నప్పుడు కూడా అదేపనిగా నిటారుగా ఉండకుండా తరచూ పోస్చర్‌లో కాస్తంత మార్పులు చేస్తూ ఉండాలి. వంట చేసేటప్పుడు మహిళలు వంట ప్లాట్‌ఫారమ్ దగ్గర చాలాసేపు నిలబడి ఉండాల్సి వస్తోంది. ఇలాంటి వారు తమ ఎత్తునకు అనుగుణంగా ప్లాట్‌ఫారమ్ అమర్చుకోవడం, తరచూ కూర్చోడానికి ఎత్తైన లాంగ్ స్టూల్‌ను వేసుకోవడం మంచిది. దాని కాళ్ల దగ్గర ఫుట్‌రెస్ట్ చేసుకోవడానికి అనుగుణంగా అడ్డుపట్టీలు ఉండటం నడుమునొప్పి నివారించడానికి దోహదపడుతుంది.




డ్రైవింగ్ సీట్... నడుము నొప్పి

వాహనాన్ని నడపడానికీ, నడుమునొప్పికీ చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. వాహనాన్ని నడిపే కొందరిలో నడుము నొప్పి కనిపిస్తుంటుంది. ఆ నొప్పి నివారణకు సూచనలు :

- తొడలకు సీట్ సపోర్ట్ వీలైనంత ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. అంటే వాటి నిడివిలో అవి ఎక్కువ భాగం సీట్‌పై ఉండాలన్న మాట.
- బ్రేక్, క్లచ్ వంటి మీ కాళ్లు ఆనే భాగాలకు మరీ దూరంగా కూర్చోవద్దు.
- కాళ్ల పొడవుకు అనుగుణంగా సీట్‌ను సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి
- ఎత్తునకు అనుగుణంగా సీట్ ఎత్తును అడ్జెస్ట్ చేసుకోవాలి
- సీట్‌ను నిటారుగా ఉంచేలా చూసుకోవాలి లేదా అది మీకు మరీ ఇబ్బందిగా ఉంటే కొద్దిగా మాత్రమే వెనక్కు వాలేలా సీట్ ఒంచాలి. ఆ సీట్ ఒంపు ఎంత అవసరం అని తెలియాలంటే ఒకటే కొండగుర్తు... ఆ ఒంపు నడుము మీదగానీ మోకాళ్ల మీద గానీ ఒత్తిడి పడనివ్వని విధంగా ఉండాలి.
- నడుము దగ్గర ఉండే ఒంపు (లంబార్) భాగంలో ఒక కుషన్ ఉంచుకోవాలి. ఆ లంబార్ సపోర్ట్ వల్ల నడుమునొప్పి చాలావరకు తగ్గుతుంది.
- మెడ మీద ఒత్తిడి పడని విధంగా మీ హెడ్‌రెస్ట్ ఉండాలి.
- సీట్‌లో చాలాసేపు ఒకే భంగిమలో కూర్చొని ఉండకూడదు. అప్పుడప్పుడూ పొజిషన్ కాస్త మారుస్తూ ఉండాలి.
- అదేపనిగా డ్రైవ్ చేయకుండా మధ్య మధ్య కాస్త బ్రేక్ తీసుకోవాలి.
- ఇక డ్రైవ్ చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవడం మేలు.

పడక కారణంగా వచ్చే నడుమునొప్పి...



మీ పడక కారణంగా నడుమునొప్పి వస్తుందేమో కూడా చూసుకోవాలి. నిద్రలేవగానే అకస్మాత్తుగా నడుమునొప్పి వస్తే అది పక్కసరిగా లేని కారణంగా కావచ్చు. కనీసం 15 -30 నిమిషాల పాటు మెల్లగా స్ట్రెచ్ అవుతూ చేసే వ్యాయామాల తర్వాత కూడా నొప్పి తగ్గలేదంటే అది పక్క సరిగా లేకపోవడం వల్ల వచ్చిన నొప్పిగా అనుకోవచ్చు.

ఏది మంచి పడక : మంచి పడక అనేది అందరికీ ఒకేలా ఉండదు. వారి వారి వ్యక్తిగత సౌకర్యాలకు అనుగుణంగా తమ పడకను ఏర్పాటు చేసుకుంటుంటారు. అయితే నడుము నొప్పి రాకుండా ఉండేందుకు పడక విషయంలో తీసుకోవాల్సిన కొన్ని సూచనలు ఇవి... ● పడుకునే చోటు సమతలంగా ఉండాలి. అయితే కొందరు కఠినమైన తలం (సర్ఫేస్) మీద పడుకోవడం వల్ల నడుమునొప్పి తగ్గుతుందని అపోహ పడుతుంటారు. అది సరికాదు. పడక కూరుకుపోయేంత మెత్తగానూ ఉండకూడదు, పూర్తిగా చెక్కలాగా కఠినంగానూ ఉండకూడదు. మీ మ్యాట్రెస్ తగినంత మెత్తగా ఉంటూనే... సమతలంగానూ ఉండాలి. మీ మ్యాట్రెస్ చాలా కఠినంగా ఉంటే వెన్నులోని కొన్ని మృదువైన లిగమెంట్లు, కండరాలను మరీ గట్టిగా నొక్కేస్తుంది. అలాగే మరీ మృదువుగానూ, మీరు లోనికి కుంగిపోయేంత మెత్తగా ఉంటే మీ వెన్నెముకను అర్ధచంద్రాకారంలో ఒంగిపోయేలా చేసి నొప్పికి కారణమవుతుంది. వెన్నెముక ఆకృతి ఎలా ఉంటుందో దానికి అనుగుణంగా మారి సపోర్ట్ ఇచ్చేలా మీ పరుపు ఉండాలి.



చికిత్స

నడుమునొప్పితో బాధపడుతున్న మహిళలు ముందుగా అది ఏ నిర్దిష్టమైన కారణంతో వస్తున్నదో తెలుసుకోవాలి. ఇందుకోసం అనేక మార్గాలు ఉన్నాయి. వీటిల్లో అన్నింటికంటే ప్రధానమైనది... ఫిజియోథెరపిస్ట్ సహాయంతో అవసరమైన వ్యాయామాలు లేదా (ఇంటర్‌ఫెరెన్షియల్ థెరపీ) ఐఎఫ్‌టీ వంటి ప్రక్రియలతో చేసే చికిత్సలూ ఉపశమనాన్ని కలిగిస్తాయి. టెన్స్ అనే చికిత్స కూడా ఇలాంటిదే. ట్రాన్స్‌క్యుటేనియస్ ఎలక్ట్రికల్ నర్వ్ స్టిమ్యులేషన్ అనే మాటలకు సంక్షిప్త రూపమే ఈ 'టెన్స్'. ఈ చికిత్స ప్రక్రియలో ఎలక్ట్రోడ్‌ల సహాయంతో చిన్న చిన్న విద్యుత్ ప్రకంపనలను చర్మం కిందికి పంపుతారు. ఫలితంగా ఉపశమనం కలుగుతుంది. అయితే గర్భవతులు, మూర్ఛతో బాధపడే రోగులు, గుండెజబ్బులు ఉన్నవారు లేదా గుండె సమస్యను చక్కదిద్దడానికి పేస్‌మేకర్ అమర్చిన వాళ్లకు టెన్స్ చికిత్స సరికాదు. అందుకే ఇలాంటి చికిత్సలు పూర్తిగా వైద్యనిపుణుల పర్యవేక్షణలోనే సాగాలి. ఇక పై మార్గాలన్నీ విఫలం అయినప్పుడు సమస్యను శాశ్వతంగా చక్కదిద్దడానికి ఎముకల వైద్య నిపుణులు లేదా న్యూరోసర్జన్లు లేదా స్పైన్ సర్జన్లు అవసరమైన శస్త్రచికిత్సను నిర్వహించి పరిస్థితిని చక్కబరుస్తారు.

తక్షణ నొప్పి నివారణ కోసం : నొప్పిని తాత్కాలికంగా తగ్గించడం కోసం నొప్పి నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్) అందుబాటులో ఉన్నాయి. కానీ ఇవి కేవలం తక్షణ నొప్పి నివారణ కోసమే పనికి వస్తాయి. శాశ్వత నివారణ కోసం నొప్పి నివారణ మందులను వాడకూడదు. నొప్పి నివారణ మందులను దీర్ఘకాలం వాడటం వల్ల జీర్ణవ్యవస్థతో పాటు మూత్రపిండాల వంటి కీలకమైన అవయవాలు దెబ్బతినవచ్చు. అందుకే రెండు వారాలకు మించి నొప్పి నివారణ మందులు తీసుకోవడం సరికాదు. దీనికి బదులు ఉపశమనం కోసం పైపూత మందులు (టాపికల్ మెడిసిన్స్) వాడటం మంచిది. అయితే ఇందుకోసం కొన్ని ఆయిల్స్‌తో మసాజ్ చేస్తుంటారు. తొలుత నొప్పిని ఉపశమింపజేసే నూనెలతో మసాజ్‌లు చేయడం మంచిదే. మసాజ్‌లో భాగంగా నిపుణులు రుద్దడం, నొక్కడం, కొన్ని నిర్దిష్టమైన చోట్ల ఒత్తిడి కల్పించడం... అంటే రోలింగ్, నీడింగ్, అప్లయింగ్ ప్రెషర్ వంటివి చేస్తారు. దాంతో నొప్పి ఉన్న భాగాల్లో రక్తప్రసరణ బాగా అయ్యేలా చేస్తారు. ఫలితంగా కండరాల్లో ఒత్తిడి తగ్గడం లేదా పట్టివేసిన కండరం వదులు కావడం వల్ల నొప్పి ఉపశమిస్తుంది. అయితే... ఇలా ఆరు వారాల కంటే ఎక్కువగా చేసినప్పటికీ నొప్పి కొనసాగుతూ ఉంటే పూర్తిస్థాయి చికిత్స కోసం డాక్టర్‌ను సంప్రదించాలి. అలాగే 20 ఏళ్ల లోపు వాళ్లలో నడుము నొప్పి కనిపిస్తే మాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

(నడుము నొప్పి నుంచి ఉపశమనాన్నిచ్చే యోగాసనాలు లోపలి పేజీలో...)



డాక్టర్ సుధీంద్ర ఊటూరి, లైఫ్‌స్టైల్ నిపుణులు, కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

ఆత్మీయం

పెళ్లికి జాతకం మాత్రమే ముఖ్యం కాదు..!



వివాహానికి తల్లిదండ్రులు తమ పిల్లల జాతకాలను చూపించుకుని, వాటికి సరిపోయే జాతకం ఉండే వధువును లేదా వరుడిని వెతుక్కోవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఆచారం ఒకప్పుడు కొన్ని వర్ణాలకు మాత్రమే ఉండేది. ఇప్పుడది అన్ని వర్ణాలవారిలోనూ విస్తరిస్తూ వస్తోంది. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎంత వయసు వచ్చినా, అవతలి వారి జాతకం బాగాలేదని వంకలు పెడుతూ వచ్చిన సంబంధాలన్నింటినీ తిరగ గొట్టడం, తీరా పెళ్లి వయసు దాటిపోతుండగా అప్పుడు ఏదో ఒక సంబంధాన్ని ఖాయం చేసుకోవడం... ఆ తర్వాత ఇద్దరికీ మనసులు కలవక ఇబ్బందులు పడటం... సర్వసాధారణమై పోతోంది. పెళ్లికి జాతకాలు చూపించడంలో తప్పులేదు కాని ఇతర అంశాలు అంటే వధువు లేదా వరుని ప్రవర్తన, ఉద్యోగం, కుటుంబ సంప్రదాయం, శీలం, నడత, రంగు, రూపు, విద్యార్హతలు అన్నింటికీ మించి ఆ సంబంధం తమ పిల్లలకు ఇష్టమా, కాదా అనేది విచారించకపోవడం... వీటితోపాటు ఇతర అంశాలు ఏవి నప్పకపోయినా సరే, జాతకాలు బాగున్నాయి కాబట్టి అన్నీ అవే సర్దుకుంటాయిలే అనే గుడ్డినమ్మకంతో వారిద్దరికీ ముడిపెట్టెయ్యడం సబబు కాదు. అదేవిధంగా పైన చెప్పిన అన్ని అంశాలు బాగుండి, వధూవరురిద్దరికీ ఒకరి పట్ల మరొకరికి సదభిప్రాయం, ఇష్టం ఉన్నప్పటికి కూడా కేవలం జాతకాలు కుదరలేదని వంకపెట్టి పెళ్లి ఆపేయటం కూడా సమంజసం కాదు. ఈ వాస్తవాన్ని తల్లిదండ్రులందరూ తెలుసుకున్నప్పుడే పెళ్లిళ్లు సకాలంలో అవుతాయి. కాపురాలు చల్లగా సాగుతాయి.

గుడ్‌ఫుడ్

నడుమునొప్పిని నివారించే ఆహారం...

వెన్ను ఆరోగ్యానికి తగినంత వ్యాయామంతో పాటు పోషకాహారం కూడా అవసరమే. ఆ ఆహారం ఎన్నో గాయాలను త్వరగా మాన్పి... వెన్నునొప్పులను నివారిస్తుంది. ఆ పోషకాలివి.

కాల్షియమ్: ఆహారంలో కాల్షియమ్ పుష్కలంగా తీసుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యం బాగుంటుంది. పాలు, పెరుగు, వెన్నతో పాటు ముదురు ఆకుపచ్చగా ఉండే ఆకుకూరలు, చేపలలో క్యాల్షియమ్ ఎక్కువ.

విటమిన్ డి3 : మన ఒంట్లోకి వచ్చే క్యాల్షియమ్ ఎముకల్లోకి ఇంకేలా చేసి, వాటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో విటమిన్–డి అద్భుతమైన భూమిక పోషిస్తుంది. స్వాభావికమైన ఎండతో పాటు చేపలు, కాలేయం, గుడ్డు వంటి ఆహారాల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది.



విటమిన్-సి : చిగురు ఎముకలో ఉండే కొలెజెన్ వంటివి ఏర్పరచడంలోనూ, ఎముకలు, కండరాలు, చర్మం, టెండన్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో విటమిన్–సిది ప్రధాన పాత్ర. నిమ్మజాతి పండ్లతో పాటు జామ, టొమాటో, కాప్సికమ్‌లలో ఇది ఎక్కువ.

ఇక గాయాలను మాన్పడం: దెబ్బతిన్న భాగాల రిపేర్ కోసం మాంసం, పప్పు వంటి ప్రోటీన్లు తీసుకోవాలి.

విటమిన్-బి12 : అన్ని రకాల చేపలు, మాంసంతో పాటు తాజా పండ్లు, ఆకుకూరలు, పౌల్ట్రీ ఉత్పాదనల్లో విటమిన్–బి 12 పాళ్లు ఎక్కువ.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
గురువారం
3-8-2017

స్ట్రాంగ్ బ్యాక్

బ్యాక్ పెయిన్... ఒకప్పుడు ఉండేది అంటూ నడుము ఇప్పుడు హాయిగా చెప్పగలగాలి. వెన్ను నొప్పిని 'గతం'లోని సమస్యగా మాత్రమే గుర్తు చేసుకోవాలనుకుంటే యోగాను మించిన మార్గం లేదు. ప్రస్తుత జీవనశైలి పుణ్యమాని ఆధునికులలో అత్యధికులను వేధిస్తున్న బ్యాక్ పెయిన్‌ని స్ట్రాంగ్‌బ్యాక్‌కి చేయడానికి... ఉపకరించే కొన్ని యోగాసనాలివి.

ధనురాసనం



నేలపై బోర్లాపడుకుని మోకాళ్ళని వంచి చేతుల్ని వెనక్కి తీసుకెళ్ళి కాలి చీలమండలాన్ని పట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస తీసుకొని వదిలేస్తూ మోకాళ్ళని పైకెత్తుతూ రెండు కాళ్ళని, ఛాతీని పైకెత్తాలి. పొట్ట మాత్రమే నేలను తాకుతూ ఉంటుంది. శరీరం బరువు మొత్తం పొట్ట మీద ఉంటుంది. శరీరం ధనుస్సు మాదిరిగా ఉంటుంది. ముందు కాళ్ళను పైకెత్తుతూ, ఛాతీని పైకెత్తితే నడుము మీద ఒత్తిడి పడదు. కాళ్ళను పైకెత్తే క్రమంలో మోకాళ్ళను ఎడంగా ఉంచాలి. అప్పుడు ఆసనంలోకి వెళ్ళటం తేలిక అవుతుంది. సాధ్యమైనంత సేపు ఆసనంలో ఉండి నెమ్మదిగా ఛాతీ నేలకు ఆనించి తర్వాత కాళ్ళను నేలకు ఆనించి నిదానంగా బయటకు రావాలి.

ప్రసారిత మార్జాలాసన



వజ్రాసనంలో కూర్చున్న తరువాత (రెండు కాళ్ళు మడిచి కాలి మడమల మీద కూర్చోవాలి) అర చేతులు రెండూ ముందు వైపు నేల మీద ఉంచి మోకాళ్ల కింద ఉంచి నడుమును పూర్తిగా రిలాక్స్ చేయాలి. దీనిని మార్జాలాసనమని అంటారు. మార్జాలం అంటే పిల్లి. జంతుజాలములన్నింటిలో పిల్లికి చాలా ఫ్లెక్సిబుల్‌గా ఉండే వెన్నెముక ఉంది. ఈ ఆసనం చేయడం వల్ల వెన్నెముకకు మంచి రిలాక్సేషన్ వస్తుంది కనుక దీనిని మార్జాలాసనమని అన్నారు. ఈ స్థితిలో ఉండి శ్వాస తీసుకుంటూ ఎడమచేతిని ముందుకు, కుడికాలును వెనకకు ఒకే సరళ రేఖలో ఉండేటట్లుగా సాగదీస్తూ ఉండి 3 లేదా 5 శ్వాసల తరువాత శ్వాస వదులుతూ కుడిమోకాలు క్రిందకు, ఎడమ చేయి క్రిందకు తీసుకురావాలి. మళ్ళీ సీటు నడుము భాగాలను రిలాక్స్ చేస్తూ కొంచెం విశ్రాంతి తీసుకున్న తరువాత ఇదే ఆసనం రెండవవైపు కూడా చేయాలి. ఆపోజిట్ చేతిని, కాలుని స్ట్రెచ్ చేయడం వల్ల బ్యాలన్స్ చేయడంతో ఎక్కువ ఇబ్బంది ఉండదు.

గమనిక: ఎవరికైనా మోకాలు సమస్య ఉన్నట్లయితే టర్కీ టవల్‌ని కానీ పలచ్చడి దిండును కాని మోకాళ్ల కింద పెట్టుకోవచ్చు.

నడుము, సీటు, వెన్నెముక భాగాలు ముఖ్యంగా లోయర్ బ్యాక్ L1 నుంచి L5 వరకు ఎటువంటి సమస్య ఉన్నా చక్కటి ఉపశమనం కలుగుతుంది. వెన్నెముక ఫ్లెక్సిబుల్‌గా అవుతుంది. వీపు భాగంలో కండరాలలో చోటుచేసుకున్న బిగుత్వంపోతుంది. కండరాలను సడలించినప్పుడు ఆక్సీజన్ కంజప్షన్ కెపాసిటీ పెరుగుతుంది.

ఫొటోలు: **ఎస్.ఎస్.ఠాకూర్**

అర్ధ అధోముఖ శ్వాసాసన



మార్జాలాసనములోలాగానే మోకాళ్ళ మీద ఉండి మోకాలు నుండి సీటు వరకూ (నడుము వరకూ) 90 డిగ్రీల కోణంలో ఉంచి వీపును ముందుకు బాగా స్ట్రెచ్ చేస్తూ, నుదురు లేదా గడ్డమును నేల మీద ఉంచి చేతులు రెండూ ముందుకు బాగా స్ట్రెచ్ చేస్తూ శ్వాసను సాధారణ స్థితిలో ఉంచి కనీసం 5 లేదా 10 శ్వాసల వరకూ అదే ఆసనంలో ఉండేటట్లయితే, డోర్సల్ స్పైన్‌కి, డెల్టాయిడ్ ట్రెపీజియస్ కండరాలకు తగినంత టోనింగ్ జరిగి అప్పర్ బ్యాక్‌కి పూర్తిగా రిలీఫ్ దొరుకుతుంది. వీపు నుంచి నడుం వరకూ ఉన్న భాగం మొత్తం రిలాక్స్ అవుతుంది.

భుజంగాసన (కోబ్రా పోజ్)



బోర్లా పడుకుని మకరాసనంలో చేతులు రెండు మడచి కుడిచేయిని ఎడమ చేతిమీద ఉంచాలి. చేతుల మీద గడ్డం ఆనించి తలకొంచెం లిఫ్ట్ చేసేటట్లుగా ఉంచాలి. పాదాల మధ్య రెండు లేదా మూడు అడుగుల దూరం, కాలి బొటన వేళ్ళు భూమికి దగ్గరగా ఉంచినట్లయితే పొత్తి కడుపు భాగం, తొడలు పూర్తిగా భూమికి ఆని విశ్రాంతి కలుగుతుంది. పొట్ట ఆధారంగా చేసే ఆసనాలకు మధ్య మధ్యలో ఇలా మకరాసనంలో విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరం. ఇప్పుడు పాదాలు రెండు కలిపి (వెన్నెముక లేదా సయాటికా సమస్య ఉన్నట్లయితే కాళ్ళు కొంచెం ఎడంగా ఉంచవచ్చు) అరచేతులు ఛాతీకిరువైపులా ఉంచి శ్వాసతీసుకుంటూ గడ్డాన్ని తలను పైకి లేపాలి. తరువాత చేతులు బలంగా నేలకు నొక్కుతూ మోచేతులు ఓపెన్ చేస్తూ ఛాతీని వీలైనంత పైకి లేపాలి. బొడ్డు నుంచి కిందకు నేలమీద పూర్తిగా ఆనేటట్లుగాను బొడ్డు నుంచి పై భాగాన్ని వీలైనంత పైకి లేపే ప్రయత్నం చేయాలి. (ఇది పూర్తి భుజంగాసన స్థితి). ఇలా కష్టం అన్పిస్తే మోచేతుల నుండి ముందు భాగం వరకూ పూర్తిగా రెండు చేతులను నేల మీద శరీరం ఇరువైపులా ముందుకు ఉంచి తలను ఛాతీని పైకి లిఫ్ట్ చేసే అర్ధ భుజంగాసనను ఎంచుకోవాలి.

1ఎ) భుజంగాసన: పూర్తి భుజంగాసన స్థితిలో ఉన్నప్పుడు తలను కుడివైపుకు తిప్పి కుడి భుజం మీదుగా వెనుక పాదాలను మళ్ళీ తలను ఎడమవైపుకు తిప్పి ఎడమ భుజం మీదుగా వెనుక పాదాలను చూసే ప్రయత్నం చేయాలి. శ్వాస వదులుతూ నెమ్మదిగా పొట్ట ఛాతీభాగాలను తరువాత గడ్డంను నేలమీదకు తీసుకు రావాలి. శ్వాస తీసుకుంటూ తల ఛాతీ పైకి లేపడం, శ్వాస వదులుతూ తిరిగి నేల మీదకు మకరాసనంలో విశ్రాంత స్థితికి రావాలి. నడుము కింది భాగంలో నొప్పి (లోయర్ బ్యాక్‌యేక్)కి ఇదొక ఉత్తమమైన ఆసనం. అంతే కాకుండా కిడ్నీ, ఎడ్రినల్ గ్రంథులు సమర్థవంతంగా పనిచేయడానికి, కార్టిసోన్ హార్మోను ఉత్పత్తిని నియంత్రణకి వీలు కలగిస్తుంది. కీళ్లనొప్పులు, రెనిమాటిజమ్‌కు పరిష్కారం.అయితే గర్భిణీస్త్రీలు, పెప్టిక్ అల్సర్స్, హెర్నియా, ఇంటెస్టియల్ ట్యూబరోక్లోసిస్ ఉన్నవారు సాధన చేయరాదు.

శశాంకాసన



ఈ స్థితిలో శ్వాస చాలా వేగంగా ఉంటుంది. శ్వాసలు చిన్నవిగా ఉంటాయి. అందువలనే దీనికి శశాంకాసన అనే పేరు వచ్చింది.

చేసే విధానం: అర్ధ అధోముఖశ్వాసాసనంలో నుండి నెమ్మదిగా సీటు భాగాన్ని క్రిందకు క్రమక్రమంగా దించి మడమల మీద కూర్చొనే విధంగా ప్రయత్నించాలి. పొట్ట ఛాతీ భాగాలు తొడలపైన ఉంచి శ్వాస వదులుతూ నుదురుని నేలకు వీలైనంత దగ్గరలోకి తీసుకువెళ్ళే ప్రయత్నం చేయాలి. నుదురు నేలకు దగ్గరగా తీసుకువెళ్ళకపోయినా ఫరవాలేదు. కానీ వెనుక మడమల మీద సీటును ఉంచే ప్రయత్నం చేస్తూ మోకాళ్ల రెండూ కలిసి ఉంచే ప్రయత్నం చేయవలెను. చేతులను ముందుకు బాగా స్ట్రెచ్ చేస్తూ ఉంచాలి.

ఈ ఆసనాలు అన్నీ వెన్నెముకతో పాటు నడుము భాగాలకు పూర్తిగా ఉపశమనం అందించేందుకు, మనసుకు ఆందోళన తగ్గించి ప్రశాంతతను చేకూర్చడానికి ఉపకరించేవే! తరచుగా వీటితో పాటు మరికొన్ని యోగాసనాలు సాధన చేస్తుండడం ద్వారా ఇప్పుడున్న బ్యాక్ పెయిన్ నుంచి కోలుకోవడంతో పాటు భవిష్యత్తులోనూ ఆ సమస్య రాకుండా చేసుకోవడం సాధ్యపడుతుంది.




ఎ.ఎల్.వి కుమార్
ట్రెడిషనల్ యోగా ఫౌండేషన్

సమన్వయం
ఎస్. సత్యబాబు
సాక్షి ప్రతినిధి

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ సర్!! చాలా రోజుల నుంచి నన్ను ఒక అమ్మాయి చూస్తోంది. చూస్తే లవ్ అంటారా? లేక అమ్మాయిలు క్యాజువల్‌గా చూస్తుంటారా?

- రవి



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

క్యాజువల్‌గానే చూస్తోంది.

'సార్! మీరు శాడిస్ట్... సార్!!'

అడిగిన దానికి సమాధానం చెప్పడం శాడిజం ఎలా అవుతుంది?

'రవి మీరంటే ఎంతో గౌరవంతో రాస్తే...'

'ఆం!... గౌరవం లేదు.. జీబ్రా ఈకలు లేవు...'

'హ... హ... హ... హా... హా..'

ఏమైంది నీలాంబరీ?

'జీబ్రాకి ఈకలేంటి సార్?'

గాడిదకు గుడ్డేంటి అని అడగని మీకు జీబ్రాకు ఈకలేంటని అడిగే అర్హత ఎక్కడిది?

'ఓ... హో.. గౌరవం లేదు, గాడిద గుడ్డు లేదు అని అనకుండా జీబ్రా ఈకలు అన్నారా?'

నువ్వు చూశావా గాడిద గుడ్డును కానీ ఆర్ జీబ్రా ఈకలను కానీ..?

'హ.. హ.. హ. హా.. చూడలేదు సార్, ఇంతగా నవ్వించకండి కడుపు నొప్పి వస్తుంది.'

రవి చూశాడు!

'వాట్!?!!?!!'

అమ్మాయి నవ్వడం!!

'అదా...'

ఆ నవ్వు సిల్లీగా లేదు, క్యాజువల్‌గా ఉంది అని చెప్పా!

'అంటే నవ్వు వెనక పరమార్థం లేదా సార్?'

పరమార్థం ఉంది... ప్రేమార్థం లేదు!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఫ్యామిలీ డాక్టర్ — హోమియో కౌన్సెలింగ్స్

రోల్డ్‌గోల్డ్ నగలతో ర్యాష్ వస్తుంటే...

నేను అప్పుడప్పుడూ రోల్డ్‌గోల్డ్ నగలు వేసుకుంటుంటాను. ఈ మధ్య వాటిని వేసుకున్న తర్వాత మెడ భాగంలో, చేతులకు దురద, పొక్కులు వస్తున్నాయి. అదే గోల్డ్ నగలు వేసుకుంటే ఏమీ కాదు. దీనికి కారణం ఏమిటి? హోమియోలో పరిష్కారం చెప్పండి.

– సునీత, హైదరాబాద్

మీరు చెప్పిన కారణాలతో చర్మ శోధ రావడం వల్ల కలిగే ఈ పరిణామాన్ని డర్మటైటిస్‌గా చెప్పవచ్చు. ఇలా జరిగినప్పుడు చర్మం ఎర్రబారి దురద, మంట వస్తాయి. ఇది శారీరకంగా సమస్యగా పరిణమించడంతో పాటు మానసికంగానూ కుంగదీస్తుంది. డర్మటైటిస్‌ను వివిధ రకాలుగా విభజించవచ్చు. అవి...

కాంటాక్ట్ డర్మటైటిస్ : దీన్ని స్పర్శ చర్మశోధగా చెప్పవచ్చు. ఇందులో చర్మంపై సాధారణంగా గులాబి లేదా ఎరుపు దద్దుర్లు వస్తాయి. దురద కూడా ఉంటుంది. ఇది చికాకు, అలర్జీని కలిగిస్తుంది. మీరు చెప్పినట్లుగా ఆభరణాలు, రబ్బరు తొడుగులు దీనికి కారణమవుతాయి. అలాగే కొన్ని రకాల పరిమళ ద్రవ్యాలు, జుట్టు రంగులు(హెయిర్‌డై), చర్మ సంబంధిత ఉత్పత్తుల వల్ల కూడా ఇది సంభవించవచ్చు.

నుమ్ములార్ డర్మటైటిస్ : ఇందులో మచ్చలు నాణెం ఆకృతిలో ఎరుపు ఫలకాల్లా ఉంటాయి. ఇది సాధారణంగా కాళ్లు, చేతులు, భుజాలు, నడుముపై కనిపిస్తుంది. ఇది స్త్రీలతో పోలిస్తే పురుషుల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఇది 55 నుంచి 65 ఏళ్ల మధ్య వారిలో ఎక్కువ.

ఎగ్జిమా : ఇది కూడా ఒక రకమైన డర్మటైటిస్. క్రానిక్ స్కిన్ ఇన్‌ఫ్లమేషన్‌ని ఎగ్జిమా అంటారు. ఎగ్జిమాలో చర్మం ఎరుపుదనంతో కమిలినట్లుగా కనిపించడం, కొద్దిగా పొరలుగా తయారవ్వడం, వాపు, దురద దీనిలో ప్రధాన లక్షణాలు. ఎగ్జిమా బయటపడేప్పుడు మొదట చర్మం కమిలినట్లుగా ఎరుపురంగుకి మారుతుంది. తర్వాత పొక్కుల్లా వచ్చి, అవి క్రమంగా నీటిపొక్కుల ఆకృతిని సంతరించుకుంటాయి.

సెబోరిక్ డర్మటైటిస్ : ఇది పిల్లల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా ముఖం, తల మీది చర్మంపై ఎరుపు లేదా పసుపు రంగులో చర్మం కమిలినట్లుగా కనిపిస్తుంది. ఇంకా కనుబొమల సమీపంలో, ముక్కుకు ఇరుపక్కలా వ్యాపిస్తుంది. ఇది అధిక ఒత్తిడి వల్ల రావచ్చు.

కారణాలు : ● రోల్డ్‌గోల్డ్ నగలు ● కొన్ని రకాల మందులు వాడటం వల్ల ● జుట్టు కోసం వాడే రంగులతో ● ఇక బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లతో కూడా డర్మటైటిస్ రావచ్చు.

చికిత్స : డర్మటైటిస్‌కు హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. యాంటీమోనియమ్ క్రూడమ్, అపిస్ మెల్లిఫికా, రస్టాక్సికోడెండ్రాన్, సల్ఫర్ వంటి మందులను అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో వాడాలి.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి, ఎండీ (హోమియో)
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

ముక్కులు బిగదీసుకుపోయి వాసనలు తెలియడం లేదు

నా వయసు 28 ఏళ్లు. నాకు గత ఆర్నెల్లుగా తుమ్ములు, ముక్కుకారవడంతోపాటు ముక్కులు బిగదీసుకుపోతున్నాయి. వాసనలు తెలియడం లేదు. చాలా మంది డాక్టర్లను కలిశాను. సమస్య తగ్గినట్టే తగ్గి, మళ్లీ వస్తోంది. హోమియోలో దీనికి పరిష్కారం చెప్పండి.

– రవికిరణ్, కోదాడ

మీరు 'అలర్జిక్ రైనైటిస్' అనే సమస్యతో బాధపడుతున్నారు. మీకు సరిపడనివి తగిలినప్పుడు (దుమ్ము, ధూళి, పుప్పొడి, ఘాటు వాసనలు) మీకు అలర్జీ మొదలవుతుంది. దాంతో ముక్కులోని రక్తనాళాలు ఉబ్బినట్లుగా అయి, ఆగకుండా తుమ్ములు రావడం, ముక్కు బిగదీసుకుపోవడం వంటివి కనిపిస్తాయి.

లక్షణాలు : ఆగకుండా తుమ్ములు రావడం, ముక్కుకారడం వంటి లక్షణాలే గాక... వాటిని నిర్లక్ష్యం చేస్తే సైనస్‌లకు ఇన్ఫెక్షన్ సోకి తలబరువు, తలనొప్పి వంటివి కనిపించవచ్చు. ముక్కుపొరలు ఉబ్బడం వల్ల గాలి లోపలికి వెళ్లక వాసనలు కూడా తగ్గిపోతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే ముణ్ముందు సైనసైటిస్, నేసల్ పాలిప్స్, వంటి పెద్ద పెద్ద సమస్యలూ వచ్చేందుకు అవకాశం ఉంది. వ్యాధి నిర్ధారణ కోసం ఎక్స్-రే, సీటీ స్కాన్ వంటి పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.

నివారణ : ● అలర్జీ కారకాలకు సాధ్యమైనంత దూరంగా ఉండటం ● సరైన పోషకాహారం తీసుకోవడం ● ముక్కుకు సంబంధించిన వ్యాయామాలు చేయడం ● చల్లని వాతావరణానికి దూరంగా ఉండటం, ● పొగతాగే అలవాటుకు దూరంగా ఉండటం.

చికిత్స : హోమియోలో వ్యక్తిగత లక్షణాలనూ, మానసిక స్వభావాన్ని బట్టి కాన్‌స్టిట్యూషన్ చికిత్స ఇవ్వవచ్చు. దీనివల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. క్రమక్రమంగా వ్యాధి తీవ్రతను తగ్గిస్తూ పోయి, అలా సమస్యను పూర్తిగా తగ్గించవచ్చు. అనుభవజ్ఞులైన హోమియో నిపుణుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటూ ఉంటే అలర్జిక్ రైనైటిస్ పూర్తిగా తగ్గుతుంది. హోమియోలో ప్రక్రియ ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.



డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీనియర్ డాక్టర్,
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

రుమటాయిడ్ ఆర్థరైటిస్ తగ్గుతుంది

నా వయసు 58 ఏళ్లు. నాకు రెండు చేతుల్లోని కీళ్లు నొప్పిగా ఉండటం, కీళ్లవద్ద ఎర్రగా మారడం జరిగింది. నాకు తగిన సలహా ఇవ్వండి.

– ఫణీంద్ర, కాకినాడ



మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీరు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఒక ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే తన వ్యాధి నిరోధక శక్తి తన పట్ల ప్రతికూలంగా పనిచేయడం. సాధారణంగా యాభైఏళ్లు పైబడిన వాళ్లలో ఈ నొప్పులు మొదలవుతాయి.

ఈ వ్యాధి ఉన్న వారిలో లక్షణాల తీవ్రతలో చాలా రకాల మార్పులు కన్పిస్తుంటాయి. వ్యాధి యాక్టివ్ స్టేజ్‌లో ఉన్నప్పుడు అలసట, ఆకలి లేకపోవడం, లోగ్రేడ్ జ్వరం, కీళ్ళలో, కండరాల్లో నొప్పులు, కీళ్లను సరిగ్గా కదపలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా కీళ్లనొప్పులు ఉదయాన్నే లేవగానే అత్యధికంగా ఉండి కొద్దిగా శరీరం కదిలించిన తర్వాత అదుపులో ఉంటాయి. సాధారణంగా చేతుల్లో కాళ్లలో రెండు వైపులా ఒకే కీళ్ళు ప్రభావితమవుతాయి. కీళ్లు ఎర్రగా, వేడిగా మారి విపరీతమైన నొప్పితో బాధిస్తాయి. వ్యాధి దీర్ఘకాలంగా మారినప్పుడు కీళ్లలోని మృదులాస్థి, ఎముకలు దెబ్బతినడం వలన వేళ్ళు వంకర్లు పోవడం పూర్తిగా కదలికలు ఆగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటినే 'డిఫార్మిటీస్' అంటారు.

రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ని నిర్ధారించడానికి ఏ ఒక్క పరీక్ష సరిపోదు. రక్తపరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలూ చేయించాల్సి ఉంటుంది. ఆటో ఇమ్యూన్ సమస్యలలో చికిత్స చెయ్యడానికి హోమియోపతిలో మయాజ్మాటిక్ ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. సాధారణంగా వాడే పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వల్ల నొప్పి నుండి తాత్కాలికంగా ఉపశమనం లభించడం లేదా కొన్నిసార్లు అస్సలు ప్రభావమే లేకపోవడం జరుగుతుంది. పైగా ఈ మందుల వలన డిఫార్మిటీస్‌ని నివారించలేం. హోమియోపతి మందుల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించి నొప్పులను పూర్తిగా తగ్గించడం మాత్రమే కాకుండా డిఫార్మిటీలు రాకుండా నివారించవచ్చు.



డాక్టర్ టి. కిరణ్ కుమార్, డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి, విజయవాడ, వైజాగ్



● అల్లు అర్జున్

వేసవిలో సూర్యుడొస్తాడు!

... ఆ మాటకొస్తే ప్రతి ఉదయం సూర్యుడొస్తాడు. కానీ, వేసవిలో ఎక్కువసేపు మన తోడుగా, నీడగా వస్తుంటాడు. వచ్చే ఏడాది అదే టైమ్‌లో ప్రతిరోజూ ఉదయించే సూర్యుడితో పాటు మరో సూర్యుడు 'నేనొస్తున్నా' అంటున్నారు. ఆ సూర్యుడే అల్లు అర్జున్. ఎప్పుడూ మనదేశ ప్రజలకు తోడు–నీడగా ఉండే ఆర్మీ అధికారి సూర్యగా ఆయన నటిస్తున్న సినిమా 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకత్వంలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ నిన్న హైదరాబాద్‌లో మొదలైంది. నిన్ననే సినిమా విడుదల తేదీనీ ప్రకటించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 27న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నట్లు నిర్మాత లగడపాటి శ్రీధర్ తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ– ''బన్నీ ఎనర్జీకి తగ్గట్టుగా రెడీ చేసిన ఈ కథలో కమర్షియల్ అంశాలన్నీ ఉన్నాయి. నాగబాబు–'బన్నీ' వాసుగార్ల ఆధ్వర్యంలో సినిమా ముందుకెళ్తున్నందుకు వెరీ హ్యాపీ'' అన్నారు. కథానాయికగా అనూ ఇమ్మాన్యుయేల్, ముఖ్య తారలుగా అర్జున్, శరత్‌కుమార్‌లు నటిస్తున్న ఈ సినిమాకు కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు (చంటి), ఫైట్స్: రామ్–లక్ష్మణ్, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, కెమెరా: రాజీవ్ రవి, సంగీతం: విశాల్–శేఖర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాబు, సమర్పణ: కె. నాగబాబు, సహనిర్మాత: 'బన్నీ' వాసు.

దర్శకుడికి తొలి ప్రేక్షకుడు చిరంజీవే!

''నాకిది చాలా కొత్తగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. ఫస్ట్ టికెట్‌ను నాకు అందించి, 'దర్శకుడు' సినిమాకు నన్ను తొలి ప్రేక్షకుణ్ణి చేసిన ఈ యూనిట్ సభ్యులకు, ముఖ్యంగా సుకుమార్‌కు ధన్యవాదాలు'' అన్నారు చిరంజీవి. అశోక్, ఈషా జంటగా హరిప్రసాద్ జక్కా దర్శకత్వంలో బీఎన్‌సీఎస్‌పీ విజయ్‌కుమార్, థామస్‌రెడ్డి ఆదూరి, రవిచంద్ర సత్తిలతో కలసి సుకుమార్ నిర్మించిన 'దర్శకుడు' ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఫస్ట్ టికెట్‌ను చిత్రబృందం చిరంజీవికి అందించగా, ఆయన కొనుక్కున్నారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ– ''దర్శకుడిగా ఉన్నత స్థాయిలో ఉన్న సుకుమార్ తనకున్న టైమ్‌లో మంచి కథలు రాసుకుని డబ్బు, పేరు సంపాదించుకోవచ్చు. కానీ, అతను అలా ఆలోచించకుండా సుకుమార్ రైటింగ్స్ సంస్థను స్థాపించి... ప్రతిభ గల రచయితలు, దర్శకులు, ఆర్టిస్టులను ప్రోత్సహించడం అభినందనీయం. దీన్ని చిత్రపరిశ్రమకు తను చేస్తున్న కాంట్రిబ్యూషన్‌గా ఫీలవుతున్నా. 'కుమారి 21ఎఫ్' కంటే ఈ 'దర్శకుడు' పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నా'' అన్నారు.



● అశోక్, సుకుమార్, చిరంజీవి, హరిప్రసాద్

నేను ప్రేమించినప్పుడు మాట్లాడతా!

"బహుశా.. సినిమాల్లో నటించే పాత్రలు నటీనటులపై ప్రభావం చూపుతాయేమో! అందువల్లే, 'మాకంటూ ఓ సొంత లైఫ్ లేదు, డిప్రెషన్‌లోకి వెళ్లాం' అని చాలామంది చెబుతున్నారనుకుంటున్నా. నేను సాయంత్రం ప్యాకప్ చెప్పగానే... నటించే పాత్ర నుంచి బయటికొచ్చేస్తా" అన్నారు రకుల్‌ప్రీత్‌సింగ్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు జోడీగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఆమె నటించిన సినిమా 'జయ జానకి నాయక'. మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. రకుల్ చెప్పిన విశేషాలు...



● రకుల్ ప్రీత్‌సింగ్

● జానకి... బబ్లీ అండ్ హ్యాపీ కాలేజ్ గాళ్. కుటుంబమంటే ప్రేమ. ఏ పని చేయాలన్నా తానే ముందడుగు వేస్తుంది. ఓ ఘటన వల్ల అటువంటి అమ్మాయి లైఫ్ మొత్తం మారుతుంది. ఆ ఘటన ఏంటి? ఆమె లైఫ్ ఎలా మారింది? అనేది చిత్రకథ. ఈ రెండు వేరియేషన్స్ ఉన్న పాత్రలో జానకిగా నేను నటించాను. ● కొన్ని పోస్టర్స్ చూస్తే నేను స్యాడ్‌గా, డల్‌గా కనిపిస్తా. ఇటువంటి ఎమోషనల్ పాత్రను నేనిప్పటి వరకు చేయలేదు. అందువల్ల సెట్‌లో ఉన్నంతసేపూ నా ప్రపంచానికి దూరంగా, డల్‌గా ఉండేదాన్ని. లేదంటే రోజంతా క్యారెక్టర్‌కు కావలసిన మూడ్‌లో ఉండలేం. ఓ రోజు షూటింగులో ఉన్నప్పుడు 'నాతో రెండు నిమిషాలు మాట్లాడలేవా?' అని మా అమ్మ ఫోన్ చేస్తే... 'నో మమ్మీ' అని పెట్టేశా. బోయపాటిగారయితే అప్పుడప్పుడూ 'షాట్ అయ్యిందమ్మా... కొంచెం నవ్వొచ్చు' అనేవారు. (నవ్వులు) ఓ నాలుగు రోజులు షూటింగ్ చేసిన తర్వాత డల్‌గా నటించడం కొంచెం కష్టమనిపించింది. ● ఏడుపు సీన్స్ కోసం గ్లిజరిన్ వాడారా? అనడిగితే... అవును! నా లైఫ్‌లో గ్లిజరిన్ లేకుండా ఇప్పటివరకు ఎప్పుడూ ఏడవలేదు. అలా ఏడ్చే సందర్భం రాదనుకుంటున్నా. ఈ సినిమా కోసం గ్లిజరిన్ వాడి వాడి సాయంత్రానికి నా కళ్లు వాచిపోయేవి. సరదాగా బోయపాటిగారితో 'సార్... ఈ షెడ్యూల్ పూర్తయ్యేసరికి నేను ఓల్డ్ అవుతా. ఏడ్చి ఏడ్చి రెండు చెంపలపై చారలు వచ్చేస్తాయి' అన్నాను.

● బోయపాటిగారు చాలా స్మార్ట్. ఎందుకంటే... ఆయన ఎలాంటి సినిమా తీస్తున్నారో? ఏం తీస్తున్నారో? కథలో బలం ఏంటో? ఆయనకు బాగా తెలుసు. గొప్ప ప్రేమకథ, కుటుంబ విలువలు ఉన్న సినిమా ఇది. జానకి చుట్టూ కథంతా తిరుగుతుంది కాబట్టి... 'జయ జానకి నాయక' టైటిల్ పెట్టారు. బోయపాటిగారి నుంచి డిఫరెంట్ ట్రీట్మెంట్‌లో వస్తున్న సినిమా. ఆయన సిగ్నేచర్ ఆఫ్ యాక్షన్ కూడా ఉంటుంది. ● బోయపాటిగారితో 'సరైనోడు' చేశాను. ఆ సినిమా రిలీజ్ కాకముందే ఈ ఆఫర్ వచ్చింది. ఆయనేంటి? సినిమా ఎలా తీస్తారనేది తెలుసు. అందుకని సాయి శ్రీనివాస్ కొత్త హీరో కదా? అని ఆలోచించకుండా, వెంటనే ఒప్పేసుకున్నా. సాయి అద్భుతంగా నటించాడు. అతని బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ సూపర్బ్. మా నిర్మాత రవీందర్‌రెడ్డిగారు చాలా మంచి వ్యక్తి. మంచి సినిమా తీయాలని ఖర్చుకు వెనుకాడకుండా తీశారు. ● 'లైఫ్‌లో కష్టం వచ్చిన ప్రతిసారి లైఫ్‌ను వదులుకోం. కానీ, ప్రేమను మాత్రం వదిలేస్తాం. నేను వదలను. ఎందుకంటే... నేను ప్రేమించా' అని ట్రైలర్‌లో డైలాగ్ ఉంది. అటువంటి పరిస్థితి మీకొస్తే? అని రకుల్‌ను ప్రశ్నించగా... ''ఫస్ట్ నా లైఫ్‌లో లవ్ రావాలి. అది వచ్చినప్పుడు... నేను ప్రేమించినప్పుడు మాట్లాడతా'' అన్నారు. ● ప్రస్తుతం హిందీలో 'అయ్యారే', తమిళంలో సూర్య సరసన ఓ సినిమా చేస్తున్నా. మహేశ్‌బాబు హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో నటించిన 'స్పైడర్' వచ్చే నెల్లో విడుదలవుతుంది.

ఇది మా అందరికీ ఓ కుదుపు... అలసత్వంతో ఉండకూడదని హెచ్చరిక!

● డ్రగ్స్ అంశంపై తెలంగాణ సీయం కేసీఆర్‌కు తెలుగు చలన చిత్రపరిశ్రమ లేఖ

''మేం ఏ వర్గం మీద, కులం మీద, మతం మీద, ప్రభుత్వం మీద ఒక్క చెడ్డ మాట లేకుండా సినిమా తీసే ప్రయత్నం చేస్తాం. కానీ, ప్రతివాళ్లూ సినిమా వాళ్ల మీద ఇంత తీవ్రంగా స్పందించడం మాకు చాలా బాధ కలిగించింది. ఎవరికో కష్టమొస్తే జోలె పట్టుకుని విరాళాలు సేకరించిన హీరోలున్న పరిశ్రమ మాది. మాకు కష్టమొచ్చినప్పుడు సమాజం–మీడియా నుంచి కొంచెం సానుభూతి కోరుకుంటున్నాం. ఇది మా అందరికీ ఓ కుదుపు... అలసత్వంతో ఉండకూడదని ఒక హెచ్చరిక'' అని తెలుగు చిత్రపరిశ్రమ ముక్త కంఠంతో తన స్పందన వ్యక్తం చేసింది. కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో, దేశవ్యాప్తంగా సంచలనమైన డ్రగ్స్ కేసుపై తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి. కిరణ్, శివాజీరాజా, బూరుగుపల్లి శివరామకృష్ణ, కె. మురళీమోహన్‌రావులు తెలంగాణ సీయం కేసీఆర్‌కి ఓ లేఖ రాశారు. అందులో సారాంశం ఏంటంటే... ''డ్రగ్స్ తీసుకునేవాళ్లు ఎప్పటికీ హీరోలు కాదు. అతికొద్ది మంది చేసిన పొరపాట్లకు తెలుగు చిత్రపరిశ్రమ తల వంచుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. మాకు సమాజం పట్ల గౌరవం ఉండబట్టే తగ్గిపోతున్న మానవీయ విలువల్ని ఇంకా పట్టుకుని ముందుకెళ్తున్నాం. చెడుపై మంచి గెలవడం అనే కథనే 60 ఏళ్లుగా చెప్తూ, కుటుంబ విలువలు బయట సమాజంలో ఎలా ఉన్నా... కనీసం సినిమాల్లోనైనా బలంగా ఉండాలని సినిమాలు తీస్తాం. ఎందుకంటే... అవి కాలాతీతం! క్రమశిక్షణ లేనోళ్లను పరిశ్రమ భరించినట్లు ఒక్క మచ్చు తునక కూడా లేదు. ఇలాంటి అలవాట్లు ఉన్నోళ్లు వాళ్లంతట వాళ్లే తెరమరుగైపోతారు. కానీ, మా వంతుగా వారి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి, పోలీసులకు పూర్తిగా సహకరిస్తాం. ఈ కేసును వెలుగులోకి తెచ్చిన ప్రభుత్వ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలుపుతూ, చిత్రపరిశ్రమ ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని, మీ పరిశోధనను కొంచెం హుందాగా ముందుకు తీసుకెళ్లమని మాత్రమే కోరుతున్నాం. సినీ పరిశ్రమకు ఈ పది రోజులూ చీకటి రోజులు. అయినా గ్రహణం గంట సేపే ఉంటుంది. కానీ, ప్రయాణం నిరంతరం సాగుతూనే ఉంటుంది''.

విడుదలకు ముందే విజయం!



● శ్రీకాంత్ చల్లా

ఓ పెళ్లి చూపులు, ఓ ఉయ్యాలా జంపాలా... కొత్తవాళ్లతో తీసినా సినిమా బాగుంటే ప్రేక్షకాదరణ ఉంటుందనీ, 'కంటెంట్ ఈజ్ కింగ్' అని నిరూపించాయి. ఈ నమ్మకంతోనే ఐఐటి గ్రాడ్యుయేట్ చల్లా శ్రీకాంత్ 'వశం' తీశారు. ఓ రకంగా విడుదలకు ముందే ఈ సినిమా విజయం సాధించిందని చెప్పాలి. ఎందుకంటే... విడుదలకు ముందే సగం స్క్రిప్టును ఆన్‌లైన్‌లో పెడితే బోలెడు ప్రశంసలు. ఇంకొకటి... ఈ సినిమాకు సుమారు 120 మంది నిర్మాతలు. అంటే... క్రౌడ్ ఫండెడ్ ఫిల్మ్ అన్నమాట. 'అంతమందికి కథ నచ్చి, తమ డబ్బులు ఇన్వెస్ట్ చేశారంటే... ప్రేక్షకులకూ సినిమా నచ్చుతుంది కదా!' అంటున్నారు చల్లా శ్రీకాంత్. రేపు రిలీజవుతోన్న ఈ సినిమా గురించి ఆయన చెప్పిన సంగతులు....

● ఐఐటి చదువు నా ఆలోచనా విధానాన్ని మార్చింది. ఐఐటిలో ఉన్నప్పుడు 'కర్తవ్య' అనే డాక్యుమెంటరీ చేశా. తర్వాత రెండు షార్ట్ ఫిల్మ్స్ చేశా. ఐఐటిలో గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఐబీయమ్‌లో జాబ్ చేశా. సినిమాలపై ఆసక్తితో జాబ్ మానేసి హిందీ–ఇంగ్లీష్ ఫిల్మ్ 'సాంగ్ ఆఫ్ లైఫ్' తీశా. తెలుగులో 'మిణుగురులు' సినిమాకు ప్రీ–ప్రొడక్షన్ వర్క్ చేశా. సురేశ్ ప్రొడక్షన్స్‌లో కొన్నాళ్లు, ప్రవీణ్ సత్తారు 'చందమామ కథలు'కు కో–రైటర్‌గా వర్క్ చేశా. 'వశం'తో తెలుగు తెరకు దర్శకుడిగా పరిచయమవుతున్నా. ● భయం లేదు.. భక్తి లేదు... ఓ వ్యక్తిని కంట్రోల్ చేసే పవర్ మనుషులకు వస్తే ఏం జరుగుతుంది? ఎదుటివ్యక్తిని మనం వశపరుచుకోగలిగితే ఏం చేయొచ్చు? అనే కథతో రూపొందిన చిత్రమిది. రెండొందల ఏళ్ల క్రితం విమానాల్లో ప్రయాణించొచ్చని, కరెంట్‌తో బల్బ్ వెలిగించొచ్చని చెబితే మేజిక్ అనేవారు. ఇప్పుడలాగే పర్టిక్యులర్ యోగా, విభిన్నమైన సంగీతం, కొన్ని కెమికల్స్‌తో ఎదుటివ్యక్తి మైండ్‌ను కంట్రోల్ చేయొచ్చని చెబితే మేజిక్ అంటారు. కరెంట్‌ను కనిపెట్టినప్పుడు... నేను చెప్పేది కూడా సాధ్యం కావొచ్చు కదా. అది సాధ్యమైతే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ. ● ఈ కథ చదివిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొంత అమౌంట్ ఇన్వెస్ట్ చేశారు. అంతే కాదు... రెండు నెలలు సెలవు పెట్టి మాకోసం వర్క్ చేయడానికొచ్చినప్పుడు హ్యాపీగా అనిపించింది. ఫిల్మ్ మేకింగ్ అంటే... సరైన టీమ్‌ను ఏర్పాటు చేసుకోవడమే. ఆ విషయంలో నేను లక్కీ. ప్యాషన్ ఉన్న ఆర్టిస్టులు, నిర్మాతలు దొరికారు. ● హిందీ హిట్ 'యే దిల్ హై ముష్కిల్'కు అనిల్ మెహతా (సినిమాటోగ్రాఫర్) బృందంలో చేసిన దుర్గా కిశోర్ మా సిన్మాకు సినిమాటోగ్రాఫర్. ఆయన్ను 'వశం'కు తీసుకోవడం ఓ మిరాకిలే. ఆయనోసారి నాకు మెసేజ్ చేశారు. మళ్లీ ఇంకోసారి మెసేజ్ చేసినప్పుడు కలిశా. దుర్గాకిశోర్ షో రీల్స్ చూపించినప్పుడు 'ఆయన గురించి ఎవరికీ ఎందుకు తెలియలేదు' అని ఆశ్చర్యపోయా. అప్పుడే ఆయన అనిల్ మెహతా దగ్గర వర్క్ చేశారని తెలుసుకున్నా. నలభై రోజుల్లో మా సినిమాను కంప్లీట్ చేశాం. మాది ఓ చిన్న సిన్మా, లో బడ్జెట్ మూవీ అనే ఫీల్ ఎక్కడా రాకుండా చాలా రిచ్ లుక్‌తో తీశారాయన. 'వశం' పూర్తయిన తర్వాత ఇరానియన్ ఫిల్మ్ మేకర్ మాజిద్ మాజిది 'బియాండ్ ద క్లౌడ్స్'కు దుర్గాకిశోర్ వర్క్ చేస్తున్నారు. ● సిన్మాకు కీలకమైన పాత్రలో 'చందమామ కథలు'లో బిచ్చగాడిగా నటించిన కృష్ణేశ్వరరావు, వాసుదేవ్ రావు, శ్వేతా వర్మ, నందకిశోర్... ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు. సినిమాలో ఒక్కటే పాట ఉంది. చక్రవర్తుల కిరణ్ రాసిన ఆ పాటను జోస్యభట్ల శర్మగారు స్వరపరిచారు. ఆయన చేసిన రీ–రికార్డింగ్ ప్రతి ఒక్కర్నీ ఆకట్టుకుంటుంది. సరికొత్త కథతో తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నా.





● సాక్షి, శ్రీనాథ్

డిఫరెంట్ దెయ్యం కథ!

మాగంటి శ్రీనాథ్‌ను హీరోగా పరిచయం చేస్తూ, వి. రవివర్మ దర్శకత్వంలో ఎస్. సరిత నిర్మించిన 'ఇదేం దెయ్యం' శుక్రవారం రిలీజ్ కానుంది. ''సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు కూడా 'ఇదేం దెయ్యంరా బాబు' అనేంత డిఫరెంట్ కథతో తీశాం. హారర్ సీన్లు థ్రిల్‌కి గురి చేస్తాయి'' అన్నారు దర్శక- నిర్మాతలు. సాక్షి కక్కర్, రచనా స్మిత్, రుచీ పాండే నాయికలుగా నటించిన ఈ సినిమాకు సహ–నిర్మాతలు: ఎమ్. రత్నశేఖర్‌రావు, ఎమ్. మధుసూధన్‌రెడ్డి, వి. రామ్‌కిశోర్‌రెడ్డి, ఎమ్. సౌజన్య.



● నటరాజ్, రోణిక

గిల్లీ–దండా ఆట

నటరాజ్, రోణిక సింగ్ జంటగా తెరకెక్కుతోన్న సినిమా 'గిల్లీ- దండా'. 'అరుంధతి' శ్రీను దర్శకత్వంలో జె.వీరేష్ నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో మొదలైంది. ''గ్రామీణ నేపథ్యంలో 'గిల్లీ–దండా' ఆట బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రమిది. హృదయానికి హత్తుకునే ప్రేమకథ ఉంటుంది'' అన్నారు దర్శకుడు. ''మంత్రాలయం రాఘవేంద్రస్వామి వారి ఆలయంలో, అనంతపురం, గుత్తి, బెంగళూరు, హైదరాబాద్‌లలో చిత్రీకరణ జరపనున్నాం'' అన్నారు నిర్మాత జె. వీరేష్. ఈ చిత్రానికి కెమెరా: జి.జె. కృష్ణ, సంగీతం: రఘు కుంచె, నిర్వహణ: రాంబాబు.

ప్రొడ్యూసర్స్ సెక్టార్ అధ్యక్షుడిగా రమేశ్

తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి నిర్మాతల విభాగానికి (ప్రొడ్యూసర్స్ సెక్టార్) అధ్యక్షునిగా అశోక్, ఔను.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు, కబడ్డీ కబడ్డీ, గోపి గోపిక గోదావరి తదితర చిత్రాలు నిర్మించిన వల్లూరిపల్లి రమేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పద్మిని–బాబ్జీ, కార్యదర్శులుగా బోడపాటి మురళి–రాజేశ్వరి ఎన్నికయ్యారు.



● వల్లూరిపల్లి రమేశ్

సౌత్‌కి సై!

... అంటే ప్రియాంకా చోప్రా సౌత్ సినిమాలో కథానాయికగా నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనుకుంటున్నారా? అది కాదు. అసలు విషయం వేరే ఉంది. కథానాయికగా సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోన్న ప్రియాంకా చోప్రా భోజ్‌పురి, మరాఠీ, పంజాబీ భాషల్లో సినిమాలు నిర్మిస్తున్నారు. మరాఠీలో ఆమె నిర్మించిన 'వెంటిలేటర్' కథ సౌత్‌కి తగ్గట్టుగా ఉంటుందని, మలయాళంలో రీమేక్ చేస్తే బాగుంటుందనీ ఫ్రెండ్స్ సలహా ఇస్తే, ప్రియాంక 'సై' అన్నారట. ''మలయాళంలో కంటెంట్ బేస్డ్ మూవీస్ వస్తుంటాయి. 'వెంటిలేటర్' రీమేక్ పనులన్నీ నిర్మాతగా నేను దగ్గరుండి చూసుకోబోతున్నా. ఇంకా దర్శకుడు, నటీ నటులను ఖరారు చేయలేదు'' అని ప్రియాంక తల్లి మధు చోప్రా పేర్కొన్నారు.



● ప్రియాంకా చోప్రా



● ఈ చట్టం యజమానులకే చుట్టం ● ఫీజులు ఇక బాదుడే బాదుడు
● పాఠశాల విద్య ఇక పూర్తిగా వ్యాపారమయమే! ● ప్రభుత్వ స్కూళ్ల మనుగడకు ముప్పే
● వివాదాల్లో కోర్టుల జోక్యం ఉండదు... కమిటీలదే కీలకపాత్ర

స్వయంపోషక స్వేచ్ఛ

ప్రైవేటు పాఠశాలలకు సర్కారు కొత్త చట్టం



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం (ఏపీ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్-2017)ను తెస్తోంది. పాఠశాల విద్యలో ప్రైవేటు కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించడంతోపాటు వీటిపై ప్రభుత్వానికి కూడా అజమాయిషీ లేని తీరులో ఈ చట్టంలోని అంశాలు, నిబంధనలు ఉన్నాయి. ఫీజులు, తదితర అంశాల్లో వాటికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దీంతో ఇప్పటికే భారంగా మారిన పాఠశాల విద్య సామాన్య, మధ్య తరగతికి అందుబాటులో లేకుండా పోనుంది.


సాక్షి, అమరావతి

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఐఐటీ, ఒలింపియాడ్, టెక్నో, కాన్సెప్ట్, ఈ–టెక్నో, ఈ–శాస్త్ర, కాన్వెంట్, పబ్లిక్ స్కూల్ వంటి పేర్లతో ఇప్పటికే ఫీజుల దోపిడీ జరుగుతోంది. ఇప్పుడీ కొత్త చట్టంతో మరింత పట్టపగ్గాల్లేకుండా పోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 90 శాతం ప్రైవేటు స్కూళ్లలో అర్హులైన టీచర్లు లేరు. ఆట స్థలాలూ కరవే. అన్ని పట్టణాలు, నగరాల్లో చిన్న కాన్వెంట్లలో ఒక రకమైన ఫీజులు, కార్పొరేట్ స్కూళ్లలో అంతకు రెట్టింపు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒకటో క్లాస్‌లోనే 30వేలకు పైగా వసూలు చేస్తుండగా అది పదో తరగతికి రూ.లక్షకు పైగా చేరుతోంది.

గత జీవోల్లో ఇలా..

గతంలో ఫీజులపై హైకోర్టు ఆదేశాల మేరకు జారీ చేసిన 91, 41, 42 జీవోలను ప్రభుత్వం ఇప్పుడు తుంగలో తొక్కుతోంది. జీవో నెంబర్ 91 ప్రకారం.. ప్రతి ప్రైవేటు పాఠశాలలో గవర్నింగ్ బాడీలను ఏర్పాటు చేయాలి. జిల్లా స్థాయిలో జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీలను (డీఎఫ్ఆర్‌సీ) ఏర్పాటు చేయాలి. పాఠశాల గవర్నింగ్ బాడీలు ప్రతిపాదించే ఫీజులను డీఎఫ్ఆర్‌సీ పరిశీలించి తుది ఫీజులను ఖరారు చేయాలి. వాటినే స్కూళ్లలో వసూలు చేయాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏటా గరిష్టంగా రూ.24 వేలు, ఉన్నత పాఠశాలల్లో రూ.30 వేలు ట్యూషన్ ఫీజును మాత్రమే వసూలు చేసుకోవచ్చని పేర్కొంది. కానీ ఆ జీవో అమలు అటకెక్కింది. తర్వాత జీవో నెంబర్లు 41, 42ను జారీ చేస్తూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పట్టణ ప్రాంతాల్లో అయితే ఏడాదికి గరిష్టంగా రూ.9 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,800 వసూలు చేయాలని పేర్కొంది. అలాగే ఉన్నత పాఠశాలల్లో పట్టణాల్లో రూ.12 వేలు, గ్రామాల్లో రూ.10,800లకు మించి వసూలు చేయొద్దని తెలిపింది. అయినా అవేవీ అమల్లోకి రాలేదు.

రాష్ట్రంలో జిల్లాల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల వివరాలు



జిల్లా	ప్రైవేటు	ప్రభుత్వ
పశ్చిమగోదావరి	1392	3065
విజయనగరం	632	2739
విశాఖపట్నం	1284	4028
శ్రీకాకుళం	577	3302
ప్రకాశం	1151	3223
నెల్లూరు	1023	3414
కర్నూలు	1438	2844
కృష్ణా	1845	2719
కడప	1238	3335
గుంటూరు	1420	3452
తూర్పుగోదావరి	1761	4336
చిత్తూరు	1285	4912
అనంతపురం	1228	3886

జీవో నెంబర్ 1 కూడా అంతే..


జీవో నెంబర్ 1 ప్రకారం ప్రైవేటు పాఠశాలలు కేపిటేషన్ ఫీజు, డొనేషన్లు వసూలు చేయడానికి వీల్లేదు. వసూలు చేస్తే పది రెట్ల జరిమానా విధించాలి. స్కూళ్ల ఆవరణలో వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధం. ప్రవేశాల కోసం తల్లిదండ్రులకు, పిల్లలకు ఎలాంటి స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టకూడదు. ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తే మొదటి సారి అయితే రూ.25 వేలు, అంతకంటే ఎక్కువసార్లు అయితే ప్రతిసారి రూ.50 వేల చొప్పున జరిమానా విధించాలి. గుర్తింపు లేని స్కూళ్లను కొనసాగించడానికి వీల్లేదు. గుర్తింపు రద్దుచేసిన స్కూళ్లను కొనసాగిస్తే రూ. లక్ష వరకు జరిమానా విధించాలి. దీన్ని వారం రోజుల్లో చెల్లించకపోతే సీజ్ చేయాలి. అయితే ఇవేమీ జరగడం లేదు. ఇక విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఆయా వర్గాలకు కేటాయించాలి. కానీ ఇవేవీ ప్రస్తుత కొత్త చట్టంలో లేవు.

ఫీజులు, సిలబస్ వారిష్టమే..



కొత్త చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు, టీచర్ల జీతాలు, సిలబస్, సమయాలు, పరీక్ష విధానం రాష్ట్ర విద్యాశాఖ పరిధిలో ఉండవు. అంతా ప్రైవేటు పాఠశాలల ఇష్టం. ఏటా 12 శాతానికి పైగా ఫీజుల్ని పెంచుకోవచ్చు. చట్టంలోని సెక్షన్ 16 నిబంధన ప్రకారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తమకేదైనా అన్యాయం జరిగితే వీటిపై కోర్టుకు నివేదించే హక్కు కూడా లేదు. పాఠ్య, నోటుపుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం తదితరాలన్నీ ప్రైవేటు పాఠశాలలు అమ్మరాదనే 1994 నాటి జీవో 1లోని నిబంధనలను కాదని రాష్ట్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువస్తోంది.

చట్టంలోని ముఖ్యాంశాలు



- 3 ఏళ్లు నిండిన వారిని ప్రీ ప్రైమరీలో చేర్చుకోవాలి.
- 1వ తరగతిలో 5 ఏళ్లు నిండనిదే చేర్చకూడదు.
- పాఠశాల సొంత అడ్మిషన్ విధానాన్ని అనుసరించొచ్చు.
- మౌలిక వసతులు, ఇతర ఖర్చుల కోసం ఫీజులు నిర్ణయించుకోవచ్చు
- ప్రతి చెల్లింపునకు, ఫీజు, ఫండ్ వసూలుకు రసీదు ఇవ్వాలి
- పాఠశాల ఎటువంటి కాపిటేషన్ ఫీజు వసూలు చేయరాదు.
- అడ్మిషన్లకు 60 రోజుల ముందే పాఠశాల అడ్మిషన్, ఫీజులు, ఉపాధ్యాయులు, వారి అర్హతలు, మౌలిక వసతులు, అన్ని అంశాలను బ్రోచర్ ద్వారా, వెబ్‌సైట్ ద్వారా ప్రకటించాలి.
- బోధన, బోధనేతర సిబ్బందికి ప్రభుత్వం సూచించిన అర్హతలు ఉండాలి.
- టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని పార్ట్‌టైమ్, టెంపరరీ, కాంట్రాక్టు, పర్మినెంటు ప్రాతిపదికన నియమించుకోవచ్చు.

చట్టం ఏం చెబుతోందంటే...

- అర్హత ఉన్న విద్యాసంస్థలు కొత్త పాఠశాల లేదా ప్రస్తుత పాఠశాల అప్‌గ్రేడేషన్‌కు నిర్దేశించిన ఎండోమెంటు ఫీజు మొత్తాన్ని డిపాజిట్ చేయాలి.
- సరైన మౌలిక వసతులు, భవనాలు, పారిశుధ్య సౌకర్యాలుండాలి.
- శిక్షణ పొందిన ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బందిని నియమించాలి.
- పాఠశాల ఏదో ఒక ఎడ్యుకేషన్ బోర్డుకు అనుబంధంగా ఉండాలి.
- రాష్ట్ర విద్యావిధానానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులకు లోబడి ఉండాలి.
- ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రరీ, ల్యాబ్, క్యాంటీన్, కో కరిక్యులర్ సౌకర్యాలుండాలి.
- ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) సదుపాయాలుండాలి.
- యాజమాన్యాలు ఏటా 12శాతానికి పైగా ఫీజులు పెంచుకోవచ్చు.
- సిలబస్ రూపకల్పనలోనూ 'ప్రైవేట్'కు స్వేచ్ఛ ఇచ్చారు.

కమిటీలదే కీలకపాత్ర



- ప్రతి ఎడ్యుకేషన్ జోన్‌కు ఫీజు నియంత్రణ కమిటీని ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది.
- దీనికి చైర్‌పర్సన్‌గా జిల్లా రిటైర్డ్ జడ్జిని హైకోర్టు సూచనతో నామినేట్ చేస్తుంది.
- స్టేట్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయ జిల్లా ప్రతినిధి, ఒక ప్రముఖుడిని, విద్యాశాఖ నుంచి డీఈఓ స్థాయికి తగ్గని అధికారిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. అనుమతి పొందిన పాఠశాల నుంచి ఒకరు కమిటీలో ఉంటారు.
- ఫీ రెగ్యులేటరీ కమిటీ 3 ఏళ్ల కాలపరిమితితో ఉంటుంది.
- రాష్ట్రస్థాయిలో కూడా రివిజన్ కమిటీని ప్రభుత్వ గెజిట్ ద్వారా ఏర్పాటు చేస్తారు.
- ఇందులో హైకోర్టు రిటైర్డ్ జడ్జి చైర్స్‌పర్సన్‌గా ఉంటారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కార్యదర్శి, స్టేట్ అకౌంటెంట్ జనరల్ సభ్యులుగా ఉంటారు. సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంటు ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి రిటైర్డ్ ప్రిన్సిపల్ సభ్యులుగా ఉంటారు. మరో ప్రముఖుడిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.
- ఫీజు రివిజన్, పెంపుదలపై వివాదాలను జోనల్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ పరిష్కరిస్తుంది.
- స్టేట్ రివిజన్ కమిటీ కాలపరిమితి 5 ఏళ్లు. దీనికి సివిల్ కోర్టు అధికారాలుంటాయి.
- ఈ చట్టం ప్రకారం ఈ పాఠశాలలకు సంబంధించిన ఏ అంశంపైనా సివిల్ కోర్టు జోక్యానికి అవకాశం లేదు. జోనల్ ఫీ రెగ్యులేటరీ కమిటీ, రివిజన్ కమిటీలే వివాదాలను సెటిల్ చేస్తాయి.
- అకౌంట్సు నిర్వహణ సక్రమంగా చేయాలి. స్థిరాస్తిని అమ్మకూడదు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే పెనాల్టీ విధిస్తారు.
- అక్రమాలకు పాల్పడ్డా, అసంపూర్తి సమాచారం ఇచ్చినా పాఠశాల గుర్తింపు రద్దు చేస్తారు.
- చట్టంలో ఎప్పటికప్పుడు మార్పులు చేయడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుంది.

పాఠశాల విద్యకు విఘాతం



దేశంలోని పిల్లలందరికీ సమాన విద్యావకాశాలు అనే లక్ష్యానికి ఈ స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం తూట్లు పొడుస్తోంది. కొత్త చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు వేర్వేరు విద్యా విధానాన్ని అవలంబించనున్నాయి. ఈ చట్టంతో ప్రభుత్వ పాఠశాలల మనుగడ దెబ్బతినే అవకాశముందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రైవేటులోనే మంచి విద్య అందుతుందన్న సందేశాన్ని ఈ కొత్త చట్టం కల్పిస్తోందని, ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు క్రమేణా విద్యార్థులు లేక మూతపడొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతమున్న నిబంధనలనే సర్కార్ అమలుచేయకపోవడంతో ఈ కొత్త చట్టం అమలుపై కూడా విద్యావేత్తల నుంచి సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రేషనలైజేషన్ పేరిట మూసివేతలు

ఆంధ్రప్రదేశ్‌లో 2015–16లో 1486 స్కూళ్లను విలీనం పేరిట మూసివేశారు. ఈ ఏడాది రేషనలైజేషన్ పేరిట దాదాపు 9వేల స్కూళ్లను మూతవేయాలని ముందుగా భావించినా ప్రజల నుంచి.. ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత రావడంతో దాన్ని ఉపసంహరించుకున్నారు. నిర్ణీత సంఖ్యలో విద్యార్థుల్లేని అన్ని పాఠశాలలను నాన్‌వయబుల్ పేరిట మూసివేయాలనుకున్నారు. ప్రజావ్యతిరేకతతో అది 1900 వరకు తగ్గింది. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత అనే మూడంచెల వ్యవస్థ కొనసాగుతుండగా అందులో ప్రాథమిక, ఉన్నత వ్యవస్థలనే ఉంచి ప్రాథమికోన్నత బడులను తీసివేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. దీనివల్ల 4వేల స్కూళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడింది. దీనిపైనా సంఘాలు ఎదురుతిరగడంతో చివరకు నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు లేనివాటిని మాత్రమే మూసివేసేలా నిబంధనలు మార్చారు. దాదాపు 12వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం భర్తీచేయడంలేదు. టీచర్లు లేక దాదాపు 6వేల స్కూళ్లు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది.

పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు రావాలి

ఎంఎస్ఈడీసీ రాష్ట్ర చైర్మన్ బి.వి.రామారావు



సదస్సులో మాట్లాడుతున్న రామారావు

కొరిటెపాడు (గుంటూరు): పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని సూక్ష్మ, చిన్న పరిశ్రమల వ్యాపారాభివృద్ధి సంస్థ (ఎంఎస్ఈడీసీ)రాష్ట్ర చైర్మన్ బి.వి.రామారావు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ప్రాంతీయ పారిశ్రామిక సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు ఆయా పరిశ్రమల స్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రెండు కోట్ల రూపాయల వరకు ఏ విధమైన ష్యూరిటీ లేకుండా బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చన్నారు. అంతేకాకుండా ముద్రా పథకం ద్వారా రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు హామీ లేకుండా రుణాలు పొందవచ్చని తెలిపారు. పరిశ్రమల శాఖలో సంస్కరణలు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందని, జిల్లా పరిశ్రమల శాఖలు సక్రమంగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీల కన్నా మౌలిక సదుపాయాలైన భూమి, విద్యుత్ రాయితీ, నీరు ఉచితంగా సరఫరా చేస్తే లక్షలాది మంది నిరుద్యోగులు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తారని అన్నారు. ఈ నెల 14న ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలసి అన్ని విషయాలను వివరించనున్నట్లు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ మిహిర్ నారాయణ ప్రసాదు మిశ్రా మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రుణాలు మంజూరు చేయడానికి ఎస్‌బీఐ ముందుంటుందని చెప్పారు.

5.90 లక్షల మంది సర్వేకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాసాధికార సర్వేలో భాగంగా సెప్టెంబర్ 15 వరకు నిర్వహణ: సీఎస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాసాధికార సర్వే ద్వారా నమోదు కాకుండా మిగిలిపోయిన 5.90 లక్షల మందిని సర్వే చేసి నమోదు చేసేందుకు సెప్టెంబర్ 15 వరకు అన్ని జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ వెల్లడించారు. ప్రజా సాధికార సర్వే ప్రగతిని బుధవారం సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నివసించే ప్రతి కుటుంబాన్ని, వ్యక్తిని ఈ సాధికార సర్వే కింద నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4 కోట్ల 94 లక్షలమంది జనాభా ఉండగా వారిలో 4 కోట్ల 34 లక్షల మందిని ఈ సర్వే ద్వారా నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో నివాసముంటున్నట్టు చిరునామాలిచ్చినప్పటికీ ఎక్కువ మంది రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉండటం, కొంతమంది మరణించడం, ఆధార్ సంఖ్య అందుబాటులో లేకపోవడం, సర్వేలో నమోదుకు ఆసక్తి చూపకపోవడం వంటి కారణాలతో 54 లక్షలమంది సర్వేకు అవకాశం లేదని గుర్తించినట్లు చెప్పారు. మిగతా 5.90 లక్షల మంది సర్వేకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సిందిగా అధికారుల్ని ఆదేశించారు.

ఉద్యాన పంటల విస్తరణతోపాటు మార్కెటింగ్, ఎగుమతి పెంచాలి: రాష్ట్రంలో ఉద్యానవన పంటల్ని మరింత విస్తరించడంతోపాటు పండిన పంటకు మార్కెటింగ్, ఎగుమతి సౌకర్యాల్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎస్ దినేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో ఉద్యానవన, సెరికల్చర్ శాఖలపై ఆయన సమీక్షించారు. గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు ఎదురైనప్పుడు పంటను నిల్వ చేసేందుకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో కూడిన శీతల గిడ్డంగుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకోసం చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పోస్టు హార్వెస్టింగ్ మెకానిజం అమలుకూ సిద్ధమవ్వాలన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి వీలైనన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖల అధికారుల్ని ఆదేశించారు.